# మిసిమి

మాస పత్రిక

మే - 2004



బుద్ధ జయంతి ప్రత్యేక సంచిక

రూ. 8/-

## మొదటి అట్ట మీది బుద్ధ ప్రతిమ గురించి :

సికిందరాబాద్ తుకారమ్ గేట్, మహేంద్రాహిల్స్ మీద ఉన్న ఆనంద బుద్ధ విహారంలో ఏప్రిల్ 4, 2003 న టిబెట్ బౌద్ధ మత గురువైన దలైలామా ఈ ప్రతిమను ప్రతిష్టించారు. ఆనంద బుద్ధ విహార భవన సముదాయాన్ని ఆ రోజే ప్రారంభించారు. అంతేగాదు బోధివృక్ష శాఖను కూడా నాటడం జరిగింది.

బంగారు పూత అద్దిన ఈ అందాలనీనే భారీ కాంస్య బుద్ధ ప్రతిమను, విహార ముఖ ద్వారానికి నగిషీతో చెక్కిన పెద్ద తలుపులను, మయన్మార్ చిట్టగాంగ్ బౌద్ధ సంఘం ఆనంద బుద్ధ విహారకు బహూకరించి వారి ఔదార్యాన్ని చాటుకొన్నారు. చిట్టగాంగ్ బౌద్ధ సంఘాన్ని సంప్రదాయ బౌద్ధులైన బారువా కుటుంబాలవారు నడుపుతున్నారు. ఆనంద బుద్ధ విహార ఛైర్మన్ అయిన కె. సంఘ రక్షిత మహాథేర గారి దాయాది సోదరుడైన గౌ.యు.పఞ్ఞాతిలోక నేతృత్వంలో, ఎన్నో విధాలుగా మన విహారానికి నైతిక సహాయాన్ని అందిస్తున్నారు.

ముఖచిత్ర ఫోటో : కేశవ కుమార్



సాంచిలోని మినీ బౌద్ధ స్థూపాలు



బౌద్ధ గురువు ఆవాసాల శిథిలాలు

# మిసిమి

**"All that we are is the product of what we have thought"**
**is "We are what we think." - Dammapada.**

సంపుటి 15 మే 2004 సంచిక 5

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

భీముని చేతి కర్రలనుకొని ఫిరోజ్‌షా తుగ్లక్ తరలించిన అశోకుని శాసన స్తంభాలు -ఈమని శివనాగి రెడ్డి
తెలుగునాట మళ్లీ పల్లవిస్తున్న బౌద్ధం - కడియాల వెంకటేశ్వరరావు
కల్లోల భారతం - బి. యస్. యల్. హనుమంతరావు
బౌద్ధం-ఆధునిక సమాజం మూలం: సి. ఆంజనేయ రెడ్డి, అనువాదం: మిసిమి అన్నపరెడ్డి
ఆధునిక బౌద్ధుడి మతం - టి. రవిచంద్
బుద్ధుడు హిందువా? బౌద్ధం హిందూ మత శాఖా? - అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి
బౌద్ధం-హిందూమతం-లౌకికతత్వం - శివలింగం
గౌతమ బుద్ధుని గురించి - డా॥ యన్. సి. రామానుజాచార్యులు
తనను తనకు బోధపరచుకొనటమే బౌద్ధం - వావిలాల సుబ్బారావు
సుఖ-దుఃఖాల మూలం మనస్సే అంటున్న బౌద్ధం '- మ. శివరామకృష్ణ
బౌద్ధ జీవన దృక్పథం - ఎమ్. వి. ఎస్. అప్పారావు
బౌద్ధంలో రాజు-రాజ్యపాలన - డా॥ బి. వి. యస్. భానుశ్రీ
బౌద్ధ ప్రపంచం-నూతన రీతులు - ఎమ్. రాజగోపాలరావు
ఆధునిక ప్రపంచానికి బుద్ధుడు - షణ్ముఖానంద
బుద్ధ బోధ - డా॥ మలయశ్రీ
బౌద్ధ ధర్మం-సర్వకాలీనం - ముంగర జాషువ
పాళీ సాహిత్యం అశోకుని చరిత్ర - జె. అమరజ్యోతి
అశోకుని జీవితంలో ప్రధాన ఘట్టాలు - కె. వెంకటరెడ్డి
బుద్ధుని మూల బోధనా భండారము-సుత్తనిపాతము - దిట్టకవి కన్నబాబు
బౌద్ధ శిల్పకళా నిక్షేపం-సాంచి - డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **సికిందరాబాద్, ఆనందబుద్ధ విహార్‌లోని బుద్ధ ప్రతిమ**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# ఆధునిక ప్రపంచానికి ఆశాజ్యోతి బౌద్ధం

మిసిమి వ్యవస్థాపక సంపాదకుడు డా. రవీంద్రనాథ్ తన జీవిత చరమాంకంలో మానవ అస్తిత్వానికి, మనుగడకు సంబంధించిన జటిల సమస్యలకు పరిష్కారం బౌద్ధంలోనే ఉందని భావించి బౌద్ధాన్ని లోతుగా అధ్యయనం చేశాడు. ఆ ప్రక్రియలో భాగంగానే మిసిమికి "All that we are is the product of what we have thought is" We are what we think" అనే ధమ్మ పద శ్లోకాన్ని మకుటంగా స్వీకరించడమే కాక, కొన్ని ధమ్మపద శ్లోకాలను వివరిస్తూ వాటికి సంబంధించిన వర్ణ చిత్రాలను ముఖ చిత్రాలుగా వేశారు. ఈ బౌద్ధ స్ఫూర్తికి అనుగుణంగానే మూడు సంవత్సరాల నుంచి ప్రతి బుద్ధ జయంతికి బౌద్ధం మీది వ్యాసాలతో మిసిమిని ప్రత్యేక, సంచికగా ముద్రిస్తున్నాం. ఇది నాలుగో సంచిక. మొదటి మూడు ప్రత్యేక సంచికలకు రచయితలు అంతగా ఉత్సాహం చూపలేదు, కాని ఈసారి అడిగిన వెంటనే తమ వెలలేని వ్యాసాలను బౌద్ధంలో గాఢాభినివేశం ఉన్న చాలమంది రచయితలు పంపారు. వారి సహకారానికి కృతజ్ఞతలు. మరో విషయం రవీంద్రనాథ్ మిసిమి వ్యవస్థాపక సంపాదకులే కాదు, కళాజ్యోతి ప్రెస్ అనే పేరుపొందిన పెద్ద ముద్రణా సంస్థకూ వ్యవస్థాపకులు. అందుకని కళాజ్యోతి గూడ అదే స్ఫూర్తితో నారదమహాథేర రాసిన "The Buddha and His Teachings" అనే ఆంగ్ల గ్రంథానికి అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి అనువదించిన ''బుద్ధ దర్శనం''ను అచ్చువేసి ఆనందబుద్ధ విహార, సికిందరాబాద్‌కు, 1999లో కానుకగా సమర్పించింది. మళ్ళీ అదే గ్రంథం రెండో ముద్రణను, ఇనుమడించిన స్ఫూర్తితో రేపు (4-5-2004) బుద్ధ జయంతినాడు ఆనంద బుద్ధ విహారకు కానుకగా అర్పిస్తోంది. ఈ విధమైన స్ఫూర్తి, దాతృత్వం వెనుక రవీంద్రనాథ్ కుమారులు దేవేంద్రనాథ్, బాపన్నల దృఢచిత్తం, సంకల్పం ఉన్నాయి.

ఆనందబుద్ధ విహార కృషి, రచయితలు బౌద్ధం మీద రాయడానికి సమధికోత్సాహంతో ముందుకు రావడం, నూతన బౌద్ధ సంఘాల ఏర్పాటు, బౌద్ధం మీద జరుగుతున్న సెమినార్లు చూస్తుంటే, ఆధునిక ప్రపంచం మనస్సు బౌద్ధం మీదికి తిరిగినట్లు కనిపిస్తుంది. ఇది శుభపరిణామం. ఎప్పటికైనా బుద్ధుడు ఆసియా జ్యోతే కాదు, ప్రపంచ మానవాళి ఆశాజ్యోతి అవుతాడని నమ్మకం కలుగుతోంది.

– సంపాదకుడు

# భీముని చేతి కర్రలనుకొని ఫిరోజ్‌షా తుగ్లక్ తరలించిన అశోకుని శాసన స్తంభాలు

-ఈమని శివనాగి రెడ్డి

కోట్ల ఫిరోజ్‌షాగా పేరొందిన ఢిల్లీలోని సుల్తాన్ ఫిరోజ్‌షా తుగ్లక్ కోటలోని ఒక దిబ్బ, దానిమీదగల స్తంభం చారిత్రక పరిశోధకులను ఆకర్షించాయి. సున్నీ తెగకు చెంది, ఇస్లాం పట్ల అంకిత భావంతో పనిచేసిన సుల్తాన్ మామూలుగా మంచివాడే అయినప్పటికీ, 'సున్నీ' పట్ల నమ్మకం లేని వారినీ, ఎదిరించిన వారినీ తెగనరకటానికి కూడా వెనకాడలేదని చారిత్రకుల వాదన. మతంపై విశ్వాసం లేని వాళ్లను తన రాజ్యం నుంచి వెలివేశాడని సమకాలీన రచనలు తెలియ జేస్తున్నాయి. ఇలాంటి మత ఛాందసుడైన తుగ్లక్, ఖిజ్రాబాద్, మీరట్‌ల దగ్గరగల రెండు శాసన స్తంభాలను తన కోటలోకి తరలించి, మంచి వేదికలను నిర్మించి వాటిపై నిలబెట్టాడంటే అతని బుర్రలో ఏమూలో కళ, ప్రాచీన కళాఖండాలంటే కొద్దోగొప్పో ఇష్టమూ ఉండేవని తెలుస్తుంది కదూ!

'తరీఖ్ - ఇ - ఫిరోజ్‌షాహి'ని రచించిన షమ్స్-ఇ-సిరాజ్ అఫీఫ్, అనే సమకాలీన చారిత్రకుని ప్రకారం, ఫిరోజ్‌షా (క్రీ.శ. 1351-88) దండయాత్రపై తట్టా వెళ్లినపుడు ఖిజ్రాబాద్ దగ్గరి తోప్రాగ్రామం, మీరట్ సమీపంలోనూ గల నునుపైన రెండు పొడవాటి స్థంభాలు సుల్తాన్ దృష్టి నాకర్షించాయి. అప్పటికే తాళ పత్రాల్లో రాసిన పాండవుల్లో మేటి అయిన భీముడు, అతని గొప్పతనం, వెయ్యిమందికి సరిపడే భోజనం తానొక్కడే తినగలంత పెద్ద సైజు వ్యక్తి అనీ, తన నలుగురు సోదరుల పశువులను కాయటానికి రోజు బయటికి వెళ్ళే వాడనీ, పశువులను ఒకచోట మందగట్టడానికి ఈ స్తంభాలను చేతి కర్రల్లా వాడాడనీ అతడు చనిపోయిన తరువాత అతనికి గుర్తుగా ఆ కర్రలను అక్కడ నాటారని కూడా అఫీఫ్ చదివాడు. చారిత్రక స్పృహలేని మధ్యయుగంలో ఈ స్తంభాలు అశోకునివని తెలియక, స్థానిక హిందువులు భీముని చేతి కర్రలని నమ్మేవారని తెలుస్తుంది.

శిలా స్తంభాల పనితీరును మెచ్చుకొన్న సుల్తాన్, తోప్రా స్తంభం నునుపుకు ముగ్ధుడై, దాన్ని మీనార్ -ఇ-జరీన్ (బంగారు స్తంభం)గా పిలుచుకొని, ప్రాచీన భారత కళా ఖండంగా దాన్ని తన కోటలో ప్రదర్శించాలనుకొన్నాడు. అన్నిటికీ మించి అసలంత పెద్ద స్తంభాన్ని ఎక్కడ నుంచో తెచ్చి ఇక్కడ పాతినవైనం అతన్ని ఆకట్టుకొంది. ఆ కాలపు ఇంజినీరింగ్ పద్ధతులను తెలుసుకోవాలను కొని, స్థానిక బ్రాహ్మణ పండితులను వాకబు చేసి 'ఇంత పెద్ద శిలా స్థంభాన్ని ఎక్కణ్ణించి తెచ్చారు, ఇక్కడ ఎలా పాతారు?' అని అడిగాడు. అందుకు ఆ బ్రాహ్మణ పండితులు 'మహారాజా! ఇది మానవ మాత్రుల పనికాదు! మానవాతీత శక్తులైన దేవతలే ఈ స్థంభాలను చెక్కి, తరలించి, నాటారు' అని శెలవిచ్చారు.

మరికొందరు పండితమ్మన్యులు ఇంకొక అడుగు ముందుకేసి, అసలా స్థంభం స్వయంభువనీ, భూమి నుంచి తనంతట తానే పుట్టుకొచ్చి పైకి ఎగబాకి ఆగిందని చెప్పారు. ఇంకొందరు రాజు దృష్టి నాకర్షించటానికి తమకు తోచిన ఆలోచనను మరోలా వెల్లడించారు. ఇది ఒక పెద్దతాయెత్తనీ, దీన్ని తరలించటానికి ఎలాంటి ప్రయత్నమూ చేయొద్దనీ, ఒకవేళ, దాని చుట్టూ పునాదిదాకా తవ్వితే, పెద్ద పెద్ద విషసర్పాలు, తేళ్లు, మండ్రగబ్బలు బయటికొచ్చి ప్రజలను చంపుతాయని తుగ్లక్‌ను భయ పెట్టారు. ఎవరేమని చెప్పినా, తుగ్లక్ మాత్రం వాటిని తరలించాలను కొన్నాడు. అంతే కాదు, దేవుని

ఈమని శివనాగిరెడ్డి, రాష్ట్ర పురావస్తు శాఖ, గన్‌ఫౌండ్రి, హైదరాబాద్‌లో స్థపతిగా పనిచేస్తున్నారు.

దయ వల్ల, ఆజ్ఞవల్ల, ఆ పెద్ద శిలా స్తంభాన్ని తరలించి ఫిరోజాబాద్లోని జుమామసీద్‌లో పాతి పెడితే ప్రపంచ మున్నంత కాలం ఇది కూడా ఉంటుందని తన నిర్ణయాన్ని ప్రకటించాడు.

తన మనసులో నాటుకుపోయిన ఈ కోరికను వెంటనే తీర్చుకోవాలనుకున్న తుగ్లక్, ఆ స్థంబాన్ని జాగ్రత్తగా దించి, తన కోటలోపలికి తరలించటానికి పేరు పొందిన ఇంజనీర్లను ఆహ్వానించాడు. ఇప్పటి ప్రభుత్వోద్యోగుల మాదిరిగానే వాళ్ళు, ఆ స్తంభాలను చూడగానే 'మహాప్రభో ఇది మా చేత కాదని' కాళ్లు మొక్కి పక్కకు తప్పుకొన్నారు. వీళ్ల వట్టి చవటలనుకొన్న సుల్తాన్ తానే ఒక చక్కటి ప్రణాళికను రూపొందించాడు. దాని ప్రకారం, ఓడల నుంచి సరుకులు దించుకోవటానికి సముద్రపు ఒడ్డు నుంచి కొంచెం లోపలి వరకూ నీటిలో కట్టే జెట్టీగోడ లాంటి దాన్ని కట్టెలతో నిర్మించాడు. ఒక్కో కొయ్యగోడ 10 గజాల చుట్టుకొలత, అంతే ఎత్తు ఉండేట్లు మొత్తం ఆరింటిని నిర్మించాడు. శిలా స్థంభానికి వెనుక రెండు, కుడి, ఎడమ వైపున రెండేసి చొప్పున గోడల్ని నిర్మించాడు. అలా నిర్మించిన కొయ్య గోడలకు ఇనుప మేకులు కొట్టి, పొట్టేళ్ల చర్మాలు, తాళ్లతో చుట్టాడు. ఒక్కో కొయ్యగోడను మధ్యలోను, పైన, రెండేసి కొయ్య దూలాలతో కలిపి బిగించాడు. ఒక్కో దూలం మధ్యలో నిలువుగా ఉండేట్లు, తాళ్లు బిగించుకోవటానికి వీలుగా కొయ్య కప్పీలను అమర్చాడు. తరువాత శాసన స్థంభం చివరన నాలుగు తాళ్లను బిగించి, వాటిని ముందుకు లాగాలని చెప్పాడు. అదే సమయంలో, కప్పీల్లో దూర్చి ఉంచిన తాళ్లను వదలమని చెప్పాడు. మట్టి, ఊకలతో కింద ఒక అరుగులాంటి దాన్ని నిర్మించాడు. అంతేకాదు, స్తంభం పడిపోకుండా పొడవాటి కట్టెలను కూడా అమర్చాడు.

అంతా సజావుగానే ఉంది అనుకొన్నాక, రాజు స్వయంగా పనివాళ్లకు, ఆ స్థంభాలను ఎలా దించాలో, సూచనలిచ్చాడు. ఆయన ఆజ్ఞల ప్రకారం, మొత్తం ఆ స్థంభం పొడవెంతుందో అంత పొడవుండేట్లు ఒక బండిని చేయించారు. బరువుకు తట్టుకోవాలిగా అందుకని దానికి తగ్గట్టుగానే 42 చక్రాలను అమర్చారు. ఒక్కో చక్రం చుట్టుకొలత 10 గజాలు.

తరువాత స్తంభం ఏమాత్రం దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకొన్నాడు. పైనుంచి కిందిదాకా ఎండుగడ్డి, ముడి తోళ్లతో కట్టి, ముందుగా కట్టి ఉంచిన తాళ్లను వేలమంది కూలివాళ్లతోనూ, ఎడ్లు, ఏనుగులతోనూ మెల్లమెల్లగా లాగించాడు. అనుకొన్నట్టుగానే ఆ స్తంభం బండిమీద దిగింది. ఇక చేయాల్సిందల్లా ఆ బండిని యమునా నది దాకా తీసుకెళ్లడం. బాగా ఆలోచించిన తుగ్లక్, బండి వెళ్లాల్సిన దోవను బాగు చేయించాడు. దగ్గరుండి బండిని యమునా నది ఒడ్డుకు చేర్పించాడు. నదిని దాటించటానికి బల్లకట్టులున్న పెద్దపెద్ద పడవల్ని ఒడ్డమ్మటే సిద్ధం చేశాడు. తన సూచనలపైన ఆ స్తంభాన్ని కప్పీలు, తాళ్ల సాయంతో మెల్లగా బండి మీద నుంచి లేపి, పడవ పైకి చేర్పించాడు. పడవ మీద ఆ పెద్ద స్తంభం ఒరిగేప్పుడు ఆకార్యక్రమంలో పాల్గొన్న వాళ్లంతా ఒక్కసారిగా 'బిస్మిల్లాహ్- ఇ-మజ్రిహ వా ముర్సహా' అంటే, దేవుని పేరు మీద ఈ పడవలు జాగ్రత్తగా వెళ్లి లంగరు వేయాలని వేడుకొన్నారు. అలా సాగిన పడవలు కోట్ల (ఫిరోజ్‌షా కోట్ల) చేరుకొన్న తరువాత పడవ మీద నుంచి తోవ్ర దగ్గర ఆ స్తంభాన్ని బండి మీద ఎలా ఎక్కించారో అలాగే మరో బండి మీద ఎక్కించారు.

కోట లోపల ఆ స్తంభాన్ని నిలబెట్టడానికి జామీ మసీదు దగ్గర నిపుణులైన ఇంజినీర్లు, శిల్పులను రప్పించి ఒక కట్టడాన్ని చేపట్టారు. సున్నం, రాయితో అనేక అంతస్తుల బిల్డింగు, ఒక అంతస్తు పూర్తి కాగానే, పాత పద్ధతిలోనే ఆ స్థంభాన్ని నిల బెట్టారు. అయితే దాన్ని నిటారుగా నిలబెట్టడానికి సుల్తాన్ ఎంతో శ్రమపడవలసి వచ్చింది. ఆరు వరుసలుగల పునాది కట్టడానికి, బాగా పేనిన 35 తాళ్లను కట్టి, వాటి రెండో కొనలను స్తంభంపై భాగానికి కట్టారు. కప్పీల్లో తాళ్లను క్రమంగా లాగటం వల్ల స్తంభం

మొత్తం అనుకొన్నట్టుగానే పైకి లేచింది. ఎట్టి పరిస్థితుల్లోనూ స్తంభం వంగకుండా, కుంగకుండా చుట్టూ పత్తి బస్తాలు, పొడవాటి దుంగలను అమర్చారు. అన్ని వైపులా తిన్నగా ఉండేట్లుగా, సుల్తాన్ 13-9-1367 రోజున ఆ స్తంభాన్ని నిలబెట్టాడు. దాని చుట్టూ, సారువా కట్టేంత వరకూ, కట్టెలను నిలబెట్టాడు. తరువాత స్తంభం చుట్టూ పాల రాళ్లు, ఎర్రరాళ్లు, నల్ల రాళ్ళతో ఒక పీఠాన్ని నిర్మించారు. స్తంభాన్ని మళ్లీ నునుపుగా చేసి, దానికి మెరుగు పెట్టి, పైన మంచి డిజైన్‌తో చేయించిన కలశాన్ని నిలిపాడు. ఆ కలశం పైన ఇస్లాం గుర్తైన నెలవంకను కూడా ఉంచాడు.

ఇంతటితో కథ కంచికి వెళ్లిందనుకొంటున్నారా? లేదు ప్రారంభమైంది. ఆసక్తిని కలిగించే రసవత్తర సంఘటనలకు దారితీసింది. స్తంభం నిలబడిందిలే అని సుల్తాన్ ఊరుకోలేదు. దాని మీద రాసున్న ఏడు శాసనాల సంగతిని తేల్చాలనుకొన్నాడు. తలపండిన హిందూ పండితులను రప్పించి, తానే స్వయంగా శిలాశాసనాల్ని చూపించి, అందులో ఏమి రాసుందో కనుక్కోమని ఆజ్ఞాపించాడు. పండితులు స్తంభంచుట్టూ ప్రదక్షణలు చేశారు. బుర్రలు గోక్కున్నారు. ముహూర్తాలు సరిచూచుకొన్నారు. అక్షరాలు అర్థంకాక, లిపి తెలియక కుప్పిగంతులు వేశారు. తెలియదని ఒప్పుకొంటే రాజాదరణ పోతుంది. తెలిస్తే చెప్పొచ్చుగానీ తెలియదు. ఏం చేయాలో దిక్కుతోచని హిందూ పండితులకు పట్టపగలే చుక్కల్ని లెక్క బెట్టినంత పనైంది. ఒక్కొక్కరూ తేలుకుట్టిన దొంగల్లా అక్కణ్ణించి జారుకున్నారు. వారిలో ఒకడు మాత్రం ధైర్యం కూడగట్టుకొని, తెలిసినట్లు నటిస్తూ, చిదంబర రహస్యాన్ని పటాపంచలు చేస్తున్నట్లు ప్రకటించాడు. రాజు మొఖంలో ఆనందం. 'ఆ అందులో ఏముందో చెప్పండి' అన్నాడు! 'మహారాజా! ఈ శాసన స్తంభాన్ని ఇక్కడ నుంచి తరలించటం ఎవరి తరమూ కాదని, ఒక వేళ అలా తరలించాలంటే, రాబోయే కాలంలో ఫిరోజ్, అనే మహమ్మదీయ సుల్తాన్‌కు మాత్రమే అది సాధ్యమని రాసుంద'ని చెప్పి చేతులు దులుపుకొన్నాడా పండితుడు. నమ్మ శక్యంకాని ఈ వివరణ పట్ల సుల్తాన్ సంతృప్తి పడక పెదవి విరిచాడు. ఏది ఏమైనప్పటికీ, ఆ స్తంభాన్ని ఉన్నచోటు నుంచి తరలించి, కోట్లలో మళ్లీ నిలబెట్టడానికి సుల్తాన్ వ్యక్తిగత విజయంగా అఫీఫ్ వర్ణించాడు.

మినార్ - ఇ - జరిన్ ( బంగారు స్తంభం) గురించి ఆనాటి ప్రజలు ఏమనుకొన్నారో, సుల్తాన్ దర్బార్‌లోని ఒక కవి పద్య రూపంలో అభివర్ణించాడు. ఆ కవి ప్రకారం, కింద వెడల్పుగానూ, మధ్య నుంచి పైవరకూ సన్నగానూ ఒకే రాతిలో చెక్కబడిన ఈ స్తంభం స్వర్గలోకాన్ని తాకేట్లుందనీ, ఉదయపు సూర్య కిరణాలు సోకిన ఆ మెరిసే స్తంభం దాదాపు 100 ఫర్లాంగుల దూరం వరకూ ఒక బంగారపు కొండలా ప్రకాశిస్తుందనీ, గద్దగానీ, కొంగగానీ, ఏ ఇతర పక్షిగాని ఈ స్తంభం పై భాగం వరకూ ఎగర లేదనీ, ఏ బాణంగానీ, ఖడ్గంగానీ కనీసం దాని మధ్య భాగం వరకూ కూడా చేరుకో లేదనీ, ఒక వేళ ఈ స్తంభంపైన పిడుగుపడినా ఆ శబ్దం కిందికి వినిపించనంత ఎత్తుందనీ, ఈ స్తంభాన్ని ఎత్తి, దాన్ని కదలకుండా ఇంత గట్టిగా బిగించిన వీరు లెవరో, దానికి బంగారు పూత ఎలా పూశారో ఆదేవునికే తెలియాలనీ, స్వర్గలోకంలోని కల్ప వృక్షాన్ని దేవతలు ఈ లోకంలో ప్రతిష్టించినట్లుందనీ, దీని పునాదిని ఇనుము, రాయి మొదలైన ధాతువులతో నింపారనీ, పై స్తంభాన్ని బంగారంతో చేసి ముత్యాలతో అలంకరించారనీ, ఆ కాలపు ప్రజలు గొప్పలు చెప్పుకొనేవారనీ సిరాత్-ఇ-ఫిరూజ్ షాహీలో వివరించబడింది. తెలియక డాంబికానికి పోయిన హిందూ పండితుల కంటే, కేవలం స్తంభం ఎత్తును, ఆకారాన్ని, మెరుగును, నిర్మాణ రీతిని చూచి అతిశయోక్తిగా చెప్పుకొన్న మామూలు ప్రజలే నయమని పించారు.

ఈ స్తంభం చుట్టూ ఫిరోజ్‌షా నిర్మించిన కట్టడం కూడా చెప్పుకోదగ్గదే. మొదటి అంతస్తు 118 అడుగులు, రెండో అంతస్తు 83 అడుగులు, మూడో అంతస్తు 55 అడుగుల చదరంలో నిర్మించబడి, ప్రతి అంతస్తులోను పైన బోర్లించిన గంపను బోలిన కప్పులు గల అనేక గదులతో నుండి స్తంభం చుట్టూ గట్టిగా పట్టుకోసం మరికొంత నిర్మాణం చేయబడింది. ఇంతకీ అసలు స్తంభం పొడవు 42 అడుగుల 7 అంగుళాలు, దీనిలో 35 అడుగులు నున్నగా నగిషీ చేయబడింది.

భారతదేశంపై 1398లో దండెత్తిన తైమూర్, తాను ఎన్నో దేశాల్లో తిరిగాను గానీ, ఇలాంటి అద్భుతమైన మేలిమిలా మెరిసే స్తంభాన్ని ఎక్కడా చూడలేదని ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

ఫిరోజ్‌షా రాజ్యం చలాయిస్తున్న 20వ సం॥లో అంటే క్రీ.శ. 1370 లో రాసిన సిరాత్-ఇ-ఫిరోజ్ షాహిలో మరోలా వివరించబడింది. దాని ప్రకారం అంబాలా దగ్గరి తోప్రా శిలా స్థంభాన్ని ఢిల్లీకి తరలించటానికి ముందుగా ఏనుగులతో ప్రయత్నించి, విఫలమైన సుల్తాన్ 20,000 మంది పనివాళ్ల సాయంతో ఆ స్తంభాన్ని 42 చక్రాలబండి మీద లాక్కొచ్చి, పెద్ద పడవల ద్వారా యమునా నదిని దాటించి, ఫిరోజాబాదులోని జుమ్మా మసీదుకు చేర్పించాడు. అలాగే కోసాంబిలోని అశోక శిలా శాసన స్తంభాన్ని అలహాబాద్‌కు తరలించిందెవరనుకొంటున్నారు? అక్బరు చక్రవర్తి!

సరే! మరి 1367లో ఫిరోజ్‌షా తరలించిన ఈ భీముని చేతి కర్రలపై శాసనాల్ని ఎవ్వరైనా గుర్తించారా? లేదా? అన్న అనుమానం రాకమానదు. గుర్తించటానికి దాదాపు 600 సం॥ పట్టింది. క్రీ.శ. 1750లో పి. టీఫెంథ్లర్ అనే క్రైస్తవ ఫాదర్ ఇక్కడున్న మీరట్ శాసనాన్ని గురించి మొదటి సారిగా తెలియజేశాడు. 1834లో జేమ్స్ ప్రిన్సెప్, ఢిల్లీలోని తోప్రా స్తంభం పై నున్న శిలా శాసన పాఠాన్ని కనుగొని ఏడు శాసనాలను జర్నల్ ఆఫ్ ఏసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్‌లో ప్రచురించటంతో కథ ముగిసింది. ఈ అక్షరాల్ని బ్రాహ్మీలిపి అంటారు. కలకత్తాలోని రాయల్ ఏసియాటిక్ సొసైటీ సెక్రటరీగా పని చేసిన జేమ్సు ప్రిన్సెప్, తాను కొన్ని నాణేలపైగల ద్విభాషా ముద్రలపైగల అక్షరాలను కనుగొన్నాడు. తరువాత సాంచీ స్థూప వేదిక స్థంభాల మీదగల శాసనాల నుంచి 'దానం' అనే మాటను కనుగొని ముందుగా 'దా', 'న', తరువాత 'ఆ', 'ఏ' 'అనుస్వరం', 'య', 'వ', 'ల' మొదలైన అక్షరాలను గుర్తించి, అశోకుని, గిర్నారు, ఢిల్లీ తోప్రా శాసనాక్షరాల నుంచి మొత్తం బ్రాహ్మీ అక్షరమాలను 1837లోనే కనుగొన్నాడు. 1840 ప్రాంతం నోరిస్ అనే అతను **దీప వంశం** అనే గ్రంథం ఆధారంగా 'దేవానాం ప్రియ' అన్న బిరుదు అశోకునికి ఉందని తెలియజేయటంతో ఈ శాసనాలు అశోకుని వని కనుక్కోవటం తేలికైంది. తరువాత 1915లో కర్నాటకలోని మాస్కి దగ్గరగల శాసనంలో 'దేవానాం ప్రియ అశోక' అని ఉండటంతో అశోకుని శిలాశాసనాలను గుర్తించటం మరింత సులువైంది.

చారిత్రక అవగాహన లేక అశోకుని శాసన స్తంభాలను భీముని చేతి కర్రలనీ, గదలనీ, పొగతాగే చుట్టలనీ ఎవరికి తోచినట్లు వారు అనుకొన్నారు. ప్రిన్సెప్, కన్నింగ్‌హామ్, హుల్ట్జ్, సెనార్ట్, బూలర్, బర్జెస్ లాంటి పాశ్చాత్య పరిశోధకుల కృషి వల్ల అశోక శాసనాలు గుర్తింపుకు నోచుకొని భారత దేశానికి ఒక గొప్ప చరిత్ర ఉందని తెలిసింది.

ఇంతకీ అశోకుని శిలాశాసనాలపై ఉన్న విషయాలివి: 1. ధమ్మ మార్గం, ధమ్మ విధానం గురించి; 2. ధమ్మ నిర్వచనం; 3. పాపం తెలుసుకొనుట (చెడును తెలుసుకొనుట); 4. అశోకుడు నియమించిన రజ్జుకులు; 5. చంపకూడని ప్రాణులు; 6. జనుల ధమ్మ అభివృద్ధి; 7. అశోకుని ధమ్మ సమీక్షా ఉన్నాయి.

# తెలుగునాట మళ్లీ పల్లవిస్తున్న బౌద్ధం

## కొత్తగా వెలుగు చూచిన బౌద్ధ క్షేత్రం : జగతిమెట్ట

–కడియాల వెంకటేశ్వరరావు

దాదాపు రెండు శతాబ్దాలుగా తెలుగునాట జరుగుతున్న పరిశోధనల్లో ఇప్పటిదాకా 156 బౌద్ధ క్షేత్రాలున్నట్లు తెలిసింది. అంతేకాదు ప్రతి సంవత్సరం, వ్యవసాయ పనుల మూలంగానో, ఇళ్ళకు పునాదులు తీస్తున్నప్పుడో ప్రత్యేకించి ఉత్తర కోస్తాలో అడపాదడపా బౌద్ధ కట్టడాల ఆనవాళ్లు బయటపడుతున్నాయి. ఈ కోవకు చెందిందే వంశధారనది ఒడ్డున వెలుగు చూచిన జగతిమెట్ట బౌద్ధక్షేత్రం. తూర్పుగోదావరి జిల్లా చొల్లంగిలోనూ, జేగురుపాడు పవర్ ప్లాంటు కింద పాక్షికంగా వెలుగు చూచిన బౌద్ధ అవశేషాలు కూడా ఇలా బయట పడినవే. చరిత్రపట్ల, చారిత్రిక అవశేషాల పట్ల ఏమాత్రం అవగాహన లేని రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 1796-97లో అపురూపమైన అమరావతీ శిల్పాన్ని సున్నంకోసం పిండి కొట్టించినట్లుగానే స్థానిక రెవెన్యూ అధికారులు, ఇళ్ల కాలనీలకు ఈ స్థలాలను కేటాయిస్తుండగా, బయట పడే ఇటుకలను స్థానికులు ఇంటి నిర్మాణానికి వాడుకోవడం ఒక ఎత్తైతే, మరికొంతమంది ఏకంగా ఆ ఇటుకలతో శివాలయాలు, విష్ణాలయాలు నిర్మిస్తున్నారు. పురావస్తు శాఖకు చెందని, బౌద్ధం పట్ల జిజ్ఞాస కలిగిన ఒక క్రీడాధికారి, కడియాల వెంకటేశ్వరరావు మొదటి సారిగా ఈ క్షేత్రాన్ని గుర్తించి దాని వివరాలను 'మిసిమి'లో ప్రచురణకు పంపిస్తూ పురావస్తు శాఖ ఈ విషయంలో కొంచెం శ్రద్ధ కనబరచి, తవ్వకాలు జరిపితే అక్కడి స్తూపాలు, విహారాలు, చైత్యాలను వెలికి తెచ్చి కాల గర్భంలో కలిసి పోయిన బౌద్ధ చరిత్రను నలుగురికీ తెలియ జేయాలని కోరుకొంటున్నారు. – సంపాదకుడు

మధ్యమ కళింగంగా పేరొందిన శ్రీకాకుళం జిల్లాలో కొత్తగా వెలుగు చూసిన మరో బౌద్ధ విహారం జగతిమెట్ట. ఈ బౌద్ధ ఆరామ శిథిలాలు పోలికి మండలం, తలసముద్రం శివారు గ్రామం దుబకవానిపేటను ఆనుకొని ఉన్న జగతిమెట్టగా గుర్తించాలి. శ్రీకాకుళం జిల్లా హెడ్ క్వార్టర్స్‌కి 32 కి॥మీ॥ దూరంలో, కళింగ పట్టణానికి 7 కి॥మీ॥ దూరంలో వంశధారా నదికి ఉత్తరం వైపున, సాలిహుండం బౌద్ధ విహారానికి కనుచూపు మేరలో ఉంది. ఈ విహారాన్ని నరసన్నపేట మీదుగా తలసముద్రం నుండి కాలి నడకన దుబకవానిపేట చేరవచ్చు. విహార భూమి బీహారే అయినా అంతకు మించి అనేక బౌద్ధ విహారాలు ఆంధ్ర దేశంలో వెలుగు చూస్తున్నాయి. అమరావతి, భట్టిప్రోలు లాంటి విఖ్యాతి గాంచిన అనేక బౌద్ధ విహారాలు మన రాష్ట్రంలో ఉండటం ఆంధ్రుల ఆధ్యాత్మిక చైతన్యానికి కళాభిలాషకు ప్రతీకగా నిలుస్తాయి. కొత్తగా వెలుగు చూసిన ఈ జగతిమెట్ట బౌద్ధ విహారం కొంత భూ ఆక్రమణలకు గురైనప్పటికి నేడు సుమారు $6^1/_2$ ఎకరాలలో నిలిచి ఉండటం ఒకప్పటి విహార విస్తృతిని, గత వైభవాన్ని సూచిస్తుంది. ఈ విహారానికి మధ్య భాగంలో సుమారు 10 అడుగుల ఎత్తు 280 అడుగుల చుట్టుకొలత కలిగిన ఒక స్తూపం నిలిచి ఉంది.

---

కడియాల వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఎ.పి.,
లాల్ బహదూర్ స్టేడియం, హైదరాబాద్

కాలగమనంలో అనేక సాంస్కృతిక ఒడిదుడుకులకు, ప్రకృతి వైపరీత్యాలకు, వంశధార వరదల ఉధ్రుతికి తట్టుకొని ఇప్పటికీ ఈ విహారం నిలిచి ఉండటం ఒక అదృష్టంగా భావించాలి. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలో శ్రీముఖలింగం, శాలిహుండం, దంతవరపుకోట, కళింగపట్టణంలో బౌద్ధ విహారాలు వెలుగు చూసాయి. ఈ విహారాలు వంశధార నది ఒడ్డున మాత్రమే నెలకొని ఉండటం ఒక విశేషం. భూగర్భంలో ఉండి వెలుగు చూడని బౌద్ధ క్షేత్రాలు ఎన్నో ఈ కళింగంలో ఉన్నట్లు చరిత్రకారుల అభిప్రాయం. పూర్వం నుండి మహానది గోదావరి మధ్య ప్రాంతాన్ని కళింగ సామ్రాజ్య విభాగంగా గుర్తించారు. చరిత్రలో మధ్య కళింగ ప్రాంతంగా ఖ్యాతి గాంచిన కళింగ పట్టణానికి సమీపంలో ఈ జగతి విహార ఉండటం గమనార్హం. వంశధార నది సాగర సంగమ ప్రవేశానికి అతి చేరువలో ఈ విహారం ఉంది. సముద్ర ప్రయాణానికి అనువైన ప్రదేశంలో నిర్మించబడింది. ఈ విహారం పాతపేరు ఏముందో తెలియదు. కానీ ఈ విహార స్థలాన్ని జగతిమెట్ట లేక జగతిపాడుగా స్థానికులు పిలుస్తున్నారు. జగతి అనే పదం శ్రీకాకుళం జిల్లాకి ఆనుకొని ఉన్న ఒరిస్సా రాష్ట్రంలో దేవాలయాల నిర్మాణంలో ఒక ఎత్తైన వేదికకు పర్యాయ పదంగా వాడబడినది. కనుక జగతి అంటే ఎత్తైన లేక శిథిలమైన మట్టి దిబ్బను జగతి అని పిలిచి ఉండవచ్చు. ఇప్పటికీ ఆంధ్ర దేశంలో గ్రామ నామాల చివర పాడు అని అంత్య పదం ఉన్న గ్రామాలన్నీ ఒకప్పటి పురాతన పాటి దిబ్బలపైన నిర్మించబడినవే. ఈ శిథిల బౌద్ధ స్థూపాన్ని జగతి - జగతిమెట్ట లేక జగతిపాడుగా పిలువ బడుతున్నది. శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం దగ్గర ఒక జగతి అనే గ్రామం ఉన్నది. ఒరిస్సా రాష్ట్రంలో బౌధ్‌కు పశ్చిమాన 10కి.మీ. దూరంలో మరో జగతి ఉన్నది. క్రీస్తు పూర్వం నుండి ఈ జగతి విహార ఒక బౌద్ధ క్షేత్రంగా, విద్యాలయంగా భాసిల్లి ప్రపంచానికి ఆధ్యాత్మిక వెలుగు ప్రసరించిన ఒక పురాతన విద్యాలయంగా భావించవచ్చు. ఈ విహారానికి ఆనుకొని దక్షిణం వైపున సుమారు 150 లేక 200 సం॥లు క్రితం దుబకవానిపేట గ్రామం ఏర్పడినట్లుగా తెలుస్తున్నది. గ్రామ స్థులు ఈ విహారానికి తూర్పున చెరువు కోసం త్రవ్వకాలు ప్రారంభించినప్పుడు ఈ ప్రాంతంలో అనేక విహారాలు, స్థూప, చైత్యాలు, చతుశ్శాల సంబంధించిన ఇటుక రాతి గోడలు, ఇటుక రాతి పునాదులు అనేకం బయట పడినాయి. ఈ విహార కట్టడాలకు స్థూపానికి వాడబడిన ఇటుకలు 57 x 28 x 8 సెం.మీ. 52 x 25 x 7 సెం.మీ.ల కొలతలు కలిగి ఉన్నాయి. స్థూపానికి పైన పూతగా, విహారాలకు గచ్చుగా వాడబడిన 10-20 సెం.మీ. మందం కలిగిన సున్నపు గచ్చు ముక్కలు అనేకం తూర్పు వైపున కనిపిస్తున్నాయి. కనుక స్థూపాన్ని విహారాలను మట్టితో కట్టి సున్నపు పూత వేసినట్లుగా తెలుస్తున్నది. అనేక శంఖా కారపు పగిలిన గిన్నెలు, ఎరుపు - నలుపు కలిగిన కుండ పెంకులు మరియు ఎరుపు - నలుపు మెరుపు కలిగిన కుండ పెంకులు అనేక చోట్ల కనిపిస్తున్నాయి. విహార పై కప్పులకు వాడబడిన రంధ్రం కలిగిన పెంకులు అనేకం పడమర వైపు భూములలో కన్పిస్తున్నాయి. ఈ స్థూపానికి ఉపయోగించిన రాతి కాలువలు ఉత్తరం వైపున పంట పొలాలలో మోటారు పంపు షెడ్‌లలో ఉపయోగిస్తున్నారు. భిక్షు గృహాల ఇటుక రాతి పునాదులు విహారానికి దక్షిణం వైపున సుమారు 30 మీ॥ పొడవున తూర్పు వైపు నుంచి పడమర వైపుగా కనిపిస్తున్నాయి. తూర్పు వైపు చెరువు త్రవ్వకాల సమయంలో చిన్న మట్టి పైపులు, ముద్రలు, ఒక తగరపు నాణెం దొరికినట్లుగా గ్రామస్థులు తెలియ జేశారు. ఈ స్థూపానికి తూర్పు వైపున, దక్షిణం వైపున మూడు అడుగుల

ఎత్తుగల రాతి స్థంభాలు కనిపిస్తున్నాయి. ఇవి బహుశ స్థూపానికి నాలుగు వైపుల ఏర్పాటు చేసిన తోరణ స్తంభాలు గానీ, లేక శిలా మండప స్తంభాలు గానీ ఉండవచ్చు. ఇక్కడ లభించిన అతి పెద్ద ఇటుకలు, మెరుపు కలిగిన కుండ పెంకులు, ఇతర ఆధారాలు శాలిహుండం, కళింగపట్టణం, బావికొండ, తొట్లకొండ, మొదలైన చోట్ల లభించిన ఆధారాలను పోలి ఉండటంతో ఈ జగతి విహారం క్రీ॥పూ॥ 2 లేక 3వ శతాబ్దాల నాటిదిగా భావించవచ్చు. ఈ స్థూపానికి సంబంధించి బౌద్ధ శిల్పాలు గాని, రాతి పలకలు గాని లభించలేదు. కనుక ఈ విహారం క్రీ॥ పూ॥ నాటి థేరవాద బౌద్ధ కేంద్రంగా గుర్తించవచ్చు. మహాయాన, వజ్రయాన పంథాలు వర్ధిల్లిన దాఖాలాలు ఏమీ పైకి కనిపించవు.

ఈ విహారానికి సమీపంలో వంశధార నది ఒడ్డున తీర్థాల రేవు అనే ఒక ప్రదేశం ఉంది. ఈ తీర్థ సాంప్రదాయాలన్నీ జైన లేక బౌద్ధ మతస్థులు జనులను తరింపచేయడానికి ఏర్పాటు చేయబడ్డ సాంప్రదాయాలుగా గుర్తిస్తున్నారు. గ్రామస్థులు పండగ సందర్భాలలో ఈ తీర్థాల రేవులో స్నానాలు చేయటం ఇప్పటికీ ఒక ఆచారంగా కొనసాగుతున్నది. కనుక ఈ తీర్థాల రేవు సాంప్రదాయం జగతి బౌద్ధ విహారానిదై ఉండవచ్చు. ఈ పురాతన సాంప్రదాయం ఇప్పటి వరకు కొనసాగటం ఒక చారిత్రక సత్యం. ఈ విహారానికి వంశధార నది ఆవలి ఒడ్డున ఉన్న శాలిహుండం బౌద్ధ విహారాన్ని 1919-20 ప్రాంతంలో ఎ.హెచ్.లాంగ్ హరస్టు అనే బ్రిటీష్ పురాతత్వ శాస్త్రవేత్త తవ్వకాలు జరిపి చారిత్రక విషయాలను వెలుగులోకి తెచ్చారు. శాలిహుండం కనుచూపు మేరలో ఉన్న ఈ జగతిమెట్ట ఆయన దృష్టికి రాలేదు. బహుశ ఈ జగతిమెట్ట చుట్టూ పెరిగిన చెట్లు, ముళ్ళకంప మూలంగా ఈ బౌద్ధ స్థూపం కనుమరుగై ఉండవచ్చు.

ఉత్తరాంధ్రలో మైదాన ప్రాంతంలో వెలుగు చూసిన మొదటి బౌద్ధ విహారం జగతిగా గుర్తించవచ్చు (స్థూప, చైత్య, బిక్షుగృహాల సముదాయము). మిగిలిన బౌద్ధ విహారాలన్నీ చిన్న గుట్టల మీద లేక కొండలపైన నిర్మింపబడ్డాయి.

క్రీ॥శ॥ 7వ శతాబ్దంలో హుయాన్ చాంగ్ అనే చైనా యాత్రికుడు భారత దేశ సందర్శనకు వచ్చినప్పుడు కళింగపట్టణం రేవును సందర్శించినట్లు చరిత్ర తెలియచేస్తున్నది. జి.ఆర్. వర్మ రచించిన కళింగ దేవ పుస్తకంలో చాంగ్ నాటికి కళింగ దేశంలో 10 సంఘారామాలు, 500 మంది బౌద్ధ బిక్షువులు, 100 దేవాలయాలు ఉన్నట్లు తెలియచేశారు. హుయాన్ చాంగ్ కళింగ పట్టణం రేవు నుండి కొంత దూరంలో 100 అడుగుల ఎత్తు కలిగిన ఒక బౌద్ధ స్థూపం, బౌద్ధ విగ్రహాలు కన్పిస్తున్నాయని ఆ స్థూపానికి వాయువ్య దిశగా మరొక సంఘారామం ఉండెనని చాంగ్ గుర్తించారని పుస్తకంలో పేర్కొన్నారు. చాంగ్ పేర్కొన్న 100 అడుగుల స్థూపం శాలిహుండం కొండపైన ఉన్న స్థూపంగా చరిత్రకారులు గుర్తించారు. కనుక స్థూపం శాలిహుండానిదైతే దానికి వాయువ్య దిక్కున చాంగ్ పేర్కొన్న ఆరామం మన జగతి ఆరామం అయి ఉండాలి.

చరిత్రకారుల చేత ఒకప్పటి కళింగ రాజధానిగా పేర్కొనబడిన కళింగపట్టణానికి అతి సమీపంలో ఉండి కళింగ సామ్రాట్టుల ఆదరణ పొంది, కళింగంలో బౌద్ధ ధర్మ చక్ర పరిభ్రమణాన్ని గావించిన ఈ జగతి విహారం కేవలం ఒక పది అడుగుల ఎత్తు కలిగిన దిబ్బగా మిగిలి ఉంది. చుట్టూ ఉన్న

బిక్షు గృహాలు, విహారాలు నాశనం చేయబడి ఇటుక రాతి పునాదులే ఆనవాలుగా మిగిలి ఉన్నాయి. చారిత్రక స్పృహ లేని గ్రామస్థులు ఈ స్థూపం పైన 1995లో చిన్న శివాలయాన్ని నిర్మించారు. ఇంత ప్రాముఖ్యత సంతరించుకొన్న బౌద్ధ విహారం సముద్రపు అలల తాకిడికి గాని వంశధార నది వరదల తాకిడికి గాని గుర్తై ఉండవచ్చు. గ్రామస్థుల కథనం ప్రకారం 1980 ఆగష్టులో వంశధార నది ఉధృతంగా ప్రవహించి ప్రస్తుత గ్రామాన్ని, బౌద్ధ విహార స్థలాన్ని వరద ముంపుకు గురి చేసినట్లు ఒక రాత్రి అంతా గ్రామస్తులు ఈ స్థూపం పైన తలదాచుకున్నట్లు తెలియచేస్తున్నారు. ఇప్పటికీ ఈ జగతి విహారం మూడు వైపుల వరదల ఆనవాలుగా ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. కనుక ఈ విహారం వంశధార వరదల మూలంగా పాడుబడి బౌద్ధ బిక్షువులు శాలిహుండం కొండపైన గాని, కళింగపట్టణం వద్ద గాని విహారాన్ని పునః నిర్మించి ఉండవచ్చు లేదా ఇక్కడి బిక్షువులు ఆదరణ కోల్పోయిన తరువాత చైనా, జపాన్, జావా లాంటి దక్షిణ ఆసియా దేశాలకు వలస వెళ్ళి ఉండవచ్చు.

ఈ స్థూపం తాలూకు కొన్ని పెద్ద ఇటుకలు సమీపంలో ఉన్న తలసముద్రం గ్రామంలో కనిపిస్తున్నాయి. కనుక జగతి విహారం తాలూకు ఇటుకలు, పాటిమట్టి, ఇతర వస్తువులు తల సముద్రం గ్రామ నిర్మాణ సమయంలో ఉపయోగించినట్లుగా తెలుస్తున్నది. కనుక ప్రస్తుతం ఉన్న తలసముద్రం దానికి శివారు గ్రామం దుబకపేట గ్రామాలు ఈ విహారం పాడుబడిన తరువాత నిర్మించబడినట్లుగా భావించవచ్చు. తలసముద్రం గ్రామానికి తూర్పు వైపున గంటిపాడుగా పిలుస్తున్న ఖాళీ స్థలాన్ని క్రీ॥పూ॥ నాటి జనావాసంగా గుర్తించవచ్చు. ఈ గంటిపాటి స్థలం రెండు అడుగుల ఎత్తు ఉండి 10-15 ఎకరాల పరిధిలో విస్తరించి ఉంది. ఇక్కడ కొన్ని మెరుగు గల నలుపు, ఎరుపు మరియు బఫ్ కలర్ కలిగిన కుండ పెంకులు దొరుకుతున్నాయి. కాని ఎక్కడా ఇటుకలు కాని, ఇతర కట్టడాలు కాని కనిపించవు. కనుక గంటిపాడు క్రీ॥పూ॥ నాటి నివాస భూమిగా గుర్తించవచ్చు. ఈ నివాస భూమి జగతి విహారానికి ఉత్తరం వైపున అతి సమీపంలో ఉంది. కనుక ఈ రెండు ప్రాంతాలు దగ్గర సంబంధాలు కల్గిన చారిత్రక ప్రదేశాలుగా గుర్తించవచ్చు. లేదా ఈ రెండు ప్రదేశాలు పూర్వకాలంలో కలిసి ఉండేవా? పరిశీలించాలి. ఇప్పటి వరకు ఈ ప్రాంతాన్ని పరిశీలించిన పురావస్తు శాస్త్రజ్ఞులు ఎవ్వరూ లేరు. ఉద్యోగ రీత్యా శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తూ ఈ విహారాన్ని మొదటగా 1999 లో గుర్తించటం జరిగింది.

క్రీ॥పూ॥ 3 లేక 2 శతాబ్దాల నాటిదిగా భావిస్తున్న ఈ అతి పురాతన థేరవాద శాఖకు చెందిన జగతిమెట్ట బౌద్ధ విహారాన్ని ఒక చారిత్రక సంపదగా గుర్తించి రాబోవు తరాల వారి కోసం పరిరక్షించవలసిందిగా జిల్లా కలెక్టరు గారికి ఒక విజ్ఞాపన సమర్పించబడినది. జిల్లా కలెక్టరు గారు సానుకూలంగా స్పందించి పరిరక్షణకు హామీ ఇవ్వటం జరిగినది. శాస్త్రీయంగా త్రవ్వకాలు జరిపి చారిత్రక సత్యాలను వెలుగులోకి తేవలసినదిగా ఈ జగతి విహారం ఉనికిని ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ వారికి విజ్ఞాపన పత్రం ద్వారా తెలియచేయటం జరిగింది. ప్రభుత్వ పరంగా ఈ విహారాన్ని రక్షించి ఆంధ్ర దేశంలో మరొక పురాతన బౌద్ధ ఆరామాన్ని భావితరాలకు అందించటం అందరి కర్తవ్యం.

# కల్లోల భారతం

- బి.యస్.యల్. హనుమంతరావు

'ఆంధ్రులు చరిత్ర', ఆంధ్రలో జైన బౌద్ధాలు, 'Religion in Andhra' లాంటి అపూర్వ గ్రంథాలు రాసి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహాయాన బౌద్ధ అధ్యయనాల కేంద్ర నిర్దేశకుడు, దివంగతులైన B.S.L. హనుమంతరావుగారి అముద్రిత రచన ఇది. - సం.

సుప్రసిద్ధ చరిత్రకారులు కీ.శే. ఆచార్య బి. యస్. యల్. అసంపూర్ణ గ్రంథం ''కల్లోల భారతం స్వర్ణయుగావిర్భావం'' లోని మొదటి ఉపన్యాస పాఠం. బి. యస్. యల్. మాటల్లో ''నీతిలో, సాంఘిక విలువలలో మానవునికి విశ్వాసాన్ని కలిగించి స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా నీతి మంతుడిగా జీవించటానికి తగిన ఆత్మవిశ్వాసం నైతిక బలం చేకూర్చటానికి కొత్తగా పునాదులు వేయనక్కరలేదు. చాలా ప్రాచీన కాలంలోనే, అంటే సుమారు 2,500 సం॥ పూర్వమే, భారత దేశంలోను, గ్రీసులోను అట్టి కృషి ప్రారంభించారు. నాటి ప్రయత్నంలో ఒక భాగంగానే బౌద్ధం ఆవిర్భవించింది ... నేటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా విస్మృత పథంలో పడిపోయిన బౌద్ధ సాంప్రదాయాలను పునః పరిశీలించి వాని పునరుద్ధరణ ఆవశ్యకతను గుర్తింప చేయటమే నా యీ ఉపన్యాసాల ఉద్దేశ్యం.''

సాధారణంగా, ఒక భావంగానీ, సిద్ధాంతంగానీ, సంస్థగానీ, సమకాలిక పరిస్థితులు మానవ ధీశక్తిపై సృజనా సామర్థ్యంపై చేసిన సవాలుకు సమాధానంగా ఆవిర్భవిస్తూ ఉంటై. సవాలూ, సమాధానమూ; సమస్య, పరిష్కారమూ - అనేవే నాగరికతాభివృద్ధికీ పురోగతికి తార్కాణాలు. అదేవిధంగా, క్రీ.పూ. 8,7 శతాబ్దాలలో భారత దేశంలో విజృంభించిన సాంఘిక, రాజకీయ, ఆధ్యాత్మిక సంచలనమే బౌద్ధానికి కారణమైంది. ఒక భారత దేశంలోనేగాదు; ప్రపంచ మంతటా అది భావ విప్లవ యుగం; పాత జీవిత విధానం మీద, ఆలోచనా క్రమంమీద, అసంతృప్తితో తిరుగుబాటు జరిపి నూతన విధానాలను రూపొందించే కృషి జరిగిన సువర్ణయుగం! ప్రస్తుతం భారత దేశంలో నాటి కల్లోలానికి కారణాలను పరిశీలిస్తే, బౌద్ధానికి గల చారిత్రక ప్రాశస్త్యాన్ని సులభంగా గుర్తింప గలుగుతాం.

## సాంఘిక రాజకీయాలు

క్రీ॥పూ॥ 8వ శతాబ్ది నాటికి, భారత దేశంలో ఆర్య అనార్య జాతుల సమ్మేళనం పూర్తికాలేదు. తూర్పు దక్షిణ భూముల్లో ఆర్యేతర జాతులు నివసిస్తూ, ఆర్య అధికార, సంస్కృతీ విస్తరణను ప్రతి ఘటిస్తూనే ఉన్నాయి. ఈ ఆర్యులు క్రీ॥పూ॥ 2000ల సం॥ల ప్రాంతంలో వాయువ్య సరిహద్దుల గుండా ఇండియాలో ప్రవేశించి అనార్య గ్రామాలనూ, నగరాలనూ ధ్వంసం చేసుకొంటూ పురోగమించినట్లు వైదిక వాఙ్మయం ద్వారానే తెలుస్తుంది. సంహితలలోనూ, బ్రాహ్మణములలోనూ 'వినష్టగ్రామ' అనే అర్థంగల 'అర్మ' 'అర్మక' పదాలు విరివిగా ఉన్నై. తైత్తిరీయ బ్రాహ్మణంలోని ఈ ప్రార్థనను పరిశీలించండి :

ఏ షామ్ ఇమే పుర్వే అర్మాస ఆసన్
అయూపాః సద్మవి భృతా పురూణి

వైశ్వానర త్వయాతే నుత్తః
పృధివీమ్ అన్యామ్ అభితస్థుర్ జనాసః తై॥ బ్రా॥ II 4,6,8,

''ఓ విశ్వానరా! విధ్వంసం చేయబడి, స్థంభాలు లేని ఇట్టి ప్రాంతాలు అనేకమై విస్తరించి యున్నై; ఇవి ఎవరికి మొదట చెందినవో వారునీ చేత తరిమి వేయబడినవారై, వేరొక దేశానికి వలస వెళ్ళినారు''. ఈ దండ యాత్రలకు గురియైన వీరందరూ అనాసులు, కృష్ణవర్ణులు, మృధ్రవచనులు. అంటే వైదికార్యులకు భిన్నమైన జాతి వారనటం స్పష్టమే. అంతేగాదు; ఈ జాతి వారు అవ్రతులు, అపవ్రతులు, ఇంద్రవిరోధులు అనగా వైదిక మతానికి భిన్నమైన మతము నవలంభించిన వారు. వీరిని గానీ, వీరి మత సాంప్రదాయములను గానీ పూర్తిగా నిర్మూలించుట ఆర్య విజేతలకు సాధ్యం కాలేదు. సింధు లోయలోని మొహెంజొదారో నగర అంతిమ దశ, వైదిక యుగంలోని ప్రథమదశ సమకాలికములనీ, వైదికార్యుల పరస్పర కలహాలలో పాత్రధారులైన అనార్య తెగల వారీ మొహెంజొదారో ప్రజలై యుండవచ్చుననీ చరిత్ర కారుల అభిప్రాయమై యున్నది. సమకాలికములైన రెండు భిన్న సంస్కృతు లొకే ప్రాంతమున పోటీగా నిలిచినప్పుడు పరస్పర ప్రభావమునకు లోనగుట సహజము. వేదములలోని మూడవ విభాగమైన 'అరణ్యకము' లలో ఆర్యేతర ప్రజావిధాన ప్రభావము స్పష్టముగ కన్పించుచున్నది. వైదిక మతములోని ''ప్రజాపతి'' భావమునకు సింధు ప్రజల ''పశుపతి'' భావముతో పరిచయమొక కారణమని నిర్భయముగ చెప్పవచ్చును. యోగ విద్యను సైతము అనార్యుల నుండియే ఆర్యులు గ్రహించియుందురు; సింధు ప్రజల పశుపతి మహాయోగి గదా! ఉపనిషత్తులూ, సాంఖ్యయోగాది దర్శనములూ, అనార్య భావ ప్రభావ ఫలితములేనని డాక్టర్ జి.పి. భట్టాచార్య మున్నగు పండితుల విశ్వాసము. వేదములది కర్మ మార్గము; ఉపనిషత్తులది జ్ఞానమార్గము! ఈ విధముగా ఆర్య, అనార్య సంస్కృతుల సంఘర్షణ ఫలితంగా, ఆధ్యాత్మిక ఆలోచనారంగమున నేర్పడిన అవ్యవస్థనూ, సందిగ్ధతనూ తొలగించి, ఉభయ సమ్మతమైన నూతన సమన్వయ సిద్ధాంతమును ప్రతి పాదించి ప్రబోధించి జాతి సమైక్యతను సాధింపవలసిన అవసరం నాడు యేర్పడినది. డాక్టర్ జాకోబి మున్నగు పండితుల పరిశోధనల ప్రకారం. జైన, బౌద్ధ మతాలలో ఎక్కువ పాలు అనార్య సాంప్రదాయాలో! బౌద్ధ ధర్మానికి ప్రాణ ప్రదమైన శీల, సమాధి, ప్రజ్ఞలు వైదికేతర విధానములనుటలో సందేహములేదు. జైన బౌద్ధులకు మగధ రాజ్యము కేంద్రమగుట మరొక విశేషము. మగధ నాటి కింకనూ పూర్తిగా ఆర్యా క్రాంతము కాలేదు. అంతేగాదు; శాక్యవంశము మంగోలు జాతికిచెందిన దనియు, ఆర్యజాతి విస్తరణకు మంగోలు ప్రతి ఘటనయే బౌద్ధరూపమున వెలువడినదనియూ వాదించు విద్వాంసులు కూడా లేక పోలేదు. నాటి జాత్యహం కారాలకు బుద్ధుని జీవిత కాలంలో జరిగిన ఈ సంఘటనయే నిదర్శనం. కోసలాధీశుడైన ప్రసేన జిత్తు, మొదట బద్ధ విరోధి; తరువాత బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి, క్రమంగా తథాగతుని యందేర్పడిన అభిమానం వల్ల శాక్య రాకుమార్తెను వివాహమాడాలని నిశ్చయించాడు. బుద్ధుని బోధనామృతం చవిచూచిన తరువాత కూడా, శాక్యులు దురభిమానంతో తమ రాకుమార్తెను ప్రసేన జిత్తుకు నీయ నంగీకరింపలేదు; కాని బలాధికుడైన ప్రసేన జిత్తు కోర్కను తిరస్కరింప లేక, అంతః పుర దాసికి రాకుమారి వేషము వేసి ప్రసేన జిత్తునకిచ్చి పెండ్లి చేశారు. అమె యందు ప్రసేన జిత్తుకు 'విధూదబుడు' అనే కుమారుడు కలిగాడు. విధూదబుడు యుక్తవయస్కుడగు నాటికి,

ప్రసేన జిత్తుపై శాక్యులు ప్రయోగించిన మోసం వెల్లడియైంది. విధూదబుడు క్రుద్ధుడై శాక్యులపై దండెత్తి స్త్రీ పురుష వయో భేదము గమనింపక వారినేకులను హతమార్చినాడట !

ఇట్టి జాత్యహంకారములతో బాటు వర్ణ వ్యత్యాసములు సైతం సమైక్యతకు ప్రతిబంధకములైనై. వృత్తులాధారంగా నేర్పడిన సామాజిక విభజన, ఆర్యులకు పూర్వమే అనార్యులనుసరించిన వ్యవస్థ. సంచారదశలో ఇండియాకు వచ్చిన ఆర్యులలో అంతటి స్థిరమైన వ్యవస్థయుండెనని చెప్పజాలము. కాని, ఆర్యావర్తమున స్థిరపడిన అనంతరం, వృత్తులకు జాతీయాధిక్యతను చేర్చి, వైదికార్యులు వర్ణవ్యవస్థలో సమాజాన్ని మూస పోశారు. క్రమంగా జాత్య హంకారముతో బాటు వర్ణవైషమ్యాలు వెల్లి తలలు వేసినై. అందుకు ఉదాహరణలుగా ''కూటదంత జాతక కథ'', ఉత్తర రామ చరిత్రలోని ''శంబుక వధ'' గాథలను పేర్కొనవచ్చును. వీటికి తోడు పూజారులైన బ్రాహ్మణులు నిరంకుశత్వం మితి మీరింది. బ్రాహ్మణుడు అంటే ''బ్రహ్మజ్ఞానం'' సాధించిన వాడంటూ ఉంటారు. నేను పేర్కొన్నదా బ్రాహ్మణుడు కాదు. యజ్ఞ ఔన్నత్యాన్ని ఘంటాపథంగా చాటిన ''బ్రాహ్మణములు'' అనే వేద విభాగాన్ని కంఠస్థం చేసి, తత్ప్రకారం వైదిక కర్మకాండలు జరిపించే శక్తి అర్హత పొందిన పూజారి! దక్షిణలపేర వీరు ప్రజానీకాన్ని పీల్చి పిప్పి చేశారని చెప్పవచ్చు. వైదిక వాఙ్మయానికి అధికారులై వీరు క్రమంగా భూదేవతలైనారు. అదేవారి నిరంకుశత్వానికి కారణం. ఈ శ్లోకాన్ని పరిశీలించండి.

దైవాధీనం జగత్సర్వం
మంత్రాధీనంతు దైవతం
తన్మంత్రం బ్రాహ్మణాధీనం
బ్రాహ్మణో మమదైవతం.

నాటి రాజకీయాల్లో గూడా, ఈ వర్ణవైషమ్యాలు ప్రతిధ్వనించినై. దిగ్విజయ యాత్రలు చేసి, ప్రజాపతి కుమార్తెలుగా వైదిక యుగంలో జోహారులందు కొన్న ప్రజాసంస్థలైన సమితి, సభలను కాలరాచి,, నిరంకుశులై, అశ్వమేధాది క్రతువులతో తమ సార్వ భౌమత్వాన్ని చాటుకొంటున్న చక్రవర్తులకు పురోహితుల ఆధిక్యత కంటకమైంది. మన దేశంలోనేగాదు ప్రతి దేశ చరిత్రలోనూ ఈ రాజ-పూజారి సంఘర్షణ కన్పిస్తుంది. మన పురాణాలలోని వశిష్ఠ, విశ్వామిత్ర, పరశురామ, కార్త వీర్యార్జున సంఘర్షణ సుప్రసిద్ధం. వశిష్టు నెదిరించి, బ్రహ్మత్వాన్ని సాధించి క్షత్రియాధిక్యతను ప్రతిష్ఠితం చేశాడు. విశ్వామిత్రుడు; ఇరువది యొక్క మార్లు క్షత్రియ ధ్వంస మొనర్చి, దేశాన్ని, 'అరాజకం' చేసి బ్రాహ్మణ ఔన్నత్యాన్ని పునః ప్రతిష్ఠ చేశాడు పరశురాముడు! తిరిగి క్రీ॥పూ॥ 8వ శతాబ్దిలో పూజారులలోనూ, వారిమతంలోనూ విజృంభించిన అసంతృప్తినీ, ద్వేషాన్ని అవకాశంగా తీసికొని వారినణచటానికి ప్రయత్నించటమే గాక దేశాన్ని ఎదుర్కొంటున్న సాంఘిక ఆధ్యాత్మిక సమస్యలను పరిష్కరించి శాంతి నెలకొల్పే బాధ్యత తమదేనని రాజులు గ్రహించారు. తత్ఫలితంగా, నాటి ఆధ్యాత్మిక మహోద్యమానికి నాకత్వం వహించిన జనక, జాబాలి, అశ్వపతి, పార్శ్వనాథ, మహావీర, సిద్ధార్థ, బింబి సారాదులందరూ క్షత్రియులే! ''బ్రాహ్మణులు ప్రగతి నిరోధుకులు; అపౌరుషేయములని విశ్వసించబడే వేదములే వారి కాధారములు; వేదాలను వ్యాఖ్యానించే హక్కు,

అర్హత వారికి మాత్రమే ఉంది. ఇక క్షత్రియులు జీవితానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించే బాధ్యతగలవారు; కొంతవరకు అనార్య ఆచార వ్యవహారాలను కూడా అంగీకరించి ఆర్య లోకంలో శాంతి భద్రతలను కాపాడాలని తాపత్రయపడేవారు. వీరిది పిశాచాల దృక్పథం'' అనే హోవెల్ పండితుని విమర్శ సత్య దూరమైనది కాదు. (Aryan Rule) ఆధ్యాత్మికంగా సమాజ నాయకత్వాన్ని పూజారుల నుండి ప్రభువులు సంగ్రహించారు. దీనినామోదించుచున్నట్లుగా పురాణాల్లో కన్పించే ''బ్రాహ్మణ, క్షత్రియ'' వర్ణక్రమాన్ని, ''క్షత్రియ, బ్రాహ్మణ'' క్రమంగా మార్చి జైన బౌద్ధ వాఙ్మయాలు రాజకీయాధికారానికే ప్రథమ స్థానాన్ని అంగీకరించినై.

రాజులకు వెన్నుండగా నిలిచారు వణిక్ప్రముఖులు. ఐరోపాలో ఆధునిక యుగారంభమున (క్రీ॥శ॥ 16వ శతాబ్ది) సాగిన మత సంస్కరణోద్యమంలో వర్తక వర్గం నిర్వహించిన పాత్రకూ, బౌద్ధయుగంలో భారతీయ వైశ్య వర్ణం నిర్వహించిన పాత్రకూ పోలికలు కన్పిస్తై. వైశ్యులు, శూద్రులతో చేరి బ్రాహ్మణ క్షత్రియ వర్ణాల ఆధిపత్యంపై ధ్వజం ఎత్తినట్లు స్పష్టమౌతుంది. ఋగ్వేదంలో అనార్య జాతిగా, ఆర్యవిరోధులుగా వర్ణింపబడిన 'ఫణి' జాతియే వణిగ్వర్ణంగా నాటి సామాజంలో చేరియుంటారు. ఈ అనాది వైరుధ్యాన్ని పురస్కరించుకొనియే, దక్షిణల రూపంలో పూజారులు సాగిస్తున్న దోపిడీ విధానాన్ని నిరసించి, బ్రాహ్మణ వర్ణాధిక్యతను నిర్మూలించే కార్యక్రమంలో రాజులతో వైశ్యులు సహకరించారు.

బౌద్ధయుగంలో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఆంధ్ర దేశంలో వెలసిన స్థూప, విహార, సంఘారామాలను నిర్మించినవారిలో ముఖ్యులు వర్తకులూ, శ్రేణికులే! వైశాలిలో జేత వనాన్ని బంగారు నాణెములు పరచి బుద్ధునికి బహూకరించిన అనాథ పిండకుడనే వైశ్య శ్రేష్ఠుని కథ జగత్ప్రసిద్ధం! ఇక సామాన్య ప్రజానీకం సంగతి వేరుగా చెప్పనక్కర్లేదు. జాత్యహంకారాలనూ, వర్ణవిభేధాలనూ నిర్మూలించి మోక్షమార్గాన్ని తమ చేరువకు గొని రాగల నూతన సిద్ధాంతమే వారికి అత్యంత అవసరం! అదే వారి ధ్యేయం! బౌద్ధంలో వారు దర్శించిన దదియే. అందుచేతనే కొందరు బౌద్ధ ఉద్యమాన్ని పూజారి వర్గంపై జరిగిన ప్రజా విప్లవమని వర్ణిస్తారు.

**ఆధ్యాత్మిక సంచలనం**

అన్నిటికంటె ప్రధానమైనది నాటి ఆధ్యాత్మిక సంచలనం. క్రీ॥పూ॥ 8వ శతాబ్దినాటికి, ఋగ్వేద యుగానికి లక్షణమైన నిరాడంబర ప్రకృతి పూజావిధానం వెనుకబడి, ఆడంబరమైన యజ్ఞం కేంద్రంగా బ్రాహ్మణ మతం వెఱ్ఱి తలలు వేసింది. ఒకప్పుడు దైవ ప్రార్థనగా, కృతజ్ఞతా సూచనగా నుండిన యజ్ఞం అసాధారణ వ్యక్తులను, తుదకు భగవంతునిపై అధిపత్యాన్ని సంక్రమింప జేయగల మహత్తర సాధనంగా పరిణమించింది. ''మంత్రాధీనంతు దైవతం'' అనిగదా నాటి భావన. యజ్ఞ ప్రయోజనమూ, ప్రాశస్త్యములను గురించిన చర్చలే, 'బ్రాహ్మణము'లలోని ప్రధానాంశము. ఐతే ఈ యజ్ఞానికి అర్హత మాట అటుంచి, అది బహు వ్యయ ప్రయాసలకు కారణమైంది. యజ్ఞాల పేర జరిగే జంతు బలులతో ఆర్యావర్తం రక్త సిక్తమైంది. నాటి బ్రాహ్మణ మతాన్ని గురించి సిల్వైన్ లెవీ పండితుని అభిప్రాయం పరిశీలించండి: ''బ్రాహ్మణుల మతం కంటె హింసాత్మకమైనదీ, ప్రాపంచికమైనదీ మరొక మతాన్ని ఊహించటం కూడా కష్టం; నాగరికత అని చలామణీ అవుతూ, నీతి పూతలు పూయబడిన నాటి

భావాలు, ఆటవిక యథార్థతతో మనకు విస్మయాన్ని కలిగిస్తై'. ఇట్టి అభిప్రాయాలు వెలిబుచ్చినది, భారతీయ సంస్కృతిలోని విశిష్టతను దర్శింపలేని పాశ్చాత్యులే కాదు; భారతీయ తత్వ శాస్త్రంపై అధికారిగా జోహారులందు కొంటున్న గౌరవనీయ రాధాకృష్ణ పండితుని అభిప్రాయంలో ''నిరాడంబరమై భక్తి ప్రపత్తులతో నిండిన ఋగ్వేద మతం స్థానంలో, కరుడుగట్టుకు పోయి హృదయ విదారకమై ప్రాపంచికమైన వర్తక లావాదేవీల భావాలపై నాధారపడిన మతం తయారైంది. ...... '' ఆ మతంలో నీతికి యేమాత్రం స్థానం లేక పోయింది. ప్రజానీకానికి అటువంటి మతంలో విశ్వాసం నశించటంలో ఆశ్చర్యం లేదు. నిరంకుశంగా పూజారులు సాగిస్తున్న దోపిడీలు. యజ్ఞ వేదికల నుండి స్రవించే రక్త వాహినులూ, నాటి ఆర్య ఆలోచనా పరులకే జుగుప్సాకరంగా తోచినై.

బ్రాహ్మణమతంలో ప్రబలిన అసంతృప్తి వల్ల దేశంలో అవ్యవస్థ యేర్పడింది. ఈ యుగాన్నే ఆరణ్యాక - ఉపనిషత్ యుగం అని వ్యవహరిస్తారు. ఆలోచనా రంగంలో నాడు ప్రబలిన అరాజకత మరే దేశంలోనూ యే యుగంలోనూ కన్పింపదనటం అతిశయోక్తి కాదు. అంతేగాదు. నాటి సత్యాన్వేషణ, జ్ఞాన పిపాస సమాజాన్ని పునాదులతో కదలించింది. ప్రొఫెసర్ హోఫ్ కిన్సు చెప్పినట్లు ''అంతకు పూర్వమే 'బ్రాహ్మణమతం' మహా సముద్రంలో ఒంటరి దీవిగా నిలిచియుండేది. ఆర్యజాతిని కూడా పూర్తిగా తన యేలుబడిలో నుంచు కొన లేకపోయింది.'' ఇక ఇప్పుడా మతంపై నొక మహోద్యమం ప్రారంభమైది. సాంప్రదాయకంగా విద్యావంతులూ, ఆలోచనా పరులూనైన అగ్రవర్ణాలతోనే ఆ ఉద్యము ఆగిపోలేదు; సమస్త ప్రజానీకమూ కార్యశూరతతో ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. అందుకు నిదర్శనంగా దేశం నలుమూలలా విజ్ఞాన సమాజాలు, సంస్థలూ విజృంభించినై; మహారాజులూ, మహారాణులూ ఆ సమాజాలను పోషించి, తమతమ ఆస్థానాలలో తాత్విక చర్చలు ప్రోత్సహించారు. ఆ మహారాజులను పైన పేర్కొన్నాముగదా! దేశమంతటా పర్యటిస్తూ వేనకువేలు పరివ్రాజకులు తమ సిద్ధాంతాలను ప్రచారం చేసేవారు. వీరిని గ్రీసు దేశంలోని సోఫిస్టులతో పోల్చవచ్చునేమో! వీరి నివాసానికై దేశం నలుమూలలా యేర్పాట్లు జరిగినై. వీరికొరకే మల్లికా మహారాణి శ్రావస్తిలో నొక సభను యేర్పాటు చేసింది. వైశాలి చెంతనున్న వనంలో లిచ్ఛవులు వాగ్వివాద మంటపాన్ని నిర్మించారు. చంపక సరోవర తీరంలో గగ్గారా రాణిచే నిర్మింపబడిన భవనాలూ, రాజ గృహం చేరువ 'మోరనివాస' మనే వనంలో వెలసిన విడిది గృహాలు సత్యాన్వేషకులైన పరివ్రాజకుల చర్చలకూ, నివాసానికై ఉద్దేశింపబడినవే. సత్యాన్వేషణలో నాటి ప్రజలకు లభించిన ప్రోత్సాహమూ ఆలోచనా స్వాతంత్ర్యమూ అపూర్వం అని అంగీకరింపక తప్పదు.

**నూతన మార్గాన్వేషణ**

**తపస్సు :** నిష్ప్రయోజనమూ, అమానుషమూ ఐన వైదిక కర్మలను విసర్జించిన ప్రజలు, బహుముఖంగా మోక్షాన్వేషణ సాగించారు. ఆరణ్యకములను బట్టి కర్మలకు ప్రత్యామ్నాయంగా కొందరు యోగ మార్గాన్ని అనుసరించి తపస్సుచేయ ప్రారంభించారు. బ్రాహ్మణాలలోనే తపస్సు ఘనత గుర్తింప బడింది. ''ఆకాశానికి వాయువు, వాయువుకు భూమి, భూమికి జలం, జలానికి సత్యం, సత్యానికి యజ్ఞం, యజ్ఞానికి తపస్సు ఆధారం'' అంటూ తపస్సు యొక్క మౌలిక ప్రాధాన్యతను

గుర్తించింది ఐతరేయ బ్రాహ్మణం. ఉపనిషత్తులలో సైతం అక్కడక్కడ తపో మార్గం ప్రశంసింపబడింది. ముండకోపనిషత్తులో :

తపః శ్రద్ధేయే హ్యుసవ సంత్యరణ్యే
శాంతా విద్వాంసో - భైక్ష్య చర్యాం చరంతః
సూర్య ద్వారేణ తే విరజాః ప్రయాంతి
యత్రామృతః సపురుషో హ్యవ్యయాత్మా.

అంటూ తపస్సంపన్నులై, భిక్షావృత్తితో జీవయాత్ర సాగిస్తూ అరణ్యములలో నుండు విద్వాంసులు అద్వైతానుభూతి సాధింపగలరని చెప్పబడినది. ఐతే కఠిన నియమాలతో యోగాభ్యాసంతో సాధించిన శారీరకమూ మానసికమూ ఐన అసాధారణ శక్తుల ద్వారా మోక్షప్రాప్తి లభిస్తుందనే విశ్వాసమే తపోమార్గానికి ఆధారం. త్రేతాగ్నులమధ్య, కుత్తుక బంటినీటిలో, ఒంటికాలిపై నిలిచి, తల్ల క్రిందులుగా వృక్ష శాఖలకు వ్రేలాడుతూ మహర్షులు తపస్సు చేసినట్లు పురాణాలలో కన్పించే వర్ణనలు ఈ కాలమునకు చెందిన సంప్రదాయము లేనని భావింపవచ్చును. కాబట్టి జీవిత సుఖాలను విసర్జించి, కష్ట సహిష్ణుతనలవరచు కొనుటయే తపస్సు లక్ష్యంగా కన్పిస్తుంది. ఒకవిమర్శకుడు చెప్పినట్లు 'తపో నియమావళిని పరిశీలించినచో, సత్యాన్వేషణకు నిస్పృహతో చేసే తుదియత్నం వలె తోస్తుంది తపస్సు''. అంతేగాదు; తపస్సు వ్యక్తికం; సామాజికం గాదు; సామాజిక సమస్యలను పరిష్కరించి, సుఖశాంతులను సాధింప జాలదు.

**జ్ఞానమార్గం :** ఇక, నాటి సత్యాన్వేషకుల మార్గాలలో ప్రధానమైనదీ విశిష్టమైనదీ జ్ఞానమార్గం. అపారమైన జిజ్ఞాసతో, విజ్ఞానతృష్ణతో, ఆవేదనతో సాగినదా అన్వేషణ అని శ్వేతాశ్వతరోపనిషత్తులో నిదర్శనం సూచిస్తుంది ''విజ్ఞుడవైన ఓ బ్రాహ్మణుడా! ఎందుకు జన్మించాం? ఎలా జీవిస్తున్నాం? ఎక్కడికి వెళ్ళి పోతాము? సుఖంలోనూ కష్టంలోనూ ఇక్కడ ఎవరి ఆజ్ఞలకు బద్ధులమై బ్రతుకుతున్నాం? కాలము, ప్రకృతి, కామము, అదృష్టము, పంచభూతములు - ఇవియా లేక 'పురుషుడు' అని పిలువబడే అనంత శక్తియా, కారణమేదో మాకు బోధించవలసింది'' ఈ ఆవేదన, జిజ్ఞాస తీర్చే ప్రయత్నంలో జ్ఞాన మార్గం రెండుగా చీలిపోయింది: ఒకటి ఆత్మ వాదం, రెండవది అనాత్మవాదం. ఇందు మొదటిది ఆత్మ పరిశీలనాత్మకమూ, రెండవది ప్రకృతి పరిశోధనాత్మకమూ అని చెప్పవచ్చు. ఆత్మ వాదంతోనే ఉపనిషత్తులన్నీ నిండియున్నై; అనాత్మవాదం, భౌతిక వాదానికి పునాదులు వేసి నాస్తిక వాదంగా సనాతనుల దూషణకు గురి అయింది.

**ఉపనిషత్తులు :** ఉపనిషత్తులు భారతీయ ఆధ్యాత్మిక చింతనకు గీటు రాయి వంటివి; వానిలో భారతీయుల భావనాశక్తి అందుకొన గలిగిన మహోన్నత శిఖరాలను దర్శించి పాశ్చాత్యులు సైతం ముగ్ధులైనారు. ఉపనిషత్తులు కర్మమార్గాన్ని తిరస్కరించినై:

ఇష్టా పూర్తం మన్యమానా వరిష్ఠం
నాన్యచ్ఛ్రేయో వేదయంతే ప్రమూఢాః

నాకస్య పృష్ఠేతే సుకృతే ఽనుభూత్వా
ఇమం లోకం హీనతరం వావిశంతి.

ఇష్టా పూర్తకర్మలు అంటే శ్రౌత స్మార్త కర్మలే పరమ శ్రేష్ఠములని నమ్మి మూఢులు నీచ లోకములను పొందుదురని ముండకోపనిషత్తు చాటుచున్నది. అదే ఉపనిషత్తు మరొక చోట :

''పరీక్ష్య లోకాన్ కర్మ చితాన్ బ్రాహ్మణో
నిర్వేద మాయాన్నస్త్యకృతః కృతేన''

కర్మ మార్గమున లబ్ధమగు ఫలములు అనిత్యములని తెలిసి తత్త్వవిదుడు వానియందు విరక్తుడగునని చెప్పుచున్నది. ఈ విధంగా బ్రాహ్మణ వాదానికి విరుద్ధములైన ఉపనిషద్ధర్మాన్ని బ్రహ్మవాదమని కూడా వ్యవహరిస్తారు. అందుకు కారణం ఉపనిషత్తులలో 'బ్రహ్మ' పదార్థం గుర్తింపబడుటయే. ఇదియే ఆత్మ. ఉపనిషత్తుల భావనలో విశ్వానికి మూలం, విశ్వ ఆత్మ; అదే బ్రహ్మ పదార్థం. అదే శాశ్వత యథార్థం; సృష్టిస్థితిలయములకు కారణమదియే; వ్యక్తిలోని 'ఆత్మ'గా సాక్షాత్కరించేది సైతం ఆ బ్రహ్మ పదార్థమే.

ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణి చ
ఖం వాయుర్జ్యోతి రాపః పృథివీ విశ్వ స్యధారిణీ

సమస్త ప్రాణికోటి, మనస్సు, సర్వేంద్రియములు, ఆకాశము, వాయువు, వెలుగు, నీరు, భూమి - సమస్తమును ధరించునది ఆ బ్రహ్మ పదార్థమేనని ముండకోపనిషత్తు.

ఏకోవశీ సర్వభూతాన్తరాత్మా
ఏకంరూపం బహుధాయః కరోతి

అంటూ కఠోపనిషత్తు, ఆత్మ ఒకటే ఐనప్పటికీ సర్వ భూతాన్తరమై, బహురూపధారిణియై ఉంటుందని భావించింది. ఈ జ్ఞానమే అనగా ''బ్రహ్మయే నా అంతరాంతరాలలోని ఆత్మ; నా మరణంతో ఆత్మ బ్రహ్మతో ఐక్యమౌతుంది; అదే మోక్షం''; అనే జ్ఞానమే జన్మరాహిత్యానికి సాధనం. అంటే యజ్ఞాలుగానీ, తపస్సుగానీ గాక 'ఆత్మజ్ఞాన'మే మోక్షానికి సాధనంగా ప్రతిపాదించినవి ఉపనిషత్తులు. ఉపనిషత్తు అనే మాటకు అర్థమే అది అని అంటారు కొందరు. ''బ్రహ్మ విద్యను ఎవరైతే ఆశ్రయించి (ఉప) శ్రద్ధతో (ని) అనుసరిస్తారో వారు జరామరణాలకు కారణమైన అవిద్యను నిర్మూలింప (షడ్) గలరు!

ఐతే, ఎన్ని వాదోపవాదాలూ, చర్చలూ జరిపినా ఉపనిషత్తులు ఆత్మ స్వరూపాన్ని గురించి ఏకాభిప్రాయానికి రాలేకపోయినవి. కొన్ని ఉపనిషత్తులు ఆత్మ అవాఙ్మానసగోచరమని తప్పుకొన్నవి. కఠోపనిషత్తు

''అంగుష్ఠ మాత్రః పురుషోంతరాత్మా
సదాజానం హృదయే సన్నివిష్టః'' అంటూ,

మరొకచోట

అణోరణీయాన్ మహత్ మహీయాన్
నాత్మా౽స్య జంతోర్నిహితో గుహాయామ్. అంటుంది.

ఆత్మ ప్రమాణము జంతు స్వరూప ప్రమాణాలననుసరించి ఉంటుందట! ఇక చాందోగ్య ఉపనిషత్తు

నీవార సూకవత్తన్వీ
పీతా భా స్వత్య నూపమా ॥

వరిముల్లు ప్రమాణమైన తనువుగలదీ పచ్చనై ఉపమింప శక్యముగాని ప్రకాశముగలది ఆత్మ అని వర్ణిస్తున్నది. ఏది ఏమైనా ఆత్మజ్ఞానం పొందటం సాధ్యమైన విషయం కాదు. కేనోపనిషత్తులోని నాచికేతూపాఖ్యానంలో ఆత్మజ్ఞానం సాధించటం, ప్రాచీన కాలంలో దేవతలకే సాధ్యం కాలేదని స్పష్టం చేయబడింది.

దేవైరా తోపి విచికిత్స తంపురా
నహి సువిజ్ఞేయమణురేష ధర్మః

అందుచేతనే ఉపనిషద్విజ్ఞానం నిగూఢ విజ్ఞానం గానే ఉండి ప్రజాదరణ పొందలేక పోయింది; ప్రజానీకానికి దీనివల్ల ప్రయోజనం లేక పోయింది.

ఐనప్పటికీ ఉపనిషత్ చర్చలవల్ల తాత్త్వికమూ, సాంఘికమూ ఐన కొన్ని పరిణామాలు జరిగినై. విశ్వాత్మ అంశమైన ఆత్మయే ప్రతివ్యక్తిలోనూ ఉన్నదనటంవల్ల అగ్రవర్ణాల ఆధిక్యతలో విశ్వాసం నీరసించి ఆర్య అనార్య సన్నిహితత్వానికి ఉపనిషత్తులు సుగమ మార్గాన్ని కల్పించినై; ఆత్మ జ్ఞానమే మోక్షసాధన మనటం వల్ల యజ్ఞాలలో, జంతుబలులలో శ్రద్ధ పూర్తిగా నశించి నైతిక ప్రవర్తన పైకి దృష్టి మరల సాగింది. మరొక విశేషం. మానవుడు ప్రకృతిలో భాగం, ప్రకృతి యొక్క అంశం అని ఉపనిషత్తులు స్పష్టం చేసినై. ఈ ఉపనిషద్భావమే భౌతిక వాదానికి పునాదులు వేసినై. శాస్వేద్యోపనిషత్తులో: ''ప్రకృతియే సృష్టికర్త, కాలమే లయకారుడు, వీరే లోకపాలకులు; మానవులకు సుఖ దుఃఖాలనీయటంలో మంచి చెడ్డల ప్రమేయం వీరికి లేదు''. ఇది భౌతిక వాదానికి నాంది వాచకమని వేరుగా చెప్పనక్కరలేదు.

**భౌతికవాదం :** ''భారత దేశ చరిత్రను కాపాడుతూ వచ్చిన బ్రాహ్మణులు హైందవమత సాంప్రదాయాలనుగురించీ, హైందవ మత పవిత్రతను గురించీ ఏకాభిప్రాయమే ఉండినట్లు ఉద్ఘాటించి ప్రపంచాన్ని మోసగించారని తలపోయవచ్చు''నని విల్‌డూరెంట్ అభిప్రాయం. అందుకు కారణం, మనదేశంలో కర్మ, ఆత్మ సిద్ధాంతాలకు సంబంధించిన వాఙ్మయమే అపారంగా లభిస్తూ అందుకు భిన్నమూ, వ్యతిరేకమూ ఐన అనాత్మ వాదానికి చెందిన రచనలు నష్టంకావటమే. ఈ నష్టానికి కారణాలిచ్చుట ప్రస్తుతం కాదు. కాగా అనాత్మ వాదానికి ఉపనిషత్తులలోనే ప్రారంభోత్సవం జరిగిందని పేర్కొన్నాంగదా! అనాత్మవాదులు ఇంద్రియగోచరములైన ప్రమాణములను మాత్రమే స్వీకరించి

దానికి హేతువాదాన్ని జోడించి జీవిత సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించారు; ఆత్మ వాదులపై దండయాత్ర సాగించారు. వారి ఆలోచనా క్రమాన్నీ, భావాలను పరిశీలిస్తే మన చరిత్రలోనది యొక విస్తృత విజ్ఞాన యుగంగా గోచరిస్తుంది.

అనాత్మ వాదుల్లోకూడా క్రియావాదులు, అక్రియావాదులు, వినయ వాదులూ, అజ్ఞానవాదులు అనే భేదాలుండేవి. 'అజ్ఞానవాదు'లనే పేరు విపరీతంగా తోచవచ్చు; కాని వారు 'అజ్ఞానమే బ్రహ్మానందము' (Ignorance is bliss) అని బోధించిన వారు మాత్రం కాదు! ''సత్య పరిశోధనకు జ్ఞానం అవసరం; కాని జ్ఞానం అనేది అనుమానాస్పదం; జ్ఞానం, సంశయ రాహిత్యమైనప్పుడు అభిప్రాయ భేదాలకు తావుండదు, ఇందుకు ఉదాహరణగా ఆత్మను గురించిన వాదోపవాదాలనే పేర్కొనవచ్చు; ఐనప్పుడు సత్యాన్ని చేరుకొనటం అసాధ్యం; సత్యం తెలియనప్పుడు అసత్యాన్ని బోధించటం అపచారం'' అని మాత్రమే అజ్ఞాన వాదుల వాదన; చాల విజ్ఞమైన వాదమని అంగీకరింపక తప్పదు!

అనాత్మ వాదులందరూ జీవిని భౌతిక పరంగా వ్యాఖ్యానించినా వారిలో వారికి కొన్ని స్వల్ప అభిప్రాయభేదాలున్నై. దృష్టధర్మ నిర్వాణవాదులు రూపరస శబ్ద గంధ స్పర్శలోనే జీవి యేర్పడు చున్నాడనీ, నిర్వాణం అనేది పైగుణాల అనుభూతియేననీ, పరలోకం లేదనీ వాదించారు; శాశ్వతవాదులు ప్రపంచంలోని సమస్త వస్తు జాలమూ భూమి, నీరు, అగ్ని, గాలి, సుఖము, వేదన, జీవము అనే యేడు మూల పదార్థాలతో నేర్పడుచున్నవి; కావున అవి పరస్పరం విరుద్ధములూ కావు, పరస్పరం సుఖ దుఃఖాలకు కారణాలూకావు; అందుచే చంపే వాడుగానీ, చంప బడేదిగానీ ఉండదు. ఒక వ్యక్తి తలనరకటమంటే అతణ్ణి చంపటం కాదు; అది మూల పదార్థముల మార్పే అంటారు. వీరి నాయకుడు కకుద కాత్యాయనుడు. భౌతిక వాదుల్లో కొందరు ఆత్మను అంగీకరించారు. అక్రియావాదుల్లో సుప్రసిద్ధుడైన పురాణ కాశ్యపుడు ''ప్రకృతిని చైతన్య వంతం చేయటానికి ఆత్మ అవసరం'' అంటాడు. ఐనప్పటికీ వీరెవరూ ఆత్మ శాశ్వతత్వాన్ని అంగీకరింపరు. శరీరమూ, ఆత్మ వేరు కాదనీ, శరీరంతోనే ఆత్మ నశిస్తుందనీ అజిత కేశ కంబళి స్పష్టం చేశాడు. రాకుమారుడూ, కోసలాధిపుడైన ప్రసేన జిత్తు సామంతుడూ ఐన 'పయశి' ఆత్మనూ, పరలోకాన్ని తిరస్కరించాడు. అతని వాదనలో పది అంశాలుండేవి. అవి : (1) మరణ శయ్యపై నున్న పాపులను వారికి గోచరించే పరలోక స్వభావాన్ని గురించి తెల్పమని ప్రార్థించాను. చెప్పలేకపోయినారు. ఎందుచేత? (2) ఇదే ప్రశ్న పుణ్యాత్ములనడిగినా ఫలితం శూన్యమే ఐంది. కారణం ? (3) భగవంతుని స్వయంగా చూడగలిగినవాడు లేడేమి? (4) ఐనప్పుడు భగవంతుడు ఉన్నాడని ఎందుకు విశ్వసించాలి? (5) పరలోకాన్ని గానీ, భగవంతునిగానీ చూడలేక పోవటంలో అర్థమున్నదా? (6) పరలోకమే యథార్థమైనదని విశ్వసించే పుణ్యాత్ములు వెంటనే ఆత్మహత్య చేసి కొనరేమి? (7) దేహం నుండి నిర్గమించే ఆత్మ ఎందుకు కనిపింపదు? (8) ఆత్మ ఉనికి సత్యమైనచో, మృత దేహం కంటె సజీవ శరీరమే బరువుగా ఉండాలిగదా? ఉండదేమి? (9) సజీవ సమాధి చేసినప్పుడు సమాధిని బ్రద్దలు చేసికొని ఆత్మ పైకి రావాలి గదా! సమాధి బ్రద్దలైనట్లు కన్పింప దేమి? (10) దేహాన్ని ముక్కలుగా నరికినప్పుడు ఆత్మ కన్పించ వలెగదా! కన్పింపదేమి? నాడే కాదు, నేటికైనా పయశి చేసిన సవాలుకు మతవాదులు హేతుబద్ధమైన అంగీకార యోగ్యమైన సమాధానం చెప్పలేరనటం అతిశయోక్తి కాదు.

ఆత్మ, అనాత్మ వాదాలీ విధంగా పోటీ బడి ప్రచారం సాగించినై; ఈ వాదాలలో రెండువందలకు పైగా సిద్ధాంత భేదములుండినట్లు జైన వాఙ్మయం పేర్కొనగా, బ్రహ్మజాల సుత్తమునను సరించి, అరువది రెండు భిన్న సిద్ధాంతములుండినట్లును, వానిని పరిశీలించి బుద్ధుడు పూర్వ పక్షమొనరించి నట్లును తెలియుచున్నది. భారతదేశం దార్శనికుల దేశం అన్న సూక్తి నాడు యథార్థమై యుండినట్లు చెప్పవచ్చు. విభిన్న సిద్ధాంత ప్రచారకులు సంఘాలుగా నేర్పడు చుండెడివారు. అట్టి వానిలో నిగంధ, ఆజీవక, ముండసావక, పరివ్రాజక, జటిలక, మాగంధిక, త్రిదండిక, అవిరుద్ధక, గోతమక, దేవధమ్మిక అను సంఘాలు చాల ప్రముఖమైనట్లు పేర్కొనబడుచున్నవి. క్రమంగా ఆత్మ అనాత్మ వాదాల ప్రభావం పరస్పరం ప్రసరించి, వాని సిద్ధాంతాలన్నీ ఏడు దర్శనాలుగా క్రోడీకరింప బడినై. అందు ఆరు దర్శనాలు ఆత్మవాదాన్ని అంగీకరించి మత వాదులకు శిరోధార్యములైనై. వీనిలో సాంఖ్యదర్శనం, ప్రథమమూ, ప్రధానమూ ఐనది. ఇక అనాత్మ భౌతిక వాదం బార్హస్పత్యమనే చార్వాక దర్శనంలో ఉన్నత స్థాయి నందుకొన్నది. ప్రజలలో నిది సాధించిన పలుకుబడి వల్లనది లోకాయత వాదమని కూడా ప్రసిద్ధి చెందింది. ఐతే విప్లవాత్మక సిద్ధాంతాలన్నింటివలెనే బార్హస్పత్యం కూడా ఆధ్యాత్మిక వాదుల ఆగ్రహానికి గురియై చాల భాగం నశించింది; అందుకొన్ని సూత్రాలు మాత్రమే లభిస్తునై; తుదకు, సాంఖ్య బార్హస్పత్య దర్శనాలే బౌద్ధానికి తాత్త్వికంగా పునాదులు కల్పించినై.

## సాంఖ్య, లోకాయతాలు

**సాంఖ్యము :** సాంఖ్య సిద్ధాంత ప్రవక్తయైన కపిలుడు క్రీ॥పూ॥ 8వ శతాబ్దివాడు. ఈతని పేరనే గౌతమ బుద్ధుని జన్మ స్థలమైన కపిలవస్తు నగరం వెలసినట్లు కొందరు చరిత్ర కారులంటారు. తన కాలంలో తాత్త్విక రంగమున ప్రబలిన అరాజకతను మాన్పి, మానవుల శారీరక, మానసిక, ప్రాపంచిక, దైనిక బాధలను తొలగించే నిమిత్తమై యథార్థమైన విజ్ఞానాన్నిప్రసాదించటమే తన లక్ష్యంగా ప్రకటించాడు కపిలుడు. నాటి వరకు జ్ఞానార్జనకు కేవలం అంతర్వాణియో, ఆకాశవాణియో, దివ్యజ్ఞానమో సాధనలుగా ఉండేవి; వీటి సామర్థ్యాన్ని సవాలు చేసి, ఇంద్రియ గోచరం కానిదీ ప్రయోగ సాధ్యశ్యాలకు నిల్వనిదీ విజ్ఞానం కాదనీ శాస్త్రీయమైన మార్గాన్ని సూచించాడు కపిలుడు. సత్యాన్వేషణకు ఈ సాధనాలనే మధ్య యుగాంతంలో ఐరోపాలో సూచించిన రోజర్ బేకన్ మతాధికారుల ఆగ్రహానికి బలియైనాడు. ''సృష్టి, మానవుడు, మానవునకు ఆతని భవిష్యత్తుకు గల సంబంధం మొదలైన సమస్యలను గురించి ఆలోచనా పరుడైన ప్రతి మానవుని యెదుర్కొనే విచిత్ర ప్రశ్నా పరంపరకు వివేకమూ, హేతువాదమూ ఆధారంగా సమాధానలివ్వటానికి చేసిన లిఖిత పూర్వకమైన ప్రథమ ప్రయత్నమే సాంఖ్య సిద్ధాంత'' మని డేవీస్ పండితుని అభిప్రాయం.

పరిశీలనకు సాధ్యమైనవీ యోగ్యమైనవీ ప్రకృతీ మానవుడూ మాత్రమేననీ ప్రకటించటం ద్వారా, కపిలుడు ప్రకృతి లేక భౌతిక మతానికి పునాది వేశాడు. ఆతని అభిప్రాయంలో ప్రకృతి శాశ్వతమైనది, స్వయం సమృద్ధమైనది; ప్రకృతి పదార్థమయం; పంచ భూతాలూ, ఇంద్రియాలూ శరీర అవయవాలే గాక బుద్ధి పరిజ్ఞానమూ అన్నీ పదార్థాలే. కాబట్టి రూపభేదమేగాని సమస్త వస్తు జాలమూ ప్రాథమికమైన ఏకైక కుటుంబానికి చెందినవే. ఇదే ప్రపంచంలోని ఐక్యత! ఇక సృష్టికి, వివిధ వస్తు సముదాయాలనూ, కపిలుడు కార్యకారణ సంబంధంతో వ్యాఖ్యానించాడు. ప్రకృతి పరిణామాత్మకం. నిరంతర అభివృద్ధి

క్రమంలో నడుస్తూ, విశ్వం క్రియాత్మకమైన పరిణామ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఈ సామర్థ్యం పదార్థానికి సహజలక్షణం అంటాడు. దీని వల్ల ప్రపంచంగానీ, మానవుడుగానీ భగవంతుని సృష్టికాదు; ప్రపంచ పరిణమానికి కారణాలు అందులోనే ఇమిడి యున్నై, అని స్పష్టం చేశాడు. ''ప్రాచీనమైనా, అర్వా చీనమైనా పరిణామ సిద్ధాంతాలన్నీ, తాత్త్వికంగా సృష్టికర్తకుగానీ, ప్రపంచ పాలకునకుగానీ తావీయవు; అదే విధంగా సాంఖ్య సిద్ధాంతం కూడా తాను అనీశ్వర వాదమునని నిర్భయంగా చాటు కొన్నది'' అంటాడు మాక్సుముల్లర్.

ఐతే జీవకార్యక్రమానికి ప్రాణాపాన వ్యానో దాన సమాన వాయువులే కారణమని చెప్పినా, పదార్థమయమైన ప్రకృతినుండి జీవోత్పత్తికి 'ఆత్మ' (పురుష)ను అంగీకరింపక తప్పలేదు కపిలునకు. కాని సాంఖ్య దర్శనంలోని 'ఆత్మ' కేవలం ఆధ్యాత్మిక వాదాలలోని 'ఆత్మ' కాదు, అంటే భగవంతుడు కాదు. అది పదార్థము నుండి స్వతంత్రమైనది; భిన్నమైంది; విశ్వవ్యాప్తమైనది. ఆత్మ పదార్థంలో చేరినప్పుడే జీవియేర్పడుతుంది; పదార్థం నుండి ఆత్మ శాశ్వతంగా విముక్తిపొందటమే మోక్షం; మోక్షాను సత్ప్రవర్తనయే సాధనం అని కపిలుని అభిప్రాయం. ''శాశ్వతమైన పదార్థం నుండి సర్వతంత్ర స్వతంత్రమైన ఆత్మను గుర్తించియుండుటయే కపిలునకూ, ఆధునిక భౌతిక వాదులకూ గల తేడా''. (R.C.Dutt).

**లోకాయతం** : భౌతికవాదాన్ని ప్రతిపాదించినప్పటికీ జీవిని వ్యాఖ్యానించటానికి ఆత్మ, పరమాత్మకు నిదర్శనాలు ఆశ్రయించినట్లు పరిశీలించాం. ఒక్క, అద్వైతాన్ని స్థాపించిన 'వేదాన్త దర్శనం' మినహా మిగిలిన వన్నీ పదార్థంతో తాత్కాలిక సంబంధ మేర్పరచుకొన్న శాశ్వత స్వతంత్ర విశ్వాత్మ ఉన్నదని గ్రహించినై. కాని ఆత్మ సిద్ధాంతాన్ని పూర్తిగా నిరాకరించినది, బార్హస్పత్య మనే లోకాయత దర్శనం, దీన్నే చార్వాక మతమని కూడా వ్యవహరిస్తారు. ఆత్మను నిరాకరించి, కేవలం ప్రకృతీ, కాలములపై విశ్వాన్ని వ్యాఖ్యానించిన వీరిని నాటి మహోద్యమంలో వామ పక్షీయులనటం సమంజసం. ఐనా వీరిది అర్థరహితమైన ఉద్రేకంతో జరిపిన విధ్వంసాత్మక ప్రచారం కాదు. వీరి ఆలోచనలు వివేకవంతమైనవి, వీరి వాదనల్లో హేతుత్వం ఉన్నత స్థాయిని అందుకొన్నది, నీతి బద్ధమైన సమాజ సంబంధాలలో వ్యక్తిగా మానవునకు ఔన్నత్యాన్ని చేకూర్చే సూచనలు వీరి సిద్ధాంతాలలో కన్పిస్తై. ''ప్రపంచాన్ని వ్యాఖ్యానించటానికిగానీ, అర్థం చేసికొనటానికిగానీ 'సృష్టికర్త' అనే ప్రాతిపదిక నిరుపయోగం; ప్రకృతి స్వభావసిద్ధంగా నేర్పడినదే; నీరుచల్లగా, నిప్పు వేడిగా ఉండటం వాటి సహజ లక్షణాలు; మానవుని అనుభవంలోగానీ చరిత్రలో గానీ మానవుని దైనందిన కార్య కలాపాలలో దేవుడు జోక్యం కల్గించుకొన్నట్లు తెలియరాదు; పదార్థమే యథార్థమైన సత్యం; ఆలోచనా శక్తిగల పదార్థమే బుద్ధి; బుద్ధితో గూడిన శరీరమే ఆత్మ; అందుచే ఆత్మ శరీరంతో పాటు నశిస్తుంది'' అనేదే చార్వాక దర్శన సారం. జీవోత్పత్తి క్రమాన్ని గురించి వీరి సూచనలు హేతుబద్ధమై మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తై; కొన్ని పదార్థాలు తమంతట తాముగా ఉద్రేకం కలిగింప లేకపోయినా, వానితో తయారయిన పదార్థం (మద్యం) ఉద్రేకం కలిగించినట్లే; సున్నం, పసుపు కలిసి యెఱుపు ఏర్పడినట్లే శరీరావయవములు కలిసినప్పుడు జీవం యేర్పడగలదని చార్వాకులు నిర్ధారణ చేశారు. పదార్థపరిణామ

క్రమంలో, రసాయనిక మార్పుల వల్ల పదార్థస్వరూపమూ, గుణమూ మారుననీ, జీవం యేర్పడటానికి కూడా అవకాశం లేక పోలేదనీ నేటి రసాయనిక పరిశోధనలు తేల్చిన విషయమేగదా! మతమూ; భగవంతుడూ బలహీనుల అండదండలని చార్వాక సిద్ధాంతం : ''మానవులు చిరకాలం నుండి మతానికి అలవాటు పడిపోయి, విశ్వాసాన్ని విజ్ఞానం నిర్మూలించినంతనే, తాము నిస్సహాయులైనట్లు దుర్భరమై భయానకమైన శూన్యం యేర్పడినట్లు భావిస్తారని'' వివరించారు. ఐతే చార్వాకులు ''తిను, త్రాగు, తందనాలాడు'' అనే ఆకర్షణీయమైన (చారు) అవినీతికర ప్రచారం (వాక్) సాగించారని లోకంలో నొక అప ప్రథ ప్రచారంలో ఉంది. అది చార్వాకుల సవాళ్ళకు సరియైన సమాధానం చెప్పలేక వారిపై జరిపిన దుష్ప్రచారమే. ''నీతి మానవ సహజం; సామాజిక జీవితానికి నీతి అత్యంతావశ్యక సదుపయోగం'' అని హెచ్చరించారు చార్వాకులు. భగవంతునికీ, నీతికీ సంబంధం లేదు; మానవుడు నీతి మంతుడు; నీతి పరుడుగా బ్రదకటానికి భగవంతుని ఆశ్రయించటం దౌర్బల్యం; ఆ దౌర్బల్యాన్ని జయించి వ్యక్తి ఔన్నత్యం నిలుపుకొనాలి' అని చార్వాకులుద్బోధించారు!

ఈ సిద్ధాంత రాద్ధాంతాలన్నీ నాటి సామాన్య మానవుని సమస్యలనెంతవరకు పరిష్కరించినవనేది అనుమానాస్పదం. ఉపనిషత్తులు ప్రజలకు గగన కుసుమాలైనట్లు పరిశీలించాం; సాంఖ్యాది దర్శనాల తర్కము సైతం సాధారణ వ్యక్తికి అందుబాటులోనిది కాదు. అంతేగాక అవి విశ్వాన్ని వ్యాఖ్యానించటానికి పూనుకొన్నవేగాని, వ్యక్తి జీవితాన్ని సమాజ స్వరూపాన్ని సంస్కరించి ఉద్ధరింపగల సూత్రాలను నిర్మించటానికి ప్రయత్నించినట్లు కన్పింపదు. ఇక, చార్వాకులు నీతికెంతటి ప్రాధాన్యత నిచ్చినా, అజ్ఞానా వృతమైన నాటి సమాజంలో వారి బోధనలు విశృంఖలత్వానికి దారితీసినై. తత్ఫలితంగా, ఉపనిషత్తులలో ప్రారంభమైన

తమ సోమా జ్యోతిర్గమయ
అసతోమా సద్గమయ
మృత్యోర్మా అమృతంగమయ

అను ఆవేదనతో గూడిన అన్వేషణ ఫలింపలేదు. ఇట్టి పరిస్థితుల్లోనేగౌతమ బుద్ధుడు జన్మించాడు; మొగల్ పాదుషా అక్బరును గురించి ''తన కాల పరిస్థితులకు అక్బరు ప్రతినిధి మాత్రమే కాదు; ప్రతిబింబము'' అన్నా డొక చరిత్ర కారుడు. అదే విధంగా బుద్ధుని మహా ప్రజ్ఞవల్ల నాటి ఆలోచనలు భావాల ప్రభావం, ఒక సమగ్రమూ, స్వయం సంపూర్ణమూనైన సిద్ధాంతంగా పరిణతి చెందింది. ఉపనిషత్తుల నిగూఢ ఆధ్యాత్మిక వాదాన్నీ, సాంఖ్య చార్వక భౌతికనైతిక వాదాలను సమన్వయ మొనర్చి ఒక వినూత్న జీవిత విధానాన్ని మానవ జాతికి ప్రసాదించటమే బుద్ధుని జీవితంలోని చారిత్రక ప్రాశస్త్యం. ఒక క్రైస్తవ ఆచార్యుని మాటల్లో: ''ప్రపంచంలోని గొప్ప మతాలన్నింటిలోనూ, బౌద్ధం ఒక్కటే, జీవిత సమస్యలను గురించిన సక్రమమూ, హేతుబద్ధమూనైన ఆలోచనలపైనా, వాని పరిష్కార మార్గాలపైనా యేర్పడిన మతం; దార్శనిక మహోపజ్ఞ అపార మానవ ప్రేమ మూర్తీభవించిన ఏకైక మహాపురుషుడు గౌతమ బుద్ధుడు.''

# బౌద్ధం-ఆధునిక సమాజం

ఆంగ్ల మూలం : సి. ఆంజనేయరెడ్డి   అనువాదం : మిసిమి అన్నపరెడ్డి

2004, ఫిబ్రవరి 1,2 తేదీలలో 'బౌద్ధం - ఆధునిక సమాజం' అనే అంశం మీద కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ లో నిర్వహించిన జాతీయ సెమినార్ లో సి. ఆంజనేయరెడ్డి ముఖ్య అతిథిగా చేసిన ప్రసంగ పాఠం.

బౌద్ధం - ఆధునికసమాజం అనే అంశం మీదగోష్ఠికి ఇక్కడ సమావేశమైనగౌరవనీయ భిక్షులారా, పండితులారా!

ఈ సమావేశ ప్రారంభోపన్యాసానికి ముఖ్య అతిథిగా రావడానికి నాకు ఎటువంటి అర్హతలు లేవనే విషయాన్ని మీకు ముందుగా తెలియజేయనీయండి. నేను బౌద్ధాన్ని గొప్పగా అధ్యయనం చేశానని చెప్పలేను. నాకీ గౌరవం లభించడానికి కారణం ఈ గోష్ఠి నిర్వాహకుల ఔదార్యం. ఇంకా బహుశ ఆనంద బుద్ధ విహారతో నాకున్న అనుబంధం. నేను బౌద్ధానికి ఆకర్షితుడను కావడానికి అది మానవ స్వభావాన్ని లోతుగా అవగాహన చేసుకోవడం. మానవాళి సమస్యల పరిష్కారంలో అది అనుసరించిన మానవతా దృక్పథం. ముఖ్యంగా నన్ను ఆకర్షించిన విషయం ప్రపంచంలోని మతాలన్నీ దేవుణ్ణి కేంద్రంగా చేసుకొంటే బౌద్ధం మనిషిని కేంద్రంగా చేసుకొంది. అది అతి- ప్రాకృత శక్తుల గురించి ఆలోచించదు. ఒక మనిషి పైకి ఎదగడానికి, దిగజారిపోవడానికి కారణం అతడే అని అది ప్రతి పాదించిన అనన్యకర్మ సిద్ధాంతం పేర్కొంటుంది. ఈ ప్రతిపాదన ఆధునికుని మనస్సును ఆకట్టుకొంటుంది. బౌద్ధం పుట్టుకను పరిశీలిస్తే ఈ విషయాలన్నీ బాగా తెలుస్తాయి.

మన దేశంలో ఎప్పుడూ గూడ రెండు విస్పష్టమైన వేరు వేరు సంప్రదాయాలున్నాయి. అవి ఒకటి వేదాలలో వేళ్ళూనిన యజ్ఞ క్రతువుకు సంబంధించిన సంప్రదాయం. రెండోది వేదకాలానికి పూర్వం నుంచే ఉన్న వైదికేతర శ్రమణ (సమణ) సంప్రదాయం. తొలి బౌద్ధసాహిత్యం ఈ రెండు సంప్రదాయాల - సమణ - బ్రాహ్మణ - ను తరచు పేర్కొంటూనే ఉంది. యుగయుగాలుగా బ్రాహ్మణులు, యజ్ఞాధికారులుగా తమ హితైషులకు గొప్పతనాన్ని కల్పిస్తూ, వేదసంప్రదాయ పరిరక్షకులుగా ఉన్నారు. శ్రమణులు మరో సంప్రదాయానికి చెందినవారు. ఈ సంప్రదాయానికి మూలం భారత దేశంలోని వైదికేతర సంస్కృతులలో ఉంది. ప్రాచీన భారత దేశ సమణులు సంసార జీవితాన్ని పరిత్యజించి నిర్గృహ జీవితాన్ని ఎంచుకొన్న పరివ్రాజకులు. మత పరంగా చూసినట్లైతే ఈ రెండు శాఖలు విరోధులే. అయినా ప్రపంచం వీరిద్దరిని సమాన గౌరవంతోనే ఆదరించింది.

శ్రమణులలో కొంత మంది అసాధారణ శక్తులు సాధించడానికో, తమ ఆత్మను (చిత్తాన్ని) పరిశుద్ధం చేసుకోవడానికో కఠోర తపస్సును ఎంచుకొంటే, మరికొందరు సమణులు ఈ ప్రకృతి గురించి, ప్రపంచాన్ని గురించి నూతనసిద్ధాంతాలను ప్రతిపాదించి వాద వివాదాలలో మునిగి పోయారు. సమణుల సిద్ధాంతాలు అనేకం, వివిధం. ''వాటిలో కొన్ని సిద్ధాంతాలు ప్రజ్ఞావంతాలైతే, కొన్ని బుద్ధిహీనాలు, కొన్ని ఆధ్యాత్మికంగా ఉదాత్తాలు, కొన్ని పచ్చి భౌతికాలు''. పాళీ బౌద్ధ గ్రంథాలు సమణ సంప్రదాయానికి చెందిన ఆరుగురు బుద్ధుని సమకాలికులను పేర్కొంటున్నాయి. నీతితో ఎటువంటి సంబంధంలేని (వినైతిక వాది amoralist) పూరణ కస్సప, నియతివాది అయిన మక్ఖలి గోసాల, భౌతిక వాది అయిన అజిత కేస కంబళి, పాదార్థిక (విభాగ = categorist) వాది అయిన

పకుధ కచ్చాయన, సాపేక్షవాది అయిన నిగ్గంనాధపుత్త (జైన మహావీరుడు), ఉదారవాది (Elcectic), అజ్ఞేయవాది, నాస్తికుడు లేదా ఏకాంతవాది అయిన సంజయ బేలట్ఠ పుత్తులు వారు. బుద్ధుని కంటె వీరంతా వయస్సులో పెద్దవారే. దీనిని బట్టి సమణులంతా ఒకే సమూహానికి చెందిన వారు కారని స్పష్టమవుతున్నది. వారు స్వేచ్ఛా చింతనులు. వారికి ఏది నచ్చితే దానినే బోధించారు. సమణులు సమాజంలోని ఏ వర్గం నుంచి వచ్చినా, రాజులతో సహా, క్రతువు చేసే వారి కంటె తక్కువ గౌరవాన్ని పొందలేదనేది గమనార్హం. ఈ దేశంలో ప్రాచీన చింతనా ధోరణులను తీర్చి దిద్దడంలో యాజకులకు ఏ మాత్రం తీసిపోని పాత్రను సమణులు నిర్వహించారు. తొలి ఉపనిషత్తులలోకి చొరబడిన మౌలిక 'రహస్య బోధ'ను మొదటిగా ప్రవచించిన వారు వీరే. ఆ తరవాత ఉపనిషత్తులు ఛాందస బ్రాహ్మణ వాదంలోకి అంట్లుగా తొక్కబడ్డాయి. ఈ అంట్లే తరువాతి వేదాంత దర్శనానికి కేంద్రకమయ్యాయి. బౌద్ధ, జైనాలు ఈ రకమైన సమణ సంప్రదాయానికి చెందుతాయి. తొలి బౌద్ధ గ్రంథాలలో జైన, బౌద్ధ భిక్షువులు, ఇద్దరూ గూడ, శ్రమణులుగానే పేర్కొనబడ్డారు. బుద్ధుణ్ణి మహా సమణుడన్నారు.

భారతీయ చింతనలోని సమణ బోధను ఆమోదించక పోవడమే కాదు, దానిని తక్కువ చేసి చూసే ప్రయత్నాలు కొనసాగాయి. అయితే దానిని చులకన చేయలేదు. 'బుద్ధుడు హిందువు. సనాతన మతాన్ని సంస్కరించాడు' అనే తప్పుడు మాట ఒకటి ఉంది. 'హిందూ' పదం వాడకానికి సంబంధించి సరైన అవగాహన లేదు (anachronistic). ఈ విషయాన్ని అలా ఉంచితే, బుద్ధుణ్ణి హిందువని చెప్పటం ఘోరనేరం. ఎందుకంటె అతడు యజ్ఞ క్రతువును తోసిరాజన్నాడు. అవి నిర్వహించే వారిని మతాధికారులుగా అంగీకరించలేదు. అంతేకాదు, నాటి దేవతలకు అతడు ఈ ప్రపంచ వ్యవస్థలో అనామక పాత్రనే కల్పించాడు. దేవతలు జ్ఞానోదయమైనవారు కారు అన్నాడు. జ్ఞానం మానవులకెంత అవసరమో వారికీ అంతే అవసరం అన్నాడు. అయినా మరో మాట ఉంది: ''బౌద్ధం ఉపనిషత్తుల నుంచి వచ్చింది. తరవాత అది అందులో లీనమైంది''. దీనిని మనం ఇట్టే తోసివేయవచ్చు. ''బౌద్ధానికి అనాత్మవాదం కేంద్రకం. ఇది వ్యక్తి ఆత్మను నిరాకరిస్తుంది. అంతేకాదు ఉపనిషత్కేంద్రకమైన 'బ్రహ్మ' (Universal self) ను నిరపేక్షిస్తుంది'' - అని మనం ఇక్కడ చెబితే సరిపోతుంది.

సమణ సంప్రదాయం మనకందిన రీతిలో బౌద్ధ, జైనాలు రెండింటిలో గూడ, 'సృష్టికర్త అయిన దేవుని భావన' లేనే లేదు. వారు కర్మ సిద్ధాంతాన్ని నమ్మారు. అది ఒక అవైయక్తిక (impersonal) సహజ నియమం. ఆ నియమం మనం చేసే పనులు (కర్మలు) ఆధారంగా పని చేస్తుంది. బయటి శక్తి ఏదీ దానిని నడపదు. బౌద్ధంలో 'కర్మ' దేవునికి ప్రత్యామ్నాయం. బుద్ధుడు విజ్ఞతతో గూడిన తన ప్రతీత్య సముత్పాద సిద్ధాంతంలో (ఒక దాని ఆధారంగా మరొకటి పుడుతుంది అనే సిద్ధాంతం) ఈ ప్రపంచంలో అన్ని విషయాల జనన, స్థితి, లయాలు - భౌతిక, మానసిక విషయాలతో సహా - కారణ, ప్రత్యయాల వల్ల సంభవిస్తాయని వివరించాడు. బౌద్ధ, జైన సంప్రదాయాలు రెండూ గూడ ప్రతి వ్యక్తికి తన స్వంత ప్రయత్నంతో ఆధ్యాత్మికంగా ఎదగగల సామర్ధ్యం ఉందని నమ్ముతాయి.

ఇహ బౌద్ధం విషయానికి వస్తే, సిద్ధార్థ గౌతముడు 'మానవ దురవస్థ' (human predicament) ను అర్థం చేసుకోవడమే కాదు, దానిని పరిహరించే మార్గాన్ని గూడ కనుగొన్నాడు. బుద్ధుడు తన ప్రథమ ధర్మోపన్యాసంలో చెప్పిన మధ్యేమార్గం, చతురార్య సత్యాలు, అష్టాంగ మార్గం - ఇదే బౌద్ధ సారం. శీల, సమాధి, ప్రజ్ఞ అనే మూడు ధర్మ స్తంభాలను అష్టాంగ మార్గం పరివేష్టిస్తుంది. శీలం

సాధకుడనుసరించవలసిన నైతిక ధర్మం. పంచశీల గృహస్థులకు, అష్టశీల అనగారికులకు, దశ శీల సమణులకు, పాతి మొక్ష (వినయ) ఉపసంపద తీసుకొని బౌద్ధ సంఘంలో చేరిన వారికి ఉద్దేశితమయ్యాయి.

'సమాధి' అనేది ఎవరికి వారు తమను తాము పరిశుద్ధం గావించుకునే ప్రక్రియ. ఇందులో వ్యక్తి తనలోకి తాను లోతుగా చూసుకొని పరిశుద్ధం గావించుకొంటాడు. మామూలుగా ధ్యానంలో కొంత మార్మికత ఉంటుంది. కాని 'విపస్సనా' దానిని తొలగించి, సాధకుడు తనకు తానే అర్థమై కనిపించేట్టు చేస్తుంది. కుశల (మంచి) అకుశల (చెడ్డ) ధర్మాలను, లేదా ఆరోగ్యకర, అనారోగ్యకర ఆలోచనలను గుర్తించే విధంగా సాధకుడు తన మనస్సుకు శిక్షణ ఇచ్చుకొంటాడు. కుశల ఆలోచనలను పెంపొందించుకొంటూ, అకుశల ఆలోచనలను పరిహరించుకొంటూ, అతడు సుదీర్ఘ క్షాళన ప్రణాళికతో పయనిస్తాడు. అంతిమంగా అతడు ప్రజ్ఞను సాధిస్తాడు. ఈ ప్రజ్ఞ ద్వారా లోభ, ద్వేష, మోహాలనే మూడు కశ్మలాలను తొలగించుకొంటాడు. అప్పుడు సాధకుడు మంచి దానిని మంచిదని, చెడ్డదానిని చెడ్డదని గుర్తించే యథాభూత జ్ఞాన దర్శనం చేస్తాడు. ఈ విధంగా, ధర్మం (ధమ్మం) ముఖ్య లక్షణం ఏమంటే, మనిషిని బంధనాల నుంచి విముక్తుని చేసి, అతనిని తను తాను అధిగమించి ఎదిగేట్టు చేయడం. మానవుడే అన్నింటికి మూలం అని చెప్పడంలో, తథాగతులు కేవలం మార్గం మాత్రమే చూపుతారని చెప్పడంలో, ఎవరికి వారు మార్గంలో స్వీయ ప్రయత్నంతో నడవాలని చెప్పడంలో ధమ్మం మతానికి మానవతా దృక్పథాన్ని ఇవ్వడమే కాదు మనిషిని తన మీద తాను ఆధారపడేట్టు చేసింది.

ధమ్మపదం ఇలా అంటుంది :

చెడు చేసేదీ తనే
మలినం కావించుకొనేదీ తనే
చెడును పరిహరించేదీ తనే
పరిశుద్ధం కావించుకొనేదీ తనే
శుద్ధా శుద్ధతలకు తనే కారణం
ఎవడూ ఎవనిని శుద్ధం చేయలేడు.

చతురార్య సత్యాల - దుఃఖం, దుఃఖ సముదయం, దుఃఖ నిరోధం, మార్గం - లో మనకు బహుశ, 'మానవ దురవస్థను' హేతు బద్ధంగా అర్థం చేసుకొనే అత్యంత ప్రాచీన విధానం కనిపిస్తుంది. అది : సమస్యను గుర్తించడం, దాని కారణాన్ని కనుక్కోవడం, దానికి ఒక పరిష్కారాన్ని సూచించడం. ఈ పద్ధతి ఆధునిక శాస్త్రీయ విధానాన్ని పోలి ఉంది. ఆల్బర్ట్ ఐన్‌స్టైన్ ఊరికే అనలేదు: ''ఆధునిక శాస్త్రీయ అవసరాలకు సరిపోయే మతమేదైనా ఉన్నదా అంటే అది బౌద్ధమే''.

అంత్యాలను (exstreams)ను పరిహరించి, మధ్యేమార్గాన్ని అనుసరిస్తే, ప్రపంచ సమస్యలనేకం పరిష్కారమవుతాయని ధమ్మం చెబుతుంది. టిబెట్ సమస్యలో దలైలామా అనుసరించిన పద్ధతి మధ్యే మార్గమే. అటు సంపూర్ణ స్వాతంత్ర్యం కాక, ఇటు దీనాతిదీనంగా అడుగులకు మడుగులొత్తడం కాక, టిబెట్టు, చైనాలో అంతర్భాగంగానే ఉంటూ స్వతంత్ర ప్రతిపత్తిని కలిగి ఉండాలనే మధ్యేమార్గాన్ని దలైలామా సూచించాడు.

బౌద్ధం మొదటి నుంచి గూడ మతాన్ని జ్ఞాన దృష్టితోనే చూసింది. సాధకుని కది మానసిక స్వేచ్ఛ ఇచ్చింది. మతం పేరుతో రోజు రోజుకు పెరుగుతున్న హింసను చూస్తూనే ఉన్నాం. పరమత సహనం లేకపోవడాన్ని గమనిస్తూనే ఉన్నాం. ముఖ్యమైన మతాలు అవతరించి ఏండ్లు పూండ్లు గడిచినా మనిషి మానసిక స్వేచ్ఛకు నోచుకోలేదు. కాలంలో గడ్డ కట్టుకుపోయిన అనేక మతాలు మనిషికి బౌద్ధిక ప్రగతిని నిరాకరించి, తమ గుప్పిటలో అట్టే పెట్టుకొని బానిసలుగా చూస్తున్నాయి. కాని బౌద్ధం అలా కాదు. మనిషికి స్వేచ్ఛను ప్రసాదించింది. ఇతరులకు మేలు చేయని దేనిని, నిశిత పరిశీలనకు గురి చేయని దేనిని అంగీకరించవద్దంటుంది బౌద్ధం. ప్రఖ్యాత కలామ సూత్రంలో కలాములకు బుద్ధుడు ఇలా సలహా ఇచ్చాడు: ''తాను చెప్పింది సైతం తన మీది గౌరవంతో దానిని అంగీకరించవద్దంటాడు. - విజ్ఞులైనవారు బంగారాన్ని గీటురాయి మీద రాసి, కోసి, రుద్దిన విధంగా ప్రతిదానిని పుటం పెట్టి, నిగ్గుతేల్చి ఆతరవాతనే అంగీకరించాలన్నాడు. మన ఆధ్యాత్మిక స్వేచ్ఛను వీర్యవంతంగా రక్షించుకోవాలని, ఇతరులు చెప్పిన దాని ఆధారంగా (శబ్దప్రమాణం) దానిని దూరం చేసుకోవద్దని బౌద్ధం నొక్కి చెబుతుంది. ఇదే భావాన్ని ఇరవయ్యో శతాబ్దికి చెందిన భారతీయ దార్శనికుడు జిడ్డు కృష్ణమూర్తి చెప్పాడు. బుద్ధుడు ధర్మాన్ని తెప్పతో పోల్చాడు. తెప్ప నదిని దాటడానికి ఎలా పనికి వస్తుందో, అలాగే సంసారమనే సముద్రాన్ని దాటడానికి ధర్మం ఉపకరిస్తుంది. ఈ దృష్టాంతాన్ని అర్థం చేసుకొంటే పరమత అసహనం అంతరిస్తుంది. దీనికంటెగూడ ఈ ప్రపంచానికి ఈ భావాల ఆవశ్యకత ఎంతో ఉంది.

ఇప్పటికిప్పుడే, ఇక్కడికిక్కడే ప్రజల జీవితాలలో సమరసాన్ని నింపే ప్రయత్నం చేస్తుంది. దానిని ఆచరిస్తే ఒనగూడే ప్రయోజనాల కోసం ఎవడూ జీవితాంతం వేచి ఉండనక్కరలేదు. రోగం ఇక్కడే ఉంది, దానిని కుదిర్చే మందూ ఇక్కడే ఉంది. నిర్వాణం శీల జీవితం చివరలోనే ఉండాల్సిన అవసరం లేదు. ఆ మూడు మలినాలను - లోభ, ద్వేష, మోహాలను - కడిగి వేసుకొంటే ఉపధి శేష నిర్వాణం ఇప్పుడే ఈ జీవితంలోనే ఇక్కడే ఉంది.

బౌద్ధ అధ్యయనాలలో అగ్రేసరుడైన రిస్ డేవిడ్స్, సుమారు నూట ఏభై ఏళ్ళ క్రితం, బౌద్ధాన్ని ఎండగట్టడానికి, ఇంకా వీలైతే తెగడడానికి విషయ సేకరణ ప్రయత్నాలు మొదలెట్టాడు. ఆ కార్యంలో అతడు ప్రాచీన పాళీ బౌద్ధ వాఙ్మయాన్ని ఔపోశన పట్టాడు. లక్ష్యం మారింది. పరివర్తన చెందాడు. గొప్ప బౌద్ధుడయ్యాడు. అతడు ఇలా అంటాడు: ''నేను ప్రపంచంలో ముఖ్య మతాలన్నింటిని సాకల్యంగా పరిశీలించాను. అయితే వాటిల్లో వేటిల్లో గూడ బుద్ధుని ఆర్య అష్టాంగ మార్గాన్ని మించిన మనోజ్ఞత కాని, వ్యాపకత (weanty and comprehensiveness) గాని లేవు''.

ప్రస్తుత పరిస్థితులలో బౌద్ధం ఆవశ్యకత ఎంతైనా ఉంది. దాని విధానం శాస్త్రీయం. మనిషినే కాదు, అతని ఆధ్యాత్మక, భౌతిక జీవితాన్ని అది పట్టించుకొంటుంది. మానవ హక్కుల గురించి ఎవరూ ఊహించని ఆ కాలంలోనే బౌద్ధం మానవ వాదానికి ఉన్నతాసనం వేసింది. అంతేకాదు, బౌద్ధం ఇంకా అంతకంటె ముందుకు పోయి చైతన్యం ఉన్న సర్వజీవుల హితాన్ని ఆకాంక్షించింది. నాలుగో శతాబ్దికి చెందిన అమరావతి శాసనంలో ధర్మాన్ని ''సర్వ సత్వానామ్ నిఖిల దుఃఖోప శమనమ్'' - అంటే సర్వజీవులను దుఃఖ విమోచనం గావించేది - గా నిర్వచించటాన్ని ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవాలి.

# ఆధునిక బౌద్ధుడి మతం

\- టి.రవిచంద్

ప్రాచీన కాలం నుంచి ఆధునిక యుగం వరకు బౌద్ధ ధర్మ వికాసంలో, వ్యాప్తిలో, ప్రచారంలో ఆంధ్రులు ( తెలుగువారు) అగ్ర భాగాన నిలిచారు. ఆంధ్రులు తొలి నుండి అవైదిక (Non-vedic) మతాల పట్ల ఆసక్తి కనబరిచారు. ముఖ్యంగా బౌద్ధ ధర్మం పట్ల ఆంధ్రుల అభిమానం మాటలకు అందనిది. నాగార్జునుడు, బుద్ధఘోషుడు లాంటి బౌద్ధాచార్యులు బౌద్ధంలో వినూత్న భావ సంచలనానికి కారకులై, నూతన శాఖల ఆవిర్భావానికి ఆద్యులైనారు. తమ రచనల ద్వారా అంతర్జాతీయ ఖ్యాతి గడించారు. బౌద్ధంలో వీరిరువురి ఆలోచనా స్రవంతి నాటి నుంచి నేటి వరకు ప్రపంచ బౌద్ధుల అభిమానాన్ని, ఆదరణను పొందుతూనే ఉంది. ప్రపంచ వ్యాప్తంగా గౌతమ బుద్ధుడ్ని బౌద్ధులు ఎంతగా ఆరాధిస్తారో, అంత ఆరాధనా భావం ఆంధ్రులైనా ఈ ఇరువురి బౌద్ధాచార్యుల పట్ల కనబరుస్తారు. నాగార్జునుడు మహాయాన సూత్రాల ఆధారంగా మాధ్యమిక వాదాన్ని రూపొందించగా, బుద్ధ ఘోషుడు థేరవాదులకు విజ్ఞాన సర్వస్వం లాంటి గ్రంథాన్ని ( విశుద్ధిమగ్గ) రచించాడు. ఇద్దరు బౌద్ధాచార్యుల్లో ఒకరు మహాయానాన్ని అభిమానించే దేశాల్లో ప్రసిద్ధిచెందగా, మరొకరు థేరవాదాన్ని అనుసరించే దేశాల్లో ప్రఖ్యాతి చెందారు. ఈ బౌద్ధ దేశాల్లో ఈ ఇరువురి ప్రభావం ఏ చరిత్రకారుడి అంచనాలకు అందనిది. క్రీ.శ. 13వ శతాబ్ది వరకు ఏదో ఒకవిధంగా ఆంధ్ర దేశాన్ని ప్రభావితం చేసిన బౌద్ధం కొన్ని చారిత్రక కారణాలవల్ల వెనకడుగు వేసింది. భారతదేశంలో అందులో అంతర్భాగమైన ఆంధ్రరాష్ట్రంలో బౌద్ధం బలహీనపడినా, నేటికీ ఆసియా ఖండంలోని అనేక దేశాల్ని అది ప్రభావితం చేస్తూనే ఉంది. క్రీ.శ. 13వ శతాబ్దం నుంచి బౌద్ధం ఈ గడ్డపై అంతరించినా! ఆధునిక యుగంలో దాని పూర్వవైభవం మరల పునరుద్ధరణకు నోచుకున్నది.

ఆధునిక యుగంలో బౌద్ధ పునర్నిర్మాణం రెండుమార్గాలలో జరిగింది. పద్దెనిమిదవ శతాబ్దంలో యురోపియన్ ఓరియంట లిస్టులు, వారి భారతీయ అనుచరులు వలస పాలకుల మద్దతుతో బౌద్ధ శిథిలాల, రాతప్రతుల పునర్నిర్మాణానికి అపారమైన పరిశోధన, సేవ చేశారు. ఈ పరిశోధకులందరూ వలస పాలకుల ప్రయోజనాలకే సహాయపడిన వాళ్ళు కాదు. వీరు ముఖ్యంగా విద్యారంగం నుంచి వచ్చిన వాళ్ళు. వీళ్ళు విద్యా విషయక-చారిత్రక పరిశోధనకు మార్గ దర్శకులయ్యారు. వీళ్ళ ప్రధాన లక్ష్యం చారిత్రక బౌద్ధం ఆవిర్భవించిన నాటి పరిస్థితుల్ని వాటికి ఆధారమయిన కట్టడాల్ని, శిథిలాల్ని వెలికి తీసి, త్రవ్వకాలు జరిపి చారిత్రక బుద్ధుడ్ని ఆవిష్కరించడం. క్రీస్తుకు పూర్వం ఆరువందల సంవత్సరాల క్రితం స్థాపించబడిన బౌద్ధమతాన్ని, ప్రపంచ మతాల్లో అది ఒక ప్రధాన మతంగా చర్చ ద్వారా పునః స్థాపించడమే. ఆపని వలస పాలన పరిధికి లోబడి యూరోపియన్ ఓరియంటలిస్టులు గొప్పగా నిర్వహించారు.

ఇక రెండో మార్గంలో పయనించిన వారు భారతీయులు. ఈ భారతీయ బౌద్ధ పరిశోధకుల్లో ఎక్కువమంది బుద్ధుడ్ని అణచబడిన వర్గాల, కులాల ఆశాజ్యోతిగా భావించి, ఆయన బోధించిన ధర్మ మార్గంలో, కులాల ఆశాజ్యోతిగా భావించి, ఆయన బోధించిన ధర్మ మార్గంలో

---

టి. రవిచంద్, గుంటూరు.

ప్రయాణించటం వల్ల తరతరాలుగా అనుభవిస్తున్న సకల అసమానతల నుండి, అవమానాల నుండి విముక్తి పొందగలరని భావించి బౌద్ధ ధర్మ పునర్నిర్మాణానికి, వికాసానికి కృషి చేశారు. వీరు యూరోపియన్ ఓరియంటలిస్టుల చారిత్రక పరిశోధనల ఆధారంగా, వినూత్న దృష్టితో బుద్ధుడ్ని, బౌద్ధ ధర్మాన్ని వెలుగులోకి తెచ్చారు. ఆధునిక యుగంలో బౌద్ధ ధర్మ అధ్యయనం, పరిశోధనలో యూరోపియన్ ఓరియంటలిస్టులు, ఇండాలజిస్టుల కృషి తెలిసినంతగా, ఈ దేశ చరిత్రలో అణగారిన కులాల, వర్గాల అస్తిత్వం, ఆత్మ గౌరవం కోసం బౌద్ధ ధర్మాన్ని పునర్నిర్మించిన, పునర్నిర్వచించిన పరిశోధనా ఉద్యమాల చరిత్రకు చరిత్ర రచనా శాస్త్రంలో తగిన స్థానం లభించలేదు. డా॥ అంబేద్కర్ సారధ్యంలో నిర్మించబడిన నవబౌద్ధ ఉద్యమం కొంతవరకు గుర్తింపు పొందినా, ఆయనకు ముందు బౌద్ధ ధర్మ పునరుద్ధరణకు ఆద్యులైన వారి చరిత్రలకు చరిత్రలో సముచిత స్థానం లభించలేదు. ఆధునిక బౌద్ధ ఉద్యమాల చరిత్ర రచనల్లో ధర్మపాల నాయకత్వంలోని 'మహాబోధి సొసైటీ', డా॥ అంబేద్కర్ 'నియోబుద్ధిస్టు' ఉద్యమాల చరిత్రలే తరచుగా పేర్కొనబడుతుంటాయి. కాని ఈ పునర్నిర్మాణంలో ఆంధ్రులంతా గర్వించదగిన కృషి చేసిన ప్రొఫెసర్ పోకల లక్ష్మీ నరసు నాయుడికి దక్కాల్సిన స్థానం దక్కలేదు.

భౌగోళికంగా, భాషారీత్యా చూసినప్పుడు ప్రొ॥ పి. లక్ష్మీనరసు (1860-1934) ఆంధ్రుడు. శాస్త్రీయ దృష్టితో బౌద్ధ ధర్మాన్ని వ్యాఖ్యానించిన ఆదునిక బౌద్ధుడు ఆయన. శాస్త్రవిజ్ఞానాన్ని అమితంగా అభిమానించిన ఆయనకు భౌగోళిక సరిహద్దులు, సంకుచితత్వాలులేవు. కాబట్టి ఆయన ఆంధ్రుడిగా పుట్టినా భౌగోళిక సరిహదుల్ని దాటి అంతర్జాతీయ ఖ్యాతి పొందాడు. బౌద్ధంపై ఆయన రచనలు, వ్యాఖ్యానాలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావితం చూపాయని చెప్పడానికి మనకు ఆయన జీవితంలో జరిగిన ఒక అపూర్వ సంఘటన ఉదాహరణప్రాయంగా నిలుస్తుంది. ప్రొ॥లక్ష్మీ నరసు రచించిన ''వాటీజ్ బుద్ధిజం'' (బౌద్ధం అంటే ఏమిటి?) అనే పుస్తకం జెకోస్లోవేకియా దేశానికి చెందిన జీన్‌మసరిక్ (Jean Masaryk)ను ఆకట్టుకుంది. ఆయన ఆంగ్లంలో ఉన్న ఈ గ్రంథాన్ని జెక్ భాషలోకి అనువాదం చేశారు. అనువాదకుడైన జీన్ మసరిక్ ఎవరనుకున్నారు? జెకోస్లోవేకియా దేశానికి తొలి రాష్ట్రపతి. అనువాద గ్రంథాన్ని జీన్ మసరిక్ ప్రొ॥ పి. లక్ష్మీ నరసుకు పంపారు. ఈ గ్రంథం తర్వాత జర్మన్ భాషలోకి కూడా అనువాదమయింది. ఆ తర్వాత 1940 ప్రాంతాల్లో ఆయన మరొక గ్రంథం ''ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం'' (1907) డా॥ అంబేద్కర్‌ను ప్రభావితం చేసింది. ఆయన దీనివల్ల కేవలం ప్రభావితుడవ్వటమే కాకుండా 1948 నాటికి అలభ్యమైన ఈ గ్రంథాన్ని తన స్వీయ పరిచయంతో పునర్ముద్రింప చేశారు. అంటే అంతర్జాతీయంగా, జాతీయంగా ఒక దేశాధ్యక్షుడ్ని, ఒక దేశ రాజ్యాంగ నిర్మాతను ప్రభావితం చేసిన గ్రంథరచన చేసిన వారు ప్రొ॥ పి. లక్ష్మీనరసు. ఆయన మన తెలుగు వాడని ఆంధ్రులు మరచి పోయారు. ఆయన రచనల మీద పరిశోధన చేస్తున్న స్వదేశీ, విదేశీ పరిశోధకులు తెలుగు వారు గర్వంగా చెప్పుకోదగిన తమ బౌద్ధుడ్ని తమిళుడిగా చిత్రించితే ఎవరూ నిలువరించ లేక పోయారు. ఆయన్ని తెలుగువాడిగా, డా॥ అంబేద్కర్‌ను ప్రభావితం చేసిన ఆధునిక బౌద్ధుడిగా నిరూపిస్తూ ప్రస్తుత వ్యాసరచయిత తన పరిశోధనతో నిరూపించారు. ఆయన జీవితంలోని అనేక చారిత్రాత్మక సంఘటనలు నేటి తరానికి తెలియకుండా పోయాయి. ఆయన బౌద్ధంపై రచించిన కొన్ని ముఖ్యమైన గ్రంథాలు నేడు బౌద్ధ సాహిత్యాభిమానులందరికీ అందుబాటులోకి వచ్చాయి.

1999లో తైవాన్ లాంటి చిన్న దేశం ప్రొ॥ పి. లక్ష్మీ నరసు ''ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం'' (బౌద్ధ సారం) గ్రంథాన్ని వేల సంఖ్యలో ప్రతుల్ని ప్రచురించి (37,500) ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా పంపిణీ చేస్తున్నది. మా ఆంధ్ర సంస్కృతి, మా తెలుగు భాషగొప్పదని జబ్బలు చరుచుకొనే ఆంధ్రులు ఆయన్ని గుర్తించి, గౌరవించకపోయినా, ఇతర దేశాల వారయినా ఆయన రచనల ఆవశ్యకతను గుర్తించటం ముదావహం. ఆంధ్రదేశంలోని ఒక ప్రాబల్యకులంపై పరిశోధనచేసిన జపాన్ పరిశోధకురాలు యమద కేకో జపాన్ భాషలో ప్రొ॥ లక్ష్మీ నరసుపై ఒక వ్యాసం రాసానని తెలిపారు (టోక్యో నుంచి రాసిన లేఖ 20-01-1999). ఆమె జపాన్ భాషలోకి అనువాదమయిన ''ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం'' గ్రంథాన్ని ప్రస్తుత వ్యాసరచయిత కోరికపై జిరాక్స్ ప్రతి చేయించి పంపిందని తెలియ చేయడానికి సంతోషిస్తున్నాను. ఈ విషయాలన్నీ ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే తెలుగువాడిగా పుట్టి 1930 ప్రాంతాల్లో పరిశోధకుడిగా, రచయితగా బౌద్ధ ధర్మంపై అత్యుత్తమ గ్రంథాన్ని రచించి అంతర్జాతీయంగా మన్ననలు పొందిన ప్రొ॥ లక్ష్మీ నరసుని, ఆయన జీవితాన్ని చాలా సహజంగా విస్మరించారని తెలియ పరచటానికే!

ప్రొ॥ పి. లక్ష్మీ నరసు మరణించి డెబ్బయి సంవత్సరాలు అయింది (జులై 14,1934). ఆయన చివరి దశలో బౌద్ధంపై ఒక గ్రంథం రచించారు. దీని పేరు ''రెలిజియన్ ఆఫ్ ద మోడ్రన్ బుద్ధిస్టు'' (ఆధునిక బౌద్ధుడి మతం). ఈ గ్రంథం ఇంత వరకు ముద్రణకు నోచుకోలేదని, దీన్ని డా॥ అంబేద్కర్ 1950 ప్రాంతాల్లో ప్రచురించాలన్న ఆ కాంక్షతో మద్రాసు (నేటి చెన్నై) నుండి తీసుకెళ్ళారని, ఆయన అనేక పనుల ఒత్తిడివల్ల, అనారోగ్య కారణాలవల్ల ప్రచురించ లేక పోయారని, దీన్ని తెలుగు వారిలో ఎవరయినా, ఏ సంస్థయినా ముందుకు వచ్చి ప్రచురిస్తే బాగుంటుందని 1996లో ప్రస్తుత వ్యాసరచయిత మిసిమి (సెప్టెంబరు)లో రాసిన వ్యాసంలో విజ్ఞప్తి చేశాడు.

ఈ గ్రంథం ఎట్టకేలకు 2002లో జి. అలయ్‌సియస్ (Aloysius) కృషి వలన పుస్తకంగా వెలువడినందుకు బౌద్ధ సాహిత్యాభిమానులతో పాటు తెలుగు వారందరూ ఆనందిస్తారని భావిస్తున్నాను. ఈ గ్రంథానికి సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించిన అలయ్‌సియస్ తమిళ బౌద్ధంపై పరిశోధన చేశారు. ఈయన ఢిల్లీలోని జామియామిలియా (అకాడమి ఆఫ్ థర్డ్ వరల్డ్ స్టడీస్) లో రీడర్‌గా పనిచేస్తున్నారు. దక్షిణ భారతంలో బౌద్ధ పునరుద్ధరణకు మూల కారకుల్లో ఒకరైన పండిట్. సి. ఇయోథిదాస్ తమిళ రచనలకు (రెండు వాల్యూములు) సంపాదకత్వం నిర్వహించారు. దక్షిణ భారతంలోని ఆధునిక బౌద్ధ ఉద్యమాలపై మంచి అవగాహన, ఆసక్తి ఉన్న జి. అలయ్‌సియస్ ప్రొఫెసర్ పి. లక్ష్మీనరసు గ్రంథానికి సంపాదకత్వ బాధ్యతలు సమర్థవంతంగానే నిర్వహించారని చెప్పాలి. ప్రొఫెసర్ పి. లక్ష్మీ నరసు ఆంగ్ల గ్రంథం రాత ప్రతిని, డా॥ అంబేద్కర్ రాత ప్రతులతో పాటు ఇంత కాలం పరిరక్షించిన మూన్ దంపతులకు (మీనాక్షి, వసంత్‌మూన్) మనమంతా రుణగ్రస్తులం. వసంత మూన్ మహారాష్ట్ర ప్రభుత్వ ఉన్నతోద్యోగి. డా॥ అంబేద్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్ సంపాదకుడు. ఆయన ఈ మధ్యనే కీర్తి శేషులయ్యారు.

ప్రస్తుత గ్రంథం - ''రెలిజియన్ ఆఫ్ ది మోడ్రన్ బుద్ధిస్టు'' (ఆధునిక బౌద్ధుడి మతం) విషయానికొస్తే, పుస్తకం పేరే ఆసక్తి కరంగా, ఆలోచనాత్మకంగా ఉంది. బౌద్ధుల్లో ప్రాచీన బౌద్ధులు,

మధ్యయుగ బౌద్ధులు, ఆధునిక బౌద్ధులు అనే విభజన ఏమిటి, అనే సందేహం కలగవచ్చు. ఈ శీర్షిక గురించి చెప్పుకొనే ముందు మరొక ఆంధ్ర బౌద్ధ పరిశోధకుడు డా॥ కె. బి. కృష్ణ (1906-1948) తమ గ్రంథం ''పొలిటికల్ అండ్ సోషల్ థాట్ ఆఫ్ బుద్ధిస్టు రైటర్స్'' (బౌద్ధ రచయితల రాజకీయ, సామాజిక చింతన)లో బుద్ధుడి బోధనలు గురించి చెబుతూ అన్నమాటల్ని పేర్కొనడం సందర్భోచితంగా ఉంటుంది. "Buddhism of Pre-Christian era, Buddhism of the early Christian era, Buddhism of the present era are entirely different" (క్రీస్తు పూర్వం బౌద్ధం, తొలిక్రీస్తు శకంలోని బౌద్ధం, నేటి యుగంలోని బౌద్ధం - పూర్తిగా భిన్నమైనవి). ఈ మూడు శకాల్లోని బౌద్ధం కాలాన్ని బట్టి, దేశాన్ని బట్టి వివిధ రూపాలు సంతరించుకున్నా, బౌద్ధంలోని మౌలిక భావనలు అనిత్యం, దుఃఖం, అనాత్మ బుద్ధుడి నుండి ప్రొ॥ లక్ష్మీనరసు కాలం వరకు మార్పు చెందలేదన్నది యథార్థం. భిన్నయుగాల్లోని, భిన్నదేశాల్లోని బౌద్ధానికి కేంద్రం డా॥ కె. బి. కృష్ణ అన్నట్లు - ''బుద్ధుడి బోధనలు''. ప్రొ॥ పి. లక్ష్మీనరసు గ్రంథరచన వలస భారతం (Colonial India)లో జరిగింది. వలస భారతం ఆధునిక భావాలకు, విజ్ఞాన శాస్త్రానికి నిలయం. ఈ యుగంలో ఆధునికత, విజ్ఞాన శాస్త్రం పర్యాయ పదాలుగా మారాయి. ఆయన వృత్తి రీత్యా విజ్ఞాన శాస్త్రాచార్యుడే కాదు మానవ సమస్యలకు విజ్ఞాన శాస్త్రం పరిష్కారం చూపగలదనే సహేతుకమైన విశ్వాసం గలవాడు. కాని ఆయన సైంటిజం (విజ్ఞాన శాస్త్రవాదం) భ్రమల్లో చిక్కుకోలేదు. సద్ధర్మం విజ్ఞాన శాస్త్ర దృక్పథానికి, బోధనలకు భిన్నమైనది కాదు. విజ్ఞాన శాస్త్రం ఎలాగయితే అఖండ సత్యాన్ని ప్రతిపాదించకుండా క్రమానుసారంగా సత్యాన్ని చేరుకోగలమని బోధిస్తుందో, అదేవిధంగా సద్ధర్మం (బౌద్ధం) బోధిస్తుందని ప్రొ॥ పి. లక్ష్మీనరసు భావించాడు. దీనితో పాటు సద్ధర్మం మానవీయ కోణాన్ని ప్రసాదించింది. మానవ దుఃఖాన్ని, దాని నివారణోపాయాన్ని సూచించి మానవ జీవితంలో భాగమయింది. అందువల్ల మానవ సమస్యలన్నిటికీ విజ్ఞానశాస్త్రమే పరిష్కారం అనే సైంటిజం బారినుండి ఆయన తప్పుకోగలిగాడు. బౌద్ధ ప్రభావం వల్ల మానవత్వం మూర్తీభవించిన శాస్త్రవేత్తగా, ఆధునికుడిగా రూపొందాడు ప్రొ॥ పి. లక్ష్మీనరసు. నిరంతర పరివర్తన శీలమైన ప్రకృతిలో, ప్రపంచంలో మారనిది ఏదయినా ఉంటే అది ''మార్పు'' (change) అని తాత్వికంగా సూత్రీకరించిన బౌద్ధం ఆధునిక నాగరికతకు అనుగుణంగా మార్పు చెందడంలో ఆశ్చర్యంలేదు. విజ్ఞాన శాస్త్ర వేత్తయిన ప్రొ॥ పి. లక్ష్మీ నరసు ''ఆధునిక బౌద్ధుడి మతం'' అనే పేరు తన గ్రంథానికి పెట్టడంలోనే ఆయనలోని వైజ్ఞానిక స్పృహ, నిబద్ధతలు బహిర్గతమవుతున్నాయి. ఆధునిక బౌద్ధుడు ఆధునిక విజ్ఞాన శాస్త్రం అందించిన కొత్త జీవితానికి అనుగుణంగా మారడానికి ఎటువంటి ప్రతిబంధకం బౌద్ధంలో లేకుండా, దాన్ని వికసింపచేయాలన్నదే ఈ గ్రంథ రచయిత లక్ష్యం. బౌద్ధంలో ప్రవేశించిన ఇతర అహేతుక విశ్వాసాల్ని ప్రక్షాళణ చేసి, బుద్ధుడు శాస్త్రీయ పరిశోధన, తార్కిక వివేచనతో తన అసాధారణ అంతర్ దృష్టితో సాధించిన (కనుగొన్న) సత్యాన్ని స్థాపించటం మరో లక్ష్యం.

ప్రొ॥ పి. లక్ష్మీనరసు ''రెలిజియన్ ఆఫ్ ది మోడ్రన్ బుద్ధిస్టు'' గ్రంథాన్ని మూడువందల పదమూడు (రాత ప్రతి ఐదు వందల) పేజీలు, 51 అధ్యాయాలుగా విభజించి రచించారు. బుద్ధుడి మార్గం అప్రాకృతిక విశ్వాసాలను అధిగమించి వివేచనా పూరిత జీవితం (life of reason) గడపడానికి ఎలా

ఉపయోగపడుతుందో గ్రంథంలో చర్చించిన వివిధ విషయాలు రుజువు చేస్తాయి. దీనిలో చర్చించిన విషయాల్ని పరిచయం చేయాలంటే మరొక చిన్న పుస్తకం రచించాలి. ఈ వ్యాస పరిధిలో దీనిలో చర్చించిన ప్రధాన విషయాల్ని రేఖా మాత్రంగా చూద్దాం. ఈ 51 అధ్యాయాల్ని నాలుగు భాగాలుగా విభజించుకొని అధ్యయనం చేస్తే అర్థవంతంగా ఉంటుంది. గ్రంథకర్త అటువంటి విభజన చేయలేదు. పాఠకులు తమ అధ్యయన సౌలభ్యం కోసం 1. సద్ధర్మానికి ఐదు సజీవ చారిత్రక మతాల (వీటిలో రెండు - హిందూయిజం, జూడాయిజం కేవలం జాతీయమతాల) కు గల ప్రధాన వ్యత్యాసం; 2. భారతీయ దర్శనాలు - బౌద్ధం; 3. బుద్ధుడు, బౌద్ధం, త్రిపిటకాలు; 4. బౌద్ధంలోని వివిధ భావనలు. ఇలా విభజించుకొని పరిస్తే ఆధునిక బౌద్ధుడికి బౌద్ధ దర్శనం, మతాలపై మంచి అవగాహనను కలిగిస్తుందీ గ్రంథం.

ప్రపంచంలో నేడు సజీవంగా ఉన్న ఐదు మతాల్లో రెండు మతాలు హిందూయిజం, జూడాయిజం జాతీయ మతాలు. ఈ రెండు మతాలకు జాతీయ పరిధి దాటితే మనుగడలేదు. వీటి ప్రభావం లేదు. హిందువుగా పుట్టడమంటే ఏదో ఒక కులంలో పుట్టడమే. కుల రహిత హిందువుని ఊహించుకోవడం కూడా కష్టమే. కులం హిందూ మతంలో భాగంకాదని కొంతమంది సంస్కర్తలు సిద్ధాంత చర్చలు చేసినా, ఆ వాదనలు నిలబడలేదు. కాబట్టి హిందువుకి కీలకాంశం కులం. అందువల్ల దేశ సరిహద్దులు దాటి మిషనరి మతాలవలె వ్యాప్తి చెందలేదు. జూడాయిజం (యూదుమతం) కూడా జాతీయ పరిధులు దాటలేదు. ఇక మిగతా మూడు మతాల్లో వరసగా బౌద్ధం, క్రైస్తవం, ఇస్లాం విశ్వమతాలు. జాతి, జాతీయత, దేశ సరిహద్దులు దాటి మనిషిని మనిషిగా పరిగణించి ప్రపంచవ్యాప్తంగా విస్తరించినవి ఈ మూడు మతాలు. ఐతే ఈ మూడు మతాల్లో బౌద్ధాన్ని మాత్రమే విజ్ఞాన శాస్త్రంతో మేళవించటానికి, సమన్వయం చేయటానికి వీలుపడుతుంది. క్రైస్తవం, ఇస్లాం మతాల్లో వ్యక్తిగత దేవుణ్ని (Personal God) ఈ విశ్వానికి సృష్టికర్తగా భావించడం కనిపిస్తుంది. ఈ మతాలు శరీరం, ఆత్మ వేరని, రెండింటి స్వభావం, లక్ష్యం వేరని భావిస్తాయి. ఈ భావనలు ఆదిమానవుడు అమాయకత్వంతో అజ్ఞానంలో ఊహించుకున్నవి. ఈ భావనలకు ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి పొత్తుకుదరదు. బౌద్ధం సృష్టిభావనను, మానవరూపంలోని సృష్టికర్తను అంగీకరించదు. దీనిలో చారిత్రక మోక్ష దాత లేడు. మార్గదాత మాత్రమే ఉన్నాడు. ఆయన చారిత్రక బుద్ధుడు. బౌద్ధంలో పవిత్ర గ్రంథాలకు తావు లేదు. త్రిపిటకాలు సాంకేతిక గ్రంథాలు (technical books). అవి భిక్షువులుపయోగించేవి. బౌద్ధంలో వివిధ శాఖల త్రిపిటకాలు ఒకేరకంగా లేవు. త్రిపిటక భాష పాలీ. బుద్ధుడు మాట్లాడింది పాలీ కాదు. కాని అతి ప్రాచీన నికాయం ఒకటి మాగధి భాషలో ఉన్నదని పరిశోధకులు భావిస్తున్నారు. కాని సిలోన్, బర్మా, సయాం లలో ఉన్న త్రిపిటకాలు పాలీలో ఉన్నాయి. చైనా త్రిపిటక సంస్కృతం నుండి రూపొందింది. అందువల్ల ప్రాచీన బౌద్ధం గురించి తెలుసుకోవాలంటే కేవలం త్రిపిటకాలపైనే ఆధారపడకూడదు. త్రిపిటకాలు ఒకగైడు లాంటివి. బౌద్ధంలో శబ్ద ప్రమాణానికి స్థానం లేదు. బౌద్ధంలోని ప్రసిద్ధ చింతకులంతా బుద్ధుడి బోధనల్ని తర్క శాస్త్రం, మనో విజ్ఞాన శాస్త్రం వెలుగులో వ్యాఖ్యానించారు. సూత్రాన్ని (scriptures) ఎప్పుడూ శాస్త్రం వెలుగులోనే వ్యాఖ్యానించాలి. మానవ అనుభవానికి, వివేచనకు నిలవనిది ఏదీ బుద్ధుడి బోధకాదని ప్రొ॥ పి. లక్ష్మీనరసు తమ అన్ని రచనల్లో

తరచుగా పేర్కొంటుంటారు. అందువల్ల బుద్ధుడి బోధనలు సైన్సు బోధనలకు భిన్నమైనవి, వ్యతిరేకమైనవి కావు. సహేతుకమైన బహుజనహితాన్ని, సుఖాన్ని బౌద్ధం ఆకాంక్షిస్తుంది. సద్ధర్మం చుట్టూ ఎన్ని శాఖలావిర్భవించినా, దాని మౌలిక లక్షణాలు అనిత్యం, దుఃఖం, అనాత్మల విషయంలో అన్ని శాఖల మధ్య ఏకీభావం ఉంది. బౌద్ధం వ్యవస్థీకృత మతాలవలె విజ్ఞాన శాస్త్రానికి వ్యతిరేకం కాదు. అందుచేతనే ఒక సందర్భంలో ప్రఖ్యాత భౌతిక శాస్త్రజ్ఞుడు ఐన్‌స్టీన్ భవిష్యత్తు మతం (Future religion), విశ్వ సంబంధమైన మతం (Cosmic religion) అంటాడు. ఇటువంటి మతం వ్యక్తిగత దేవుడ్ని (Personal God), పిడివాదాల్ని (dogmas), దైవశాస్త్రాన్ని (theology) అధిగమించింది కావాలని, అటువంటి మతం బౌద్ధం అనికూడా ఆయన భావించాడు. తాను మతస్తుడ్ని కానని ఒకవేళ కావాల్సి వస్తే బౌద్ధుడ్ని అవుతానని ఆయన ప్రకటించాడు. బౌద్ధం ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి, అది ప్రతిపాదిస్తున్న సూత్రాలకు వ్యతిరేకం కాదన్న ప్రొ॥ పి. లక్ష్మీనరసు అభిప్రాయాలను ఐన్‌స్టీన్ ప్రకటన బలపరుస్తుంది. 1930 ప్రాంతాల్లో ''రెలిజియన్ ఆఫ్ ద మోడ్రన్ బుద్ధిస్టు'' గ్రంథ రచన జరిగింది. అప్పటికి ఐన్‌స్టీన్ ఈ అభిప్రాయం వెల్లడించలేదు. అందువల్ల దీనికి ప్రొ॥ పి. లక్ష్మీనరసు గ్రంథంలో స్థానం లభించలేదు.

ఆధునిక బౌద్ధుడి మతం అన్న పేరు వినినవెంటనే ఎవరికయినా బౌద్ధాన్ని మతంగా పరిగణించవచ్చా అనే సందేహం సహజంగా కలుగుతుంది. అందువల్లనే గతంలో కొంతమంది పరిశోధకులు బౌద్ధాన్ని ''దేవుడులేని మతం'' (Religion without God)గా భావించిన సందర్భాలున్నాయి. దేవుడే కాదు శాశ్వతమైన ఆత్మ భావనకూ బౌద్ధంలో స్థానం లేదు. అసలు సాంప్రదాయిక మత భావనకు పూర్తిగా భిన్నమైనది బౌద్ధం. ఈ సందేహాన్ని నివృత్తి చేయటం కోసమని "Is Buddhism a Religion?" (బౌద్ధం ఒక మతమా?) అని ఒక శీర్షిక పెట్టి చర్చించారు ప్రొ॥ పి. లక్ష్మీ నరసు. ఆత్మకు, దేవుడికి చోటివ్వని బౌద్ధం మతం పేరుతో పిలవడానికి అర్థమయిందా? అని ఆయన ప్రశ్నిస్తూ, విజ్ఞానశాస్త్రం, తాత్విక వ్యవస్థలు, మత గాథలు - ఈ మూడు ఒకే ఒక మానవ ప్రేరణతో బయలు దేరాయని, అది ఈ విశ్వాన్ని సహేతుకంగా వ్యాఖ్యానించాలన్న ఆకాంక్షగా ఆయన భావించారు. కాని వ్యవస్థీ కృత మతాలు రహస్యాన్ని పెంచి పోషించడం (fostering of mystery) ద్వారా విజ్ఞాన శాస్త్రానికి, తత్వ శాస్త్రానికి శత్రువులుగా మారాయని ఆయన వివరించారు. ఆత్మ, దైవభావం మతంలో అవశ్యకమైన, అనుల్లంఘనీయమైనవి కావని స్పష్టంచేశారు. దాదాపు అన్ని అప్రాకృతిక మతాలు (super natural religions) వ్యవస్థీకృత మతాలుగా మార్పుచెంది, ప్రజల అజ్ఞానాన్ని ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకొంటున్నాయి. విజ్ఞానశాస్త్రం (సైన్సు) నిరంతరం ప్రగతి పథంలో పురోగమిస్తూ, మార్పు చెందుతుంటే, మతం పురోహిత వర్గం కారణంగా సహజ పరివర్తన చెందకుండా స్తబ్దంగా నిలిచింది. ప్రపంచాన్ని గురించి విజ్ఞానశాస్త్ర దృక్పథం విశ్లేషణాత్మకమయింది, భౌతిక మయింది. మతాంశ మేదయినా కానీయండి మానవుడే దాని కీలకాంశం. అదృశ్య శక్తి (the unknown) మీద ఆధారపడటం నుండి స్వేచ్ఛే మత సారం. మతమనేది జీవితం కొరకు; మత జీవిత మనేది దుఃఖం నుండి స్వేచ్ఛ. దాని లక్ష్యం విముక్తి.

మానవ భవిష్యత్తును ఏదో తెలియని అదృశ్య శక్తి నిర్ణయిస్తుందని భావించటం, దుఃఖంలోంచి ఎలా బైటపడాలి అనే ఆలోచన మతాలన్నిటికీ ప్రాతిపదిక. ఫలితంగా మరింత సుఖ ప్రదమూ,

సంతోషకరమైన జీవితం కలుగుతుందనే ఆశ. శాక్య సింహుడు (బుద్ధుడు) ఒక సందర్భంలో ఇలా అన్నాడు: ''నేను మీకు రహస్యాలు, అద్భుతాలు వెల్లడిస్తానని అనలేదు కదా? పై పెచ్చు నేను చెప్పేదల్లా ఒకటే. దుఃఖం ఉన్నది. దుఃఖానికి కారణమున్నది. దుఃఖ నివారణ మార్గమున్నది. మహా సముద్రంలోని నీరంతా ఒకే ఒక రుచికలిగి ఉంటుంది. ఉప్పగా ఉంటుంది. అలాగే నేను చేసే ధర్మబోధ అంతా ఒకే ఒక రుచి కలిగి ఉంటుంది. నిర్వాణ సాధన అనే రుచి కలిగి ఉంటుంది''. అన్ని మతాలు (supernatural religions) మానవుడ్ని దేవుడి చేతిలో పాచికగా భావిస్తాయి. సద్ధర్మం (బౌద్ధం) అలా కాక, మానవుడు తన భవిష్యత్తుకు తానే కర్త అనే ప్రాతిపదిక మీద బోధ చేస్తుంది. ఇతర మతాలన్నీ అతీతశక్తి, తెలియని శక్తి ముందు మోకరిల్లాలని చెబుతాయి. ఈ తెలియని అదృశ్య శక్తి బలహీనులను భయపెడుతుంది. సద్ధర్మం అలా కాకుండా మానవుడ్ని సర్వ స్వతంత్రుడ్ని చేస్తుంది. నిజమైన మతం స్వయం కృషి, ఆత్మ నిగ్రహం, వ్యక్తి సంస్కారం ద్వారా మానవుడు ఈ అత్యున్నత స్థితికి చేరుకోగలడనే విశ్వాసం కలిగిస్తుంది. మానవాతీత శక్తులపై ఆధారపడని విశ్వజనీన మతం (cosmic religion) బౌద్ధం. ఐన్‌స్టీన్ ఆశించిన కాస్మిక్ రెలిజియన్ లక్షణాలన్నీ బౌద్ధంలో ఉన్నాయని ఈ గ్రంథం ద్వారా గ్రహించగలం. ఆధునిక విజ్ఞాన శాస్త్ర వేత్తలు అంగీకరించే మత భావనకు సన్నిహితమైంది బౌద్ధం. అదే ఆధునిక బౌద్ధుడి మతంగా మనం భావించవచ్చు. బౌద్ధం దేవుడ్ని నిరాకరిస్తుంది, ఆత్మను నిరాకరిస్తుంది, మరి అటువంటప్పుడు దాన్ని మతమని ఎందుకు పిలవాలనే ప్రశ్నకు సంతృప్తి కరమైన సహేతుక సమాధానమే ''రెలిజియన్ ఆఫ్ ద మోడ్రన్ బుద్ధిస్టు.''

బౌద్ధానికి, సైన్సుకు గల సంబంధాన్ని చర్చించిన గ్రంథ రచయిత, హిందూ మతానికి, బౌద్ధ ధర్మానికి గల ప్రధాన వ్యత్యాసాల్ని కూడా విశ్లేషించారు. ఆధునిక హిందూ మత ప్రతినిధులైన రామ కృష్ణ పరమహంస, స్వామి వివేకానందల అభిప్రాయాల్తో విభేదిస్తూ, హిందూ మత మంటే వర్ణాశ్రమ ధర్మమేనని స్పష్టం చేశారు. ఆధునిక హిందూ మత ప్రతినిధుల దృష్టిలో బుద్ధుడు దయాసాగరుడు, బౌద్ధులు దుష్టులు. ఈ అభిప్రాయంతో ప్రొ॥ పి. లక్ష్మీనరసు తీవ్రంగా విభేదించారు. బౌద్ధంలో తర్వాత కాలంలో ఎన్ని మార్పులయినా జరిగి ఉండవచ్చు, కాని దాని మౌలికాదర్శంలో ఎటువంటి మార్పులేదు. వివేకానందుడు తన సమకాలిక బౌద్ధుల్లో (శ్రీలంక బౌద్ధులు) కనిపించిన కొన్ని అలవాట్లను చూసి నిర్ఘాంతపోయాడు. వాటిని తీవ్రంగా ఖండించాడు. అంతవరకు ఎవరికీ అభ్యంతరం ఉండదు. కాని బౌద్ధులందర్నీ నిరసించడం సరియైనదికాదు. భిక్షు బౌద్ధాన్ని (Monastic Buddhism) లక్ష్మీ నరసు కొన్ని సందర్భాలలో నిశిత విమర్శకు గురించేశాడు. కాని బౌద్ధులందర్నీ తప్పుపట్టడం ప్రొ॥ పి. లక్ష్మీనరసు సహించ లేక పోయారు. అదే విధంగా ప్రాచీన హిందూ మతం ప్రాచీన బౌద్ధమతం జీవలక్షణం (స్పిరిట్) లోనూ, లక్ష్యాలలోనూ ఒక్కటే అనే అభిప్రాయంతోనూ లక్ష్మీనరసు ఏకీభవించలేదు. వైదిక నాగరికతకు, బౌద్ధ జీవ విధానానికి ఎటువంటి సామ్యం లేదని, యజ్ఞాల్ని, కర్మకాండల్ని బుద్ధుడు తీవ్రంగా ప్రతిఘటించాడు. ఆ ప్రభావం వల్ల వైదిక మతంలో రెండు ధోరణులు తలెత్తాయని అవి - కర్మమార్గం, జ్ఞానమార్గం. జ్ఞాన మార్గం ఉపనిషత్తుల రూపం తీసుకున్నదని; ఏ ఉపనిషత్తయినా బుద్ధుడికి పూర్వపుదని చెప్పడానికి వీలు లేదంటారు లక్ష్మీ నరసు. హిందూయిజంలో తర్వాత కాలంలో వచ్చిన అనేక మత సంస్కరణోద్యమాలకు ఉపనిషత్తులే కారణ

మంటారాయన. కాని బుద్ధుడికి పూర్వం కొన్ని ప్రాచీన ఉపనిషత్తులున్నాయని కొంతమంది చరిత్రకారులు గట్టిగా విశ్వసిస్తున్నారు. బుద్ధుడికి పూర్వపు ప్రాచీన భారతీయ దర్శనంలో ఉపనిషత్తులు ప్రధానమైనవంటున్నారు వీరు. ఈ విషయంపై భారతీయ తత్వ శాస్త్ర చరిత్రకారుల్లో భిన్నాభిప్రయాలున్నాయి. ప్రొఫెసర్ పి. లక్ష్మీనరసు హిందూ మతాన్ని ''వర్ణాశ్రమ ధర్మం'' (అసమానతలకు నిలయం)గా, బౌద్ధ మతాన్ని ''రిపబ్లిక్ ఆఫ్ రెలిజియన్'' (సర్వ సమానత్వ మతం)గా చాలా స్పష్టంగా నిర్వచించారు.

హిందూ పురాణాలలో బుద్ధుడ్ని (బుద్ధావతారాన్ని) గౌరవప్రదంగా చిత్రించలేదని, బ్రాహ్మణాధిపత్యాన్ని పునః స్థాపించడంలో భాగంగానే బుద్ధావతార భావన సృష్టించబడిందని ప్రొ॥పి. లక్ష్మీ నరసు పౌరాణిక సాహిత్య విశ్లేషణతో నిరూపించారు. హిందూ మతంలో కలిసి పోవడానికి ప్రతిఘటించిన బౌద్ధుల్ని ''అనాచారులు''గా ఛాందస హిందువులు నిషేధించారని, ప్రాచీన తమిళ నిఘంటువుల్లో ''శాక్య'' (బుద్ధుడి వంశం పేరు), ''పరయ'' (అస్పృశ్యుడు) కు సమానార్థకమయిందని బుద్ధావతారాన్ని గుర్చి రాసిన అధ్యాయంలో ఆయన వివరించారు.

ప్రాచీన బ్రాహ్మణ దర్శనానలలో శంకరాద్వైతం, బౌద్ధమాధ్యమిక దర్శనానికి అతి సన్నిహిత దర్శనంగా చెబుతూ, వేదాంత దార్శనికులు మధ్వ (ద్వైతం), రామానుజ (విశిష్టాద్వైతం), వల్లభాచార్యులు (శుద్ధా ద్వైతం), శంకరాద్వైతాన్ని (వేదాంతంపై శంకరభాష్యాన్ని), ''ప్రచ్ఛన్న బౌద్ధం'' (Buddhism in disguise) సరిగానే చిత్రించారని ప్రొ॥ పి. లక్ష్మీనరసు భావించారు. ఈ ముగ్గురు వేదాంత దార్శనికుల అభిప్రాయం ప్రకారం బ్రహ్మసూత్ర గ్రంథ రచయిత తాత్వికంగా పరిణామవాది; ఆయన వివర్త వాదికాడు. ఆది వేదాంతంలోని వాస్తవిక వాద ఛాయల్ని శంకర భాష్యం తొలిగించింది.

ప్రస్తుత కాలంలో ఇండాలజిస్టులు (భారత విషయ పరిశోధకులు) శంకరుడి మాయా వాద సిద్ధాంతంపై బౌద్ధ ప్రభావాన్ని అంగీకరిస్తున్నారని, వాస్తవానికి ఈ విషయాన్ని ఎప్పుడో హిందువులే అంగీకరించారని చెబుతూ పద్మ పురాణ కథనాన్ని, ద్వైత మతాచార్యుడు మధ్వాచార్యుడు అభివర్ణించిన మణిమంతుడునే రాక్షసుడి కథను కూడా ప్రొ॥ పి. లక్ష్మీనరసు పేర్కొన్నారు. ఈ రెండు కథనాలు శంకరాద్వైతాన్ని ప్రచ్ఛన్న బౌద్ధంగానే భావిస్తూ, వేదాంతం ముసుగులో బౌద్ధాన్ని బోధించినట్టుగా భావించాయి.

ప్రస్తుత అద్వైత దర్శానానికి పితామహుడు శంకరాచార్యుడు కాదని, ఆయన పరమ గురువు గౌడపాదుడని, ఆయన సిద్ధాంత రీత్యా బౌద్ధులకు రుణపడి ఉన్నాడని 1930 ప్రాంతాల్లోనే ప్రొ॥ పి. లక్ష్మీనరసు స్పష్టంగా ప్రకటించారు. గౌడపాదుడు భారత చరిత్రలో గొప్ప చింతనా పరులైన అశ్వఘోషుడు, నాగార్జునుడు, అసంగుడు, వసుబంధు, దిగ్నాగ, ధర్మకీర్తిల కాలం తర్వాత జీవించాడు. బౌద్ధంలోని మాధ్యమిక వాదానికి నాగార్జును డెటువంటి వాడో, వేదాంతంలోని కేవలాద్వైతానికి గౌడ పాదాచార్యుడటువంటి వాడు. శంకరాచార్యుడు సన్యాస దీక్షను గోవిందాచార్యుడి నుంచి తీసుకున్నాడని, తాత్విక శిక్షణను గౌడపాదాచార్యుడు నుంచి పొందాడని ఆయన భావించారు. గౌడపాదుడి ''మాండూక్య కారిక'' లో బౌద్ధ పారిభాషిక పదజాలంతో పాటు, బుద్ధుడి ప్రస్తావన కూడా ప్రత్యక్షంగా కనిపిస్తుంది.


ప్రాచీన ఉపనిషత్తులలోని అద్వైతం మృత శిశువు వంటిది. దీనితో బుద్ధుడికి పరిచయం లేదని, ఆయన అద్వయవాదాన్ని కనుగొన్నాడని, గౌడ పాదుడు బౌద్ధ ప్రభావంతో అద్వైతాన్ని పునర్నిర్మించి, పునరుద్ధరించాడని ఆయన వెల్లడించారు. గౌడ పాదుడు బౌద్ధ, వేదాంత దర్శనాల్ని సమన్వయం చేయడానికి ప్రయత్నించాడు. ఆయనలో పరమత ద్వేషం లేదు; తాత్విక పరిణతి గోచరిస్తుంది. శంకరాచార్యుడు గౌడపాదుడి సిద్ధాంతంతో పూర్తిగా ఏకీభవిస్తాడు. ఆయన దర్శనాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తూనే దాని నుండి బౌద్ధచ్ఛాయల్ని తొలగించడానికి విఫలయత్నం చేశాడు. బౌద్ధ సిద్ధాంతాల నుండి ప్రయోజనం పొందుతూనే బౌద్ధులపై, బౌద్ధ దార్శనిక శాఖలపై విద్వేషం వెళ్ళగక్కాడు శంకరాచార్యుడు. గౌడపాదుడి సమన్వయ మార్గంలో శంకరాచార్యుడు నడిచి ఉంటే, భారత తాత్విక వికాసం తీరు తెన్నులు మరో రూపం సంతరించుకొని ఉండేవి.

ఈ గ్రంథంలోని వివిధ అధ్యాయాల్లో చర్చించని విషయాలు ఆధునిక బౌద్ధుడి జీవన విధానానికి సంబంధించినవి. ఆధునిక బౌద్ధుడు బాధ్యతాయుతమైన, అర్థవంతమైన, ఆనందదాయక జీవితం గడపటానికి ఉపకరించే అనేక విషయాల్ని శాస్త్ర విజ్ఞానం, సద్ధర్మం మేళవింపుతో వినూత్న దృష్టితో పరిశీలించారు. బుద్ధిలో, హృదయంలో పరిపూర్ణమైన మార్పు రానిదే ఎవరికీ బౌద్ధుడ్నని చెప్పుకొనే అర్హత లేదంటారు ప్రొ॥ పి. లక్ష్మీ నరసు. ఈ గ్రంథం ఒక చైనా రాజనీతిజ్ఞుడు-కవికి ఒక బౌద్ధ ప్రాజ్ఞుడితో సద్ధర్మం (బౌద్ధం) లో మిక్కిలి ఆవశ్యకాంశమేది (most essential) అనే ప్రశ్నకు ఆ బౌద్ధ ప్రాజ్ఞుడు చెప్పిన సమాధానంతో ముగుస్తుంది. బౌద్ధం పైకి ఎంత సంక్లిష్ట దర్శనంగా, జీవన విధానంగా కనిపించినా, నిజానికది చాలా సహజమైన 'మానవాదర్శంగా' చైనా జ్ఞాని చెప్పిన మాటలు నిరూపిస్తున్నాయి. చైనా రాజనీతిజ్ఞుడు-కవికి బౌద్ధ ప్రాజ్ఞుడు చెప్పిన సమాధానం ఇది : ''అన్ని చెడు పనులను విసర్జించటం; మంచి పనులను ఆచరించటం.'' బౌద్ధంలో అంత ప్రసిద్ధిచెందిన ఆ బౌద్ధ జ్ఞాని చెప్పిన, అతి సామాన్య సమాధానం విని చైనా రాజనీతిజ్ఞుడు దిగ్భ్రాంతికి గురయి తీవ్రంగా స్పందిస్తూ, మూడు నెలల పసిపిల్ల వాడికి కూడా ఈ విషయం తెలుసునని అవహేళన చేస్తాడు. అప్పుడు బౌద్ధ ప్రాజ్ఞుడు ఇలా స్నేహ పూర్వక సమాధానం చెబుతాడు: ''మూడు నెలల పసిపిల్లవాడికి కూడా నేను చెప్పిన విషయం తెలిసి ఉండవచ్చు. కాని తల నెరిసిన 80 ఏళ్ళ వృద్ధుడికి కూడా బుద్ధుడి బోధనల్ని నిత్య జీవితంలో ఆచరణలో పెట్టడం చాలా కష్టం.'' ఇటువంటి సంభాషణతోనే ప్రొ॥ పి. లక్ష్మీ నరసు ''బౌద్ధం అంటే ఏమిటి?'' అనే పుస్తకాన్ని ముగిస్తారు. ఇది పునరుక్తి (repetition) గా కొంతమందికి తోచవచ్చు. కాని ఒక లక్ష్యంతో జీవించి గ్రంథ రచన చేసిన వాళ్ళెవరయినా, తమ లక్ష్యానికి ఉదాహరణ ప్రాయంగా నిలిచే విషయాల్ని తమ ప్రతి రచనలో నొక్కి చెప్పాలను కున్నప్పుడు సందర్భోచితమైన పునరుక్తి (''ఒక విషయాన్ని ఒకటికి రెండు సార్లు చెప్పడం'') ని ఉపయోగించుకుంటారు. ఒక ఉన్నతమైన లక్ష్యానికి కట్టుబడ్డ వాళ్ళ రచనల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ముఖ్యమైన విషయాల్ని శక్తివంతంగా చెప్పడంలో భాగంగా పునరుక్తులు అనేకం కనిపిస్తాయి. ఇది దోషం కాదు. కొన్ని సమయాల్లో ఆ పునరుక్తులే వాళ్ళ జీవితాదర్శాలుగా మనం భావించుకోవాలి. దీన్ని ఆధునిక మనో విజ్ఞానశాస్త్ర పరిభాషలో ''అబ్సెషన్'' (స్థిరభావం) అంటారేమో! జీవితంలోని

జయాపజయాల్ని అశాస్త్రీయ కొలబద్దలతో విశ్లేషిస్తూ, ప్రతి ఉన్నత భావాన్ని మానసిక రుగ్మతగా భావిస్తున్న నాసిరకం సమకాలిక మనోవిజ్ఞాన శాస్త్ర వేత్తలకు తమకు అర్థంకాని ప్రతి విషయం ఒక మానసిక సమస్యేకదా! అందువల్ల వాళ్ళ విశ్లేషణల్ని ఎరిక్ ఫ్రామ్ చెప్పిన Patholagy of Normalcy కి ఉదాహరణలుగా భావించి వదిలేద్దాం. సమాజంలో మంచిని, మానవత్వాన్ని పెంచి పోషించగలిగిన ''స్థిరభావాలు'' ఎప్పుడూ అవసరమే.

ఈ గ్రంథం సంపాదకత్వం గురించి రెండు మాటలు చెప్పుకోవాలి. గ్రంథ రచయిత మరణించిన ఏడు దశాబ్దాల తర్వాత ప్రచురించబడుతున్న గ్రంథాన్ని ఎంత ప్రణాళికా బద్ధంగా ప్రచురించాలో అంత ప్రణాళికా బద్ధంగా ప్రచురించారు. దాదాపు విస్మృతి పథంలో మరుగున పడిపోయిన ప్రస్తుత గ్రంథ రచయిత: ప్రొఫెసర్ పోకల లక్ష్మీ నరసు గురించి ''ఒక ఆధునిక బౌద్ధుడు'' (A Modern Buddhist) పేరుతో మంచి పరిచయ వ్యాసం రాశారు. జి అలయ్ సియస్. ప్రస్తుత వ్యాస రచయిత (టి. రవిచంద్) ఒక దశాబ్దం క్రితం ప్రొ॥ పి. లక్ష్మీ నరసు పై పరిశోధన చేసి రాసిన వ్యాసాంశాల్ని పూర్తిగా జి. అలయ్‌సియస్ పరిచయ వ్యాసంలోని విషయాలు బలపరుస్తున్నాయి. అందుకు ప్రస్తుత వ్యాస రచయితకు చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో పనిచేస్తూ, పరిశోధన చేసే వారికి ఉన్న వనరులు, అవకాశాలు, నాన్ - ఎకడమిక్ పరిశోధకులకు ఉండవు. ఏది ఏమయినా తమకు వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకొంటూ ఇటువంటి మంచి పరిశోధనలు చేస్తున్న ఈ గ్రంథ సంపాదకుడు అలయ్‌సియస్‌కు అభినదంలను తెలియ చేస్తున్నాను. అదే సమయంలో నా దృష్టికి వచ్చిన రెండు పొరపాట్లను మీ దృష్టికి తెస్తున్నాను. ఈ గ్రంథంలో గౌడపాదుడనే దార్శనికుడి పేరు వచ్చిన ప్రతి చోటా గండపాదుడనే పేరుచోటు చేసుకున్నది. ఇది కేవలం అచ్చులో తప్పుగా కనిపించటం లేదు. పుస్తకానికి చేర్చిన ఇండెక్సు (అకారాది సూచీ సంఖ్య) లో కూడా గండపాదుడనే ఉంది. దీని సంపాదకులు జి. అలయ్ సియస్‌కు తత్వ శాస్త్రంతో పరిచయం ఉన్నట్లు కనిపించటం లేదు. కాని గ్రంథ సంపాదకుడికి పాలీ, సంస్కృత భాషాపదాల్ని సాధారణ పాఠకుల (non-technical readers) కోసం ప్రామాణీకరించడానికి, సరళీకరించడానికి సహాయపడిన బౌద్ధాచార్యుడు ప్రొ॥ సంఘసేన్ సింగ్ దృష్టికి కూడా ఈ పొరపాటు కనిపించ లేదా అని ఆశ్చర్యం కలుగుతుంది. ఈ పుస్తకం చదివే పాఠకులు గండపాదుడికి బదులుగా గౌడపాదుడని చదువుకో గలరని ఆశిస్తున్నాను. డెబ్బయి సంవత్సరాల తర్వాత ప్రథమంగా ప్రచురిస్తున్న గ్రంథంలో చాలా చోట్ల అనవసరమైన వివాదం (needlessly polemical) పేరుతోకొన్ని వాక్యాల్ని తొలగించడం సహేతుకంగా కనిపించటం లేదు. ద్వితీయ ముద్రణ సమయంలో నయినా తొలగించిన వాక్యాల్ని చేర్చడం బాగుంటుంది.

పరిచయం చేసిన గ్రంథం వివరాలు : గ్రంథం పేరు : ''రెలిజియన్ ఆఫ్ ద మోడరన్ బుద్ధిస్టు'' గ్రంథకర్త పేరు : పి. లక్ష్మీ నరసు; సంపాదకుడు : జి. అలయ్ సియస్; ప్రచురణ : వర్డ్‌స్మిత్స్, ఢిల్లీ, 2002.



సజీవ విశ్వాసంగా బుద్ధుడు ఉపదేశించినది నిజమైన ప్రేమ, మానవుని పట్ల ప్రేమ. బౌద్ధం అణగ దొక్క బడినప్పుడు భారత దేశం మతపరంగా ఆత్మహత్య చేసుకుంది.

- మహాకవి గురజాడ,

(సేకరణ : కుమారి టి. మిళిందపూర్ణ)

# బుద్ధుడు హిందువా? బౌద్ధం హిందూ మత శాఖా?

– అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

ఎవడైనా శత్రువును నిర్జించడానికి రెండు వ్యూహాలను పన్నుతాడు. ఒకటి శత్రువును తరిమి వేయడం, మట్టు బెట్టడం; లేదా తనలో సంలీనం చేసుకొని తన వాడని చెప్పుకోవడం రెండవ పద్ధతి. హిందూ మతం బౌద్ధం యెడ ఈ ద్విముఖ వ్యూహాల్ని అనుసరించింది.

భారత దేశం నుంచి బౌద్ధాన్ని తరిమి వేయడం మహా నేరమని, దానిని అణచివేయడం, ఆత్మహత్యా సదృశమని, బౌద్ధం అంటే అభిమానమున్న పెద్దలు అంటే, కొందరు భారత దేశం నుంచి బౌద్ధం ఎక్కడికీ పోలేదు, భారతంలో అంతర్భాగంగా ఉంది అన్నారు. 'బౌద్ధం భారత దేశంలో అంతర్భాగం అన్నవారు 'బౌద్ధం ప్రాథమిక దార్శనిక విషయాలు ఏ విధంగాను హిందూ మత సంస్కృతిలో ఇమడవని గ్రహించకనే అలా అన్నారు.

కపిలుడు అవైదికుడు, సమణుడు. అతడి సాంఖ్య దర్శన మూలాలు వేదాలలో లేవు. అయినా అతణ్ణి నాస్తికుడైన హిందువుగా పరిగణించింది హిందూ మతం. కపిలుని మీద హిందూ ముద్రవేసినట్లుగానే బుద్ధుని మీద తన ముద్ర వేయాలని ప్రయత్నించింది హిందూ మతం. కాని బుద్ధుడు అంత తేలికగా మింగుడు పడలేదు. గత్యంతరం కానక, 'ద్విసంవేగ స్థితి సిద్ధాంతాన్ని (theory of ambivalence) ప్రయోగించారు. ఏకంగా ఒకేమాటు, ఒకే వ్యక్తి పై రాగద్వేషాలను కురిపించడం. దీనిలో భాగంగా బుద్ధుని ప్రశంసలతో ముంచెత్తారు. దూషణలతో నిరసించారు. దశావతారాల్లో విష్ణువు అవతారం చేసి ఒక ప్రక్క గొప్పగా చూపిస్తూ, మరో ప్రక్క ఆ దేవతావతారంలో బుద్ధుని చేత అతి హేయమైన పని చేయిస్తారు. (త్రిపురాసుర కాంతలు నగ్నంగా వచ్చి రావిచెట్టును కౌగిలించు కొన్నప్పుడు, ఆ చెట్టు బుద్ధుడవుతుంది).

వివేకానందుడు బుద్ధుని అసాధారణంగా పొగిడాడు. ''బుద్ధుడు మైత్రిని దశ దిశల ప్రసరింపజేశాడు. నేను ఆయనకు సాష్టాంగ ప్రమాణం ఆచరిస్తాను. అంతేకాదు అతడు నా యిష్ట దైవతం. అతడు ఏ దేవుడిని బోధించలేదు. అసలు అతడే దేవుడు. దానినే పూర్తిగా విశ్వసిస్తాను.''[1] ''బుద్ధుడు అత్యంత గొప్ప హిందూ రుషి, తాత్వికుడు, వేదాంతి, కర్మయోగి, ఈ భూమి మీద నడయాడిన ఒకే ఒక దేవుడతడు'' అన్నాడు వివేకానందుడు. బుద్ధుని భావాలకు హైందవం ఎంతగానో రుణ పడి ఉందని, అంతకుముందు ఏ హిందువు అంగీకరించని నగ్న సత్యాన్ని బాహాటంగా అతడు అంగీకరించాడు. అదే ధోరణిలో బ్రాహ్మణులు బుద్ధుని చుట్టూ పుక్కిటి పురాణాన్ని అల్లి అతన్ని అవతారం చేయడాన్ని పరిహసించాడు. కాని ఇతడు బౌద్ధాన్ని గౌరవించలేదు. బుద్ధుని శ్లాఘిస్తూ రాధాకృష్ణన్ ఇలా అంటాడు: ''ప్రాచ్యదేశాల నుంచి వచ్చిన వారిలో గౌతమ బుద్ధుడు మహామేధావి. మానవ జాతి ఆలోచనను, జీవితాన్ని అత్యంతంగా ప్రభావితం చేసిన వారిలో ఆయనకు ఆయనే సాటి. ఒక ధర్మ సంప్రదాయాన్ని నెల కొల్పడంలో అతడు అందరికీ పవిత్రుడయ్యాడు. ఆ ధర్మ ప్రభావమూ, విస్తృతీ, ఏ ఇతర ధర్మంకంటె తక్కువవి కావు. అతడు విశ్వ చింతన చరిత్రకు చెందిన వాడు. సంస్కారవంతులైన మానవులందరికీ వారసుడాయన. అతని బౌద్ధిక సమగ్రత, ధార్మిక అభినివేశం, అంతర్దృష్టులను బట్టి చూస్తే నిస్సందేహంగా అతడు ప్రపంచ చారిత్రక పురుషులకే మహా మహుడు.''[2]

రాధాకృష్ణ పండితుడు గూడ 'బుద్ధుడు మంచివాడే కాని బౌద్ధం కాదు' అనే ధోరణిని అవలంబించాడు.

కాని వివేకానందునికి భిన్నంగా, కొన్ని సనాతన హిందూ గ్రంథాలు బుద్ధుని బర్బరు (barbarian) అన్నాయి, ఛండాలుడన్నాయి. అనార్యుడు, శూన్యవాది అని నిందించాయి.

ఈ దూషణ భూషణలు ఎలా ఉన్నా వివేకానందుడు, రాధాకృష్ణ పండితుడు బుద్ధుని హిందువుగా పరిగణించారు.

''బుద్ధుడు కర్మయోగి, హిందూ ద్రష్ట, వేదాంతి'', అని వివేకానందుడు పేర్కొంటే, రాధాకృష్ణ పండితుడు ''బుద్ధుడు హిందువుగా పుట్టాడు, హిందువుగా ఎదిగాడు, హిందువుగా మరణించాడు''[3] అన్నాడు. అంతే కాదు, ''బౌద్ధం దాని పుట్టుకలో హిందూ వాదం నుంచి మొలకెత్తింది.''[4] ''తొలి బౌద్ధం అంటే నూతన కోణం నుంచి ఉపనిషత్తులను తిరిగి చెప్పడమే.''[5] ''బుద్ధుడు కేవలం హిందూ సంస్కరణ వాది మాత్రమే. అతనికి మౌలిక భావనలు లేవు. అవన్నీ సనాతన ధర్మం నుంచి, విశ్వాసం నుంచి గ్రహించినవే''[6] అన్నాడు రాధాకృష్ణ. ఇటువంటి భావనలు వెలుబుచ్చిన వారు రాధాకృష్ణ మాత్రమే కాదు, వివేకానందుడే కాదు, ఆనంద కెంటిష్ కుమార స్వామి, పాండురంగ వామన కాణేలు ఇంకా ఇతర ఆధునిక బ్రాహ్మణ హిందువులు ఉన్నారు.

అసలు ఇలాంటి భావాలు పుట్టడానికి దోహదం చేసింది, ''అంతా వేదోపనిషత్తులలోనే ఉంది. వాటిల్లో లేనిది ఎక్కడా లేదు. వాటిల్లో లేనిది ఏదీ పూర్ణం కాదు, సత్యం కాదు'' అనే భావన. 'బుద్ధుడు హిందూ సన్యాసి', 'హిందువుగా పుట్టాడు, పెరిగాడు, మరణించాడు', అని వివేకానందుడు, రాధాకృష్ణ, వారెంతగొప్పవారైనా కానీ, అన్నంత మాత్రాన మనం డూడూ బసవన్నలలా తలలూపడమేనా?

చారిత్రకంగా చూసినట్లయితే, ముస్లిమ్‌లు భారతదేశంలో కాలూనక ముందు అసలు 'హిందూ' పదమే లేదు. ముస్లిమ్‌లు కాఫిర్‌లను వేరుగా చెప్పడానికి సింధ్ వాసులను హిందువులన్నారు. నేటి హిందువులు తమ మతాన్ని నాటి సనాతన వైదిక - బ్రాహ్మణ ధర్మం కొనసాగింపుగా చెప్పుకోవచ్చు గాక. అంత మాత్రాన, బుద్ధునికి ముందు ఆపదం వినని వారికి, తెలియని వారికి, దానిని అంటగట్టడం అన్యాయం, అచారిత్రకం. అభారతీయమైన 'హిందూ' పదం కంటె 'వేదాంతం' పదం మంచిదని వివేకానందుని అభిప్రాయం. అలాంటప్పుడు ''బుద్ధుడు హిందువుగా పుట్టాడనే'' రాధాకృష్ణ పండితుని మాట అర్థరహితం. భారతీయ చరిత్ర, సంస్కృతుల మీద రాధాకృష్ణన్‌కు అవగాహన లేక రాసింది కాదు, కావాలని రాసిన రాత.

అసలు బుద్ధుని కాలంలో హిందువులు భారత దేశంలోనే కాదు. ఈ భూమి మీద ఎక్కడా లేరు. ఉన్నది స్వదేశీయులే. వీరి సంఖ్య వైదిక ఆర్యులకంటె ఎన్నో రెట్లు ఎక్కువ. పైగా ఆరోజుల్లో శ్రమణ సంప్రదాయం ప్రబలంగా ఉంది. ఇది వేదాలకు ముందునుంచే ఉంది. ఈ సంప్రదాయం రూపు దిద్దుకోవడానికి అనార్యులు, ప్రాగార్యులు కారణం. బుద్ధుని కాలంలో బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో ఇంకా ఆర్యీకరణం, బ్రాహ్మణీకరణం జరగకముందే శంకావాదం, అతి శంకావాదం (nihilism), భౌతిక వాదం, శాశ్వత వాదం లాంటి వాదాలు బాగా ప్రచారంలో ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే ఉపనిషత్తులలో కొన్ని అవైదికాలుగా ఉన్నాయంటే ఆశ్చర్య పడనవసరం లేదు.

బుద్ధుడు శ్రమణ సంప్రదాయానికి చెందినవాడు. అతనిని మహాసమణుడన్నారు. అతడు ఏ వేద రుషి దగ్గర వేదం చెప్పుకోలేదు. అతడి గురువులు ఆలారకాలామ, ఉద్దకరామ పుత్రులు. వీరిద్దరు శ్రమణ సంప్రదాయానికి చెందిన సాంఖ్యాన్ని చెప్పారు. సాంఖ్యం అవైదికమని దాని మూల పురుషుడు కపిలుడని ముందే చెప్పాం. ఇహ పోతే, ''బుద్ధుడు కొత్తగా చెప్పింది ఏమీ లేదు. అంతా ఉపనిషత్తులలో

ఉన్నదానినే కొత్త కోణం నుంచి తిరిగి చెప్పాడు'', అనే రాధాకృష్ణ మాటలను చూద్దాము. ''బుద్ధుని ఉపనిషత్తులు ప్రభావితం చేశాయి'', అనే పూర్వ నిశ్చితాభిప్రాయానికి వచ్చి, దానిని సమర్ధించడానికి ఎన్నో వ్యయ ప్రయాసలు పడ్డారు, రాధాకృష్ణ, వివేకానందులు. ఈ విషయాన్ని ప్రతాప చంద్రసాకల్యంగా చర్చించారు.[7]

అసలు ఉపనిషత్తులు ఎప్పటివి? బుద్ధుడు ఎప్పటివాడు? ఎవరు ముందు? ముందు వెనకల మాట అటువుంచి ఈ ఇద్దరి మధ్య (బుద్ధుని - ఉపనిషత్తుల మధ్య) ఏమైనా చింతనా పరమైన ఆదానాలు ప్రదానాలు జరిగాయా? అని గూడ పరిశీలించాలి.

అసలు మొత్తం ఉపనిషత్తులు ఎన్నో ఎవరికీ తెలియదు. కానీ అవి 108 అంటూ ఉంటారు. వాటిలో ముఖ్యమైనవి 11 అని కొందరు, 13 అని కొందరు (Hume) అంటారు. అవి బృహదారణ్యక, ఛాందోగ్య, ఐతరేయ, తైత్తిరీయ, కేన, కఠ, ముండక, శేత శ్వతర, కౌషీతకి, ఈశోపనిషత్తులు. ఈ పదకొండింటిలో గూడ రెండు మాత్రమే- బృహదారణ్యక, చందోగ్య ఉపనిషత్తులు- ఇంకొంత ప్రాచీనాలంటారు. ఈ రెండూ క్రీ.పూ. 500ల ప్రాంతనాకి చెందుతాయి. అంతకంటె ముందుకు పోవు. మిగతావి క్రీ.పూ. 400 - 200 ల మధ్య కాలానికి చెందుతాయి. ''ఉపనిషత్తు లేవీ క్రీ.పూ. ఆరో శతాబ్దానికి ముందుకు పోవు'', అని A.B. కీత్ 1925లో చెప్పాడు.[8] బ్రాహ్మణాల కాలం ముగియక ముందే దీఘనికాయ సూత్రాల కూర్పు జరిగింది, అని విజెశేఖర చెప్పారు.[9] అయితే వివేకానందుడు ఉపనిషత్తుల కాలాన్ని క్రీ.పూ. 2000 సంవత్సరాలుగ చెప్పాడు.

బుద్ధుడు కాలాన్ని అధికులు క్రీ.పూ. 563-483గా అంగీకరించారు. ఇక్కడ మరో సంగతి ప్రస్తావించాలి. పాళీ బౌద్ధ సాహిత్యం మొత్తాన్ని తిరగవేస్తే ఎక్కడ గూడ ఉపనిషత్తుల ప్రస్తావన గాని, వాటి భావనల పరామర్శగాని, అసలు ఆ పదం ఊసుగాని కనిపించదు. నాటి కాలంలో ఉన్న 62 దృష్టుల (సిద్ధాంతాల)ను ఖండించిన బుద్ధుడు, ఉపనిషత్సిద్ధాంతాలను స్పృశించలేదంటే అవి అప్పటికి లేవనుకోవాలి. ఒక వేళ ఉన్నాయనుకొన్నా వాటి సిద్ధాంతాలు అంతగా ప్రచలితం కాలేదనుకోవాలి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, బుద్ధుడు ఎలాగైతే ఉపనిషత్తుల గురించి మాటాడలేదో, ఉపనిషత్తులు గూడ (బృహదారణ్యక, ఛాందోగ్యాలతో సహా) ఎక్కడా బుద్ధుని గురించి, అతడి బోధల గురించి, త్రిపిటకాల గురించి ఏమీ ప్రస్తావించవు.

బుద్ధుడు తనకు గురువు ఎవరూ లేరని తాను ఎవరి నుంచి ఏమీ గ్రహించలేదని, తన భావాలన్నీ తన స్వంతాలని చెప్పుకొన్నాడు.[10] మజ్ఝమనికాయలో ఇలా ఉంది; ''బుద్ధుడు రాజమార్గాన నడుస్తున్నాడు. తనకు జ్ఞానోదయమైన బోధి వృక్షానికి గయకు మార్గమధ్యంలో ఉండగా, ఉపకుడనే సన్యాసి ఎదురై బుద్ధునితో ఇలా అన్నాడు :

'మీ ఇంద్రియాలు స్వచ్ఛంగా ఉన్నాయి..... మిత్రమా మీరు ఎవరి దగ్గర దీక్ష గ్రహించారు? స్నేహితుడా ఎవరు మీ గురువు? ఎవరి సిద్ధాంతాన్ని మీరు ప్రచలితం చేస్తున్నారు?'

బుద్ధుడు ఇలా సమాధానం చెప్పాడు: అన్నింటిని జయించాను. నాకు అంతా తెలుసు. అన్నింటి నుంచి వియోగం పొందాను. అన్నింటిని పరిత్యజించాను. తృష్ణనాశంలో నేను పూర్తిగా మునిగి ఉన్నాను - అంటే అర్హంతత్వం పొందాను. నా అంతట నేను అన్నీ గ్రహించాక నేను ఎవరిని గురువని చెప్పను? నాకు గురువు లేడు. నాకు సముడైన వాడు లేడు. దేవతలతో సహా ఈ ప్రపంచంలో నాకు ప్రత్యర్థి లేడు. ఈ ప్రపంచంలో నేను అర్హతుడను.

నేనొక్కడినే సమ్యక్సంబుద్ధుడను
ప్రశాంతుడను, సాంత్వుడను నేనే
ధర్మ చక్ర సంస్థాపనార్థం నేను కాశీ వెడుతున్నాను.
ఈ అంధ ప్రపంచంలో మరణ రహిత మృందగాన్ని నేను వాయిస్తాను.''[11]

అలాంటప్పుడు బుద్ధుడు ఉపనిషత్తుల నుంచి ఏదో గ్రహించాడనడం అన్యాయం.

"Buddha was restating with a new emphasis, the ancient ideals of indo-Aryan Civilisation[12] అన్నాడు రాధాకృష్ణన్. ''ఇండో - ఆర్యన్ ఆదర్శాలను పునరుచ్ఛరించాడే తప్ప బుద్ధునిలో కొత్తది ఏదీలేదు'' అనే ప్రతిపాదనను ఎలాగైన సమర్థించుకోవాలి. దీనికి వివేకానందుడు, అతడి ననుసరించి, రాధాకృష్ణ, కాణేలు సంయుత్త నికాయంలోని ( నిదాన వగ్గ, నిదాన సంయుత్త నగరసుత్త) ఒకపాతాన్ని మసి పూసి మారేడు కాయ చేసి తమ వాదనకు అనుకూలంగా మార్చుకొన్నారు: నిదాన వగ్గలో బుద్ధుడు తాను తనపూర్వులు నడిచిన బాటలోనే నడిచానన్నాడు. కాని వీరు ''పూర్వులు నడిచిన బాట'' కు విపరీతార్థం తీశారు. బుద్ధుని పూర్వులు ఎవరు? మన బుద్ధుని కంటే పూర్వం ఉన్న బుద్ధులు ( పుబ్బకెహి సమ్మాసంబుద్ధేహి) వారు అష్టాంగ మార్గాన్ని అనుసరించారు. వారు అనుసరించిన అష్టాంగ మార్గాన్నే (పురాణ మార్గాన్ని) తాను అనుసరించానని బుద్ధుడు చెప్పు కొన్నాడు.[13] ఇక్కడ పూర్వులు నడిచిన బాట అంటే ఇండో - ఆర్యన్ ఆదర్శాల బాటగా అది ఉపనిషత్తుల బాటగా తమ కనుకూలంగా వీరు వ్యాఖ్యానించుకొన్నారు. ''పూర్వులు'' పదానికి వేద - బ్రాహ్మణ - ఉపనిషత్ రుషులుగా వ్యాఖ్యానించారు. కాని బౌద్ధ సంప్రదాయం చెప్పేది ఏమంటే, పూర్వులంటే శాక్యమునికి ముందు బుద్ధత్వాన్ని పొందిన సమణులు, మునులు అని. అయినా వేద బాహ్యుడైన బుద్ధుడు వేద రుషుల బాటలో నడుస్తానని ఎలా చెప్పుకొంటాడు? వివేకానందుడు బౌద్ధ మూలాలకెళ్ళి, అధ్యయనం చేసిన తాత్వికుడు (grass root philospher) కాడు. అందుకని ఆయన ఏదో చెప్పాడంటే అర్థం ఉంది. అదే రాధాకృష్ణన్ చెప్పాడంటే.... బుద్ధుణ్ణి అతని శిష్యులు, అనుయాయులు సరిగా అర్థం చేసుకోలేదు. బుద్ధుని బోధలను తప్పుగా వ్యాఖ్యానించారు.'' అని వివేకానందుడు అన్నాడు.[14] ఇది బుద్ధుని శిష్యులపై దారుణమైన ఆరోపణ. వాళ్ళు బుద్ధుణ్ణి సరిగా అర్థం చేసుకోకుంటే ఆధునిక హిందువులైన వివేకానందుడు, రాధా కృష్ణన్‌లు బుద్ధుణ్ణి సరిగా అర్థం చేసుకొన్నారని మనం భావించాలా? వాళ్ళు సరిగా అర్థం చేసుకొని ఉంటే - ఆ అర్థం, హిందూ పరమార్థం - రెండూ ఒకటే అయి ఉండేవని వివేకానందుని నిశ్చితాభిప్రాయం.

పై విషయం చదివిన వారికి ఎవరికైనా ఇట్టే తట్టే ప్రాథమికమైన ప్రశ్న ఏమిటంటే, బుద్ధుని బోధలను, బుద్ధుని శిష్యులు, అనుయాయులు కాకపోతే వివేకానందుడు గొప్పగా అర్థం చేసుకొన్నాడని మనం భావించాలా? ఆనందుడు, సారిపుత్రుడు, మహాకాశ్యపుడు, నాగసేనుడు, నాగార్జునుడు, బుద్ధఘోషుడు, వసుబంధు, ధర్మకీర్తి, శాంతిదేవుడు, శాంత రక్షిత లాంటి బౌద్ధ ఆచార్య పరంపర బౌద్ధాన్ని, బుద్ధుని బోధనలను అపార్థం చేసుకొంటే వివేకానందుడు సరిగా అర్థం చేసుకొన్నాడని మనం భావించాలా? ఇది మహాదారుణం.

అసలు విషయానికి వద్దాం. ఏ అర్థంలో శాక్యముని హిందువు అవుతాడు? సృష్టికర్త అయిన దేవుడు లేడన్నవాడు, అపరివర్తనీయ శాశ్వతాత్మను లేదన్నవాడు, నిర్వాణానికి శాశ్వతాత్మ ఆటంకం

అన్నవాడు, వేదాధికారాన్ని ధిక్కరించినవాడు ఎలా హిందువు అవుతాడు? బౌద్ధానికి 'అనీశ్వరవాదం' అనాత్మవాదాలు ఆయువు పట్టులు. ఇవి హిందువులకు దాటరాని అడ్డుగోడలు.

బుద్ధునికి ఈ ప్రపంచం నిత్య పరివర్తితం అంటే అనుక్షణం మారుతూ ఉంటుంది. ఈ మారే ప్రపంచం వెనుక మారనిది (బ్రహ్మన్) ఏదీ లేదు.

''ఈ ప్రపంచానికి వెలుపల, దీనికి ఆధారమైందీ, ఆశ్రయమైందీ మరొకటి ఏదీ లేదు. ఈ ప్రపంచం సర్వసమృద్ధం, సర్వస్వతంత్రం. తనకు తానే ఆధారమైంది'' అన్నాడు బుద్ధుడు. మరి దీనిని హిందువులు అంగీకరిస్తారా? హిందువులకు ఈ ప్రపంచం మిధ్య, అస్వతంత్రం, బ్రహ్మను ఆశ్రయంగా గలిగి ఉంది.

బుద్ధుని కర్మవాదంలో వ్యక్తికి సంకల్ప స్వేచ్ఛ ఉంది. ఏ కర్మ (పని) చేయాలో, ఏది చేయరాదో ఎంపిక చేసుకొనే స్వేచ్ఛ ఉంది. (All that we are is the product of what we have thought is "We are what we think".) అయితే ఒక పని చేయాలని నిర్ణయం తీసుకొని, ఆ పని చేసిన తరవాత, దాని వల్లవచ్చే ఫలితాలను అనుభవించి తీరవలసిందే. అతడి కర్మకు అతడినే బాధ్యుని చేస్తుంది బౌద్ధ కర్మవాదం.

హిందూ కర్మ వాదం విధివాదం. అంతా ముందుగానే నిర్ణయమై ఉంటుంది. విధి రాతను తప్పించ ఎవడి తరమూ కాదు. ఒకడు మంచి చేయాలా? చెడు చేయాలా? - అనే విషయం గూడ విధే నిర్ణయిస్తుంది. అందుకని, బౌద్ధంలో లాగ, కర్మను ఎంపిక చేసుకొనే సంకల్ప స్వేచ్ఛ, హిందూ మతంలో లేదు.

బుద్ధునికి పూజ, కర్మకాండ, యజ్ఞయాగాది క్రతువులు గిట్టవు. మనిషి పురోగతికి ఇవి (వీటిని పాళీలో సీలబ్బత పరామాస అంటారు) ఆటంకాలంటాడు. అందుకని ఆయన తనను గూడ పూజించ వలదని శాసించాడు. అంతేకాదు ఇక్కడ వరాలిచ్చే దేవుడు లేడు గనుక, వ్యక్తి తరపున లేని దేవునికి సిఫారసు చేసే తాబేదారు (పూజారి) లేడు.

హిందూ మత నిర్వచనంలో పూజా క్రతువు అంతర్భాగం. పూజ, పూజారి లేక హిందూమతం నిలుస్తుందా?

హిందూ మతానికి మరో మూలస్తంభం వర్ణ వ్యవస్థ. దీనిని నిశితంగా విమర్శించి బుద్ధుడు మొదటి సామాజిక విప్లవకారుడయ్యాడు.

హిందువులకు ఆత్మ ఉంటుంది కనుక, అది మారనిది గనుక, మరణానంతరం మరో దేహంలోకి ప్రవేశిస్తుంది. కర్మవిపాకం జరిగితే బ్రహ్మైక్యం చెందుతుంది. ఇది హిందువుల పునర్జన్మ. బౌద్ధంలో ''పునర్జన్మ'' లేదు. ఎందుకంటే ఆత్మ లేదు గనుక. ఉన్నది 'పునర్భవం' మాత్రమే. ఈ స్థితిని హిందువు లంగీకరిస్తారా?

ప్రపంచాన్ని దుఃఖంగా ఎరిగి, దానిని తొలగించడానికి, చతురార్య సత్యాలను, అష్టాంగ మార్గాన్ని, ప్రతీత్య సముత్పాద సిద్ధాంతాన్ని (కార్యకారణ సిద్ధాంతాన్ని), తాను ఎవరి నుంచి, దేని నుంచి గ్రహించక,

తనకై తానే స్వయంగా పరిశోధించి, కనుగొని, ఈ ప్రపంచానికి అందించాడు. ఇటువంటి దానిని మనం హిందూ మతంలో చూడం.

బౌద్ధం మొత్తాన్ని ముచ్చటగా మూడు లక్షణాలతో చెప్పవచ్చు.

సబ్బే సంఖారా అనిచ్చ (All conditioned things are impermanent)

సబ్బే సంఖారా దుఃఖ (All conditioned things are sorrow)

సబ్బే ధమ్మా అనత్త (All dhammas are non-soul)

బౌద్ధం, దాని సారం ఇలా ఉన్నప్పుడు, వీటన్నింటికి వ్యతిరేకమైన హిందూ మతానికి బౌద్ధం ఒక శాఖ ఎలా అవుతుంది? బుద్ధుడు హిందువు ఎలా అవుతాడు? భారత దేశం నుంచి బౌద్ధం ఎక్కడకు తరిమి వేయబడలేదు, అది అంతర్గతంగా హిందూ మతంలోనే ఉందనే పెద్దలను ఎలా అర్థం చేసుకోవాలి?

**అధో సూచికలు**


1) Complete Works, VI. P. 227.
2) *"Gautama The Buddha,"* Proceedings of the British Academy Vol. XXIV, Rpt. Second Edition, Bombay, Hind Kitab, 1946 (అను నా బుద్ధదర్శనం - ఆనంద బుద్ధ విహార, సికిందరాబాద్, 1999).
3) Bapat P.V., *2500 Years of Buddhism,* Publication Division Ministry of Information Broadcosting, Govt. of India. 1956, Foreword P. ix.
4) Radhakrishnan. S. *Indian Philosophy,* Vol. 1, Oxofred University Press, New Delih, 1999. p. 361
5) Ibid., p. 361
6) *2500 Years of Buddhism*, Foreword, P. xiii
7) Pratap Chandra, "Was early Buddhism Influenced by the Upanisads?" in, *Philosophy East and West* - xxi, 1971, P. 319.
8) A.B. Keith, Religion and Philosophy of Upanisads, Cambridge, 1925, P. 498-02.
9) దీఘనికాయాన్ని ''బుద్ధుని దీర్ఘసంభాషణలు'' పేరుతో అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి అనువదించారు. మిసిమి ప్రచరణులు, హైదరాబాద్, 2002 ప్రచురించారు.
10) O.H. De Vijesekhara, *A Pali Reference to Brahmanachara* in the Adayar Library Bulletin, xx, 1956, PP. 254f.
11) మజ్జిమనికాయ 1,26, అరియ పరియెస్స సుత్త. దీనిని నారద మహాథేరలో ఉంటంకించారు. దీనికి నా తెలుగు అనువాదం 'బుద్ధదర్శనం' ఆనంద బుద్ధ విహార, సికిందరాబాద్, 1999, P. 41
12) Ed. P.V. Bapat, *2500 Years of Buddhism,* New Delhi, 1956, Foreword PP. ix, xii - xiv
13) సంయుత్త నికాయ, నాలందా దేవనాగరి, Edn. 11, 1959 P.P. 90-91.
14) *Complete Works,* I. P. 21.

# బౌద్ధం - హిందూమతం - లౌకికతత్వం

- శివలింగం

భారతదేశంలో బౌద్ధం పదిహేనువందల సంవత్సరాలపాటు సజీవ స్రవంతిగా పరిఢవిల్లింది. తాత్విక, కళ, సాహిత్య రంగాల్లో సృజనాత్మక రచనలు శిల్పాలను అందించింది. సాంచి, అజంతా, కన్హేరీలలోనే కాదు దేశమంతా బౌద్ధ తేజస్సు ప్రసరించింది. క్రీస్తు శకం ప్రథమ సహస్రాబ్దానంతరం బౌద్ధం కనుమరుగయిందని పండితులు చెప్పడం అసత్యం - శ్రమణ సంప్రదాయం ఈనాటికీ నశించలేదు. జైనులు వున్నారు. నవ బౌద్ధులకి బౌద్ధ మహా సంప్రదాయాలుగాని నిర్వాణాన్ని పొందే మార్గం గాని తెలియదు. ఆరామాలు గాని, ధ్యానపద్ధతులుగాని వారికి లేవు. అంతర్వీక్షణ, శిక్షణ తెలియదు. జైనులేకాదు. జోరాష్ట్రియన్లు, సిరియన్ క్రిష్టియన్లు, యూదులు, అమెరికన్లు భారతదేశంలో జీవిస్తూనే వున్నారు. పాశ్చాత్య దేశాల్లో జరిగిన మత యుద్ధాలు భారతదేశంలో జరగలేదు. ఇన్ని శతాబ్దాలుగా అభివృద్ధి పొందిన బౌద్ధం ఎందుకు కనుమరుగయిందీ అనేది అంతు దొరకని ప్రశ్న.

బౌద్ధ తాత్విక స్రవంతికి అడ్డుకట్ట వేసిన వాడు శంకరుడనడం సమజంసంగా లేదు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, గీత, శంకరునికి ప్రామాణ్యాలు. బౌద్ధులకు కాదు, శంకరుడు బౌద్ధాన్నే కాదు, తదితర తాత్విక ధోరణులను కూడా ఖండించాడు. అయినా అవి బతికే వున్నాయి. విమర్శల వల్ల తాత్విక సంప్రదాయాలు చచ్చిపోవు. మరింత నూతన జీవత్వంతో శక్తి వంతమై సవాళ్ళను ఎదుర్కో-గలుగుతాయి. అన్ని సంప్రదాయక ధోరణులు వాద ప్రతివాదాలతో ముందుకు సాగాయని చరిత్ర చెపుతుంది. బౌద్ధం అందుకు వెలిగాదు. శంకరునికి ముందు ప్రధాన మల్లుగా బౌద్ధం తాత్విక గోదాలో నిలబడి పోరాడింది. శంకరునితో బౌద్ధం పారిపోలేదు సరికదా తరవాత మరో అయిదు వందల సంవత్సరాలు బతికే వుంది. 8వ శతాబ్దం నుండి 1220 వరకు ఎంతమంది బౌద్ధ ఆచార్యులు పుట్టారో ఆశ్చర్యం కలుగుతుంది. శాంత రక్షిత, కమలశీల, ధర్మోత్తర, మల్లవాదిన, జితేంద్ర బుద్ధి, యశోమిత్ర, ప్రజ్ఞాకరగుప్త, పండిత అశోక జ్ఞానశ్రీ మిత్ర, అతీస, రత్నకీర్తి, మోక్షాకారగుప్త, అనిరుద్ధ మున్నగు వారు. శతాబ్దాలవారీగా ఎంతమంది వున్నారో చూద్దాం : 700-800-8 మంది ఆచార్యులు; 800 -900-7 గురు ఆచార్యులు; 900-1000-5 గురు ఆచార్యులు; 1000-1100-13 మంది ఆచార్యులు; 1100-1200-11 మంది ఆచార్యులు.

భక్తి యార్ ఖిల్జీ 1200లలో నాలంద విశ్వవిద్యాలయాన్ని ధ్వంసం చేశాడని చరిత్ర. 1250 వరకు అనిరుద్ధుని మీద ఆరుగురు రాశారు, విమలబుద్ధి, సుమంగళ మీద 11 మంది రాశారు. బౌద్ధ తాత్విక సంప్రదాయం శంకరుని అనంతరం చాలాకాలం సజీవంగానే వుందనడానికి ఈ సాక్ష్యం చాలు. నాగార్జునుడు, అసంగుడు, వసుబంధు, బుద్ధఘోషుడు, దిన్నాగుడు, చంద్ర కీర్తి, ధర్మకీర్తి వంటి మేధావులు శంకరుని ముందు వున్నారు. తరవాత కూడా అంతటి మేధావులు బౌద్ధ తాత్విక చర్చలు జరిపారు. శంకరుని తరవాత 750-1250 వరకు పరిశీలిస్తే అద్వైత ఆచార్యులు జ్ఞానఘనుడు (900) విముక్తాత్మ (950), వాచస్పతిమిశ్ర (960), సర్వజ్ఞాత్మ (1027), గంగాధర (1137), మండన

మిశ్ర, సురేశ్వర, పద్మపాదుడు, హస్తామలక, త్రోటకులు కనిపిస్తున్నారు. బౌద్ధం వలన శంకరుడు లాభపడ్డాడు గాని శంకరుని వల్ల బౌద్ధం నశించ లేదు. నశించడానికి గల కారణాలను అన్వేషించాలి.

హిందూమతంలో కలిసిపోయిందంటారు. సన్యాసం, అహింసలను హిందూ మతం స్వీకరించింది. సంఘ నిబంధనలు సడలి శక్తి నశించింది. సన్యాసం, విశాల మనస్తత్త్వం, స్వాతంత్ర్యం, సేవ, త్యాగం, ఆత్మశాంతి, సంఘాన్ని పటిష్ట పరిచేవి. అవి భిక్షువుల్లో క్రమంగా బలహీనపడి నియమాలు సన్నిగిల్లినాయి. బుద్ధుడు అనేక ప్రాంతాలు సంచారం చేసి సన్మార్గాన్ని బోధించాడు. అనేక మంది ఆయన వెంటనడిచారు. సారిపుత్త, మొగ్గల్లాన వంటి గొప్ప శిష్యులు బుద్ధుని ఆదర్శాలను అనుసరించారు. బౌద్ధ శిష్యులైన భిక్షువులు చాలా మందిని బౌద్ధంలోకి మార్చగలిగారు. రాజులు, చక్రవర్తులు, సామాన్యులు, బౌద్ధాన్ని స్వీకరించారు. ధర్మ వ్యాప్తి కోసం భక్తి భావంతో కృషిచేశారు. క్రీ. శ. 6వ శతాబ్దంలో బౌద్ధ విశ్వవిద్యాలయాలు దేశమంతా నెలకొల్పబడ్డాయి. కొన్ని సంస్థల్లో పదివేల మంది విద్యార్థులుండేవారు. వారిని పోషించటం కోసం రాజులు, వ్యాపారులు, సామాన్య ప్రజలు, విరాళాలు యిచ్చారు. రాజుల పోషణ అభివృద్ధి జరిగినా క్రమంగా బౌద్ధ భిక్షువుల్లో కొందరు సంఘ నియమాలకు తిలోదకాలిచ్చి భౌతిక జీవితానికి అంకితమై ధర్మాన్ని విస్మరించ సాగారు. నైతిక ఆదర్శాలు బలహీనపడ్డాయి. విలాసాలు మరిగి సంఘ విచ్ఛిత్తికి దారి తీసాయి. ముస్లిం దండయాత్రలు కూడా బౌద్ధక్షైణ్యతకు కొంతకారణం. సంఘం ఎప్పుడైతే శక్తిని కోల్పోవడం ఆరంభమయిందో అప్పుడే ముస్లింల దండయాత్రలు ఆరంభం. బౌద్ధుల్ని, ప్రజల్ని విచక్షణా రహితంగా చంపారు. దేవాలయాల్ని, బౌద్ధారామాల్ని ధ్వంసం చేశారు. వేలాది మంది బౌద్ధ భిక్షువుల్ని సజీవదహనం చేశారు. కొన్ని వేలమందిని క్రూరంగాచంపారు. నాలందా విశ్వవిద్యాలయ గ్రంథాలయం కొన్ని నెలల పాటు తగలబడిందని టర్కిష్ చరిత్ర కారుని కథనం. ఆ దెబ్బకు సంఘం మళ్లీ కోలుకోలేదు. బుజానవేసుకుని మోసేవాడు లేడు. దిక్కులేని దీన, అనాథ అయింది బౌద్ధం.

హిందువులకు జైనులకు అదే గతి పట్టినా, హింసకు గురి అయినా ప్రజల్లోకి వెళ్ళి తలదాచుకుని జనాన్ని కూడ గట్టుకో గలిగారు. కాని బౌద్ధులకు నాయకులు లేరు. వారు ఎక్కడవున్నా ధరించే దుస్తులు, బోడిగుళ్లు, బౌద్ధులని తెలియ చెప్పే ప్రమాదం వుంది, తప్పించుకోలేక పోయారు. దేశం వదలి కొందరు పారి పోయారు. సంప్రదాయ హిందువులకు బౌద్ధానికి చుక్కెదురు. బౌద్ధం ఉచ్ఛస్థితిలో వున్నప్పుడు, రాజుల ఆదరణలో వున్నప్పుడు, హిందువులు నోరు మెదపలేదు. బౌద్ధం క్షీణించిన దశలో బౌద్ధ దేవాలయాలను ధ్వంసానికి గురి కానివి హిందూ దేవాలయాలుగా మార్చారు. బలమైన నాయకత్వ లోపం కారణంగా, పరిసర జాతి ఒత్తిళ్ల కారణంగా నిదానంగా బౌద్ధులు హిందూ మతంలో కలిసి పోయారు. ముస్లిం దండ యాత్రలకు గురికాని ప్రదేశాల్లో కుల వ్యవస్థ ఒత్తిళ్లతో బౌద్ధులు క్రమంగా జారుకున్నారు.

**హిందూ మతం - బౌద్ధం**

బుద్ధుని కాలానికి హిందూ మతం పుట్టలేదు. మతంగా కాక ముందు ఒక తాత్విక మార్గంగా కనిపిస్తూ వుంది. ఆర్య, వైదిక, బ్రాహ్మణ, త్రయి, సనాతన పదాలు కనిపిస్తున్నాయి కాని హిందూ

పదం లేదు. శ్రమణ, వ్రత్య, నిర్గ్రంధ, అజీవక సంప్రదాయాలు వుండేవి. కొన్ని మార్గాలను అనుసరించాడు, ఫలితం లేకపోయింది, మధ్యే మార్గంలో మౌన ధ్యానం ద్వారా నిర్వాణాన్ని పొందాడు. నూతన ధర్మాన్ని బోధించాడు. బౌద్ధానికి వైదిక మతానికి వున్న ప్రధాన భేదాలు అయిదింటిని ధర్మకీర్తి (600 ఎ.డి.) పేర్కొన్నాడు. తాత్వికంగా ఆధ్యాత్మికంగా అయితే మాటల్లోనే భేదం.

1. వేద ప్రమాణాన్ని బౌద్ధం అంగీకరించలేదు. ఎప్పటినుంచో పారంపర్యంగా వస్తున్న సంప్రదాయమని నమ్మవద్దు. పవిత్ర గంథాలను, వ్యక్తులను, బుద్ధుడిని కూడా గుడ్డిగా నమ్మవద్దన్నాడు బుద్ధుడు. ఆధ్యాత్మిక ప్రగతికి అవరోధం, హిందువులకు వేదాలు పవిత్ర గ్రంథాలైనట్టుగా బౌద్ధులకు పాళీ త్రిపిటకలుకాదు. బుద్ధుని బోధలు పరిశీలించి, ఆచరించి, అనుభవంలోకి తెచ్చుకోవాలి.

2. హిందూమతానికి సృష్టికర్త దేవుడు. బౌద్ధం ప్రతీత్యసముత్పాదాన్ని చెప్పింది. ధర్మాన్ని బోధించింది.

3. హిందూ కర్మకాండలను బౌద్ధం ఖండించింది. గంగాస్నానాలను ఎగతాళి చేసింది. నీళ్లు పాపాల్ని పోగొడితే చేపలు, తాబేళ్లు, కప్పలు, పాములు, మొసళ్ళు కూడా స్వర్గం పొందుతాయి. పాపాలు పోతే వాటితో పాటు పుణ్యాలను పోగొడతాయి నీళ్లు. బ్రాహ్మణుడా పాపాలకు భయపడితే, వాటిని చేయకుండా వుండటం శ్రేయస్కరం అని ఒక బౌద్ధ భిక్షుణి బ్రాహ్మణునితో చెపుతుంది.

4. కుల వ్యవస్థ, అస్పృశ్యతలు హిందూ మతంలో వున్నాయి. బౌద్ధంలో లేవు. జన్మచేత ఎవ్వడూ బ్రాహ్మణుడు కాడు. గుణం చేత, ప్రవర్తన వలన బ్రాహ్మణుడు లేదా అస్పృశ్యుడు అవుతాడని చెప్పింది ప్రథమంగా బుద్ధుడే.

5. ఆత్మాహుతి పద్ధతుల్ని బౌద్ధం వ్యతిరేకించింది. హిందువులు, జైనులు కఠిన పద్ధతుల్ని అవలంభించారు. ఆత్మ శుద్ధి కోసం, శరీరం నిండా బూడిద రాసుకోవడం, వేసవి ఎండలో కూర్చుని ధ్యానించడం, ముళ్ళ మీద పడుకోవడం వంటి పిచ్చి పనులు చేసేవారు. బుద్ధుడు కూడా కొన్ని ఆచరించి వాటివల్ల ఆరోగ్యానికి హానికరమని, ఉపయోగం లేదని గ్రహించి వదిలేశాడు. శరీరాన్ని హింస పెట్టడం కాదు, మనసులోని మాలిన్యాన్ని దగ్ధం చేయాలి. బుద్ధుడు ఎవ్వరినీ వ్యతిరేకించ లేదు. భారతీయ సంస్కృతిని సుసంపన్నం చేయడానికి ప్రయత్నించాడు. బౌద్ధ సమాజం మడి గట్టుకుని కూర్చో లేదు. అన్ని వర్గాల ప్రజలను సమాదరించింది. వైదిక రుషులూ, బౌద్ధ భిక్షువులూ ధ్యాన సాధన చేసినవారే.

మహాయాన బౌద్ధం జనసమాన్యానికి చేరువ కావడానికి హిందూ మత పద్ధతులను అనుసరించింది. బెంగాల్‌లో పాలరాజులు నాలుగు వందల సంవత్సరాలు (750 - 1155) పరిపాలించారు. బెంగాల్‌లో అతి ప్రాచీన కవిత్వం బుద్ధ చర్యా పదాలు 950 - 1200 మధ్య కాలంలో కూర్చినవే. ఈ కాలంలో బౌద్ధం హిందూమతానికి చేరువగా వచ్చింది. విక్రమ శీల విహారం నిర్మించాడు ధర్మపాలుడు. హోమం కొన్ని సంవత్సరాలు చేశాడు. బలి ఆచార్య, హోమాచార్యులు బయలు దేరారు. పాలరాజులతో బౌద్ధమతం ముక్కలయింది. విక్రమ శీల, ఓదంతపురి అంతమే బౌద్ధం భారతంలో అంతిమదశ. తారానాథుని బౌద్ధ చరిత్రలో ఈ విషయాలు మనకు కనిపిస్తున్నాయి. Buddhism died a

natural death in India అన్నాడు మోనియర్ విలియమ్స్. సహజ మరణం అనడం సత్యం కాదు. రాధా కృష్ణన్ బౌద్ధం హిందుమతం నుండి పుట్టింది. చివరకు అందులోనే కలిసిపోయిందని భావించాడు. పదవ శతాబ్దానికి బౌద్ధం నుండి కొన్నిటిని స్వీకరించి హిందూమతం బౌద్ధమతాన్ని తనలో కలుపుకుందని చరిత్రకారులు కూడా చెప్పారు.

వజ్రయానం, తంత్రం, బౌద్ధంలో ప్రవేశించి పూర్వవైభవాన్ని శీలాన్ని కోల్పోయింది బౌద్ధం. నాస్తికుడని ఈసడించిన హిందూమతం తరవాత బుద్ధుడిని అవతారాల్లో చేర్చుకుంది. 12వ శతాబ్దానంతరం బౌద్ధాన్ని చేరదీసిన వారుగాని, ప్రవక్తలు గాని లేరు. ముస్లింల దండయాత్రల వల్ల బౌద్ధులు హిందూమతంలో చేరిపోయారు. హిందూ రాజ్యాల స్థాపన కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. 13వ శతాబ్దం చివరి వరకు హిందూ దేశంలో అధిక భాగం మహమ్మదీయుల అధిపత్యానికి బయటనే వుంది. అల్లా ఉద్దీన్ ఖిల్జీ అధిపత్యం వింధ్య పర్వతాలు దాటలేదు. బౌద్ధ ఆచార్యులు టిబెట్, నేపాల్, చైనా దేశాలకు పారిపోయినా సామాన్యులైన బౌద్ధులు హిందూ మతంలో చేరిపోయి వుంటారనుకోవడంలో తప్పులేదు. ఆనాటి సామాజిక పరిస్థితులు అటువంటివి, విక్రమశీల యూనివర్శిటీలో ఒక ఆచార్యుని వద్ద సారా సీసాని కనుగొన్నారు. అది ఒక భిక్షుణి యిచ్చిందని చెప్పడం, క్రమశిక్షణ చర్య తీసుకోవాలని కమిటీ నిర్ణయించడంలో విభేదాలు తలెత్తి విచ్ఛిత్తికి దారి తీసింది.

### బౌద్ధం - లౌకిక తత్వం

మతాలన్నిటికి భగవంతుడున్నాడు. కాని బౌద్ధానికి లేదు. బౌద్ధాన్ని మతంగా పేర్కొనాలంటే అది నైతిక ధర్మం అనాలి. బౌద్ధ మార్గం మత మార్గం కాదు. మత వివాదాలకు తెరదించాలంటే బౌద్ధ మార్గం ఒక్కటే శరణ్యం. మానవ విలువలైన విశ్వ సౌభ్రాతృత్వం, ప్రేమ, శాంతి, దయ, సహనం, న్యాయం, కరుణ, దుఃఖోపశమనం - వీటన్నిటిపట్ల అణకువ కలిగిన అంకిత భావం బౌద్ధ నైతిక ధర్మం. ఇతర మతాలకు భగవంతుని మీద, పవిత్ర గ్రంథాలమీద భక్తి భావం వుంది. బౌద్ధ నైతికత, లౌకిక తత్వ నైతికత, కుల, వర్గ, వర్ణ, లింగ, ప్రాంతీయ విచక్షణలు ఏవీ లేకుండా అందరినీ సమాదరించాడు. ఏ మతాన్ని బుద్ధుడు కించపరచలేదు. విగ్రహారాధనను ప్రోత్సహించలేదు. దురాశ, ద్వేషం, అసూయలను అణచేవరకూ మత వివాదాలను అధిగమించలేం. బుద్ధుడు చెప్పిన మార్గంలో మానవాళి నడచినపుడు ప్రపంచ శాంతి లభిస్తుంది. లౌకిక తత్వం మతానికి విరోధి కాదు. లౌకిక తత్వం, మతం చెట్టపట్టాలు వేసుకుని నడుస్తాయి. మానవతా వాదం మతానికి, లౌకిక తత్వానికి వ్యతిరేకం కాదు. బుద్ధుడు, మహావీరుడు, వివేకానందుడు, రామకృష్ణ పరమహంస, గురునానక్, క్రీస్తు వంటి మహానుభావులెందరో విశ్వమతాన్ని ప్రబోధించారు. కాని మత వివాదాలు ఈ నాటికీ నివారించ లేక పోతున్నారు. పరమతంకన్నా మన మతమే గొప్పదనుకోడం వలన స్వార్థ పరత్వం పెరిగి పోవడం వలన మతానుయాయుల మధ్య హింసాకాండ పెరిగి పోతూవుంది. వివేకానందుడు చెప్పిన విశ్వమతం బుద్ధుడు ఏనాడో చెప్పాడు. లౌకిక వాది (సెక్యులరిస్టు) అయిన వాడు మతావలంబకుడు కావచ్చు కాకపోవచ్చు. కాని నైతిక వాది కాకుండా వుండడు. సర్వమానవుల పట్ల ప్రేమ, నైతిక జీవితం పట్ల

ఆసక్తి, అతీత శక్తుల పట్ల విరక్తి, భగవంతుడు, పవిత్ర గ్రంథాల పట్ల అనాసక్తి బౌద్ధం ప్రసాదించిన అమూల్య సందేశం. ఈ విధమైన లౌకిక నైతికతతో కూడిన బౌద్ధ తత్వాన్ని ఆచరణలో పెడితే అందరూ సామాజిక జీవితంలో మత కల్లోలాలను నివారించ వచ్చు. శాంతిని నెలకొల్పవచ్చు. ఆనందంగా, సుఖంగా జీవించవచ్చు. ఇది నిజం. సందేహం లేదు. బుద్ధుడు జ్ఞానోదయం పొందడానికి ఎంతో కృషి చేశాడు. అజ్ఞానులమైన మనం కూడా మన మనస్సుకు ధ్యానం ద్వారా తగిన శిక్షణయిచ్చి బుద్ధుని బోధను ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిద్దాం. బుద్ధుడిని బయట కాదు చూడవలసింది. అంతర్వీక్షణ ద్వారా దర్శించాలి. అంతర్ముఖుడవై దర్శించినపుడు బాహ్యంలోనూ దర్శిస్తావు. మనసును క్షాళన చేయాలి. అంతర్గత శత్రువుల్ని నాశనం చేస్తే ఆనందమే మిగులు. నిస్వార్థంగా లోక సేవ చేయగలిగే శక్తి వస్తుంది.

## బుద్ధుడు - శంకరుడు

బుద్ధుడు తాను అవతార పురుషుడని గాని, ప్రవక్తననిగాని చెప్పలేదు. జ్ఞానోదయం అయిందని తెలిపాడు. ఎంతో ప్రయత్నం, అంతర్దృష్టి ఫలితంగా శుద్ధత్వాన్ని పొందాడు. అది మానవ జాతి తనలా కృషి చేస్తే పొందగలిగేటటువంటిది. ఆయన్ని ఆరాధించ నక్కరలేదు. భగవంతునిలా ప్రేమించనవసరమూ లేదు. బుద్ధునికి ఆశక్తి నదీజలాల వివాదం వలన యింటిని వదిలి వెళ్లడం వలన వచ్చింది కాదు. ఇంటిలో పోరుతో యిల్లు విడిచి సన్యాసుల్లో కలిసిన వారందరికీ జ్ఞానోదయం అవుతుందంటే నమ్మలేం. ఎన్నో సంవత్సరాల తపస్సు ఫలితం. అది భారతీయ సంప్రదాయంలో వున్నదే. సూక్ష్మ బుద్ధి కలవారు నిర్వాణాన్ని పొందగలరు. తత్వమసి, అయమాత్మ బ్రహ్మ అనేవి మానవ దైవత్వాన్ని చెబుతున్నాయి. గాని అవతారాన్ని తెలియ చేయడం లేదు. బృహదారణ్యకంలో వామదేవుడు తన అనుభవాన్ని బ్రహ్మవిదుడైనాక చెప్పాడు. నేను బ్రహ్మను అని తెలుసుకుంటే జగత్తులో అన్నీ నేనే (స ఇదం సర్వం భవతి). ఉపనిషత్తులను బట్టి సత్తును తెలిసికొనడమే గాని లీనం కావడం కాదు. ఆత్మ సాక్షాత్కారం అంటే అదే. ఉపనిషదృషులు సాధించిందే బుద్ధుడు పొందింది. దుఃఖానికి, ఈ జన్మకు మూలం ఏమిటనే జిజ్ఞాస అన్వేషణకు దారితీసి సంసారాన్ని వొదిలి తపస్సుకు పురికొల్పింది. ఆనాటికి ఎందరో సంచరిస్తూనే వున్నారు. కాని బుద్ధునికి వున్న శక్తి వారికి లేదు. నిరుపేద నుంచి రాజుల వరకు ఆయన్ని అనుసరించారంటే చిన్న విషయం కాదు. మామూలు వ్యక్తికి సాధ్యపడేదీ కాదు.

భారతదేశంలో తాత్విక చింతనలో ఆధ్యాత్మికత వుంది. జాత్యంధుడి దగ్గరకు జీసస్, ఆయన శిష్యులు వెళ్ళినపుడు శిష్యులు అడిగారు. పాపం తాను చేశాడా, తల్లి దండ్రులు చేశారా? అంధుడుగా జన్మించడానికి కారకులు ఎవరు? అన్నప్పుడు వాడూ కాదు తల్లి దండ్రులూ కాదు. భగవంతుని లీల ఆయనలో వ్యక్తం అయిందన్నప్పుడు సంతృప్తి కలిగించడం లేదు. భారతీయుడైతే ముందు జన్మలో చేసుకున్నదే ఈ జన్మలో అనుభవించేదని సమాధానం చెపుతాడు. నీవు చేసుకున్నదే నీ వెంటవస్తుంది. తరవాత కాలంలో కర్మ సిద్ధాంతంగా రూపొందింది.

సోక్రటీస్‌గాని బుద్ధుడుగాని వారిని వ్యతిరేకించిన వారిని తూలనాడలేదు. క్రీస్తు తన బోధలు యిష్టపడని వారిని కఠినంగా నిందించాడు. మానవాళి మీద ప్రేమగల వాడు పలకవలసిన మాటలు కావు. రసెల్‌నేనెందుకు క్రిస్టియన్‌ను కాను? అనే చిన్న వ్యాసంలో రాశాడు. బుద్ధుడు భౌతిక శ్రేయస్సును. ఆధ్యాత్మిక అభివృద్ధిని కోరాడు. నైతికంగా బాగుంటే బ్రాహ్మణుడైనా చండాలుడైనా ఏవర్గంవాడైనా ఒకటే. నైతికత లేక పోతే విభేదించాడు. సామాజిక స్థాయిలో విభిన్న వర్గీకరణలను ఆమోదిస్తున్నాడనే భావం కలిగింది. అయితే జన్మ వలన, వార సత్వంవలనవచ్చే కులాన్ని ఆయన అంగీకరించలేదు. గుణానికిచ్చిన విలువ వర్ణానికి యివ్వలేదు. గీతలో వర్ణం గుణకర్మ భేదంతో వుంది. అయినా వర్ణం చెప్పడమే తప్పు పడుతున్నారు. మానవ స్వభావంగా చెప్పవచ్చుగదా అని!

నిర్వాణం పొందిన తరవాత ప్రపంచం శూన్యం కాలేదు. బుద్ధుడు నిర్వాణ అనుభవం పొంది కూడా ఎంతో శక్తితో ప్రపంచంలో ప్రవర్తించడం చూస్తే ఆయన అంతర్గత చైతన్యం అమూర్త స్థితి (Impersonality) ఉండగా కర్మలో వ్యక్తిత్వం (Personality) ఉన్నట్లు స్పష్టపడుతున్నది. అంతరంగంలో సంపూర్ణ నిశ్శబ్దస్థితిని అనుభవిస్తూ బాహ్యంలో ప్రేమ, సత్యం, ధర్మాలతో కూడిన కర్మలను నిర్వహించటం సాధ్యమేనని బుద్ధుని జీవితం నిరూపిస్తున్నది. బుద్ధుడు నిర్వాణ ద్వారం దగ్గరకు పోయి వెనుక్కు తిరిగి చూచాడు. బాధనుంచి ముక్తి పొందని వాడు అహంకారం నుంచి బయట పడని వాడు ఈ ప్రపంచంలో ఒక్కడు మిగిలివున్నా ఆద్వారాన్ని దాటి లోపలికి పోను అని శపథం చేశాడు. ఇది కట్టు కథ కాదు యథార్థమైన అనుభవం ( దివ్య జీవన ప్రసంగాలు - వ్యక్తి భవితవ్యం. - టి. పూర్ణచంద్రరావు. పే. 16.26)

బౌద్ధం నుండి ప్రభావితుడై నిర్గుణ పరబ్రహ్మతత్వాన్ని ప్రతిపాదించిన శంకరుడు గొప్ప వేదాంతి. పండితుడు. అద్వైత వేదాంత స్థాపనాచార్యుడు. బౌద్ధానికి ఎంతో రుణపడి వున్నాడు. ఎంతో పదజాలాన్ని బౌద్ధం నుండి గ్రహించాడు. భాష అందరి సొత్తు బుద్ధుని జీవితాన్ని చదివిన వాడు గనుకనే.

శాంతామహాంతో లోకహితం చరంతః

శాంతిని పొందిన మహానుభావులు విశ్వశ్రేయస్సు కోసం పని చేస్తారన్నాడు. ప్రకరణ గ్రంథాలు రాశాడు. వేదాంత సిద్ధాంతాలతో నిబంధించబడిన గ్రంథాన్ని ప్రకరణమంటారు.

ప్రకరణ గ్రంథాల్లో ఎక్కడా వేదాంత విద్యకు శూద్రులు అనర్హులని పేర్కోలేదు. అందరి హృదయాల్లోను దివ్య తేజస్సు దాగుందని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. మహా భారతంలో నాలుగు వర్ణాలవారూ వేదాలు వినవచ్చని భీష్ముడు.

'శ్రావమే చ్చతురో వర్ణాన్

కృత్వా బ్రాహ్మణం అగ్రతః

వేదస్యాధ్యానం హిదం

తచ్చకార్యం మహత్ః స్మృతం' - అన్నాడు.

అనేక ఆధారాలున్నప్పుడు మనువును ఆశ్రయించాడనడం నమ్మశక్యం కాదు. విష్ణు సహస్రనామ స్తోత్ర భాష్యంలో శూద్రులు వినడానికి ఒప్పుకున్నాడు. కాని జపం, యజ్ఞం చేయరాదన్నాడు. శంకరుడు ధర్మశాస్త్రవేత్తకాడు. సామాజిక వేత్తకాడు. అసలు బాదరాయణుడు బ్రహ్మ సూత్ర భాష్యంలో అపశూద్రాధికరణం, దాని మీద శంకరుని భాష్యం ప్రక్షిప్తాలు కావచ్చు. తత్వ శాస్త్రం వివరించి చెప్పేది. బౌద్ధం అందరినీ కలుపుకొంటూ వుంటే, విశాలపడుతూవుంటే ఒక్క బ్రాహ్మణ వర్గానికే వేదాంతం బోధించాడనడం విడ్డూరంగా వుంది, శంకరుని పేరవున్న గ్రంథాల్లో అసలేదో నకలేదో తెలియని స్థితి. బుద్ధుడు బోధించిన ఆ చరణాత్మక తత్వాన్ని వివేకానందుడు బోధించాడు. ఈనాటి లౌకిక తత్వం బుద్ధుడు ఆనాడే చెప్పాడు. విశ్వ శ్రేయస్సుకు బౌద్ధమే వెలుగుదారి, అత్యాశను, ద్వేషాన్ని, భ్రాంతిని నిర్మూలించడానికి విపశ్యనే శరణ్యం. మౌన ధ్యానమే సాధనం.

శంకరుని గురించి కె. యస్. మూర్తిగారొక మాంటన్నారు.

Sankara nowhere claims that his doctrine is the fruit of the experimental science of mysticism. (Revelation and Reason in advaita Vedanta).

మూర్తిగారు శంకరుని అద్వైతాన్ని గురించి 1985లో శృంగేరీ శారదాపీఠం వారు 'శ్రీ శంకరకృప' తెలుగు పత్రిక రజతోత్సవ సందర్భంగా ఉపన్యాసం యిచ్చారు. అద్వైత బుద్ధి : Advaitic Notion పేరుతో పుస్తకంగా శృంగేరి శారదా పీఠం వారు ప్రచురించారు. అయిదు విషయాలు.

1. స్వత: సిద్ధ విజ్ఞాన సంవేదన 2. జగన్మిథ్యాత్వం 3. మహా వాక్యాలు- బ్రహ్మ వేదన 4. శ్రుతి - ప్రమాణాంతర 5. తత్వ జ్ఞానం - లౌకిక వ్యవహారం.

అద్వైత సంప్రదాయం మీద పరిశోధనాత్మక ఉపన్యాసాలు అద్వైత గంధ్రాలు వాద ప్రతివాదాలకు ఉపయోగించుకున్నారు. సాధనకు ఉపయోగపడలేదు. అద్వైత వేదాంతం కర్మకూ జ్ఞానానికి వున్న సంబంధాన్ని విద్యారణ్యుని పంచదశి చక్కగా వివరించిందని తృప్తి దీప, ధ్యాన దీప ప్రకరణాల నుండి ఉదాహరణలిచ్చారు. గౌడపాదుడు స్వతంత్ర ఆలోచనతో అద్వైతాన్ని నిలిపాడు. శంకరునికి తృప్తి కలగలేదు. శ్రుతిని ఆధారం చేసుకుని అద్వైతాన్ని స్థాపించాడు. బుద్ధుడు, గౌడపాదుడు, శంకరుడు, నాగార్జునుడు - వీరందరిలో ప్రాచీన ఉపనిషద్వాణి వినివిస్తుందని తెలిసిన వారంటారు. హేతుబుద్ధి, అనుభవం ఆధారంగా రాశారు. శంకరుణ్ణే ప్రచ్ఛన్న బుద్ధుడని ప్రత్యర్థులన్నారు. స్వయం ప్రకాశచైతన్యమే పరమార్థ సత్యం. అదేవ్యక్త్యాత్మ. ఈ భావం బౌద్ధులది విజ్ఞాన వాదులది అద్వైతులది అని యామునాచార్యుడు.

మూర్తిగారు అద్వైత బుద్ధి అన్న పేరును శ్రీ హర్షుని నుంచి స్వీకరించారు.

సేయ మద్వైత బుద్ధిర్న తర్క శతమవతార్య ప్రజ్ఞైరపనేయా. బౌద్ధికమైనశతాధిక తర్కాలు అద్వైత బుద్ధిని తొలగించలేవు. భారతీయ తాత్విక క్షేత్రంలో బుద్ధుడు, శంకరుడు పండించిన పంటలు సుసంపన్నాలు. వారు ఆరని వెలుగు దివ్వెలు.

# గౌతమ బుద్ధుని గురించి

- డా॥ యస్.సి. రామానుజాచార్యులు

ఒక విచిత్రమైన ఐతిహ్యం హిమాలయ గురు శాఖలలో ప్రచారంలో వుంది. దీనిని సామాన్య జనం కూడా ప్రస్తావించుకొంటూ వుంటారు. కపిలవస్తు రాజ్య యువరాజు గౌతముడు భౌతిక వాతావరణ ఛాయలను వీడి ఎక్కడికో పోలేదు. ఆయన శరీరాన్ని దహన కాండలకు నియోగించి వుండవచ్చును, అయినా ఆ శరీరంలో కొన్ని భాగాలు ప్రక్షిప్తంగా దాచి వుంచారు.

చైనా బుద్ధ సంప్రదాయంలోను, టిబెట్ లామాల రహస్య గ్రంథాల పొరలలోను, ఆర్యుల పరంపరాగత జ్ఞానం లోను మరో విషయం కూడా అగుపిస్తుంది. గౌతమ బుద్ధునకు రెండు సిద్ధాంత ప్రాతిపదికలు వున్నాయి. ఒకటి సామాన్య జన సందోహాలకు చెప్పేది; మరొకటి ఆయన ఎంచుకున్న ప్రధాన శిష్యులకు బోధ పరిచేది. ఈ ప్రధాన శిష్యులను 'అర్హతులు' అన్న పేరుతో వ్యవహరిస్తారు.

బుద్ధుని బోధనా ప్రక్రియ, ఆయన తరువాత ఆ అర్హతుల ప్రక్రియ కూడా ఒకే రీతిగా వుంది. అదేమంటే, అర్హతుల శ్రేణికి అందుకోవాలనుకున్న యే ఒక్కరికీ 'ప్రవేశం' కల్పించకుండా అడ్డు పడక పోవడం. అందరూ ఈ మార్గానికి ఆహ్వానితులే. అయితే యిలా చేరిన వారిని కొంత కాలం పరీక్షావస్థలో వుంచి, వాటిలో వారు నెగ్గితేనే - 'తగిన వారు' అని ఋజువు చేసుకుంటేనే చిట్టచివరి రహస్యాలు (Mysteries) తెలియ చెప్పడం. 'అర్హులు' అని తీర్మానం తీసుకున్న తరువాత, యిక యెటువంటి జాతి మత కుల ఐశ్వర్య వివక్ష లేకుండ వారికి బోధనలు అంద చేయడం.

అర్హతులు యీ విషయాలకు బహుళ ప్రచారం యిచ్చి వీటిని 'సంప్రదాయ రీతుల'లో భాగం చేసేశారు. ప్రజల మనసులలో హత్తుకు పోయేట్లు చేశారు. లామాల పునరవతరణాలకు, మానవ 'బుద్ధు'ల పరంపరకు యివి మూల సిద్ధాంతాలు అయినాయి.

బుద్ధుడు 'విష్ణువు యొక్క అవతారం అని బ్రాహ్మణులు ప్రచారం చేసిన సంగతి సందర్భాలను బౌద్ధులు, వారి రహస్య గ్రంథాలు తీవ్రంగా నిరసించాయి. నిర్ద్వద్వంగా ఖండించాయి. మనిషి తన కర్మ ఫలితాల వల్ల మళ్లీ మళ్లీ జన్మలు యెత్తడం - అనే దానిని వారు అంగీకరించరు. 'మహావిష్ణువు' అనే పదానికి వున్న ఆంతరిక అర్థం వారి గమనంలోనికి రాదు. దీనికి వున్న పూర్ణ, వ్యక్తికి అతీతం అయిన, సాధారణ అర్థ వివరాల జోలికి వాళ్లు వెళ్లరు.

ప్రకృతిలో ఒక మహత్తరము, విచిత్రము అయిన 'తత్వం' వుంది దానికి 'మహా విష్ణు' అని పేరు. ఈ పేరుతో వున్న దేవుడితో దీనికి యేమాత్రం సంబంధం లేదు. ఇది ఒక తత్త్వం, బీజం. అవతార తత్త్వానికి మూలం. దివ్యమయిన అవతార పురుషులు భూమిమీదకు రావటానికి మూలాధారం అయిన 'తత్వం' యిది. ప్రపంచ రక్షకులు, బోధి సత్త్వులు, అవతరాలు - ముక్తి ప్రదాతలయిన సంతతులన్నీ యీ బీజం నుంచి ఉద్భవించిన వృక్షాలే. అది - బుద్ధుడు (మొట్టమొదటి జ్ఞాన స్వరూపం) అన్నా, 'మహా విష్ణు' అన్నా యిదే. ఆంతరిక విజ్ఞాన దృష్ట్యా చూచినట్లయితే విష్ణువు సగుణుడు, నిర్గుణుడు కూడా (గుణాలు వున్న వాడు - లేనివాడూను). మొదటి అర్థంలో విష్ణువుకు

---

డా॥ యస్. సి. రామానుజాచార్యులు, శ్రీవిరించిగా పేరు గాంచిన ప్రసిద్ధ కథకులు అడయార్ థియొసాఫికల్ సొసైటీ మద్రాసులో పనిచేస్తున్నారు.

రూపువుంది, యీ రూపానికి ఆరాధన జరుగుతుంది. రెండవ అర్థంలో విశ్వమంతటా ఆవరించి వున్న ఆధ్యాత్మ విజ్ఞానం (Spiritual Wisdom) యొక్క సమాహారం (culmination of totality) అది. 'నిర్వాణం' అని దీనిని అన్నా అనవచ్చు. తాత్త్విక చింతనా పరులంతా దీనికి ఉపాసన పరులు. ఈ రకంగా చూచినప్పుడు బుద్ధుడు 'మహా విష్ణువు' యొక్క అవతారం అవుతాడు. ఇది తాత్త్విక, ఆధ్యాత్మ దృష్టి కోణం నుంచి పరిశీలించినప్పుడే యథార్థంగా గోచరిస్తుంది.

వ్యక్త ప్రపంచ స్థాయి నుంచి చూచినప్పుడు 'తేజో రూపంతో ప్రభవించిన' ఏడుగురు మహా పురుషులలో ఒకరి ప్రత్యక్ష అవతరణం ఆయన (బుద్ధుడు). Seven sons of light అనే భావం అన్ని మత సంప్రదాయ రీతులలోను ప్రచారం అయిన విషయమే. 'ధ్యాన దోహనులు' అంటారు వీరిని. ఒక కల్పం నుంచి మరో కల్పం వరకూ వీరు నిరాటంకంగా వుండి తమ పర్యవేక్షణలో వున్న భూమండలంలోని జీవరాశుల ఆధ్యాత్మ సంక్షేమాన్ని గమనిస్తూ వుంటారు.

అటువంటి అవతారాల చరిత్రలు ఎంతో వైచిత్రితో, మార్మికతతో నిండి వుంటాయి. మామూలు పద్ధతిలో మనం అనుకున్నట్లుగా జనన మరణాల పరిధిలోనికి రావు. పునర్జన్మలను మూడు రకాలుగా వింగడించటానికి అవకాశం వుంది.

అవతారాలు అనే పేరుతో చెలా మణి అయే దివ్య రూపములు. మానవాళికి ఉపకారం చేయడం కోసం 'నిర్వాణ' పదవిని గూడా పరిత్యజించి లోకంలో అవతరించేవారు. - 'నిర్వాణ కాయులు' అంటారు వీరిని. జన్మ పరం పరలో సహజ పద్ధతిన వచ్చేవారు.

'అవతారం' అనేది ఒక ప్రత్యక్ష దర్శనం. మాయ ఆవరణంలో ఓ ప్రత్యేక అద్భుతమైన మాయ అని దీనిని అనుకున్నా ఆక్షేపణ లేదు.

'మహాత్ముడు' పూర్తి ఎఱుక వుండే తిరిగి 'జన్మను' తీసుకుంటాడు (పుట్టుతాడు). తన 'పరిపూర్ణ మహాత్వాన్ని' చెక్కు చెదరకుండ నిలుపుకుంటూనే, ఆయన అనేక జన్మ పరం పరలకు మూలం కావచ్చును. (అనేక మార్లు పుట్ట వచ్చును). అలా పుట్టటంలో 'కర్మ ఫలితం' అనే ప్రమేయం యేమీ వుండదు. అది అవగాహనకు అందని ఒక మూల శక్తి. జన్మ పరంపరలో తిరుగాడుతూ వున్నా ఆ మహాత్ముడు తన మహత్వాన్ని కోలుపోడు. అంతకంటె ఉన్నత శ్రేణిని గూడా స్పర్శించడు.

'అవతారం' అంటే యేమిటి? ఈ పదాన్ని ఉపయోగించటానికి ముందుగానే, దీని తత్వాన్ని వివరంగా తెలుసుకోవడం అవసరం. వ్యక్త రూపం ధరించిన దైవత్వం (Manifested Deity), లీలా మానుష రూపాన్ని స్వీకరించడం (illusive form of individuality) ఈ రూపానికి మనం యే పేరయినా పెట్టుకోవచ్చు. శివుడు, విష్ణువు, ఆది బుద్ధుడు. భౌతిక స్థాయిలో చూచేవారికి ఈ రూపం 'ఉన్నట్లుగానే' కనిపిస్తుంది. నిజానికి యిలాంటి రూపం లేదు! ఈ లీలా రూపం - దీనికి గతము, భవిష్యత్తు లేవు గనుక, వెనుకటి - ముందు జన్మలతో ప్రమేయం లేదు గనుక 'కర్మ' కర్మఫలాలతో యేమి నిమిత్తం లేకుండానే వుంటుంది. కర్మలోలయమయినవి కాదు యీ లీలా రూపాలు.

గౌతమ బుద్ధుడు, ఒక రకంగా పరిశీలించినప్పుడు, అవతరించిన మహా పురుషుడు (Born Avatara) దీనికి యెంతో వివరణ జోడిస్తే తప్ప భావం పూర్తికాదు. అవతారము - జీవన్ముక్త స్థితి - యీ రెంటికీ ఎంతో వ్యత్యాసం వుంది.

మొదటిది లీలా రూపం, కర్మకు లోనయినది కాదు. అంతకు ముందు జన్మయెత్తినది కాదు.

రెండవది - జీవన్ముక్తస్థితి - తన వ్యక్తిగత ప్రయత్నం వల్ల పరిశ్రమవల్ల నిర్వాణ స్థాయిని అందుకున్న వ్యక్తి.

ఈ విభాగ వివరణకు కూడా, వేదాంత తత్త్వ దార్శనికుడు అంగీకారం తెలపడు. అవతార పురుషుడు, జీవన్ముక్తుడు - వీరిద్దరి ప్రతి పత్తి ఒక్కటేగనుక - వ్యక్తి గత పరిశ్రమ, జన్మ పరం పరల కృషి మనిషిని 'నిర్వాణ' స్థాయికి తీసుకుపోలేదు, అని అతడు వాదించవచ్చు. నిర్వాణం అనే దానికి కర్మతో నిమిత్తం లేనే లేదు అని అతడు నొక్కి చెబుతాడు. అందుచేత కర్మ ఫలితంగా నిర్వాణం పొందడం అనేది అసంబద్ధం. నిర్వాణం అనేది ఫలితం కాదు, కారణం కాదు, ఎప్పుడూ ఉన్నది (Eternalis) - అని 'నాగేశన' నిర్వచనం. అదంతా నిజమే కావచ్చును. అయినా యీ రెంటికీ ముఖ్యమైన వ్యత్యాసం ఒకటి ఉన్నది. 'అవతారం' అనేది ఉన్న స్థితి (being); జీవన్ముక్తత అనేది సంపాదించుకునే స్థితి (Becomes). రెండింటి స్థితి, ప్రతిపత్తి ఒక్కటే కావచ్చును. అయితే వాటికి తోడుకుని పోయే పరిస్థితులు మటుకు వేరు వేరు. అవతారం అంటే దైవస్థితి లీలా రూపంలోనికి దిగిరావడం. జీవన్ముక్తత అంటే - జన్మ పరం పరల ఫలితంగా, వాటిలో సద్గుణములు పోగు చేసుకుంటూ, వాటి వల్ల నిర్వాణాన్ని, పొందడం కాకుండా, ఒక 'గురువు' దగ్గరకు నడిపింపబడడం - ఆయన నుంచి నిర్వాణానికి అవసరం అయిన ఉపదేశాన్ని పొందడం, ఆయన సహకార బలంతో గమ్యాన్ని చేరుకోవడమూను.

మన పనుల ఫలితంగానే మోక్షాన్ని పొందగలుగుతాము, అని శాస్త్రాలు చెబుతున్నాయి. మనమేమీ ప్రయత్నం చేయక పోతే, పరిశ్రమించక పోతే - దైవత్వం (మహా - గురువు) యొక్క సహకార ప్రోద్బల లబ్ధి పొందలేము.

ఈ పరిశీలనను బట్టి - గౌతమ బుద్ధుడు ఒక దృష్టితో చూచినప్పుడు అవతార పురుషుడు. అలాగే మానవ వర్గం నుంచి జీవన్ముక్త స్థితిని సాధించి సిద్ధింప చేసుకున్న వాడు. అందువల్ల అవతార పురుషునికంటె మిన్న అయిన వాడు. తన వ్యక్తిగత పరిశ్రమ వల్లనే నిర్వాణాన్ని అందుకున్నాడు.

ప్రతి మనిషికీ యిటువంటి పరిశ్రమ చేయగల శక్తి సామర్థ్యాలు, అందుకు దోహదం చేసే శరీర తత్త్వాలు వున్నాయి.

ధర్మకాయం - నిర్వాణ కాయం - సంభోగ కాయం - యిలా వివిధమైన పేర్లు వున్నాయి. వీటిని గురించి యెంతయినా ప్రస్తావన చేసుకోవచ్చును.

నిర్వాణ కాయంలో వున్న వ్యక్తి యిలా అనుకోవచ్చును. ''నేను మళ్లీ మళ్లీ జన్మించి మానవ లోకంలో వున్న దుఃఖాన్ని, పాపాన్ని భరిస్తాను. వీటి భారాన్ని నేను స్వీకరించి తతిమ్మా లోకం అంతా తరించటానికి - రక్షింపబడటానికి దోహదం చేస్తాను.'' గౌతమ బుద్ధుడు అనుకున్నది యిదే.

ఇలాంటి మహాపురుషులు - మనం గమనించినా గమనించిక పోయినా - ఎందరో వస్తూవున్నారు. లోకోపకార కృత్యాలు చేస్తున్నారు.

(మేడమ్ హెచ్.పి. బ్లావట్స్కీ వ్రాసిన అవతార తత్త్వ వ్యాసంలో కొంతభాగం, యీ చిరువ్యాసానికి ఆధారం.)

# తనను తనకు బోధపరచుకొనటమే బౌద్ధం

- వావిలాల సుబ్బారావు

బౌద్ధం ఒక మతం అనటం కంటే అది స్వయం శిక్షణా కార్యక్రమం అనటం ఎక్కువ సమంజసం. మతం అంటే ఒక మానవాతీత అస్తిత్వ భావం. దాని చుట్టూ కొంత కలాపం, దానిపై విశ్వాసం, ఆ పైన భక్తి ఇవన్నీ కలిసి ఉంటాయి. బౌద్ధంలో ఇవేవీ ఉండకపోవటం చేత సర్వసాధారణార్థంలో ఇది మతం కాదు.

బౌద్ధంలో ప్రధానమైనది సాధన, అన్వేషణ, తనను గురించిన హేతుబద్ధమైన పరిశీలన. బుద్ధుడు మార్గ ప్రదర్శకుడేగాని అతీత శక్తులతో అందరినీ తరింప చేస్తానన్న దివ్య పురుషుడు కాడు. గౌతముడు ఏ విశ్వాసాన్ని ప్రతిపాదించ లేదు సరికదా, వ్యతిరేకించాడు. అందువల్ల ప్రపంచంలోని ఇతర మతాలను పిలచిన అర్థంలో బౌద్ధాన్ని మతం అనరాదు.

సాధనకు ఒక గమ్యాన్ని నిర్దేశించి అందుకు ఒక శిక్షణా క్రమాన్ని ప్రతిపాదించటం బౌద్ధంలో గమనిస్తాం. ఒక అర్హత పొందిన వ్యక్తి వివిధ అనుభవ భూమికలను సాధకునికి అర్థం చేయటానికో, భిన్న లక్ష్యాలను స్పష్టం చేయటానికో కొన్ని ఉపదేశ ఉపాయాలను ఉపకరణాలుగా చేసుకొనవచ్చు. పాఠాలు చెప్పేటప్పుడు ఉపాధ్యాయునికి బోధన సామాగ్రిలాగా ఉపకరించటమే వాటి ప్రయోజనం. అందుకని బౌద్ధంలో అక్కడక్కడ శిక్షణా ప్రణాళికలలో భేదాలు కూడా కనిపిస్తాయి.

కాని కాలం గడవగా ఈ ఉపకరణాలే మూలవిరాట్టులై అవసరాన్ని మించి స్థిరపడిపోయి పూజలందుకొనే దశలు కూడా ఉన్నాయి. ఇందుకు బోధకుల అల్పదృష్టి, మతాధికారి వాంఛా ప్రాబల్యం అనూచాన పరంపర దోహదం చేస్తాయి. ఇందువల్ల సృజన శీలమైన ఆధ్యాత్మిక సాధన యాంత్రిక మతంగా మారిపోతుంది. ఈ పతన దశా పరిణామాన్ని బౌద్ధం కూడా తప్పించుకొనలేదు. కాని బౌద్ధం అసలు ఏమి చెప్పదలచుకొన్నది, ఎటు నడిపించదలచినది అని ఆలోచిస్తే అది ఒక స్వయం శిక్షణా కార్యక్రమంగా కనిపిస్తుంది.

శ్రీ బోధ చైతన్య గారి పుస్తకాలలో ''బౌద్ధంలో పండితుడు కావటం కన్నా బుద్ధత్వం పొందటం తేలిక'' అన్న వాక్యం చదివాను. కాని చాలామంది, కష్టమైనా సరే పాండిత్యం పొందటానికే ఎక్కువ కృషి చేస్తున్నారు. సాధనను పక్కనబెట్టి అనేక బాహ్య విషయాలను గురించి పరిశోధనాత్మకంగా, విషయ పరిజ్ఞాన పరిపుష్టంగా, పాండితీ ప్రౌఢంగా పుస్తకాలు వ్రాస్తున్నారు. ఇవి ఎన్ని చేసినా బౌద్ధ లక్ష్యాన్ని చేరుకొనలేము. సాధన చేయకుండా ఒడ్డున కూర్చొని బుద్ధ బోధను విశ్లేషించటమంటే కొమ్మలు చూచి చెరువులోని గేదెను బేరమాడినట్లే.

బౌద్ధంలో కూడా దేవతలు, వారి ప్రతిమలు వెలిసాయి. ఈ దేవతా రూపకల్పన బుద్ధుని మూలబోధకు విరుద్ధంగా అనిపిస్తుంది. తాంత్రిక విద్యలున్న వజ్రయాన శాఖాధిపతి దలైలామా

---

వావిలాల సుబ్బారావు, రిటైర్డ్ లెక్చరర్, సుహృల్లేఖ పద్య కావ్యాన్ని వ్రాశారు.
పాపయారాధ్య వీధి, అమరావతి.

బౌద్ధంలో భగవంతుని భావన లేదని అంగీకరించారు ( బాబా అమ్టే- దలైలామా సంభాషణ, టైమ్స్ ఆఫ్ ఇండియా ). అరుణాచల్ ప్రదేశ్‌లోని ''తవాంగ్'' లో 400 సంవత్సరాల క్రితం నిర్మించిన అతి పెద్ద మొనాస్టరీ ఉంది. అక్కడ వందల కొలది లామాలకు శిక్షణ ఇస్తుంటారు. అనేక దేవతా రూపాల ప్రతిమలు గోడలను, వేదికలను అలంకరించి ఉంటాయి. ఏమిటీ ఆరాధన, ఏమిటీ దేవతలు అని విచారిస్తే తెలుసుకొన్న విషయాలు (చైనా సరిహద్దుకు 10 మైళ్ళ దూరంలో ఉన్న ఈ స్థలాన్ని దర్శించటం నాకొక అపూర్వమైన అనుభవం.)

ఆ దేవతా విగ్రహాలుగా కనిపించేవన్నీ భావాలకు మాత్రమే ప్రతీకలు. ఒక్కొక్క భావం మీద మనస్సు లగ్నం కావటం కోసం ఏర్పరచిన కళాకృతులు. వాళ్ళు వాస్తవ జీవులని కాని, వాళ్ళు స్వయంగా రక్షిస్తారని కాని వారనుకోరు. హిందూ మతంలో ఉన్నట్లే దేవతను సాధకుడు అంగన్యాస కరన్యాసాలతో శరీరం మీదకు ఆవాహన చేసుకోవటం మొదలైన భావతాదాత్మ్య సాధనా పద్ధతులు వారికీ ఉన్నాయి. కాని అవన్నీ భావింపదగిన మనో దశలు, అభ్యాసయోగ్యమైన సుగుణాలు మాత్రమే. ఆరాధింపవలసిన సజీవులు కారు. ప్రతిమూర్తి మనలో ఒక జ్ఞానదశనో, భావాన్నో ఉత్తేజపరచడానికి. జాతికి జెండాలాంటి చిహ్నం మాత్రమే. కాని జెండాలకే పూజలు, అర్చనలు చేసే వక్రమార్గం కూడా ప్రవేశించక పోలేదు.

''బోధి సత్వుడు'' అనంతమైన కరుణా స్వభావానికి సంకేతం. ''అమితాభ బుద్ధుడు'' అనంత జీవనానికి, జ్ఞానానికి సంకేతం. అపూర్వమైన చిరునవ్వుతో కనిపించే ''మైత్రేయ బుద్ధుడు'' తృప్తికి ప్రసన్నతకు చిహ్నం. ఈ ప్రసన్నతాది గుణాలు బుద్ధుని బోధనలను అభ్యసించడానికి అవసరమైన ప్రాథమిక మనోలక్షణాలు. అతనికున్న పెద్ద పొట్ట సరళతకు, సహనానికి, ఉదారతకు చిహ్నం. ఇట్లాగే అనేక దేవతారూపాలు భిన్న భిన్న భావాలకు ప్రతీకలు. బహుశా వైదిక మతంలో కూడా ఇట్లాగే ప్రారంభమైన ప్రతీకలు పురాణాల ద్వారా నేటికి ఆరాధ్యమైన విగ్రహాల అవతారం ఎత్తి ఉంటాయి.

బౌద్ధానికి ప్రధాన లక్ష్యం ప్రశాంతి, దుఃఖరాహిత్యం. ఎవరెన్ని ఉపాయాలు చెప్పినా అవన్నీ సూటిగానో, భంగ్యంతరంగానో ఆ దుఃఖరహితస్థితిని సాధించటానికి మార్గాలే. అనుక్షణం అంతరంగ పరిశీలన, సమ్యక్ స్మృతి ఇవే ఇందులో ప్రధాన సాధనాలు. ఈ స్మృతి సాధనలోకి తనకు తాను ప్రవేశించడమే బౌద్ధ సాధన. శీల నియమాలు ఎన్ని చెప్పినా అవి బాహ్య ఆచరణలు మాత్రమే. నిరంతర స్మృతిసాధన వల్ల ఈ నియమాలు సహజ ఆచరణలుగా పరిణమిస్తాయి. బౌద్ధ ఆచరణకు తుది గమ్యం అంటూ ఏమీ లేదు. ఎవరు ఏ మేరకు సాధిస్తే ఆ మేరకే సాఫల్యం. ఎంత ప్రయాణించినా ఇంకా ఉండే ఉంటుంది. అది ముగింపు లేని ప్రయాణం. చివరకు ప్రయత్నమే లేని ప్రయాణం. అందువల్ల బౌద్ధం ఏ విశ్వాసాన్ని ప్రతిపాదించదు పైగా నిరాకరిస్తుంది.

దేవతా రూపాలు భావ సంకేతాలైనట్లు వాస్తు నిర్మాణాలు కూడా సంకేతాత్మకాలే అంటారు. ''తవాంగ్'' లోని మొనాస్టరీ బయటకు చూడటానికి రెండంతస్థుల భవనంలా ఉంటుంది. లోపల చూస్తే ఒకే కప్పు క్రింద ఏకాండమైన అంతరాళం ఉంటుంది. రెండంతస్థులు లాగా కనిపించే నిర్మాణం మండువాల వంటి రెండు వరండాలు. అవి సాపేక్ష సత్యానికి పరమ సత్యానికి చిహ్నాలు. లోపల

కనిపించే ఒకే అంతరాళం రెండు సత్యాలు ఒకటే సుమా! అని చెప్పే ఏకరూపత (ఇట్లాంటి వ్యాఖ్యానాలు హిందూ వాస్తు నిర్మాణాలకు కూడా లేకపోలేదు.) ఈ విధంగానే చైత్యాకృతులకు కూడా భావ వివరణలు ఉన్నాయి. బోర్లించిన అర్ధగోళాకృతి నీటి బుడగను పోలి జీవితం బుద్బుద ప్రాయమని సూచిస్తుందని చెప్పారు. ఈ రకంగా నిర్మాణాలను, శిల్పాలను, దేవతా మూర్తులను అన్నింటిని తత్త్వ బోధనకు ఉపకరించే సంకేత సామాగ్రిగనే భావించాలి. అంతకు మించిన భ్రాంతులను, కల్పనలను వాటి చుట్టూ అల్లటాన్ని బౌద్ధం ఆమోదించదు. విగ్రహాలను అలకంరించటం, అగరువత్తులను వెలిగించటం, వస్త్రాలను సమర్పించడం వంటి ఉపచార క్రియలు గౌరవ సూచకాలేగాని మహిమాన్విత పూజా విషయాలు కావు. మతం జ్ఞాన సాధనగా ప్రారంభమైనా అంధ విశ్వాస రూపంగా అవతరించటం మన ప్రత్యక్షంలోనిదే. అది పరమార్థం కాదని ఎప్పటికప్పుడు మననం చేసుకోవాలి (లేకుంటే కలిగే అంధ విశ్వాస పరాకాష్టకు తిరుపతి ప్రాకార నిర్మాణ చర్చలు, వెయ్యి కాళ్ళ మంటపం విషయంలో అభ్యంతరాలు వర్తమాన తార్కాణాలు).

శాక్యముని గౌతముడు అత్యుత్తమ బోధకుడు. తనకు కలిగిన అంతఃస్ఫురణనే పరమ సత్యమని నిర్ధారించి దగ్గరకు చేరిన వారందరినీ విశ్వాసాల వైపు, సర్వార్పణ వైపు నడిపించిన ప్రవక్త కాదు. బుద్ధుడు బోధించిన సాధనామార్గం పూర్తిగా వ్యక్తి మూలకమైనది. మన దుఃఖానికి అన్వేషణకు సమాధానాలు బయట నుండి వచ్చేవకావు. అవి ఎక్కడ నుండి పుడతాయో వాటి సమాధానాలు కూడా అక్కడే లభిస్తాయి. ''ఆధ్యాత్మిక జగత్తులో అన్ని సమాధానాలు వ్యక్తిగతాలే. ప్రేమలాగా ధర్మం కూడా వ్యక్తిగత విషయం'' అంటారు ఆచార్య రజనీష్ (ఓషో). ప్రేమలాంటి వ్యక్తిగతానుభవం లేకుండా సత్యం గురించి విశ్లేషించడం, పుస్తకాలు వ్రాయడం అంతా మేధోవ్యాపారమే అవుతుంది. ఆధ్యాత్మికత పాండిత్యము కాదు, అనుభవం. ఎంత వివరిస్తే మాత్రం ఎట్లా తెలుస్తుంది? ఏ ''బీథోవెన్'' లాంటి వాడో వచ్చి వెన్నెలను సంగీతం ద్వారా గుడ్డివాడి అనుభవానికి అందించినట్లు అందిస్తే తప్ప!

''నేను నీ మార్గంలో ఎక్కడైనా ఎదురుపడితే వెంటనే నా తల నరికేయి'' అని బుద్ధుడు శిష్యులకు చెప్పాడని ఎక్కడో చదివాను. శిష్యుల అన్వేషణా స్వేచ్ఛను ఇంతగా ప్రోత్సహించిన ఆధ్యాత్మిక గురువు మరెవరైనా ఉన్నారా! ''నేనే నీకు సర్వస్వం ప్రశ్నించకు, సందేహించకు'' అనే వారే తప్ప ''గురూడం'' లేకుండా ఎవరికి వారు అన్వేషణలో శక్తి మేరకు ప్రయాణించే పద్ధతిని చెప్పే వారేరి గౌతముడు తప్ప! సాధకునికి శోధనాంశం కూడా తన మనస్సే. బాహ్య వస్తు విశ్లేషణ చేసే శాస్త్రాలు ఆయా రంగాలలో చాలా పురోగమించాయి. మనస్సును బాహ్య వస్తువుగా తీసుకొని విశ్లేషించే మనస్తత్వ శాస్త్రం కూడా ఆలస్యంగానైనా పురోగమిస్తున్నది. ఇక్కడ ఒకని మనస్సు మరొకనికి పరిశీలనాంశం అవుతుంది. మరి తన మనస్సు మాటేమిటి? తన మనస్సంచార మార్గాలను, వైకల్య నిదానాలను తాను ఎరుగగలడా? తన శాంతిని తాను సాధించగలడా? ఒక వేళ సాధ్యమే అయినా అది మనశ్శాస్త్రం ఎరిగిన వానికే పరిమితము. మనశ్శాస్త్ర పరిచయం లేకుండానే ఎవరికి వారు తనలోని మరుగులను అద్దంలోలాగా చూసుకుంటూ స్వభావాన్ని గ్రహించి సవరించుకొనటం మాత్రం బుద్ధుని ఆచరణామార్గం ద్వారానే సాధ్యం.

బుద్ధుని బోధనలలో ప్రధాన అంశాలు శీలం, సమాధి, ప్రజ్ఞలు. ఇందులో శీల సమాధులు మాత్రమే ఆచరించేవి. ప్రజ్ఞ ఫలితాంశం. అది దుఃఖరహితత్వానికి, ప్రశాంతికి పీఠభూమి. ''బోధిచిత్తా''నికి జనకస్థానం. మనస్సు కరుణలో, ప్రశాంతిలో నిలవాలి. సర్వ జీవ రహిత భావనయైన ''బోధిచిత్తం'' అలవడాలి. సర్వజీవ హిత భావన ప్రయత్నపూర్వక సంకల్పం ద్వారా వచ్చేది కాదు. భావాల ఆపాదనంతో కాని, రూపధ్యానంతో కాని, బీజరూపమైన శబ్దాలను సదా మననం చేయటం వల్ల కాని ఇది లభించేది కాదు. అయినా వీటి ద్వారా కూడా ఉన్నత మానసిక స్థితిని చేరిన మహాపురుషులు ఉన్నారు. వారి ఉద్వేగాలు గొప్ప కళాకృతిని పొందిన సందర్భాలు కూడా ఉన్నాయి. వారి జీవితాలే పురాణాలైన ఉదాహరణలు కూడా అనేకం. కాని అవన్నీ ఆపాదనలే కావటం వల్ల పరమ సత్యంగా శిరోధార్యాలు కాలేదు. త్యాగరాజు సంగీతం ఎత గొప్పదైనా అదంతా ఒక భావకల్పనపై ఆధారపడినదే గదా! రాముడి లోహ విగ్రహాలు కన్పించకపోతే అపరిమితమైన దుఃఖానికి లోనై పాటలు పాడిన అతనిపై, అవి ఎంత శ్రావ్యంగా ఉన్నా, జాలిగలిగినంతగా సత్యామోదము కలుగదు గదా. పురాణాలు, సాహిత్యాలు, కళలు పుట్టడానికి భ్రాంతి మద్భావం చాలా దోహదం చేసింది అన్నదీ నిజమే. పూర్ణ సత్యాన్ని గ్రహించనీయకుండా అడ్డుకొన్న మాట నిజమే. బహుశా 'ప్లేటో' కళలన్నీ సత్యానికి రెండు మెట్లు తక్కువగా భావించడం ఇందువల్లనేనేమో !

ఈ ప్రపంచాన్ని నిరాకరించకుండానే దుఃఖం నుండి బయటపడే మార్గాన్ని బుద్ధుడు సూచించాడు. సంసార స్వరూపాన్ని సమూలంగా తెలుసుకోవడం ద్వారానే దుఃఖ విముక్తి అవుతుందని, అది తెలుసుకొనే మార్గం ఉందని, అది అందరికీ సాధ్యమని చెప్పాడు. ఏ ఆపాదనలు లేని అస్తిత్వానుభవంలో ఉండటమెట్లాగో నేర్పాడు. మనసులోని పొరలను రమ్మనిగాని పొమ్మనిగాని అనకుండా, ఇష్టాయిష్టాలు లేకుండా చూసే పద్ధతిని - తద్వారా దుఃఖానికి దూరమయ్యే పద్ధతిని నేర్పాడు. అనుక్షణ స్మృతి అంటేమరపులేని ఎరుకలో ఉండటమే. తనను తాను తెలుసుకొనడం, ఎక్స్‌రే అద్దం ముందు నుంచొని తనను తాను స్పష్టంగా చూచుకొంటూ సవరించుకొనే మార్గమే బౌద్ధం. రోజుకొకగంటసేపు ధ్యాన సమయంతో సరిపుచ్చుకొనే తమాషా కాదు. ప్రవృత్తి సమయమంతట అదే, అదే ధ్యాసతో ఉండే శిక్షణ.

ఎగరటం, ఉల్లాసంగా ఉండటం, ఇవి కావు దుఃఖ రహితత్వమంటే. ఇవన్నీ దుఃఖానికి తిరగేసిన రూపాలు. ఆనందమంటే వేరుగా ఉండదు. దుఃఖరాహిత్యమే ఆనందం. తోటి వారిని ప్రేమించమన్నా, ధర్మంగా ఉండు అన్నా ''ఎందుకు చెయ్యాలి''? అన్న ప్రశ్నకు ఇంకా అవకాశం మిగిలే ఉంటుంది. కాని దుఃఖరహితస్థితిని పొందిన తర్వాత బోధి చిత్తానికి ప్రేమ, ధర్మం, ఋజువర్తన మొదలైనవన్నీ సహజ గుణాలుగా ఉంటాయి. అది ఒక మనస్థితి అవుతుంది. .నీతి ఎందుకు, ప్రేమ ఎందుకు అన్న ప్రశ్నలు, ''శ్వాస ఎందుకు'' అన్నంత అసంబద్ధంగా ఉంటాయి. ఈ మనస్థితికి శిక్షణ ఇస్తుంది బౌద్ధం. కనుక తనను తనకు బోధపరచుకొనడమే బౌద్ధం.

# సుఖ-దుఃఖాల మూలం మనస్సే అంటున్న బౌద్ధం

– మ. శివరామకృష్ణ

బుద్ధుడి దార్శనిక తత్వాన్ని ఒక మతంగా వర్ణించటం సాధారణంగా జరిగేదే. అయితే ఆయన ఒక మతానికి ఆది పురుషుడు అనటం కన్నా, ఒక జీవన విధానాన్ని రూపుదిద్ది, దానికి సంబంధించిన ఆచరణ సూత్రాలని అనుభవ పూర్వకంగా రూపు దిద్దాడనటం మరింత సమంజసం. చైతన్య పరివర్తన ద్వారా దుఃఖాన్ని ఉపశమింప చేయటం తన అనుష్ఠాన ఆధ్యాత్మికతకి లక్ష్యంగా ఎన్నుకొన్నాడు, ఆ అపూర్వ తాత్వికుడు. ''దుఃఖ నివృత్తి, సుఖ ప్రాప్తి'' కాక ''దుఃఖ నివృత్తి శాంతి ప్రాప్తి''. ఇదే బుద్ధుడి బోధల సారాంశం.

ఈ లక్ష్య సాధనకి పరికరాలు సంస్కరించబడిన మనస్సు, పరివర్తనం చెందిన చైతన్యం. దాదాపు అన్ని మతాలలోనూ పూజ, పునస్కారాల వెంపర్లాట ఎక్కువ. బౌద్ధంలో మనస్సే అంతా. అంతరంగ పరివర్తన వల్ల చైతన్య స్థితులలో ప్రగాఢమైన మార్పు వచ్చి, నిత్య, దైనందిన జీవితంలో అన్ని కర్మలను ఆవరించే శాంతి అవతరిస్తుంది. ఈ అనుష్ఠాన పరం, చైతన్యంలో 'అవగుణాల' మార్పుల ఆధారం: మౌలికమైన ఈ గుణాలు ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధ ధర్మాన్ని అనూహ్యంగా ఆకట్టుకున్నాయి.

కేవలం ఆకర్షణ కాకుండా తమ తమ సాంస్కృతిక, మత పరమైన పరిధుల్లో బుద్ధుడి ఆధ్యాత్మిక సూత్రాలని అన్వయం చేసుకునే ప్రయత్నం ఎందరో అభిమానుల్లో కనిపిస్తుంది. విపస్సన ధ్యాన పద్ధతికి అమెరికాలో ఎంతో ప్రాచుర్యం కలిగించిన Sharon Salzberg అంటుంది: ''సాంప్రదాయకంగా బుద్ధుడు, ధర్మం, సంఘం: వీటిలో విశ్వాసం వుండాలని చెపుతారు. అయితే చివరకి ఆ విశ్వాసం మనలోనే, మనపైనే, మనం అప్రమత్తతో, కరుణతో జీవించగలమని, చివరకు స్వేచ్ఛగా వుండగలమని''[1] (ఇదే విశ్వాసం).

బాహ్యమైన ఏ ఆలంబనాలు లేకుండా, చిట్ట చివరకు సాధించేది, మొట్టమొదటే పట్టుకొనటం. మనస్సుని, చైతన్యాన్నీ అవిభాజ్య పరిపూర్ణతని పట్టుకొనటం. ఈ అనుష్ఠాన ఆధారమైన అపూర్వతే బుద్ధుడి తత్వాన్ని పాశ్చాత్యుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. కొలంబియా విశ్వవిద్యాలయంలో Indo-Tibetan Studies లో ఆచార్యుడుగా వున్న Robert Thurman తన అనుభవాన్ని వివరిస్తూ అంటాడు: ''హార్వర్డ్‌లో నాకు లభించిన తత్వశాస్త్ర బోధల కంటె మెరుగైన వాటికోసం అన్వేషించా. మనస్సు ఎట్లా పనిచేస్తుంది, అవగాహన చేసుకున్నదంతా జీవితంలో ఏ విధంగా అనుష్ఠించాలి. ఈ సూక్ష్మాలు తెలుసుకోవాలని ఆకాంక్ష. చైతన్యవంతమైన ఒక తత్వం కోసం - ఒక యోగం కోసం - అన్వేషించా'' ఈ ప్రేరణ చివరకు Thurman ని బుద్ధుడి పట్ల ఆకర్షితుణ్ణి చేయటమే కాక, అతన్ని ఒక బౌద్ధ 'ఉపాసకుని'గా కూడా మార్చింది.

తన అనుభవం ఆధారంగా, జ్ఞానోదయం - గౌతముడు బుద్ధుడు అవటం - అంటే తన దృష్టిలో ఏమిటో Thurman వివరిస్తారు. ''విచారణ ద్వారా 'నేను' అన్న అహంకార భావం సడలిపోయి... ప్రపంచంతో ఒక కొత్త సంబంధం ఏర్పడుతుంది. 'నేను' కేంద్రంగా వున్న ఈ ప్రపంచం రూపు రేఖలు మారి, దానిలో ప్రవహించి చైతన్యధారతో ఏకమవుతాం. ఆ మహా చైతన్య శక్తితో లయమవుతాం.

---

మ. శివరామకృష్ణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి రిటైర్ అయినారు, హైదరాబాద్.

ఈ ( అనుభవం) మేధస్సు ద్వారానూ సంభవిస్తుంది. ఇది సంపూర్ణమైన ఆధ్యాత్మిక జాగృతి కూడా. ఇది కేవలం ''దృక్పథం''లో, ''చూపులో'' తేడా కాదు. ఆ అనుభవం భావ పూరితం, నైతికం కావటం వల్ల ఆనందాన్ని స్పందింపచేసి, భావాలన్నిటినీ పునీతం చేసి, తద్వారా కారుణ్యంతో నిండిన కర్మల ద్వారా ( మానవాళి) సేవకి ప్రోత్సహిస్తుంది.''

ప్రపంచం అంతా బుద్ధుడి అంతరంగ చైతన్య సూత్రాలకి రంగస్థలం అన్న యథార్థం మరెందరినో బలంగా ఆకట్టుకుంది. ఆ సూత్రాలని తాము చేసే దైనందిన చర్యలన్నిటిలోనూ అంతర్లీనంగా వుండేటట్లు తమ జీవనశైలిని ప్రబలంగా మార్చుకున్న వాళ్ళు ఎందరో వున్నారు. విభిన్నమైన వృత్తులు, ప్రవృత్తులు, ఉద్యోగాలు, ఉపాధులు వున్న పాశ్చాత్యుల దృక్పథంలో పెను మార్పులు కనిపిస్తాయి. ఉద్యోగ ధర్మంలోనే బుద్ధ ధర్మ సూక్ష్మాలు, ధ్యాన ప్రక్రియలు సమానాంతరంగా కొనసాగటం. Michael Roach ఒక ఉదాహరణ: వజ్రాల వ్యాపారి, పండితుడు, సాధకుడు. బుద్ధుడి ఉపదేశాలన్నిటినీ దాదాపు 2,00,000 గ్రంథాలు - Computer Disks లో భద్రపరచే కార్యక్రమం చేపట్టాడు. వజ్రాల వ్యాపారి అయిన తనకి Diamond Sutra ఎంతో ఉత్తేజం కలిగించిదంటాడు. తన వ్యాపారం అంతా ''కోపం, ఈర్ష్య లేని బుద్ధుడి సూత్రాల పైనే నడుస్తుంది'' అంటాడు. ''ఎవరైనా కోపం గాని, ఈర్ష్యగాని ప్రదర్శిస్తే, వాళ్ళని భోజనానికి తీసుకుపోయి, బుద్ధుడి తత్త్వం చెపుతా.'' ఈర్ష్యని కుదర్చాలంటే ఇరవై నిమిషాలు, ఆగ్రహం నిగ్రహించాలంటే రెండు రోజులు పట్టచ్చు అని చెపుతాడు Roach.

ఈ మార్పు పైపూత కాదు. కలకాలం మనేటట్లు మార్చటం. చైతన్యంలో, మౌలికమైన స్పృహలో మార్పులు తేవటం. మరి బుద్ధుడి తత్త్వం, వ్యాపారం రెండూ పొసుగుతాయా అని అడిగితే ''నా వ్యాపారం నా లాభం కోసం కాదు. సంపాదించినది టిబెట్‌లోనూ, ఇండియాలోనూ కనీసమైన ఆహార, పానీయ సదుపాయాలు లేని బౌద్ధ బిక్షువుల కోసం'' అంటాడు. పైగా తనతో పని చేసే వాళ్ళందర్నీ రెండు వారాలు ధ్యాన శిబిరాలకి పంపటం జరుగుతుంది. తాను కూడా రెండు సంవత్సరాల కొకసారి, ఒక నెలపాటు ఆ కార్యక్రమానికి వెడతాడు.

మరొక సాధకుడు అంటాడు: ''బంగారాన్ని కంసాలి ఎట్లా పరీక్షిస్తాడో, ఒక కొత్త మిశ్రమాన్ని Chemist ఏ విధంగా అధ్యయనం చేస్తాడో, ఆ విధంగా మన అనుభవాలని నిశితంగా పరీక్షించుకుని, మేధస్సు ద్వారా నిగ్గు తేల్చుకొనటానికి అవకాశం ఇచ్చే ధర్మం బుద్ధ భగవానుడిది.'' అందుకే ఆ జీవన పథం అంటే నాకు అభిమానం అంటాడు.

బౌద్ధ ధర్మాన్ని అనుసరించే మరొక అతి చిత్రమైన అభిమాని Robina Courfin. ఈమెని "Nun Among Gangsters" అని వర్ణించారు. కరడు కట్టిన నేరస్థుల్లో బుద్ధుని సూత్రాల ద్వారా అనూహ్యమైన మార్పు తెచ్చింది ఈమె. ఒక ఉదాహరణ మెక్సికోకి చెందిన హంతకుడు Arturo. ఎక్కడో ఒక వాక్యం చదివాడు: ''ఈ ప్రపంచంలో సత్యమేమిటో తెలుసుకొనటానికి తపిస్తాడు మనిషి. ఈ సత్యం తెలుసుకున్నపుడే అతని అశాంతి అంత మవుతుంది. ఏ సత్యం కోసం తాను తపిస్తున్నాడో దాని పునాది తన ( అంతరంగంలోనే) వున్నదని గ్రహిస్తాడు''.

ఈ వాక్యం Arturo ని ఎంతో ఆకట్టుకుంది. ఆ సత్యాన్వేషణ సందర్భంగానే అతను బౌద్ధ ధర్మం గురించి తెలుసుకుంటాడు. ఇటువంటి మార్పుకి కారణం ఖైదీలకి బౌద్ధ ధర్మం పరిచయం చేసిన, చేస్తున్న Robina. ''అంతా అంతరంగంలోనే వున్నది'' అన్న సత్యం తనని ఎంతగానో ఆకట్టుకున్నది అంటాడు Arturo. ఈ సత్యాన్ని రమణ మహర్షి దృక్పథంలో చెప్పాలంటే: '' 'నేను' అని భావించే 'నేను' ని తెలుసుకుంటే ఇక ఏ 'నేనూ' బహిరంగా లేదు అన్న సత్యం బహిర్గతమవుతుంది''. ఇదే సూక్ష్మాన్ని Stelihen Mitchell, If you find the Buddha on the Road, kill him! అన్న తమాషా అయిన శీర్షికతో వున్న తన పుస్తకంలో వివరించాడు. Robina ఎందరిలోనే మార్పు తెచ్చి క్రూరత్వం మూర్తీభవించిన వాళ్ళని కారుణ్యంతో నింపివేసింది. ఇదే బౌద్ధ ధర్మం యొక్క అపూర్వత.

మరో దృష్టాంతం Lama Palden Drolna. అమెరికాలో జన్మించిన ఈ యువతి మొదట రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనేది. శాంతి స్థాపన ఉద్యమాలు ఆమెని విపరీతంగా ఆకట్టుకొన్నాయి. అయితే బౌద్ధ ధర్మ పరిచయం, అనుష్టానం దృక్పథాన్ని తనని సమూలంగా మార్చివేసిన సంగతి చెపుతూ ఆమె అన్నది: ''యుద్ధాలని వుసిగొలిపే ఆగ్రహం ప్రతి ఒక్కరిలో లోపలే వుంది. అంతర్గతంగా నాలో వున్న కోపం మొదలైన దోషాలను సంస్కరించకుండా, ప్రపంచాన్ని మార్చటం అన్నది పొసగదు. అందుకే నాలో నేను ప్రవేశించి, నన్ను నేను సంస్కరించుకుని, ఆ నా శాంతిమయమైన కేంద్రం నుంచే ప్రపంచానికి ఏదో ఒక ప్రయోజనం చేకూర్చగలను. నేను ఎన్నుకొన్నది ఈ మార్గమే.''

ఈ లామా Psychotherapist కూడా. బౌద్ధ ధర్మ మానసిక సూక్ష్మాలకి, పాశ్చాత్య మానసిక శాస్త్రవేత్తలకి - ప్రత్యేకించి Psychiatrist మధ్య వున్న సామ్యాలని ఈ విధంగా వివరించింది: ''ఈ రెండూ మానవుడి మనస్సుతో ఒకటి, చిత్త వృత్తితో మరొకటి పని చేస్తున్నా, నిజానికి రెండింటిని విడదీసే మార్గం లేదు.... క్రోధం, లోభం, ఈర్ష్య, కోరిక, అహంకారం (గర్వం) మానవుడి పరిస్థితుల్లో నిరంతర అవగుణాలు. వీటిని మానసిక శాస్త్ర మెళకువల ద్వారా సరి చేసుకోగలిగితే'' - ఆ క్షాళన జరిగితే - బుద్ధుడి ఆధ్యాత్మిక సూత్రాలని మరింత పటిష్టంగా ఆచరించగలం అంటుంది ఈమె. అచేతనంగా వున్న కొన్ని 'కాంప్లెక్స్' లని సైకో ఎనాలిసిస్ ద్వారా తొలగించుకొనటం సాధ్యమని ఈమె విశ్వాసం. ఇంతే కాదు: ఇతరుల దుఃఖం మనలో కరుణని, దయని స్పందింప చేసినపుడే ఆ దుఃఖానికి మనం ఉపశమన మార్గం కనుగొనగలం అంటుంది. ''కరుణ అందర్నీ కలుపుతుంది'' - "Compassion interconnects".

సంగీతంలో ఎన్నో కొత్త ఒరవడులు పెట్టిన Philip Glass తన అనుభవాన్ని చెపుతూ అన్నాడు: ''బౌద్ధ ధర్మ ప్రభావం కేవలం ఒక భావ పరిధిలోనే కాదు. అది ఒక చిత్రం గీచినట్లు, ఒక నవల వ్రాసినట్లు కాదు. దాని ప్రాముఖ్యత అంతా దైనందిన జీవితంలోనే. కరుణ, సమత్వం, విపస్సన (అప్రమత్తత): వీటిని పెంపొందించుకొనటం జీవితంలో అనుష్టానపరమైన అంశాలు.'' పైగా బుద్ధుడి ధర్మం authenticగా టిబెట్ లోనో, భారతదేశంలోనే లభిస్తుంది అనటం భ్రమ. అది భౌతిక పరిధులలో, భౌగోళిక పరిమితులలో దొరికేది కాదు. అమెరికాకి వచ్చిన టిబెటన్ లామాలు తిరిగి వెళ్ళటానికి ఇచ్చగించక పోవటానికి కారణం బౌద్ధం విశ్వజనీనమైన దృక్పథం కనుక ఎక్కడైనా, ఎవరైనా దానిని తమ చైతన్యంలో నిలుపుకోవచ్చు.

Sister Kovidaకి మరింత చిత్రమైన దృక్పథం బౌద్ధం ద్వారా లభించింది. బౌద్ధ ధర్మంలో భిక్ష తెచ్చుకొని లభించిన ఆ ఆహారాన్ని తినటం ఒక అంశం. భిక్షకు వెళ్ళి, ఏది దొరికితే అది తెచ్చుకుని దానితో తృప్తిగా ఉండటం సీదాసాదా వ్యవహారం కాదంటుంది ఈమె. "Alms gathering" మానసిక పరివర్తనలో ఒక భాగం. అసలు భిక్షకు వెళ్ళాలంటేనే బిడియం అనిపించే స్వాతిశయం. పైగా మనకి మక్కువ వున్నవే దొరకవు. అతిశయం పోయి, ఏది లభిస్తే దాన్ని తృప్తిగా, ఆనందంగా ఆరగించటం మనసుకి వైద్యమే. దీన్ని గురించి వివరిస్తూ sister అంటుంది: ''బాగా ఇష్టమైనది తినాలన్న తృష్ణ ఎంత బలమైనదో తెలుస్తుంది. ఆ తృష్ణని అణచకుండా, వ్యక్తం చేసే ప్రయత్నం చేయకుండా, ఆ భావాన్ని ఒక సాక్షిలా వుండి పరిశీలిస్తే, ఆ అనుభవం యొక్క తత్వం అర్థం అయి ఆ కోరిక తొలగిపోతుంది. ఆ కోరిక ఉద్భవిస్తుంది : సమసి పోతుంది. తృష్ణ నుంచి మనకి స్వేచ్ఛ లభిస్తుంది.'' ఈ విధంగా చేస్తే వచ్చే ఫలితం "Deep feeling of peace". బౌద్ధ ధర్మంలో craving అన్ని అశాంతులకి మూలం.

ఇంతేకాదు : "alms gathering" ద్వారా ప్రపంచ పోకడలు అర్థమవుతాయి. విభిన్నమైన మనస్తత్వాల పరిచయం కలిగి, అవగాహన జనించి, మనలో జాలి, కరుణ మరింతగా పెరిగే సందర్భాలు వస్తాయి. కొందరు భిక్షకోసం వెళితే దూషిస్తారు. కొందరు అసహ్యించుకుంటారు. కొందరు విసుక్కుంటూ ఇస్తారు. కొందరు ఆనందంతో - దైవాన్ని సేవించే మార్గం ఇది అన్న అవగాహనతో - భిక్షవేస్తారు. అందరి పట్లా సాధకుడి దృక్పథం ఒకే మాదిరిగా వుండాలి. అదే బుద్ధుడి కరుణామయ తత్వం.

ఇటువంటి అనుభవాలు కలిగిన మరెందరో వున్నారు. ఇంతే కాదు ఈ మధ్యనే ఒక చిత్రమైన అంశం బయటపడింది. "Secret of a Buddhist Smile" అన్న శీర్షికతో వార్తాపత్రికల్లో వచ్చింది. సాంకేతికమైన వివరణలని పక్కకి పెడితే, neuro scientists అంటున్నది మన brain లోనే ఉన్న ఒక "spot" - "left preforntal lobe" అంటారు. దీన్ని "Positive emotions" కి good moodsకి కేంద్రం. ఇది "unusually active among practising Buddhists" ఇది "committed Buddhists" brainలని scan చేసిన తర్వాత Richard Davidson (University of Wisconsin) వెలికి తెచ్చిన అంశం. దీన్ని వివరిస్తూ "That transcendental smile on many a Buddhists face could hide a deeper truth : their religion appears to be the secret of long - term happiness." (ఇది Hindu Health scanలో వచ్చిన వార్త. తేదీ దొరకలేదు. ఈ మధ్యనే వచ్చింది.)

మరి ఈ అపూర్వమైన ధర్మాన్ని ఇతర ధర్మాలు తోసిపుచ్చగలవా? అసలు ఒక మతం/ధర్మం మరొక ధర్మాన్ని సమూలంగా పెకలించి వేస్తుందా?

---

1. ఈ వ్యాసంలోని అంశాలన్నీ Vicki Mackenzie వ్రాసిన Why Buddhism? Westerners in Search of wisdom (London : Thorsons/Harper Collins 2003) నుంచి సేకరించినవి. ఆ పుస్తకం ఎంతగానో నన్ను ఆకర్షించింది. రచయిత్రికి నా కృతజ్ఞతలు. బౌద్ధ ధర్మం పైన అభిమానం, ఆసక్తి వున్న వాళ్ళందరూ తప్పక చూడవలసిన పుస్తకం.

# బౌద్ధ జీవన దృక్పథం

- ఎమ్. వి. ఎస్. అప్పారావు

**స్వగతం**

సుమారు నాలుగు దశాబ్దాల మెడిటేషన్, అయిదు దశాబ్దాల స్టడీ ఫలితం ఈ వ్యాసం. అంచాత దయచేసి పాఠకులు ఇందులోని అంశాలను సీరియస్‌గా తీసుకోవాలని ప్రార్థన.

## మెడిటేషన్ విశిష్టత

రెండు వేల ఆరు వందల సంవత్సరాల నాడు గౌతమ బుద్ధుడు ప్రపంచంలో తొలిసారిగా విపస్సనా భావన అనే ధ్యాన పద్ధతిని ప్రవేశపెట్టాడు. అది ఆనాడు ఎంత విప్లవాన్ని తీసికొని వచ్చిందో, ఇప్పుడూ అదే పరిస్థితి. దర్మిలా పుట్ట గొడుగుల్లా లేచిన, లేస్తున్న సహజ యోగము, సమాధియోగము, ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతము, ద్వైతాద్వైతము, శుద్ధాద్వైతము, కృష్ణా కాన్షస్‌నెస్, హఠయోగము, క్రియా యోగము, దత్త పద్ధతి, వ్రతాలు, యజ్ఞాలు, యాగాలు, మంత్రాలు, తంత్రాలు, మణికంఠ, మాతా, సాయిబాబా దీక్షలు, ఒకటేమిటి - బుద్ధుని నాడు అరవై రెండు మెటాఫిజికల్ స్పెక్యులేషన్స్ ఉండేవని ఆయనే బ్రహ్మజాల సుత్తలో - త్రిపిటకాల్లోని తొలి సుత్తలో చెప్పాడు. ఇలాంటి స్పెక్యులేషన్సుతో ఆనాటి గురువులు, ఈనాటి సూపర్ మార్కెట్ గురూజీలు, తాము కంగారు పడుతూ జనాన్ని కంగారు పెట్టేస్తున్నారు. ఈనాటి యోగా టెక్నిక్‌లు పూర్తిగా కమర్షియలైజు అయిపోయాయి. సహజయోగ వెబ్‌సైట్లు, పేటెంట్లు, లిటిగేషన్, సెపరేట్ టి. వి. చానల్స్. ఒక్క మాటలో - నేటి యోగాలకు, రాజకీయాలకు, సినిమాలకు, స్పోర్ట్సుకు ఏమీ తేడా లేదు. వీటి కొచ్చిన ధనం మరే ప్రొఫెషన్సుకు రాదు. వీటితో విపస్సనా, దాని ఆఫ్ షూట్ జెన్ మెడిటేషన్లను పోల్చండి. ఇది స్వచ్ఛ, ధవళ వజ్ర సూచి. విపస్సనలో ముఖ్యమైనది సతి / స్మృతి / మైండ్‌ఫుల్‌నెస్ / ఎరుక / దీని క్రింద మెట్టు అవేర్‌నెస్ / అలర్టునెస్ / కాంప్రహెన్షన్ / శ్వాసపై ధ్యాస / ఉచ్ఛ్వాస, నిశ్వాసాలను సతితో గమనించటం. ఈ సతి నిద్ర లేచినది మొదలు, పడుకునే వరకు తైలధారవలె ఉండాలి. మన శరీర కదలికలు, శరీరంలోని శుభ, అశుభ భాగాలు, నాలుగు భూతాల కదలికలు, స్మశానానికి తీసుకుపోయే శవ కవళికలు, ఎముకలు పిండి, పిండి అయిపోయే వరకు, ఇంద్రియాల వివిధ కార్యాలు వీటన్నిటినీ సతితో చూడాలి. అప్పుడు మన బ్రెయిన్ సెల్సు యాక్టివ్‌గా ఉంటాయి. ముదిమి రాదు. చావు చాలా దూరంగా ఉంటుంది. చావుతో సహా ప్రతి నిత్యమూ సతితో ఉన్నవాడికి చావు ఎక్కడిది? సతి అంటే అనుక్షణం చచ్చి బ్రతకటమే! అయితే ఈ సాధనకు కొన్ని అడ్డంకులు ఉన్నాయి. కోరికలు, తణ్హా / తృష్ణ, బద్ధకం, ద్వేషం, హడావుడి / హర్లీ బర్లీ / కంగారు వీటిని మనం అదుపులో పెట్టుకోవాలి.

ప్రతి నేనో (Nano) సెకండుకి బ్రెయిన్ సెల్సు బిలియన్ల సంఖ్యలో చస్తుంటాయి. మళ్ళీ వేరే సెల్సు పుడుతుంటాయి. విపస్సన వల్ల ఈ చావు, పుట్టుకల సతి మనల్ని నిత్య నూతనంగా ఉంచుతుంది.

విపస్సనలో ఇరవై ఒక్క ఎక్సర్‌సైజులు ఉన్నాయి. అయితే ఆధునిక జీవితంలో ఆనా పాన సతి - శ్వాసపై ధ్యాస నిలుపుట - ఈ ఎక్సర్‌సైజు చేస్తే చాలు. ఆరోగ్యం, ఆనందం, కళ్యాణము, కుశలత,

ఎమ్. వి. ఎస్. అప్పారావు, అడ్వకేట్, అనేక బౌద్ధ గ్రంథాలు రాశారు, విశాఖపట్నం.

శాంతి జీవితానికి కలుగుతాయి. క్రమంగా ఈ ప్రాక్టీస్ వలన, కోరికలు, బ్రతుకుపై అత్యాశ, అజ్ఞానము, ఎందుకూ కొరగాని ఆచారాల, వ్రతాల నుండి, విముక్తి కలుగుతుంది. అదే నిబ్బాన (లేక) సంస్కృతంలో నిర్వాణ. ఇదే కల్చర్. ఎవరు కల్చర్డు పెర్సన్? మెడిటేషన్ చేస్తూ, సైన్సు, హిస్టరీ, ప్రకృతి గురించి తెలుసుకున్నవాడే కల్చర్ గల వ్యక్తి. అన్నిటికంటే విశిష్టమైన జ్ఞానము నిబ్బాన. దానికి దారి విపస్సన. Analysis of the Phenomena of the Human Mind అనే పుస్తకంలో జేమ్స్ మిల్ ఇదే చెప్పాడు. బుద్ధుడు గొప్ప సైంటిస్టు, మేనేజిమెంటు స్పెషలిస్టు. ఆయన సెలవిచ్చిన ధమ్మ సైన్సు సూత్రాల తాకిడికి నిలబడుతుంది. సైన్సు ప్రాసెస్ ఏమిటి?

Observation → Hypothesis → Experiment → Theory → Law

విపస్సనా భావన (మెడిటేషన్) - ఇది ఆయన పూర్తిగా పై సూత్రాల ద్వారా సాధించాడు. ఆరు సుదీర్ఘ సంవత్సరాలు తన మైండుతో అనేక ఎక్సుపెరిమెంట్లు చేశాడు. బాహిర, అంతర్గత పరిశోధనలు తదేకంగా చేశాడు. ఆ పరిశోధనల ఫలితమే బుద్ధ ధమ్మ. అప్పటి వరకు శుష్కమైన మెట్ట వేదాంతాలతో, స్పెక్యులేషన్సుతో, వ్యర్థమైన తపస్సులతో ఆనాటి నాలెడ్జి వర్కర్సు సతమతమవుతూంటే, వాటిని త్రోసిరాజని, ఆచరణ యోగ్యమైన, సుఖమయ, కళ్యాణమయ, కుశలమయ ధమ్మను మానవ కోటికి ప్రసాదించిన మహానుభావుడు ఆయన. ఇతర ధమ్మలు సైన్సు తాకిడికి తట్టుకుని నిలువలేవు. ఒక్క బుద్ధ ధమ్మమే ఆధునిక సైన్సు సిద్ధాంతాలకు అనునయంగా నిలబడ గలిగింది.

బుద్ధుడే స్వయంగా సెలవిస్తాడు. ఒక సిద్ధాంతం, ఒక ఇన్వెన్షన్, ఒక డిస్కవరీ ఏ ఒక్కని సొత్తూ కాదు. ఏ కాలానికి సంబంధించినది కాదు. అది కలెక్టివ్ ప్రయత్నాల ఫలం. కలెక్టివ్ సైకీ. ఒకని భుజాలపై ఎక్కి వేరొకడు పళ్ళు కోసినట్లు ఇంత ఆర్ద్రమైన భావన ఇతర ధమ్మాలలో ఉందా! మా ధర్మమే గొప్ప, ఇతర ధమ్మలు చెత్త, ఈ అసహనము ఈనాటికీ గోచరిస్తుంది. పెచ్చు మీరి పిచ్చి తలలు వేస్తుంది. ఇది ధమ్మం కాదు, కల్చర్ కాదు, మూఢత్వము.

ఆయన ఆనాటి రాజులతో, రారాజులతో, భిక్షులతో, సంఘంతో, ప్రత్యర్థులతో మెలిగిన తీరు నేటి మేనేజిమెంటు ఎక్సుపర్టులను ఆశ్చర్యంలో ముంచుతుంది.

**అలనాడు - ఈనాడు**

వేదాలలో, ఉపనిషత్తులలో, ఆరణ్యాకాలలో, బ్రాహ్మణాలలో ఏమీ లేదని, అది కర్మకాండ, రక్తపాతాల మయమని, సామాన్యజీవికి పనికివచ్చేవి వాటిలో ఎక్సురే పెట్టి వెతికినా దొరకవని బుద్ధుడు బుజువు, సాక్ష్యాలతో చెప్పేడు. నేటి సైన్సు కూడా పురాణాల్లో సహితము ఏమీ లేదని చెప్తోంది. మెటాఫిజిక్సు, స్పెక్యులేషన్, యుగాలు, యజ్ఞాలు, మంత్రాలు, తంత్రాలు, పురాణాలు సామాన్య జన జీవనాన్ని నిర్వీర్యులుగా చేసేశాయి. ఓల్డెన్‌బర్గు అనే జర్మన్ మహా పండితుడు అంటాడు: ఇండియన్లు ''అన్‌హేపీ పీపుల్''. మాక్సు వీబర్ అనే ఇంకో జర్మన్ ఉద్దండ పండితుడు వైదిక సంస్కృతి నాలుగు కరాళ నృత్యాల ప్రతీక అని : 1. మాంసము, 2. రక్తము, 3. ఆల్కహాలు, 4. సెక్సు.

ఇదే పౌరాణిక మతానికి కూడా వర్తిస్తుంది. అంతా యుద్ధాలు, రక్తపు మడుగులు, నురగలు, అగ్ని మంటలు, అట్టడుగు వర్గాల దైన్యము, జాత్యహంకారము, హెచ్చు తగ్గులు, నిరంకుశత్వము. బుద్ధుడంటాడు: సంస్కృతం చదవకండి, ప్రజల భాషను మాట్లాడండి, అందులోనే రాయండి, చెప్పండి.

ఆనాటి వైదిక, పౌరాణిక ఐడియాస్‌ను ఈనాడు లిబరల్ భాషలో చెప్పటానికి కొందరు నానా తిప్పలూ పడుతున్నారు. ఉదాహరణకు:

1. యజ్ఞం - యాగం: ఆనాటి ఘోరకలి వర్ణనాతీతం. ఇప్పుడు ఈ పదాలకు కొత్త అర్థాలు తీస్తున్నారు.
2. కష్యప - కష్య = లిక్కర్, ప = త్రాగుట. కష్యప - లిక్కర్ త్రాగేవాడు.
3. వాజపేయము - అంటే శక్తిని ప్రసాదించే డ్రింకు. ఒక్కొక్క కప్పు చొప్పున అయిదు వాజపేయ కప్పులతో ఇంద్రుని హెల్తు నిమిత్తం త్రాగితే ప్రజాపతిని పొందగలము.
4. అశ్వమేధము - గుర్రము యొక్క మేధ (మెదడు లేక బ్రెయిన్) మరియు మేఢ్రము (పెనిస్) నకు సంబంధించినది.
5. నిలువెత్తు విగ్రహాలు, పండుకున్న విగ్రహాలు పురాణాలవి కావు. బౌద్ధ అనుకరణలు.

ప్రపంచంలో అత్యంత ప్రాచీనమైన రేషనల్, సైంటిఫిక్ కల్చరు చైనాది. 4600 సంవత్సరాల నుండి వారు తమ కల్చర్‌ను డెవలప్ చేసుకున్నారు. ఆ క్రైమ్సులో. షావోలిన్ మొనాస్టరీ, కుంగ్‌ఫూ, ఆక్యుపంక్చర్, మార్షల్ ఆర్ట్సు, సమురాయి కత్తి, కరాటే. చైనీస్ నాగరికత అంతా సైంటిఫిక్, రేషనల్ కల్చర్. కాబట్టే బి.సి. రెండవ శతాబ్దిలో వారు బుద్ధ ధమ్మను సాదరంగా ఆదరించి తమ స్వంతం చేసుకొన్నారు. మరి మనమో! మన ప్రత్యేకతలు: 1. కులం, 2. అంతః కలహాలు మన పౌరాణిక హీరోలు మానవ సంస్కృతికి ఏమి చేశారు?

2003 సంవత్సరారంభ లెక్కలు ప్రకారము మన జనాభా : 105 కోట్లు, విస్తీర్ణము : 32 లక్షల చదరపు కిలో మీటర్లు

చరిత్ర : 1500 బి.సి. నుండి అనగా 3,500 సంవత్సరాలు.

అయితే ఈ సుదీర్ఘ కాలంలో మనం ఎంత మంది సైంటిస్టులను సృష్టించాము?

మన కంట్రిబ్యూషన్: అర్థం - పర్థం లేని మెట్ట వేదాంతం, కట్టు కథలు, పిట్ట కథలు, సుదీర్ఘమైన పరాయి పాలన.

ఇక భక్తి విషయానికొస్తే ఇస్లాము, క్రిష్టియానిటీలలో కుల వ్యత్యాసం లేదు. మనలో - ఒక వైష్ణవుల్లోనే చూడండి (ఇండియా 70 శాతము వైష్ణవులు)

శ్రీ వైష్ణవులు - సాతాని వైష్ణవులు - మాల దాసర్లు ఇత్యాది. భక్తిలో కూడా కుల వ్యత్యాసమే. అసలు మన దేవుళ్ళే జంధ్యాలు వేస్తారు. ఆడ, మగ, దేవుళ్ళు కత్తులు, కటార్లు, గండ్రగొడ్డలి, బాణం, త్రిశూలం, కట్టులు, గదలు - ఇవన్నీ ఇండియన్ ఆర్మ్స్ ఏక్టు, 1959 క్రింద నిషిద్ధం!

ఇప్పటి మన అప్పర్ క్రెస్టు హై లైఫ్ కి అలవాటు పడిపోయారు. మెటీరియలిజమ్. కమ్యూనలిజమ్. మూఢ నమ్మకాలు. ఎక్కడ టెర్రరిస్టులు చంపేస్తారో అనే భయం ఇక్కడా, విదేశాలలో కూడా. ఆదిమ మానవుడు కూడా ఇదే భయంతో బ్రతికేవాడు. అంచాత వాడికీ, మన అప్పర్ క్రెస్టుకి తేడా లేదు.

మన ఇంటలక్చువల్స్ సైన్సు, టెక్నాలజీ, మెడిసిన్, వీటిలో ఉద్దండులే. అయితే ఇవి వారికి కాసులు సంపాదించే సాధనాలుగా మాత్రమే వాడుకోబడుతున్నాయి. వారి చదువులో ఉన్న రేషనలిజమ్, శాస్త్రీయ

దృక్పథం, సర్వమానవ సౌభ్రాతృత్వము, జాలి, దయ, కరుణ, సామాజిక స్పృహ, సమానత - అబ్బే ఇవేవీ వారి బుర్రలకు ఎక్కలేదు. మూఢాచారాలు, కులాచారాలు, మూఢనమ్మకాలు, తృష్ణ, డైవర్సులు, కట్నాలు కానుకలు; దేశభక్తి లేదు. ఎక్కడ డబ్బు, పవరూ ఉందో అక్కడికే పారిపోతున్నారు. తమ ఊరు, ఆ చెరువు, ఆ మట్టి, ఆ చిన్న గ్రామ దేవత గుడి, తమ ఊరి జనుల ఆక్రందనలు. తమకు ఎక్కాలు చెప్పిన మాష్టారి కొడుకు నిరుద్యోగిగా పస్తులు పడటం, తన తల్లికి పాలు లేకపోతే ఆప్యాయంగా పాలిచ్చిన మాల వనిత, నాట్యాలాడే జొన్న చేలు, తాటి చెట్లు, రాత్రుళ్ళు నక్కల, గుడ్లగూబల సంగీతం .... అబ్బే, ఇవేవీ వారికి పట్టవు. అవి మరిచిపోయి మహానగరాల్లో, విదేశాల్లో సెకండు రేటు సిటిజన్సుగా జీవించటమే వారికి తృప్తి. ధనం, పవరు ఉన్నాయిగా! ఈ మూఢాచారాలు ఎంత వరకూ పోయాయంటే - వినాయకునికి కుడి వైపు తొండముంటే ఒక ఫలం, ఎడమవైపు తొండముంటే ఇంకో ఫలితం. సూపర్ మార్కెట్ గురూజీలకు ఖర్చు పెట్టే ధనంలో పదోవంతు తమ పుట్టిన ఊరి చెరువును, బడిని బాగు చేస్తే ఎంత ఫలమో వారికి తెలియదు.

**బుద్ధ ధమ్మలో మౌలిక అంశాలు.**

1. అనిచ్చ 2. అనత్త 3. దుఃఖ

**1. అనిచ్చ (సబ్బే సంఖారా అనిచ్చ)**

అంటే అంతా అనిత్యము. ఈ సృష్టిలో నిత్యమైనది ఏదీ లేదు. సైన్సు ఇదే చెప్తోంది. మన సౌర మండలం పది బిలియను సంవత్సరాలుంటుంది. అప్పుడే 4.5 బిలియన్లు అయిపోయాయి. ఇంకా 5.5 బిలియన్ల సంవత్సరాలు మాత్రమే. అయితే ఇంకా సౌరమండలాలు మన గెలాక్సీలోనే కొన్ని వందలు, వేలు ఉన్నాయి. ఇలాంటి గెలాక్సీలు వేలలో ఉన్నాయి. ఇవన్నీ వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. ఈ సౌర మండలాల రేడియేషన్ వలన ఇంకో సౌరమండలం పుడుతుంది. అలాగే ఒక గెలాక్సీ తర్వాత ఇంకో గెలాక్సీ. ఒక దాని వెనుక ఇంకోటి. ఏ ఒక్కదానికి వేరొకటి కారణం కాదు. అన్నీ పరస్పర కార్య కారణ సంబంధం వలన పుడతాయి, పోతాయి. దీనినే బుద్ధుడు పటిచ్చ సముప్పాద అంటాడు. (Law of Dependent Origination) ఇది వుంది. అందువలన అది వుంది. దీని వలన అది వస్తుంది. ఇది ఉండదు. అందువలన అదే వుండదు. ఇది పోతే అదే పోతుంది. ఏ ఒక్కదానికీ ఫస్టు కాజ్ లేదు. ఇదంతా అనమత్గ్గ (తెలియబడనిది). దీని రహస్యం విపస్సన వలన బోధపడుతుంది. ఇక్కడే మన ఉపనిషత్కారులు పప్పులో కాలేశారు. అంతటికీ ఏదో ఒక మూల కారణం ఉందని. దాన్ని వెతకటానికి అనేక మెటాఫిజికల్, స్పెక్యులేటివ్ సిద్ధాంతాలు లేవదీసి ఫెయిలయ్యారు. ఈ రహస్యాన్ని, ఈ ''రిడిల్''ని, ఈ ''ఫజిల్ని'' బుద్ధుడు పటిచ్చ సముప్పాద ద్వారా ఛేదించాడు. అందువలన ఆయన ఒక రివల్యూషనరీ సైంటిస్టు. మెట్ట వేదాంతి, మత ప్రవక్త కాదు.

**2. అనత్త (సబ్బే - ధమ్మా అనత్త)**

ఆత్మ అనేది ఒకటి ఉన్నదని, అది నిత్యమని, సత్యమని ఉపనిషత్తులు చెప్పాయి. ఇది కూడా రాంగ్. ఈ విశ్వంలో నిత్యమైనది ఏదీ లేదు. ఆత్మ - పరమాత్మ - జీవాత్మ. ఇవన్నీ ఊహాగానాలే. తను ప్రాక్టికల్‌గా ప్రయోగం చేసి బుద్ధుడు కనిపెట్టింది అంతా ''అనత్త'' అని. పరమాత్మ, జీవాత్మ - ఇవన్నీ మన ఊహలే. అసలు నీవు ఎవరు? అనే ప్రశ్నకు ఆయన నీవు ''పంచ ఉపాదాన ఖండవు'' అంటాడు. అనగా మనిషి - 1. శరీరం, 2. భావాలు, 3. గుర్తింపు కలగటం, 4. చేసే మానసిక, కాయిక కార్యాలు

(సంఖారా), 5. విఙ్ఞానా = తలంపులు, చైతన్యము - ఇవి ఒక దానిని ఒకటి అంటి పెట్టుకుని ఉంటాయి. ఒక దానితో ఒకటి నిరంతరం యుద్ధం చేసుకుంటాయి. ఏ ఒక్కటీ పోయినా వ్యక్తి లేనట్లే. చనిపోవటమంటే - ఈ అయిదు ఖండాలు విడిపోవటమే. ఇందులో ఆత్మకు తావెక్కడ? దానిని చూచినది ఎవరు?

**3. దుఃఖ (సబ్బే సంఖారా దుక్ఖ)**

ఈ జగత్తులో దుఃఖం ఉంది. ఇది నిజం. దానికి కారణం తణ్హ (లేక) తృష్ణ. అది పోతుంది. ఆ పోవటానికి అరియ అట్ఠంగిక మగ్గ (ఆర్య అష్టాంగ మార్గము). ఈ మార్గం విపస్సన మెడిటేషన్ వలన సుగమమవుతుంది. అదే నిబ్బాన. అంటే సుఖ, దుఃఖాలకు అతీతమైన స్థితి. ఇది ముక్కు మూసుకొని సర్వసంగ పరిత్యాగము చేసిన భిక్షులకు మాత్రమే కాదు, మనలాంటి సంసారులందరికీ సాధ్యం. నిబ్బాన - అరహతత్వం ఒకటే. కోరికలు లేక, జీవితం మీద అత్యాశ లేక, విపస్సన చేస్తూ, నానా పెడర్థాలు, దిక్కుమాలిన ఆచారాలు, నమ్మకాలు వదిలేస్తే, నీవు అరహతుడవే! నో డౌట్! అప్పుడు కాలం, స్పేస్ ఒకటౌతాయి. దీనివలన ఏదీ నిత్యమైనది కాదని, ప్రతీది పడుతూ, లేస్తూ ఉంటుందని, అనుభవంలో తెలుస్తుంది. ఊరికే థియరీ కాదు.

**సంఖారాలు**

Activities కాయిక, మానసిక చేష్టలు. మనకు తెలియకుండానే వీటి ఎఫెక్టు మనకు గోచరిస్తుంది. ఉదాహరణకు: బ్రౌనియన్ మోషన్ (Brownian Motion) అని ఫిజిక్సులో ఉంది. సెంటు రాసుకుంటే మనకు తెలియకుండానే వాసన సర్వత్రా వ్యాపిస్తుంది.

కాఫీ, టీ, పాలలో షుగర్, సాల్టు మనకు తెలియకుండగనే అవి కరిగిపోయి, తియ్యగ, ఉప్పగ ఫీల్ అవుతాము.

ఈ సంఖారాలు కూడా అంతే. విపస్సన వలన వీటి ధాటికి తట్టుకుని నిలబడగలము.

**అరియ అట్ఠంగిక మగ్గ**

సమదృష్టి, సమ సంకల్పము, సమ వచనము, సమ కార్యము, సమ జీవనం, సమ ప్రయత్నము, విపస్సనతో కూడిన సతి, సమ సమాధి పై క్లేరిఫికేషన్‌కి ముగ్ధులై, అమెరికన్ సైంటిస్టు ముర్రే గెల్ మాన్, ఇజ్రాయల్ సైంటిష్టు యువల్ నీమాన్ సూక్ష్మాతి సూక్ష్మమైన పార్టికల్స్ ఇంటరేక్షన్‌కి ''అట్ఠంగిక మగ్గ'' అని నామకరణం చేశారు. ఇంతకు ముందే అనుకున్నాము కదా: బుద్ధుడు ఒక సైంటిష్టు అనే భావన ప్రపంచ ప్రసిద్ధ సైంటిష్టులందరికీ కలిగింది. వేద సంహితలలోని ఏనిమిష్టు నేచర్ పొయిట్రీ, ఆరణ్యక, బ్రాహ్మణాలలోని యజ్ఞ, కర్మకాండ, ఉపనిషత్తులలోని పరస్పర విరుద్ధమైన మెటాఫిజికల్ స్పెక్యులేషన్‌గాని, పురాణాలలోని కట్టుకథలు, పిట్ట కథలు - సైంటిష్టులు సీరియస్‌గా పరిగణించారు.

ప్రఖ్యాత సైంటిష్టు రాజా రామన్న అంటాడు - మబ్బులు, తలంపుల వెనుక ఉన్న విశ్వము ఒక పెద్ద వాక్యూమ్ ఏమీ లేదు. శూన్యం అంటే ప్రమాణాలకు మించినది. అప్పమణ్య ఫిజిక్సులో దైవత్వానికి చోటు లేదు. అంటే ఆయన బుద్ధుడు చెప్పినది అక్షరాలా ఎండార్సు చేశాడు.

**సారాంశము**

నా అనుభవ రీత్యా నేను గ్రహించిన కొన్ని విషయాలు మీ ముంగిట ఉంచుతున్నాను: ఎంత చిన్న ఆలోచననైనా ఉపేక్షించరాదు. దానివలన ఒక గొప్ప సత్యం బయటకు రాగలదు. ఒక గడ్డి పరకలో

కూడా విశ్వచైతన్యం ఇమిడి వుంది. అలాగే ఒక శిశువులో కూడా. పఠిచ్చ సముప్పాద సృష్టి క్రమంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఉదాహరణ: సీడ్ - బేబీ - ఆడ - మగ కలయిక - సీడ్. ఇలాగే ప్రకృతి అంతా.

కల్చర్ కావాలంటే - సమాజాన్ని తెలుసుకోటానికి చరిత్ర - బాహ్య ప్రపంచాన్ని తెలుసుకోటానికి సైన్సు అంతర ప్రపంచాన్ని, మనలను తెలుసుకోవటానికి విపస్స.

జీవితంలో ముందుకు సాగుతున్న కొలది ప్రయారిటీస్ మారిపోతాయి. జీవితం ఒక స్రోతస్విని. చెత్త, రబ్బిష్, కీర్తి, అపకీర్తి, అవమానం, అన్నిటిని కలుపుకు పోవాలి. ఉరి తీయబోయే ముందు మనిషి ఎలా ఉంటాడో, మునిగి పోతున్న పడవలో మనిషి ఎలా ఉంటాడో, మనం జీవితాన్ని అలా గడపాలి. ''జీవితాన్ని సింపుల్‌గా, చిన్న పిల్లలాగా, ఆశ్చర్యంతో చూస్తే, ఆ జీవితం నిండు. అప్పుడు ప్రతి వ్యక్తి, ప్రతి సన్నివేశం నీ గుండెలోకి దూసుకుపోతుంది'' అని ప్రఖ్యాతి నోబిల్ సైంటిస్టు ఫెయిన్ మెన్ చెప్తాడు. సమత్వం - సింప్లిసిటీ. కన్ఫ్యూజన్ - కాంప్లెక్సిటీ. దేనిని ఆలోచించినా, దాని రివర్సును కూడా పరికించు - లాయర్ లాగ.

ఒక స్టేజి చేరేక సక్సెస్‌కి విలువ ఉండదు. జయం, అపజయం సమానం. భగవద్గీతకు 1500 సంవత్సరాలకు ముందు బుద్ధుడు ఈ సంగతి చెప్పాడు. సృజనాత్మక శక్తికి చాలా హంగులుండాలి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్. మన ఇంటికి కరంటు రావటానికి, పోల్సు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు, స్విచ్‌లు, రెగ్యులేటర్లు ఇవన్నీ ఉండాలి. అప్పుడే నీటిలో, గాలిలో, అణువులో, బొగ్గులో దాగి ఉన్న విద్యుచ్ఛక్తి నీ గదిలోకి రాగలదు.

విశుద్ధి మగ్గలో భదంత బుద్ధ ఘోషుడు చెప్తాడు:

చెట్టు పైకి ఎంత ఎత్తు వుందో, భూమిలో అంత లోతు వుంటుంది. కొండలూ అంతే. సముద్రపు కెరటాలు, తుఫాన్లు, అగ్ని పర్వతపు భుగ, భుగలు, మబ్బులు, తలంపులు - అన్నీ పఠిచ్చ సముపాద న్యాయాన్ని పాటించి తీరాలి.

ప్రపంచంలో అన్నిటికంటె అద్భుతమైనది ఏది? సమతుల్య జీవనం. సతితో మెలగటం. అలర్టుగా ఉండటం. ఎంత ఒత్తిడిలోనైనా బేలన్సు, గ్రేస నిలుపుకోవాలి. బీదవారిలో ఇది కనపడుతుంది. జీవితమంటే కెమిస్ట్రీ. విశ్వమంటే ఫిజిక్సు. ఒక క్రమము, నిదానం, తాపీ, శరీరమంతా ట్యూబులు, పైపులు, వైర్లు, లెన్సులు, కెమికల్సు. పంచ ఉపాదన ఖండ ఇదే చెప్తూంది. అంతా అయ్యాక మిగిలింది ఏమిటి?

Life is as tedious as a twice - told tale (Shakespeare's King John) Out, out brief candle! Life's but a walking shadow, a poor player that struts his hour upon the stage, and them is heard no more. It is a tale told by an idiot, Full of sound and fury, signifying nothing (Macbeth)

విపస్సనా భావనా - ప్యూర్ పాయిట్రీ. నిబ్బాన బ్రతుకు బాటలో ముఖ్యమైనా, బాటలో పయనించే విపస్సనే ఇంకా ముఖ్యం. ఆ స్టేజి వచ్చే సరికి చావుకు ప్రాధాన్యత ఉండదు. చావు ఒక ఐడియా మాత్రమే. జర, రోగం, ఏక్సిడెంటు, ప్యూబర్టీ వీటిలాగే అది ఒక స్టేజి అంతే.

# బౌద్ధంలో రాజు - రాజ్యపాలన

- డా॥ బి.వి.యస్. భానుశ్రీ

ఒక దేశం లేదా రాజ్యం యొక్క స్థిరత్వం, ధృఢత్వం, ప్రజల స్థితిగతులు, విలువలు - దాని పాలకుడు, పాలనా విధానం మీద ఆధారపడి ఉంటుంది. అది రాజరికమా (monarchy), ప్రజాస్వామ్యమా (democracy), కులీన స్వామ్యమా (aristocracy) అన్నది కాదు, ఎటువంటి ప్రభుత్వం అయినా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఉండే సంబంధాలు ఎలా ఉంటాయన్నది ముఖ్యం.

కాస్సేపు వెనక్కి వెళ్లి, బౌద్ధం అడుగుపెట్టక ముందు పాలకులు, పాలనలు ఎలా ఉండేవో, ముఖ్యంగా వాటి పుట్టుక పరిశీలిద్దాం. 'ఏ పాలకుడు లేనప్పుడు, జీవులంతా భయంతో, అభద్రతా భావంతో చెల్లాచెదురుగా అన్ని వైపులా పరుగెడుతుంటే, భగవంతుడు దయతలచి, ఈ సృష్టిని రక్షించడానికి ఒక రాజుని సృష్టించాడు' అని మను ధర్మశాస్త్రం చెప్తుంది. అది రాజుకి భగవంతునితో సమానమైన హోదానిచ్చింది. బాలకుడైనా, శిశువైనా సరే రాజు మామూలు మనిషి కాదుగాబట్టి, భగవదంశ కలిగిన వాడిగా గౌరవించాలి. రాజ శాసనాలను ధిక్కరించే అధికారం ఎవ్వరికీ లేదు. అతను దైవాంశ సంభూతుడవడం వలన ఉన్నతమైన నైతిక విలువలు కలిగి ఉండాలి. కాని చపలచిత్తుడై, ఇష్టానుసారంగా, నియంతలా ప్రవర్తించకూడదు. 'రాజు ఈ ప్రపంచాన్ని రక్షించేవాడు' అని మహాభారతం చెప్తుంది. 'ధర్మానుగుణంగా ప్రవర్తించేవాడే రాజుగాని, నిరంకుశంగా ప్రవర్తించే వాడు కాదు' అని శాంతి పర్వంలో ఉంది. భారతీయ పాలనా పద్ధతులను వివరించే ప్రఖ్యాత గ్రంథం - కౌటిల్యుని అర్థశాస్త్రం ధార్మికత కన్నా కర్తవ్య రూఢితకి ప్రాధాన్యత నిచ్చింది. రాజ్యాధికారాన్ని విజయవంతంగా కొనసాగించడం, రాజ్యపు సరిహద్దుల్ని విస్తరించడం, ఎప్పటికప్పుడు అభివృద్ధి పరచడం - రాజు కర్తవ్యం. సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ ప్రగతిని సాధించాలి.

ఇదంతా రాజరిక వ్యవస్థ. రాజు గొప్పదనాన్ని గుర్తిస్తూ, రాజరికపు వైభవాన్ని కీర్తిస్తూ, దాన్ని ధృఢీకరించే, గ్రంథాలు, గాధలు ఎన్నో ఉన్నాయి. ఇతిహాసాల్లో, మహా కావ్యాల్లో ఆదర్శవంతమైన రాజులు చిత్రీకరించబడ్డారు. ఉదాహరణకి - రాముడు, కృష్ణుడు, ధర్మరాజు మొదలైనవారు. అయితే క్రమంగా, ఈ వ్యవస్థకి పక్క-పక్కనే గణతంత్ర రాజ్యాలు వెలిశాయి. బుద్ధుడు పుట్టిన ఆరవ శతాబ్దానికి వస్తే ఉత్తర భారత దేశంలో గణతంత్ర రాజ్యాలు, రాజరికపు వ్యవస్థలు ఒకదానితో ఒకటి పోటీపడుతుండేవి. ఒకవైపు వేగంగా విస్తరిస్తున్న రాజరికాలు, మరొకవైపు గణతంత్ర రాజ్యాల మధ్య చిన్న చిన్న తగువులు, రాజరికాల మధ్య పెద్ద పెద్ద ఘర్షణలు - ఫలితంగా ఎంతో శక్తివంతంగా విస్తరిస్తున్న రాజరికాల ముందు గణతంత్ర రాజ్యాలు నిలవలేక పోయాయి.

గణతంత్ర రాజ్యాలు - వాయవ్యం నుండి ఆగ్నేయం వరకు విస్తరించిన హిమాలయాల నుండి గంగా తీర మధ్య మైదానాల వరకు వ్యాపించి ఉండేవి. పూర్తిగా ఉత్తరాన ఉన్న రాజ్యం గౌతముడు పుట్టిన శాక్యరాజ్యం. దాని నానుకుని ఆగ్నేయంగా కొలియ రాజ్యం, దానిపైన మౌర్యరాజ్యం, ఈ మూడింటిని తూర్పున ఉన్నది మల్ల సరిహద్దు. (చివరికి బుద్ధుడిని మృత్యుశయ్య మీదికి చేర్చిన

---

డా॥ బి.వి. యస్. భానుశ్రీ, ఆంధ్ర విశ్వవిద్యాలంలో ఫిలాసఫీలో
అసిస్టెంట్ ప్రొఫెసరుగా ఉన్నారు. విశాఖపట్నం.

కుశినగరం దాని రాజధాని). మల్లరాజ్యం, లిచ్ఛవీలు, విదేహులు, వజ్జీయులు అంతా కలిసి శత్రువుల నెదుర్కోవడంలో ఏక నిర్ణయం తీసుకోవడానికి - ఒక సంఘంగా ఏర్పడ్డారు. వీరందరిని కలిపి 'వజ్జీయుల'నే వ్యవహరించే వారు.

రాజ్యపాలన వ్యవహారాలు, ప్రజా జీవిత సమస్యలు ఎప్పటికప్పుడు చర్చించడం గణతంత్ర రాజ్యంలోని ప్రధానాంశం. అందులోని పెద్దలు ఈ విషయాలు చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. ఈ సమావేశాలనే 'సంఘం' అని అంటారు. గణతంత్ర రాజ్యంలోని ముఖ్యాంశం అదేగాబట్టి - దాన్నే సంఘం అని వ్యవహరిస్తారు. వేద కాలంలో ఈ సంఘాలు మరోరకంగా ఉండేవి. అందులో సభ్యులంతా కలిసి విషయాల్ని చర్చించేవారు. కాని బుద్ధుడు కాలం నాటి సంఘాల్లో - పెద్దలు మాత్రమే చర్చించేవారు. ఆ పెద్దలు ప్రజల చేత ఎన్నుకోబడినవారు కాదు. క్షత్రియజాతికి సంబంధించిన నాయకులు. ఆ ప్రభుత్వం ప్రజాస్వామ్యం కాదు, కులీన స్వామ్యం, పూర్తి నిర్ణయం, చివరి నిర్ణయం వారిదే.

అయితే, శాక్య గణతంత్ర రాజ్యంలో ఒక ఆసక్తి కరమైన విషయం ఉంది. శాక్య ప్రభుత్వంలో గణతంత్ర లక్షణాలు, రాజరికపు లక్షణాలు కలగలిసి ఉండేవి. బహుశా అందుకే సిసలైన సంఘాల జాబితాలో శాక్యరాజ్యం పేరు కనబడదు. ఈ విషయంలో రెండు దృష్టి కోణాలున్నాయి. రాజరికం నుండి, సంఘాలుగా చెందే పరిణామ దశలో ఇంకా రాజరికపు నీడలు వీడకపోవడం ఒకటయితే, మరొకటి ఒక తెగ అంతా కలిసి చేసే పాలన నుండి, సంపూర్ణ వ్యక్తి స్థాయిలో స్థిరపడిన రాజరికం వైపు చూసే అభివృద్ధి - ఏదయినా కావచ్చు. మొత్తానికి శాక్యులకున్న ప్రాముఖ్యత అంతా గౌతమునితో ఉన్న సంబంధంతోనే.

ఏమయినా గాని, సంఘాల్లోని పెద్దల మధ్య రేగే అభిప్రాయ భేదాల వలన కావచ్చు, నైతికమైన అలసత్వం వలన కావచ్చు. న్యాయం, క్రమశిక్షణ లోపించడం వలన కావచ్చు, అర్థంలేని ఆధిక్యతల వలన కావచ్చు. - రాను రాను సంఘాల స్థితిగతులు దిగజారిపోయేయి. ఇవన్నీ రాజరికపు వ్యవస్థ వృద్ధి చెందడానికి సహకరించేయి. అయితే రాజరికం గొప్పదా, సంఘ పాలనగొప్పదా అన్న అంశానికొస్తే దేని వాదన దానికుంది. ఆ చర్చ అప్రస్తుతం. బుద్ధుడి అభిప్రాయంలో గణతంత్ర సంఘమే ఆదర్శవంతమైనది; అయితే ఆయన బోధనలలో - రాజు యొక్క నైతికత, ధార్మికతల పాత్ర కనిపిస్తుంది. ఎన్నో జాతక కథలలో ఆదర్శవంతమైన రాజు, ఆయన నడిపే గొప్ప ప్రభుత్వ విధానాలు ఆసక్తికరంగా చిత్రీకరించబడ్డాయి.

దిఘ నికాయలోని అగ్గన్న సుత్తలో - రాజు, రాజరికం ఏ విధంగా ఉద్భవించేయో వివరించబడింది. ఒకానొకప్పుడు - ఏవేవో కారణాల వలన మనుషులు దురాశాపరులు, అవినీతిపరులు, కలహప్రియులు, దుర్మార్గులుగా మారిపోయేరు. అప్పుడు వారందరూ కలిసి ఆలోచించి, ఇటువంటి దిగజారిన పరిస్థితిని విచారించి, అవసరమైనప్పుడు కోపగించుకోవడం, దండించవలసి వచ్చినప్పుడు దండించడం, బహిష్కరించవలసినప్పుడు బహిష్కరించడం - చేయగల ఒక వ్యక్తిని ఎన్నుకొని, బదులుగా అతనికి తగినంత ధాన్యాన్ని ఇవ్వాలని నిర్ణయించుకుని, వెతికి వెతికి, వారిలో అత్యంత సుందరుణ్ణి, అత్యంత

ఆకర్షణీయమైన వారిని, అత్యంత సమర్థుడిని, అందరికీ నచ్చినవాడిని, అందరూ మెచ్చిన వాడిని గుర్తించి - వారి ప్రతిపాదనని అతని ముందుంచారు. అతను ఒప్పుకున్నాక వారతన్ని రాజుగా, పాలకునిగా ఎన్నుకున్నారు. ఇందుమూలంగా బుద్ధుడు చెప్పదలచుకున్న విషయం - రాజు ఏ ఆకాశం నించీ, మేఘాలనించీ ఊడిపడలేదు, ఏ దైవాంశ సంభూతుడూ కాదు, ప్రజల్లోంచి వచ్చిన, వారిలాగే రక్తమాంసాలతో కూడుకొనిన మనిషి - అని అర్థమవుతుంది. పై విధంగా జరిగినదంతా అద్భుతము కాదు, చమత్కారము కాదు; న్యాయంగా, హేతుబద్ధంగా ఎలా జరగాలో అలా జరిగింది. బుద్ధుని కాలంలో ఈ వివరణ అంతా అందరూ అంగీకరించిన విషయం. ఇది థామస్ హాబ్స్ చెప్పిన సోషల్ కాంట్రాక్ట్ థియరీకి దగ్గరగా ఉంది.

ఒక రాజు, లేదా పాలకుడు కేవలం కబుర్లు చెప్పడం, శుష్క వాగ్దానాలు చెయ్యడం కాకుండా కార్యశూరుడై యుండాలి. అది నాయకత్వ లక్షణం. పదవి వలన డాంబికుడైన రాజు ఎంత అధర్మపరుడో, అది అతన్ని ఎంత నాశనం చేస్తుందో మహా భారతంలోని శాంతిపర్వం చెప్తుంది. గర్వాన్ని జయించినవాడు నిజమైన రాజు. 'రాజు ఒక విజయవంతమైన పాలకుడు కావాలంటే ముందు తనలోని చిత్తవికారాలను జయించాలి' అని మనుధర్మ శాస్త్రం చెప్తుంది. ( రాజు త్యజించవలసిన గుణాలు - వేట, జూదం, పగటిపూట నిద్ర, స్త్రీ లోలత్వం, తాగుడు, నాట్యగానాలమీద విపరీతమైన మోజు, వ్యర్థమైన యాత్రలు).

రాజరిక వ్యవస్థలో అధికారమంతా ఒక వ్యక్తి చేతిలోనే ఉంటుంది. ఆ వ్యక్తి అన్ని విధాలా ఉన్నతుడు, మంచివాడు అయితే రాజ్యం, ప్రజలు ఎంతో ప్రశాంతంగా ఉంటారు; దుర్మార్గుడు, దురాశాపరుడు, రోగగ్రస్థుడు, విషయ లోలుడు అయితే రాజ్యం, పాలన నాశనమై పోతాయి. ప్రజలు చాలా బాధలు పడవలసి వస్తుంది. కాబట్టి, న్యాయాన్ని, ధర్మాన్ని, సమతౌల్యాన్ని పాటించడంలో రాజు అప్రమత్తంగా ఉండాలి. న్యాయం ఏ విధంగా పాలించబడుతుంది - అన్నదాని మీద కొంత వరకు రాజ్యం యొక్క స్థిరత్వం, ఏకత్వం ఆధారపడి యుంటుంది. నేరస్థులని శిక్షించడంలో అతి కఠినంగా ప్రవర్తిస్తే 'డిప్రెషన్'కి లోనై రాజ్యం ఎంతో నష్టపోతుంది. అలాగని రాజు మరీ మెతకగా ఉంటే అతన్ని పక్కకి తోసేసి అధికారాన్ని లాగేసుకోగలరు; అందుకే శిక్ష విషయంలో సమతౌల్యం పాటిస్తే రాజుకి అందరి సహకారం ఉండడమే కాక, ఎంతో గౌరవింపబడతాడు అని కౌటిల్యుని అర్థశాస్త్రం చెప్తుంది. మహాభారతం కూడా దాదాపుగా ఇదే విషయాన్ని వ్యక్తపరిచింది. రాజు అతి ఉదారంగా ఉంటూ, తరచుగా తప్పులు క్షమించేస్తుంటే, మావటివాడు అంత పెద్ద ఏనుగుని నెమ్మదిగ వశపరచు కున్నట్టు, సామాన్య జనం నెమ్మదిగా అతన్ని పదవీచ్యుతుణ్ణి చేసేస్తారు. శిక్షలకి సరయిన తీర్పు లభిస్తే ప్రజలు సంతోషంగా, వివేకవంతులై ఉంటారు; అలా కాకుండా కోపంతోనో, కోరికతోనో ప్రేరేపించబడి, కక్ష సాధింపు చర్యలా ఉంటే - అన్యాయ భారంతో క్రుంగిపోతారు; అసలు పట్టించుకోకుండానే ఉండిపోతే రాజ్యమంతా అరాచకమై పోతుంది.

బౌద్ధం ప్రకారం రాజు ధర్మపరుడేకాక, వివేకవంతుడు కూడ అయుండాలి. అతని రాజ్యం ఎటువంటి అణచివేతలు లేకుండా, దౌర్జన్యాలకు లోను కాకుండా న్యాయంతో పాలింపబడాలి. అతని రాజ్యంలో

మంచి వారు, తెలివైనవారు గౌరవింపబడాలి, గుర్తింపబడాలి. రాజు అతని ఉద్యోగులు నిస్వార్థపరులై కరుణ, రాజనీతి, సమాజంలో ఉండే వివిధ పట్టణ, పల్లెవాసులు, మత గురువులు ఇంకా పక్షులు, జంతువుల విషయంలో కూడ సమానమైన గౌరవభావం కలిగి ఉండాలి. వ్యక్తిగా రాజు ధర్మాత్ముడై ఉండాలన్న విషయానికి బౌద్ధం ప్రాధాన్యత నిచ్చింది. రాజులు ధర్మాన్ని పాలించే వారయితే మంత్రులు కూడ పాలిస్తారు; మంత్రులు ధర్మాన్ని పాటిస్తే, బ్రాహ్మణులు, గృహస్థులు కూడ ధర్మాన్ని పాటిస్తారు; నగర వాసులు, పల్లెవాసులు కూడ వారి ననుసరిస్తారు. ఈ విధంగా చెయ్యడంవలన సూర్యచంద్రులు తమ తమ ధర్మాన్ని పాటిస్తారు; నక్షత్రాలు, గ్రహాలు గతితప్పక నడుస్తాయి; పగలు, రాత్రులు, నెలలు, పక్షాలు, ఋతువులు, సంవత్సరాలు క్రమంతప్పక సమయపాలన చేస్తాయి; ఏ ఋతువులో వీచే వాయువులు ఆ ఋతువులో వీస్తాయి; వర్షాలు కాలానుగుణంగా కురుస్తాయి; పంటలు చక్కగా పండుతాయి; అటువంటి పంటల మీద ఆధారపడిన మనుషులు చిరకాలం బతికి, అందరి మన్ననలు పొంది, ధృఢంగా, ఎటువంటి నలతలు లేక ఆరోగ్యంగా ఉంటారు.

ప్రజల ఆర్థిక సంక్షేమం గురించి పట్టించుకునే బాధ్యత వివేకవంతుడైన రాజుమీదే ఉంటుంది. అనుగుణమైన ఆర్థికపథకాలు, ప్రత్యేక ప్రణాళికలు, తద్వారా జరిగే దేశాభివృద్ధిమీద సరియైన అవగాహన, సమర్థవంతమైన ఆచరణ ఉండాలి. రాజ్యాభివృద్ధి కోసం యజ్ఞాలు, యాగాలు చెయ్యడం అంటే డబ్బుని, కాలాన్ని, శక్తిని వృధా చెయ్యడమే. దాని బదులు రాజ్యంలో ఎంతో మందికి ఉపాధి కల్పించే ప్రయత్నాల మీద దృష్టి పెట్టాలి. దిఘ నికాయలోని కూటదంత సుత్తలో - రాజు పేదరిక నిర్మూలన, నేర నిరోధక పథకాల నేవిధంగా అమలు చేయాలో వివరించబడింది. అది దేశాన్ని ఆర్థిక సంక్షోభంలో పడేయకుండా, ఆర్థిక సమస్యలు లేకుండా చెయ్యడంతో సాధ్యమవుతోంది. రాజ్యంలోని వ్యవసాయదారులకు విత్తనాలను, తక్కువ ధరలకు ఆహారాన్ని అందించాలి. వ్యాపారస్థులు వారి వారి వ్యాపారాల్లో పెట్టుబడులకు అవసరమైన మూలధనాన్ని కల్పించాలి. ప్రభుత్వ రంగంలో పనిచేసే వారికి తగిన వేతనాలు చెల్లించాలి. ప్రజలందరికీ ఆహార ధాన్యాలను తగినవిధంగా సమకూర్చాలి. ఈ విధంగా చెయ్యడం వలన రాజ్యంలో ఎటువంటి కలతలు, ఘర్షణలు తలెత్తవు; ఏ దుష్టశక్తులు పైకి లేవలేవు; పైగా రాజు ఆర్థికపరిస్థితి మెరుగై, ధనాగారాలు నిండుతాయి. దేశం ప్రశాంతంగా, హాయిగా ఉంటుంది. ప్రజలు ఒకరితో ఒకరు సంతోషంగా, సంతృప్తిగా, స్నేహభావంతో మెలగుతారు; పిల్లలు ధైర్యంగా, ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరుగుతారు. మొత్తం మీద ప్రజలు భద్రతాభావంతో ఇంటి ద్వారాలు తెరుచుకుని మరీ నిద్రపోతారు.

ఎంతో అవసరమయిన, ముఖ్యమయిన సమయాల్లో రాజు భిక్షువుల సలహాలు తీసుకోవాలని, ముఖ్యంగా తన విధులను గురించి తెలుసుకోవాలని బుద్ధుడు చెప్పేడు. దిఘ నికాయలోని చక్క వత్తి సిహనాద సుత్తలో - ఆ విధంగా సలహాలు తీసుకోకుండా మూర్ఖంగా, డాంబికంగా తనిష్టమొచ్చినట్టు ప్రవర్తించి, పేదరికాన్ని నిర్మూలించలేక దేశాన్ని సంక్షోభంలో పడేసిన రాజు గురించి - వివరించబడింది. అతని అసమర్థతతో పేదరికం విస్తరించింది. దొంగతనాలు పెరిగిపోయేయి. పేదరికాన్ని భరించలేకే వారు దొంగతనాలకి పాల్పడుతున్నారని, జాలి పడి రాజు వారికి ధనం

సమకూర్చేడు. వారు దాన్ని మరొక విధంగా తీసుకొని అవకాశాన్ని దుర్వినియోగం చేశారు. దొంగతనాలు మానక పోగా వారు రాజు నుండి కూడ ధనాన్ని తీసుకున్నారు. ఫలితంగా దొంగతనాలు ఇంకా ఎక్కువయేయి. దాంతో రాజు చిరాకుపడి దొంగతనం చేస్తూ పట్టుబడిన వారి తలలు నరికించడం మొదలు పెట్టేడు. అయితే భయంకరమైన ఈ పని రాజ్యంలో తీవ్రవాదాన్ని పెంచింది. దొంగలు మరింత దుర్మార్గంగ తయారయేరు. పల్లెలను, పట్టణాలను దౌర్జన్యంగా దోచుకోవడం, అడ్డొచ్చిన వారిని నిర్దాక్షిణ్యంగా నరకేయడం, రాజ మార్గాలలో దోపిడీలు మరింత ఎక్కువయేయి. దొంగతనాలు, దోపిడీలు, దౌర్జన్యాల నుండి హత్యలు, అబద్ధాలాడడం, చెడుగా మాట్లాడ్డం, వ్యభిచారం, తప్పుడు అభిప్రాయాలను ఏర్పరచుకోవడం, దగ్గరివారితో అక్రమ సంబంధాలు ఏర్పరచుకోవడం, విపరీతంగా కామ ప్రేరేపితులవడం, అన్నీ పెరిగిపోయేయి. ఆ విధంగా ప్రజల జీవితాలు అసంతృప్తిగా, ఏ క్షణాని కేమి జరుగుతుందో ఊహించలేనంత అభద్రతగా, భయంగ, బాధగా, అసంపూర్తిగా దిగజారిపోయేయి. రాజు అసమర్థత వలన దేశానికేర్పడిన దుస్థితి ఇది కాబట్టి రాజు వివేకవంతుడై, సమర్థవంతుడై, నిస్వార్థపరుడై, నిజాయితీపరుడై, సరయిన ఆలోచనలు కలిగి, ఎప్పుడు, ఎక్కడ, ఎలా ప్రవర్తించాలో అలా ప్రవర్తిస్తూ, ఏ సమస్యను ఎలా పరిష్కరించాలో అలా పరిష్కరిస్తూ ధర్మాన్ని వీడకుండా దేశాన్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టాలి.

అటువంటి రాజుల్లో చెప్పుకోదగినవాడు అశోకుడు. రాజులు, రాజరికపు చరిత్రలో అతనొక గొప్ప ఉదాహరణ. అతని ఉద్దేశ్యంలో రాజ్యమే యథాతథంగా ఒక లక్ష్యం కాదు; ధర్మం రాజ్యంకన్నా గొప్పది ధర్మాన్ని పాలించడానికి, సాధించడానికి రాజ్యం ఒక మాధ్యమం. రాజ్య పాలన ద్వారా అతను ధర్మాన్ని ప్రచారం చేశాడు. ధర్మ పరిపాలన చేశాడు. కళింగయుద్ధానంతరం అతను చూసిన భయంకర మైన దృశ్యాలు అశోకుడి మనసును కలచివేసి, కదిలించేయి. అప్పటి నుండి అతను యుద్ధం చేయడం మానేసి యుద్ధ భయంలేని శాంతియుత సామ్రాజ్యాన్ని స్థాపించాలని పాటు పడ్డాడు. ప్రజా జీవితాన్ని అన్ని విధాలా మెరుగు పరచడానికి ప్రయత్నించేడు. భౌతికంగ, నైతికంగా, అన్ని విధాలా ప్రజా శ్రేయస్సును వృద్ధి చేశాడు. అహింసను పాటించడం కోసం అశోకుడు శాకాహారాన్ని, తద్వారా జంతువులను చంపకుండా ఉండడాన్ని ప్రోత్సహించేడు. చెట్లు నాటించిన విషయం అందరికి తెలిసిందే! అయితే, అందులో భాగంగా, ఔషధ గుణాలు కలిగిన మొక్కల్ని పెంచడానికి ప్రోత్సహించేడు. ప్రజా సంక్షేమం కోసం ఏం చెయ్యడానికి వెనుకాడలేదతను. ప్రజాజీవితం ఆయురారోగ్యాలతో బాగు పడడమే కాక, వ్యాపారాలు కూడా అభివృద్ధి చెంది తద్వారా బౌద్ధ నైతిక సూత్రాలను ప్రతిస్థాయిలో పాటించేడు; పాటింప జేశాడు. అశోకుడు బౌద్ధం స్వీకరించడానికి ముందు తరవాత కూడ రాజే. బౌద్ధాన్ని పాటించడంతో అతను రాజధర్మాన్ని వీడలేదు. తను పాటిస్తూ, ప్రజల చేత పాటింప జేస్తూ, బౌద్ధ ధర్మం కలకాలం నిలిచిపోయేలాంటి పథకాలు వేస్తూ, ఒక ధర్మ పరిపాలకుడైన రాజు ఎంత గొప్పగా ఉండగలడో, రాజుకి, ప్రజలకి మధ్య ఉండే సంబంధ బాంధవ్యాల ద్వారా ఎంత శాంతియుతంగా పరిపాలన సాగించగలడో నిరూపించేడు. ఒకగొప్ప 'మోడల్'గా చరిత్రలో నిలిచిపోయేడు. 'యథారాజా తథా ప్రజా' అన్న నానుడిని అక్షరాలా నిజం చేశాడు.

# బౌద్ధ ప్రపంచం-నూతన రీతులు

- ఎమ్. రాజగోపాలరావు

బౌద్ధమీనాడు నేలనాలుగు చెరుగులా విస్తరించి ఉంది. మతంగా, దర్శనంగా విశిష్ఠ సంస్కృతిగా వేళ్ళూనుకొని పోయింది. సాంప్రదాయకులు బుద్ధునికి ఆలయాలు నిర్మించి ఆరాధిస్తూ మత స్వభావాన్ని వెల్లడిస్తున్నారు. పరిశోధకులు బౌద్ధ ధర్మంలో అత్యున్నత తర్కాన్ని దర్శనాన్ని వెలికితీస్తున్నారు. తులనాత్మక పరిశీలకులు బౌద్ధం విస్తరించిన దేశాలలో అభివృద్ధి చెందిన విశిష్ఠ సంస్కృతిని, ప్రతిష్ఠించిన వినూత్న విలువలను ప్రదర్శిస్తున్నారు. ఆ విధంగా బౌద్ధమీనాడు సాంప్రదాయక దేశాలలోనూ, అభివృద్ధి చెందిన దేశాలలోనూ రకరకాల అధ్యయనాలకు వేదికగా ప్రపంచ పరిశోధకులను ఆకట్టుకొంటున్నది.

ప్రపంచంలో వంద కోట్లకు పైగా బౌద్ధులున్నారని లెక్కలు కడుతున్నారు. పాతిక పైగా దేశాలలో ప్రసిద్ధంగా ఉన్నట్లు, మరికొన్ని దేశాలలో అప్రసిద్ధంగా ఉన్నట్లు వివరిస్తున్నారు. శ్రీలంక, మయన్మార్, థాయ్‌లాండ్, కంబోడియా, వియత్నాం, లావోస్, చైనా, కొరియా, జపాన్, టిబెట్, మంచూరియా, మంగోలియా, నేపాల్, భూటాన్-ఈనాటికీ బౌద్ధ దేశాలుగా గుర్తింపు పొందుతున్నాయి. మలేసియా, ఇండోనేసియా, ఉజబెకిస్తాన్, కజికిస్తాన్, తైజకిస్తాన్‌లలో గణనీయంగా బౌద్ధులున్నారు. బంగ్లాదేశ్‌లో చిటగాంగు ప్రాంతంలో బౌద్ధులున్నారు. భారతదేశంలో సిక్కిం, హిమాచల్‌ప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతంలో, కాశ్మీర్‌లోని లధక్‌లో కొనసాగుతున్న సాంప్రదాయిక బౌద్ధరీతులు భారతదేశంలో బౌద్ధం పూర్తిగా పతనమయి పోయిందనే పండిత ప్రకాండుల అజ్ఞానాన్ని వెక్కిరిస్తున్నాయి. గత రెండు శతాబ్దాలుగా సాగుతున్న పాశ్చాత్య విద్వాంసుల అధ్యయనాల ఫలితంగా పాశ్చాత్య దేశాలలో అమెరికా, ఆస్ట్రేలియాలలో బౌద్ధ అధ్యయన కేంద్రాలు, సంఘాలు, విహారాలు అభివృద్ధి చెందాయి. లండన్, బ్రిస్టల్ నగరాలలో ఉన్న బౌద్ధ కేంద్రాలు సుప్రసిద్ధాలు. బౌద్ధ అధ్యయనాలకు అంకితమై పోయిన క్రిస్టమస్ హంఫ్రీస్ (Christmas Hamphrees) ఏనాడో అక్కడ ''నవీన యుగాన్ని'' ప్రారంభించాడు. ఏనాటి నుంచో బెర్లిన్‌లో ఉన్న కేంద్రాలలో బౌద్ధ అధ్యయనాలు కొనసాగుతున్నాయి. బౌద్ధ ధర్మానికి ఆకర్షితులైపోయిన పారిస్ వాసులు నగర శివార్లలో ''బుద్ధబార్'' (సారాయి దుకాణం కాదు) ప్రారంభించుకొన్నారు. సిడ్నీ ఈనాటికీ ప్రసిద్ధ బౌద్ధ విద్వాంసులను ప్రపంచానికందిస్తున్నది. న్యూయార్క్‌లో ఎందరో బౌద్ధ అభిమానులున్నారు. వాషింగ్టన్ డి.సి.లో రకరకాల బౌద్ధశాఖల అధ్యయనకేంద్రాలు, సమగ్రమైన బౌద్ధ గ్రంథాలయాలు నెలకొన్నాయి. అమెరికా మెయిన్‌లాండ్‌కు సుదూరంగా ఉన్న హవాయ్ ద్వీపంలో వున్న ''ప్రాచ్య-పాశ్చాత్య కేంద్రం'' East West Centre భారతీయ అధ్యయనాలకు, ముఖ్యంగా బౌద్ధ అధ్యయనాలకు ఎంత ప్రాధాన్యమిస్తున్నదో ప్రపంచ జిజ్ఞాసువులకు తెలుసు. 1891లో భారతదేశంలో అనాగరిక ధమ్మపాల రగిలించిన చైతన్యంతో జాగృతమైన బౌద్ధం, 1956 దసరా రోజున డా॥ బి.ఆర్. అంబేద్కర్ అయిదు లక్షల అనుయాయులతో బౌద్ధం స్వీకరించి ''నవయుగం'' ప్రారంభించి బౌద్ధంలోని సామాజిక విప్లవ స్ఫురణను బహిర్గతం గావించటంతో ప్రారంభమయిన ప్రకంపనలతో ఉలిక్కిపడ్డ మేధావులు, సామాన్యుల సారథ్యంలో నగరాలలో, పట్టణాలలో, గ్రామాల్లో దేశం మారుమూలల్లో ప్రారంభమయిన చిన్న, పెద్ద బౌద్ధ

ఎమ్. రాజగోపాలరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్, బహు బౌద్ధ గ్రంథకర్త, గుంటూరు.

సమాజాలు బౌద్ధానికి ఊపిరిలూది నూతనరీతులకు బీజావాపనం గావించారు. అంతా అనిత్యం, నదీ ప్రవాహంలా నిరంతరంగా మారుతుంది అనే బుద్ధుని ఉపదేశాన్ని వంట పట్టించుకొని మారుతున్న దేశకాల పరిస్థితుల కనుగుణంగా ఆనాటి నుంచి ఈనాటి వరకు బుద్ధుని ధర్మం మారుతూనే ఉన్నదనే వాస్తవాన్ని రుజువుచేశారు. బౌద్ధ ధర్మమే లేదు. ప్రపంచం, ప్రపంచంలోని ప్రతిదీ- మతాలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలతో సహా అన్నీ మారిపోతూనే ఉంటాయి. దానిని అంగీకరించి సర్దుబాటు కావటం అభ్యుదయం, ఎదురు నిలిచి భంగపడటం తిరోగమనం.

బౌద్ధధర్మం మూడు ప్రధాన రీతులలో - హీనయానం, మహాయానం, తంత్రయానం - ప్రపంచ వ్యాప్తమయి పోయిందని అందరికీ తెలుసు. ఈనాటికీ సాంప్రదాయిక బౌద్ధానికి ప్రధాన కేంద్రాలుగా కొనసాగుతున్న ప్రసిద్ధ దేశాలను హీనయాన, మహాయాన, తంత్రయాన దేశాలుగా వర్గీకరించటం జరుగుతూనే ఉన్నది. శ్రీలంక, మయన్మార్, థాయ్‌లాండ్ దేశాలను హీనయాన దేశాలుగా; చైనా, కొరియా, జపన్ దేశాలను మహాయాన దేశాలుగా; టిబెట్, నేపాల్, భూటాన్ వంటి దేశాలను తంత్రయాన దేశాలుగా పరిగణించటం పరిపాటి. హీనయాన దేశాలలో బౌద్ధ ఆచారాలలో కొంత సారూప్యత గోచరిస్తున్నా-పాళీ సాహిత్యమే ప్రాధాన్యం పొందుతున్నది. మహాయాన, తంత్రయాన దేశాలలో ఎంతో వైవిధ్యం గోచరిస్తుంది. ప్రతిదేశంలోనూ బుద్ధుని ధర్మాన్ని వ్యాఖ్యానించటం ద్వారా అభివృద్ధి చెందిన విభేదాలవల్ల అనేక శాఖలు బయలుదేరాయి. భిక్షువులు ధరించే కాషాయ వస్త్రాల రంగులలో తేడాలు వారి శాఖా భేదాలను సూచిస్తాయి. తాంత్రిక బౌద్ధులలో వారి టోపీల రంగులు వారి శాఖా భేదాలను సూచిస్తాయి. వారి ఆరాధనా కార్యక్రమాలలోను, ఆచరణలలోను విభేదాలు గోచరిస్తాయి. బుద్ధుని ధర్మం ప్రపంచ వ్యాప్తం గావటంలో ఏ దేశంలోను ఎటువంటి సంఘర్షణలకు లోనయిన సందర్భాలు కనిపించవు. అంతా ప్రశాంతంగాసాగింది. అనేక దేశాల ప్రభువులు, ప్రజలు స్వచ్ఛందంగా బౌద్ధాన్ని ఆహ్వానించి, ఆదరించి అభివృద్ధి చేసుకొన్నారు. ఆయా దేశాల సంస్కృతీ సంప్రదాయాలతో సమైక్యమవుతూ, వాటిని ఉదాత్తీకరిస్తూ మౌలిక స్వరూప స్వభావాలను సంరక్షించుకొనే సామర్థ్యం బౌద్ధానికి సహజంగా ఉండటం వల్లనే అది సాధ్యమయిందని పండితులు వివరిస్తున్నారు. ఏమైనా ఈనాడు బౌద్ధంలో దేశాలపరంగా, శాఖలపరంగా కొన్ని భేదాలు కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. ఏ దేశంలోనూ హీనయానమో, మహాయానమో, తంత్రయానమో వాటి పురాతన రూపాలలో కొనసాగుతున్న దాఖలాలు లేవు. ఒక్క పాళీభాషనే ప్రమాణంగా అంగీకరించే పరిస్థితిలేదు. మహా సంఘికుల మిశ్రమ సంస్కృత గ్రంథాలు, మహాయాన సంస్కృత గ్రంథాలతోపాటు భారతదేశంలో అంతర్ధానమయిపోయి అనువాదాల రూపంలో లభిస్తున్న చైనా, టిబెటన్ గ్రంథాలను గూడా ప్రమాణంగా అంగీకరించవలసి వస్తున్నది. ఆ విధంగా బౌద్ధ ప్రపంచంలో యానాల కతీతంగా ఒక సామాన్య బౌద్ధం ఆవిష్కృతమవుతున్నది.

అంతేకాదు- భిక్షు- ఉపాసక్ (గృహస్థ) భేదాలు అంతరించిపోతున్నాయి. బౌద్ధ భిక్షువులు దూరంగా విహారాలలో నివసించటం లేదు. ప్రజలతో కలసిపోయి ప్రజాసేవా కార్యక్రమాలలో పాలుపంచుకొంటున్నారు. కాషాయ వస్త్రాల ధారణ వల్లనే వారు భిక్షువులుగా గుర్తింపు పొందుతున్నారు. ప్రస్తుతం భిక్షుణిల సంఘాలెక్కడా కనిపించటం లేదు. సామాన్యులు, జననం, వివాహం, మరణం వంటి సందర్భాలలో జరుపుకొనే కార్యక్రమాలలో భిక్షువులు పాల్గొంటున్నారు. అటువంటి సందర్భాలలో చైనాలో టావో, కన్‌ఫ్యూషన్, బౌద్ధ భిక్షువులు సామూహికంగా పాల్గొంటుంటారు.

జపాన్‌లో భిక్షువులు వివాహాలు చేసుకొని సంసారాలు చేసుకొంటూ భారతీయ పురోహితుల్లా గృహస్థుల వేడుకలు నిర్వహిస్తుంటారు. ఆ విధంగా ఒకనాడు- ద్వితీయ సంగీతిలో-మహా సంఘికులను, అంటే గృహస్థులతో కలిసిపోయిన ఉదార థేరులను, బహిష్కరించిన సనాతన థేరుల దృక్పథాన్ని సమర్థించిన బౌద్ధ సంఘం, మహాయాన ప్రభంజనంతో ప్రజా బౌద్ధంగా రూపాంతర మందటంతో మారుతూవచ్చిన బౌద్ధ సంఘం అధునాతన అవసరాలకు అనుగుణంగా మారి ప్రజలతో మమైక్యం గావటం ఆశ్చర్యం కలిగించదు. తంత్రయాన బౌద్ధం మీద ఎన్నో అపోహలు పెంచుకొన్న బౌద్ధ పండితులు, మహాయాన, హీనయాన బౌద్ధులు ఈనాడు భారతదేశంలో తలదాచుకొంటున్న తంత్రయాన అధిపతి 14వ దలైలామాను (అంటే గురుసాగరం) ఆదర్శంగా బుద్ధుని అవతారంగా గౌరవించటం ఆమార్పునే సూచిస్తుంది. అన్నిరకాల విభేదాలకు అతీతమయిన సార్వజనీన, సర్వసమాదరణీయ బౌద్ధం సహజంగానే అభివృద్ధి చెందుతున్నదని స్పష్టమవుతుంది.

గౌతమబుద్ధుడు సంబుద్ధుడైన తరువాత మహాపరినిర్వాణమందేవరకూ 45 సంవత్సరాలు వర్షావాసం మూడు నెలలు తప్ప - నిరంతరంగా పర్యటిస్తూ ధర్మం ఉపదేశించాడు. నగరాలు, పట్టణాలు, గ్రామాలు, కూడలులు పదిమంది చేరే ప్రతిచోటా అన్ని వర్గాల వారికీ అర్థమయ్యే విధంగా ధర్మమందిస్తుండేవాడు. ఒక్కొక్కసారి సంక్షిప్తంగా, ఒక్కొక్కసారి విస్తృతంగా, ఒక్కొక్కసారి క్రియానుగతంగా- శ్రోతల అవసరాలకు అనుగుణంగా ధర్మ దేశనా విధానం మారుతుండేది. ఉపదేశించే ధర్మం ఒక్కటే. ఉపదేశ లక్ష్యమూ ఒక్కటే. దానిని జాగ్రత్తగా వినాలి, అర్థంచేసుకోవాలి. సందేహాలుంటే తీర్చుకోవాలి, అది తమ అభ్యుదయానికి దోహదం జేస్తుందని స్వయంగా నిర్ణయించుకోవాలి. అప్పుడే దానిని స్వీకరించి ఆచరించాలి. దానికి అవసరమయిన మానసిక పరిణతి అందరిలోనూ ఉండకపోవచ్చు. కొందరు కృషిచేసి సాధించుకోవలసిరావచ్చు. దానివల్ల వారి అవగాహనలో తరతమ భేదాలు చోటు చేసుకోవచ్చు, గమ్యాలు మారవచ్చు.

అటువంటి భేదాలు ఈనాడు గూడ గోచరిస్తున్నాయి. సాంప్రదాయిక దేశాలలో అత్యధిక భాగం బౌద్ధులు బుద్ధుని మీద బుద్ధుని ధర్మంమీద అచంచల విశ్వాస ముంచి ఆరాధిస్తున్నారు. బౌద్ధాన్ని మతంగా కొనసాగిస్తున్నారు. వారిలో విజ్ఞులు, ఇతర ప్రాచ్య పాశ్చాత్య పండితులు బుద్ధుని ధర్మాన్ని రకరకాలుగా అర్థంజేసుకొని వ్యాఖ్యానిస్తున్నారు. కొందరు బౌద్ధం నైతిక వ్యవస్థంటున్నారు, కొందరు మనోవైజ్ఞానిక వ్యవస్థంటున్నారు. కొందరు అద్భుత తర్కాన్ని రావిస్తున్నారు, కొందరు మహోన్నత దర్శనంగా వివరిస్తున్నారు. కొందరు సామాజిక చైతన్యంగా పరిగణిస్తున్నారు. ఎవరికివారు వారి జీవితాలను అధ్యయనాలకు అంకితంచేసుకొని బుద్ధుని ధర్మాన్ని అర్థంజేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల వెలుగు చూస్తున్న బౌద్ధ సాహిత్యాన్ని అధ్యయనం జేస్తున్నవారు బుద్ధుని మార్మికునిగా (Mystic) మహాయోగిగా వివరిస్తున్నారు. బుద్ధుని ఆలోచనలో ఉపదేశంలో అంతర్వాహినిగా కొనసాగుతున్న భావాల ప్రవాహాలు అనేక రీతులుగా వెల్లువలై వెలువడుతున్నాయి. అన్ని తరగతుల వారినీ, తరహాల వారినీ, ఆకట్టుకొంటూ వాటి సార్వజనీనతను దర్శింపజేస్తున్నాయి.

ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధులు- అంటే బౌద్ధ మతస్థులు ఉన్నారు. బుద్ధుని ధర్మాన్ని నిశితంగా అధ్యనం జేస్తున్న విద్వాంసులున్నారు. మొదటి వర్గంవారికి బౌద్ధులుగా గుర్తింపు ఉంటుంది. బౌద్ధ విద్వాంసులకు అటువంటి గుర్తింపు ఉండదు. అటువంటి గుర్తింపును వారు ఆశించనుగూడా

ఆశించరు. అటువంటివారు సంఘాలు ఏర్పాటు జేసుకొంటారు. విహారాలు నిర్మించుకొంటారు. సమావేశాలు జరుపుతుంటారు. బుద్ధుని ధర్మం గురించి చర్చిస్తుంటారు. పాశ్చాత్య దేశాలలో అటువంటివారెందరో ఉన్నారు. అటువంటివారందరికీ సమైక్య వేదికగా పాశ్చాత్య బౌద్ధ సంఘం (Western Buddhist Order) ఏర్పాటు చేసుకొన్నారు. ఆ విధంగా తమ చుట్టూ తాముగిరిగీసుకోవటం సమంజసం కాదనే భావం వారిలో బయలుదేరింది. బయట దేశాలతో సంబంధ బాంధవ్యాలను నెలకొల్పుకోవాలనే ఆశయంతో 'సంఘరక్షిత' పేరుతో భారతదేశం సందర్శించిన డెనిస్ లింగ్‌వుడ్ (Denis Lingwood) కలింపాంగ్‌లో కొంతకాలం నివసించి సామాన్యుల సంఘ అభివృద్ధికి కృషిచేశారు. లండన్ వెళ్లి 1967 సంవత్సరంలో ''పాశ్చాత్య బౌద్ధసంఘ మిత్రమండలి'' (Friends of Western Buddhist Order) ప్రారంభించాడు. ఆ మండలి గూడా త్రిశరణాల స్వీకారంతోనే బౌద్ధులవుతారని అంగీకరిస్తుంది. అయితే పంచశీలతో బ్రహ్మచర్యాన్ని (కామేసు మిచ్చాచార విరమణ) మద్యపాన విరమణను (సురామేరయ మజ్జప్పమాదట్ఠాన విరమణ) తొలగించి వారి జీవితవిధానాలకు అనుగుణంగా వినూత్న పంచశీలను అభివృద్ధి చేసుకొన్నారు - మైత్రి, దానం, నిరాడంబరతా, తృప్తి, సత్యవచనం, విశుద్ధ మనస్కతలను పంచశీల గావించుకొన్నారు. ఇటువంటి వినూత్న వ్యవస్థల నిర్మాణాలు పాశ్చాత్యాలలో బౌద్ధులుకాని బౌద్ధ అభిమానులలో కనిపిస్తాయి. త్రిశరణాలను మూడు సార్లు పారాయణం జేసే బౌద్ధులు చాలా మందే కనిపిస్తారు, కాని పంచశీలను చిత్తశుద్ధితో అనుసరించేవారు ఎందరుంటారో తేల్చటం కష్టం. వాస్తవిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ వినూత్న పంచశీలను పాశ్చాత్య బౌద్ధులు సమర్థించుకోవచ్చు.

ఇటువంటి సంఘాలు, రీతులు ఆసియాలో ముఖ్యంగా చైనా, మయన్మార్, భారతదేశాలలో గూడా అభివృద్ధిచెందాయి. చైనాలో తాయ్‌సు (Tai-Hsu), మయన్మార్‌లో లేడి సాయదా (Ledi Sayadaw) బౌద్ధ పునరుజ్జీవనానికి కృషిచేశారు. భారతదేశంలో గూడ అటువంటి ప్రయత్నాలు పుంజుకొన్నాయి. పూణె దానికి కేంద్రమయిపోయింది. ఒక్క పూణెలోనే లక్షకుపైగా 'నవీన బౌద్ధ' మతస్థులున్నారు. మానవులందరినీ అభ్యుదయ పథంలో నడిపించిన బుద్ధుడు 'కల్యాణమిత్త'గా ప్రసిద్ధిచెందాడు. అదే లక్ష్యంతో, సర్వజన శ్రేయస్సుకు కృషిచేయటానికి ఉపక్రమిస్తూ ''కల్యాణమిత్ర'' సంఘం ప్రారంభించారు. దానిని ప్రపంచ వ్యాప్తంగావించే లక్ష్యంతో ''పాశ్చాత్య బౌద్ధసంఘ మిత్ర మండలి'' ప్రేరణతో ''త్రైలోక్య బౌద్ధ సహాయక గణ'' ప్రారంభించారు. అటువంటి ప్రయత్నమే ఆనాటి ''మద్రాసు ప్రావిన్స్'' కేంద్రమైన మద్రాసులో జరిగింది. అయోధ్యదాస, లక్ష్మీనరసు వంటి బౌద్ధాభిమానులు బుద్ధిష్ట్ అసోసియేషన్ ప్రారంభించి పెరంబుదూరులో ''బుద్ధవిహారం'' నిర్మించారు.

ఆ విధంగా కృషి చేసినవారు ప్రపంచంలోను, మన దేశంలోను ఎందరో ఉన్నారు. ముఖ్యంగా డా॥ బి. ఆర్. అంబేడ్కర్ ప్రేరణతో బౌద్ధం విస్తరించటం పుంజుకొన్నది. ఈనాడు భారతదేశంలో అరకోటిపైగా బౌద్ధులుగా గుర్తింపు పొందినవారున్నారు. వారిలో భిక్షువులు, ఉపాసకులు ఉంటారు. అయినా అందరూ కలిసే ధర్మాభివృద్ధికి కృషి చేస్తుంటారు. ఈ అభివృద్ధి అంతా బుద్ధుని ధర్మం సార్వజనీనమని నిరూపిస్తున్నది. కాలాంతరాలలో అభివృద్ధి చెందిన శాఖా విభేదాలు అంతరించిపోయి సమైక్య బౌద్ధధర్మ వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న సంకేతాలు అందిస్తున్నాయి.

# ఆధునిక ప్రపంచానికి బుద్ధుడు

- షణ్ముఖానంద

మనిషిగాని సమాజం గాని సమస్యలతో సతమతమవుతుందంటే మార్పును కోరుకుంటున్నారనే అర్థం. కొందరు మనిషి మారితే సమాజం మారుతుందని అంటారు. వీరు ముఖ్యంగా తాత్వికులు. సమాజానికి మనిషి కేంద్రం కనుకనే మనిషి స్వభావంలో మార్పు తీసుకురావడం ద్వారా సమాజాన్ని పునర్నిర్మించవచ్చు అని అంటారు. మరి కొందరు సమాజం మారాలంటారు. వీరు ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ సిద్ధాంత కర్తలు. సమాజం యొక్క ఆర్థిక వ్యవస్థలో మార్పు తీసుకురావడం ద్వారా సమాజాన్ని మార్చవచ్చుఅంటారు. మనిషి తనకు తానుగా మారాలనుకున్నప్పుడు బౌద్ధం ఉపయోగపడుతుంది. మానవ సంబంధాలలో మార్పురావాలంటే అనగా ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో మార్పు రావాలంటే అదొక ఉద్యమంగా రూపాంతరం చెందాలి. అందుకు నాయకత్వం అవసరమవుతుంది. అప్పుడు మరొక బుద్ధుడు కావలసి ఉంటుంది. మనిషిలో గాని, సమాజ స్థితిలో గాని మార్పు అనవసరంగా, ఆకస్మికంగా రాదు. కాల, దేశ పరిస్థితులు ప్రభావితం చేస్తాయి. మార్పు అత్యవసరం, గత్యంతరం లేని పరిస్థితిల్లో తన్నుకు వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఆయా అవసరాలు, ఆయా సమస్యలకు తగినట్లుగా సిద్ధాంతం మరియు నాయకత్వం పుట్టుకు వస్తుంది. మార్పు ఎలాంటి స్థితిలో వస్తుంది అనగా ప్రస్తుత స్థితిలో మనిషి, సమాజం, మనుగడ, పురోగతి సాగించలేని స్థితిలో మనుగడ కోసం, పురోగమనం కోసం మార్పు వస్తుంది.

ఆధునిక ప్రపంచానికి, బుద్ధుడు కావాలా, బౌద్ధం కావాలా అంటే రెండూ కావాలనిపిస్తుంది. బుద్ధుని నాయకత్వం, బౌద్ధ ధర్మం నేటి ప్రపంచానికి చాల అవసరం. సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. బౌద్ధ అవతరించింది. ఆనాటి నుండి బౌద్ధం నిలదొక్కుకొని సమాజ జడత్వాన్ని, మూర్ఖత్వాన్ని వదిలించి పురోగమనానికి సాయపడింది. బుద్ధుడు మహా నిర్వాణం పొందినాడు. కాలక్రమేణా బౌద్ధం సిద్ధాంతంగా, ధర్మంగా, మతంగా మిగిలిపోయింది. అది కేవలం మనిషి తనకు తాను పరివర్తన చెందడానికి మాత్రమే సాధనమైంది. వ్యక్తిత్వ వికాసానికి పనికి వచ్చే సాధనంగానే కొనసాగుతుంది. నిజానికి, మనిషిలో స్వాభావికమైన మార్పు తీసుకురావడంలో బౌద్ధాన్నిమించింది లేదు. బౌద్ధం అవతరించిన తర్వాత శిల్పం, సాహిత్యం, వాస్తు, చిత్రకళ ఇత్యాది కళలు మహాద్భుతంగా త్వరితంగా అభివృద్ధి చెందినాయంటే కారణం మనిషి వికసించబట్టే. మానసిక వికాసానికి బౌద్ధం గొప్పసాధనం అనటంలో అతిశయోక్తి లేదని చెప్పడానికి ఇదే గొప్ప నిదర్శనం. ప్రపంచంలోని మనుషులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. ఒక వర్గం మానవత్వాన్ని మూర్తీభవించుకున్నవారు, అయితే మరొకవర్గం మానవత్వాన్ని మూర్తీభవించుకోవలసిన వారు. మొదటి వర్గం బౌద్ధులని ఘంటాపదంగా చెప్పవచ్చు. మనిషి యొక్క పరిణామ క్రమాన్ని మనం గమనించినట్లయితే, ఆది

---

షణ్ముఖానంద, బౌద్ధ అభిమాని, విపస్సనా ధ్యానంలో ప్రవేశం ఉంది, హైదరాబాదు

మానవుని నుండి నేటి ఆధునిక మానవుడి వరకు మానవుడు దాటిన వివిధ దశలలో, కేవలం భాష, లిపి, శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధిలోనే గాక జంతు స్వభావం నుండి మానవత్వాన్ని కలిగించుకోవడం అనే గుణ ప్రధానమైన మార్పుకూడా వున్నది. విశేషించి ఈ గుణ ప్రధాన పరిణామ అభివృద్ధి ఊపందుకున్నది బౌద్ధం అవతరించిన తర్వాతే. వినయం, విచక్షణ, ప్రేమ, దయ, కరుణ, నిస్వార్థం, త్యాగం ఈ లక్షణాలన్నీ బౌద్ధం వికసించిన ప్రాంత ప్రజలలోనే మనం చూడవచ్చు.

ప్రస్తుతం బౌద్ధం సమాజ వికాసానికి మార్గదర్శకమయ్యే ఉద్యమస్థాయిలో లేదు. బుద్ధుడు తన స్థానంలో మనిషికి బదులు ధర్మాన్ని నిలబెట్టినాడు. సమాజమార్పుకు ఉద్యమం కావాలి. నాయకుడు లేదా సంఘం కావాలి. ధర్మాన్నాచరించడమే కాదు ఆచరింపజెయ్యాలి. ధర్మ ప్రచారం జరగాలి. ధర్మాచరణకు తగిన పరిస్థితులు, శిక్షణ అవసరమవుతాయి.

ఆచరణలో లేని సిద్ధాంతం మనుగడ సాగించలేదు. సిద్ధాంతంగాని, ధర్మంగాని, నీతిగాని ప్రాథమికంగా సాంఘికమైనది. మనిషి ఏకాకిగావుంటే ధర్మంతో పనిలేదు. ధర్మం అంటే సన్మార్గ వర్తనం. సాటి మనుషులతో పరస్పర సంబంధంతో జీవిస్తున్నారో అప్పుడు ధర్మం అత్యవసరం అవుతుంది. కాబట్టి ధర్మం లేకుండా సమాజం వుండదు. సమతుల్యత సాధించకల్గినదే ధర్మం.

చివరికి ధర్మాన్ని పాటించవలసింది ఎవరికి వారే అయినా సమిష్టిగా దానిని ఆచరించినపుడే సమాజం వర్థిల్లుతుంది. లేకపోతే ఆ సమాజం అరాచకం అవుతుంది. సమాజంలో మానవుడు ధర్మపరుడై సమిష్టిగా వుంటూ ఉమ్మడి ప్రయోజనాలను పొంది సామరస్యాన్ని పెంపొందించాలి.

అనగా ఎవరికి వారు తాము నీతిగా ఉంటూ ఇతరులను నీతిపరులుగా వుండేటట్లు చూస్తూ ధర్మం వర్థిల్లేటట్లు చేస్తూ ధర్మ రక్షణ కావించాలి. అప్పుడే ఆ సమాజంలోనే ధర్మ ప్రచారానికి, ధర్మ రక్షణకి సంస్థలు అంతర్లీనంగా వుంటాయి.

బుద్ధుడు మొదటగావ్యక్తిగతమైన దుఃఖనివారణే లక్ష్యంగా పెట్టుకుని, అందుకు అష్టాంగ మార్గాన్ని కనుగొన్నాడు. ఆ మార్గంలోని శీల పథాన్ని సామాజిక నీతిగా చేయబడింది. ఆనాడు ఉన్న మూఢ విశ్వాసాలను, ఆచారాలను రూపు మాపి వేయగల్గింది.

ఇప్పుడు ప్రపంచ స్వరూపం మారిపోయింది. ఇప్పటి సమస్యలు వేరు, ఆనాడు వున్న సమస్యలు వేరు. బౌద్ధంలోని వ్యక్తి వికాస అంశాలనే కాక సామాజిక అంశాలపై మనం ఇప్పుడు దృష్టి నిలపాలి. అత్యంత విలువైన విశిష్టమైనటువంటి అనితర సాధ్యమైన బౌద్ధ ధర్మాన్ని ముందుగా ఆచరణాత్మకం చేసి సామాజీకరణ చేసి, ప్రపంచీకరణ చేసి, ఆధునీకరించి ఉద్యమ స్వరూపమిచ్చి పునర్జీవింప చెయ్యాలి. అందుకు బౌద్ధమే కాదు బుద్ధుడు కూడా కావాలి. 'మనిషి బుద్ధుడు కావాలి సమాజం బౌద్ధం కావాలి.'

మానవ ప్రపంచం ఇలా దేశాలుగా, జాతులుగా, మతాలుగా, వర్గాలుగా విడివడి అవ్యవస్థీకృతమై ఉమ్మడి లక్ష్యాలు లేక సామరస్యం కరువైనది. విభిన్న లక్ష్యాలతో విభిన్న ప్రమాణాలతో వున్నప్పుడు మనిషి సమచిత్తంతో వుండలేడు.

కాబట్టి మొత్తం మానవాళి ఉమ్మడి నైతిక సూత్రాలు, ఆదర్శాలు, లక్ష్యాలను, ధర్మ ప్రవర్తనను ఏర్పరచుకొనుటే మేలు. ఇది ఘర్షణద్వారా కాక ప్రేమ, దయ, కరుణ, అవగాహన ద్వారానే సాధ్యం. అందుకు మనిషి బుద్ధత్వాన్ని పొందాలి.

బుద్ధుడి గొప్పతనాన్ని కీర్తించాలంటే భాషచాలదు. పోల్చడానికి సాటి అయిన మరో వ్యక్తి కానరాడు. అనితర సాధ్యమైన త్యాగం చేసి, కఠోరమైన సాధన చేసి కనిపెట్టిన మూర్తిమత్వ సిద్ధాంతం, అష్టాంగ మార్గమే అతనిని అంతటి వాడిని చేసింది. మనిషి తనకు తానుగా మారటానికి బుద్ధుడు మనకు అందించిన ''చిత్తోపాసన'' సాధనమైతే సమాజం యొక్క ఉమ్మడి లక్ష్యంగా, జీవన మార్గంగా అష్టాంగ మార్గాన్ని ఎన్నుకోవచ్చు.

సమాజానికి ఇప్పుడున్న సంపదార్జనే ఏకైక లక్ష్యంకాక జ్ఞానార్జనే లక్ష్యంగా మారాలి. ఇంద్రియానందమే ప్రధానం కాక నిర్వాణానందం ప్రధానం కావాలి. అప్పుడు మాత్రమే యుద్ధ భయం, అభద్రతా భావం మనిషిని వదిలి వేస్తుంది.

బుద్ధుడి గురించి తెలిసిన వారు మాత్రమే మనస్సుని ఆరో జ్ఞానేంద్రియంగా పరిగణిస్తారు. అసలు ప్రపంచ సమస్యలన్నీ మనస్సుని ఇంద్రియంగా గుర్తించనందువల్లే వున్నాయి. మనస్సుపై అంతటి మహోన్నతమైన బుద్ధుడి విశ్లేషణను ఇక్కడ ప్రస్తావించాలి.

ఆలోచనా వస్తువుకు మనస్సు (మానసికస్థితి) జ్ఞానేంద్రియం అవుతుంది. కొన్ని మానసిక కారకాల కలయికతో ఆ మానసికస్థితి ఏర్పడుతుంది. ఏ ఏ కారకాల కలయికతో ఆ మానసిక స్థితి ఏర్పడిందనే దానినిబట్టి ఆ మానసిక స్థితి ప్రత్యేకత, అనన్యతలు నిర్ణయ మవుతాయి.

మానసిక కారకాలు కుశలాలని (మంచి), అకుశలాలని (చెడ్డవి) రెండు రకాలు.

అకుశలాలు ఏమనగా (1) మోహం (2) సంశయం (3) స్వార్థం ఇంకా ఇలాంటి సంజ్ఞాత్మక కారకాలున్నాయి. అవి నిర్లజ్జ, అపశ్చాత్తాపాలు, ఇవికాక వేదనా ప్రభావిక కారకాలు, ఆందోళన, వ్యాకులతలు. ఇలాంటి అకుశల కారకాలతో కూడిన మానసిక స్థితి ఎలాంటి ఆలోచనలు చేస్తుందో ఎలా మనిషి ప్రవర్తిస్తాడో మనం అర్థం చేసుకోవచ్చు.

ప్రతి అకుశల కారకానికి వ్యతిరేక కుశలకారకం వుంటుంది. కుశల కారకాలు ఏమనగా:

1. అంతర్దృష్టి 2. అప్రమత్తత ఇవికాక సంజ్ఞానాత్మక కారకాలు అయిన వినయం, విచక్షణ, విశ్వాసం మొదలగునవి.

అనగా మనిషి కుశల కారకాలతో ఏర్పడిన మానసిక స్థితిని కలిగివున్నప్పుడు మాత్రమే నీతివంతంగా ధర్మబద్ధంగా జీవించ కలుగుతాడు. కాబట్టి మనిషి ప్రవర్తనకి అతడు బాధ్యుడు కాడు, అతని మానసిక స్థితిది బాధ్యత. మానసిక శిక్షణ ద్వారా అకుశల కారకాలను కుశల కారకాలతో నింపి మానసిక స్థితిని మార్చుకోవడం ద్వారా తన ప్రవర్తనను మనిషి మార్చుకోగలడు. అలాకాకుండా అతడికి ఎన్ని నీతి మాటలు చెప్పినా, ఎంత ధర్మాన్ని బోధించినా మారలేడు.

ఇది కొంత కఠినమైన సాధన ద్వారానే సాధ్యం. అందుకు శిక్షణాసంస్థలు మానవుడికి అందుబాటులోకి రావాలి. అందుకే కేవలం ధర్మ ప్రచారమే సంస్థల, సంఘాల బాధ్యతగాకాక శిక్షణా సంస్థల్ని విరివిరిగా నెలకొల్పి శిక్షణ అవసరాన్ని తెలియపరుస్తూ, ప్రోత్సహిస్తూ నిర్వహిస్తూ ఉండాలి.

మానవుడు యవ్వన దశకి చేరే నాటికే అతను మూర్తిమత్వాన్ని పొంది ఉంటాడు గనుక బాల్య, విద్యార్థిదశల్లోనే మానసిక శిక్షణ నైతిక ప్రవర్తనకై బీజాలు నాటాలి. ఇది సూక్ష్మంగా వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడితే, ఇక సమాజపరంగా వ్యక్తి జీవనశైలిగా బుద్ధుడు బోధించిన అష్టాంగ మార్గాన్ని ఉపయోగించుకోవచ్చు. అష్టాంగ మార్గంలో ఎనిమిది అంగాలు వున్నాయి. ఈ ఎనిమిది అంగాలను మూడు వర్గాలుగా విభజించారు.

(1) సరైన వాక్కు (2) సరైన కర్మ (3) సరైన జీవనం - వీటిని శీల వర్గంగా
(4) సరైన అప్రమత్తత (5) సరైన ఏకాగ్రత (6) సరైన ప్రయత్నం - వీటిని సమాధి వర్గంగా
(7) సరైన అవగాహన (8) సరైన సంకల్పం -వీటిని ప్రజ్ఞా వర్గంగా విభజించారు

అష్టాంగ మార్గం ఆచరణ అంటే, ధర్మమార్గాన్ని అందరూ అనుసరిస్తే మనిషి తోటి మనిషిపై చేసే అన్యాయం, అమానుషత్వాలు, దోపిడి తొలిగి పోతాయి.

మనిషి ధర్మాన్ని అనుసరించడానికి ముందుగా అతని లక్ష్యం, గమ్యం, కోరికలో మౌలికమైన మార్పురావాలి. మనిషి యొక్క లక్ష్యాన్ని మార్చాలంటే అతడు ధర్మప్రదంగా జీవించాలంటే బుద్ధుడు చెప్పిన 4 ఆర్య సత్యాలను తెలుసుకోవలసిందే. మానవ జీవితం దుఃఖమయం, ఇది మొదటి ఆర్యసత్యం. దుఃఖకారణం, నివారణ, నివారణామార్గం ఇవి మిగతా 3 ఆర్యసత్యాలు.

మానవుడు దుఃఖిస్తున్నాడు. అయితే ఆదుఃఖ కారణం తెలుసుకోలేక ఆదుఃఖ నివారణకి సరైన మార్గం అనుసరించక మానవుడు ఇదిగో ఈ అక్రమ అధర్మ జీవన విధానాన్ని అవలంభిస్తున్నాడు. సుఖశాంతులను కోల్పోతూ ఇంద్రియానందమే లక్ష్యంగా సంపదను, అక్రమార్జనతో కూడబెడుతూవున్నాడు. ఈ ఆధునిక మానవుడి సమస్యలన్నీ, దుఃఖ నివారణ మార్గాన్ని తెలుసుకోలేక పోవటం చేతనే. బుద్ధుని మాటలలో చెప్పాలంటే అవిద్య, అంటే దుఃఖం ఉనికిని

తెలుకోలేక పోవటమే. దుఃఖ నివారణే అష్టాంగమార్గం, అదే ధర్మబద్ధంగా సుఖంగా జీవించే శైలి.

ఇప్పటి ప్రపంచం, దేశాలుగా, జాతులుగా విభిన్న మతాలుగా విభజన చెంది ఒక దానితో ఒకటి సంఘర్షించుకుంటూ యుద్ధ భయంతో వణికి పోతూవుంది. ఇందుకు సమాధానం కూడా బౌద్ధంలో మనకి కనిపిస్తుంది. అదే అనాత్మభావం. బుద్ధుడు స్వయంగా సాధనద్వారా అనాత్మభావాన్ని అనుభవపూర్వకంగా వీక్షించి మనకు అందించాడు. దీనిని మనం అంగీకరిస్తే సాధన ద్వారా తెలుసుకుంటే ఆత్మ ఉండదు, పరమాత్మవుండడు. దేవుడూ వుండడు, దేవుడిని ఆధారం చేసుకున్న మతాలు ఉండవు. ఇక విభజన ఎక్కడిది? ఘర్షణ ఎక్కడిది?

మరొక భావం ''అనిత్య'' ఏదీ శాశ్వతంకాదు. ప్రాణమే కాదు ఆఖరకు పదార్థంకూడా మనకు గోచరించేలాగ భౌతిక రూపం లేని కారకాల మిశ్రమం. ఏదీ శాశ్వతం కానప్పుడు ఆర్జన, కేవలం మనుగడ కోసమే అవుతుంది కాని కూడబెట్టడానికి కాదు. ఆనాడు దేశాలుండవు, ఎల్లలుండవు. ప్రపంచం మొత్తం ఏకఖండం అవుతుంది. మనిషి నిర్వాణానందాన్ని పొందటానికి మార్గం సుగమమవుతుంది.

దైనందిన జీవితానికే బౌద్ధం ఉపయోగపడుటయే గాక తాత్విక చింతనా పరులకు కూడా సరైన సత్యమైన, నిత్యమైన సమాధానం బౌద్ధంలో లభిస్తుంది. అందుకే ప్రపంచానికి నిజమైన ధర్మం, మార్గం, పరిష్కారం, బౌద్ధం ఒక్కటే.....

ఇప్పుడు ప్రపంచం సంప్రదాయంగా భావించే సమస్యలైన నిరుద్యోగం, ఆకలిచావులు, ఆర్థిక తారతమ్యాలు, శ్రమదోపిడి, వర్ణ విచక్షణ. ఇవి బౌద్ధునికి అసలు సమస్యలే కావు. బౌద్ధం వాటిల్ని క్షణంలో పరిష్కరిస్తొంది ఎందుకంటే అందుకు ముందే చెప్పినట్లు బౌద్ధం అసలు లక్ష్యం నిర్వాణమే. ప్రపంచం ఈ సమస్యల్ని ఎదుర్కొంటుం దంటే అందుకు కారణం ఆయాదేశాల ఆర్థిక వ్యవస్థ. ఆ ఆర్థిక వ్యవస్థలు సొంత ఆస్తిని దాని రక్షణని కేంద్రంగా ఎంచి నిర్మితమైనవి. కాని బౌద్ధం సొంత ఆస్తికాక సామూహిక ఆస్తిని కల్గి వుండి వుంటుంది.

కాబట్టి పై సమస్యలు కాక అసలైన సమస్యలున్నాయి. అవి ఏమనగా (1) మానవుడు ప్రకృతికి దూరమవటం (2) అసహజంగా బ్రతకటం (3) ఉత్పత్తిలో తప్పని సరిగా మానవుడు పాల్గొనవలసిరావటం (4) అవసరాలు పెరగటం (5) కాలం కొరత.

భవిష్యత్‌లో మానవుడు ఎదుర్కొన బోయే సమస్యలు ఇవి. ఈ సమస్యల్ని బౌద్ధం మాత్రమే పరిష్కరించగలదు.

*(ఈ వ్యాసంలోని కొన్ని అంశాలకు అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి గారి ''మానవీయ బుద్ధ'' ఆధారం).*

# బుద్ధబోధ

- డా॥ మలయశ్రీ

సుత్త పిటికం - సుత్త నిపాతంలోని 'పారాయణ వగ్గ'లో అశ్మకదేశపు బావరి ముని శిష్యులు పదహారుగురు శ్రావస్థి నగర రాతిమందిరంలో బుద్ధుని సందర్శించి వివిధ ప్రశ్నలు అడుగుతారు, గురువు కోరికగా. వాటికి గౌతమ బుద్ధుడు ఇచ్చిన సమాధానాలు విజ్ఞాన ప్రదర్శకంగా ఉన్నవి. అవి బౌద్ధ తత్త్వాన్ని స్పష్టంగా వ్యక్త పరచినవి. త్రిమతా చార్యులలో ప్రథముడైన ఆది శంకరాచార్య 'మోహముద్గరం' (భజగోవిందం)లో శంకరాచార్యుని 12, పన్నెండుగురు శిష్యులవి 12+1, మొత్తం 25 మజరి గేయాలున్నవి. అవన్నీ ఒక వృద్ధ పండితునికి భక్తిని గూర్చి ప్రబోధించినవే. శంకరుని కాలం క్రీ.శ. 8వ శతాబ్ది. బుద్ధునిది క్రీ.పూ. 6వ శతాబ్ది. విషయం మారినా 'భజగోవిందం', బుద్ధ- బావరి శిష్య సంభాషణకు అనుసరణ అని చెప్పవచ్చు.

ఈ 'పారాయణ వగ్గ' ఇప్పుడు 'మిసిమి' సంపాదకులు డా॥ అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డిగారు ఆంగ్లం నుంచి తెలుగు చేసినారు. దాని 'ముఖబంధం' వివరణ గాథ ఇట్లుంది :

అస్సక రాజ్యంలో గోదావరీ తీరాన నివసిస్తున్న బావరి అనే బ్రాహ్మణుని వద్దకు ఉత్తర దేశం నుంచి మరో బ్రాహ్మణుడు వచ్చి 500 నాణేలు ఇమ్మని అడిగాడు. కాని, అవి లభించక పోవడంతో 'నేటి నుంచి ఏడవ రోజున నీతల ఏడు వక్కలవు గాక' అని శపించాడు. బావరి చింతించగా ఒక దేవత ప్రత్యక్షమై ''బుద్ధుని వల్ల నీకు ఉపశమనం కలుగుతుంది'' అని ఓదార్చింది. అప్పుడు బావరి తన 16 గురు శిష్యులను బుద్ధుని చూసి తమ ప్రశ్నలు అడిగిరండని పంపించాడు. ఆ ప్రశ్నలకు బుద్ధుడు సమాధానాలు ఇచ్చాడు.

తర్వాత ముందుకథ 'వత్థుగాథా' పేర వివరించబడింది. అందులో బావరి ఉంఛవృత్తి (పరిగ ఏరుకొని) జీవించేవాడు. యజ్ఞం చేసి నిర్ధనుడై ఉన్నాడు కనుక అతిథి బ్రాహ్మణునికి అడిగినంత డబ్బు ఇవ్వలేక పోయాడు. ఆ దేవత ఎవరో తెలియదుకాని, ఆమె యాచక విప్రుని అహంభావి అజ్ఞాని అని బుద్ధుని గొప్పతనాన్ని ప్రశంసించింది.

సంబుద్ధుని పేరు విన్నంతనే బావరి సంతోషించి, అతడెక్కడ ఉన్నాడని అడిగితే - కోసల నగరమైన శ్రావస్తిలో ఆ మేధావి, ప్రజ్ఞాశాలి ఉన్నాడని దేవత తెలిపింది.

అప్పుడు బావరి తన శిష్యులను పిలిచి విషయం తెలిపి బుద్ధ సందర్శనానికి పంపిస్తూ ఇలా అన్నాడు. 32 మహా పురుష లక్షణాలు ఉంటేనే మీరు అతన్ని బుద్ధునిగా గుర్తించండి. మీరు అతనితో ఏ ప్రశ్నలు పైకి అడుగవద్దు. ప్రశ్నలు మీ మనసులో అనుకోగానే, అతడు బుద్ధుడైతే వినకుండానే గ్రహించి వాటికి

---

డా॥ మలయశ్రీ, భౌతికవాద రచయిత, నవ్య సాహిత్య పరిషత్ అధ్యక్షుడు, కరీంనగర్.

సమాధానమిస్తాడు అన్నాడు. వారు అశ్మక నుంచి ఉత్తరానికి బయల్దేరినారు. ( నిజామాబాద్ జిల్లా బోధన్/ పోతన నగరం అశ్మక దేశానిది. కరీంనగర్- ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల మధ్య గోదావరీ నదీ ద్వీప గ్రామం నేటి 'బాదన కుర్తి' నాటి బావరి నివాస స్థలం అని ఠాకూర్ రాజారాం సింగ్‌గారి అభిప్రాయాన్ని ఈ వ్యాస కర్త ఆ ప్రదేశాన్ని స్వయంగా చూసి నిజమని ధృవీకరించాడు. బావరన్నకుర్తి - బాదన్నకుర్తి అయి ఉంటుంది). మెదకు పై భాగం ముళక రాష్ట్ర రాజధాని ప్రతిష్ఠానం దాటి, మహస్సతి, ఉజ్జయిని, గోనద్ద, విదిశ, వనస్వ కోసాంబి, సాకేత మహానగరాలు దాటి శ్రావస్తి సేతవ్య, కపిలవస్తు, ఇంకా కుశినార, భోగనగరమైన పావా, మగధ పురమైన వైశాలి చేరి, రమణీయ శిలామందిరంలో భిక్షుక సంఘ పరివేష్టితుడై ధర్మబోధ కావిస్తూవున్న బుద్ధుని సందర్శించారు బావరి శిష్యులు. వీరు తను గురువును గూర్చి అడిగితే శాక్యముని ఆ విశేషాలు తెలిపాడు. వేదవిద్యా పారంగతుడు, హఠయోగ సాధకుని లక్షణాలవి. తామెవరూ ప్రశ్నించకుండా బుద్ధుడు జవాబులు చెప్పడం విని అవి ఏ దేవతల అదృశ్య ప్రశ్నలో మాయో అని శ్రోతలు ఆశ్చర్య పడ్డారట! ఈ శిష్యులలో ఒకడు - తల, తల పగలడం గూర్చి అడిగాడు- మౌనంగా? అవిద్యే తల- శ్రద్ధ, సతి ( సంతృప్తి ), సమాధి, వినిశ్చయం, వీర్యాలతో కూడిన విద్య ఆ తలను బద్దలు కొడుతుంది - అని బుద్ధుని సమాధానం విని వారు సంతృప్తులై బుద్ధునికి నమస్కరించారు.

మీరు మీ గురువు బావరి సుఖంగా ఉందురు గాక- అని బుద్ధుడు ఆశీర్వదించాడు. ఇక బావరి శిష్యుల ప్రశ్నలు- తథాగతుని జవాబులు ఇలా సాగాయి.

1. అజిత మాణవుడు :- ఈ ప్రపంచం దేనితో ఆవరించబడింది. అది దేనివలన ప్రకాశించదు? ఆ కాలుష్యాన్ని ఏమని పిలుస్తారు? దాని వలన ఏ ప్రమాదం కలుగుతుంది?

బుద్ధుడు :- ఈ లోకం అవిద్యచేత ఆవరించబడి ఉంది. లోభం ప్రమత్తత వల్ల అది ప్రకాశించదు. రాగం దాని కాలుష్యం, దుఃఖం దాని వలన కలిగే మహా భయం.

అజి :- అన్ని దిశల ప్రవహించే తృష్ణా ప్రవాహాలకు ఆనకట్ట ఏది? వాటిని ఏది ఆపి వేయగలదు?

బుద్ధుడు : సతి ( సంతృప్తి-మైండ్ ఫుల్‌నెస్) తో వాటిని ఆపగలం.

అజి : ప్రజ్ఞ, సంతృప్తితో పాటు నామరూపం ( మూర్తిమత్వం) ఉన్నవి. వాటి ద్వారా వీటిని నాశం చేయగలమా?

బుద్ధుడు : విజ్ఞాన నిరోధం ద్వారా నామరూప నిరోధం కావించ వచ్చును.

అజి :- సర్వధర్మ పరిశీలకులు, సామాన్య మానవులూ ఉన్నారు. వారి జీవిత విధానం ఎలా ఉంటుందో వివరించండి.

బుద్ధుడు :- భిక్కు కామ సుఖాలవెంట పరుగు తీయరాదు. అతడు ప్రశాంత మనస్కుడై సర్వధర్మ కౌశలంతో సంతృప్తుడై చరించాలి.

2. యువ తిస్స మెత్తయ : ఈ లోకంలో సంతృప్తుడెవరు? క్షోభ చెందనివాడు ఎవరు? ఉభయాంతము లనెరిగి ఎవరు మధ్యమాన్ని తగిలించుకోరు? ఎవరిని మీరు మహా పురుషులంటారు? ఈ ప్రపంచంలో ఎవరు వాంఛను జయించిన వారు?

బుద్ధుడు : కామ విషయంలో బ్రహ్మచర్యం పాటించి, కోర్కెలు లేకుండా ఎల్లవేళలా సంతృప్తి, విచక్షణ కలిగిన మనస్సుతో సుఖంగా ఉన్న భిక్షువునకు చలనం/అలజడి ఉండదు. ఉభయాంతములను తెలుసుకున్నవాడు మధ్యమాన్ని పట్టించుకోడు. అతనినే మహా పురుషుడు అంటారు. అతడు తృష్ణను జయించినవాడు. ఇవి ఇద్దరివి. ఇట్లానే మరి పదునలుగురి ప్రశ్నలకు బుద్ధుని సమాధానాలున్నవి. ఈ బుద్ధబోధ 'బుద్ధ గీత' అనదగి ఉంది. (వీటిని భజగోవిందం బాణీలో ఈ వ్యాసకర్త 80 గేయాల్లో అనువదించాడు. అవి ఆనంద బౌద్ధ విహార ప్రచురణగా త్వరలో అచ్చుపుస్తకంగా రానుంది.

ఈ సంభాషణల చివర పారాయణ సుత్తం 'నిగమనగాథ'లో ఈ సంభాషణను 'పారంగమదీయ ధమ్మం' అన్నారు. బావరి శిష్యులు బుద్ధుని సంస్తుతించి వెళ్ళారు. (వారు గురువును చేరి ఈ విషయాలను వివరించగా అతడు సంతృప్తుడై బుద్ధుని శరణు చొచ్చాడు. ఈ విషయం శిష్యులు వివరించగా విని సంతృప్తితో వృద్ధుడు బావరి మరణించాడని ఐతిహ్యం).

భగవద్గీత, ధమ్మపదాన్ని ఎట్లా వాడుకుని వక్రీకరించి మార్చుకొని హిందూమత సద్ధర్మ గ్రంథంగా వ్యాప్తి పొందిందో, శంకరాచార్యగారి మోహముద్గర - భజగోవిందం కూడా ఈ బుద్ధ 'పారాయణ వగ్గ'కు రుణపడి ఉందని చెప్పక - ఒప్పక తప్పదు.

*బుద్ధం శరణం గచ్ఛామి*
*ధమ్మం శరణం గచ్ఛామి*
*సంఘం శరణం గచ్ఛామి*

మానవుడా, మంచిని గుర్తుంచుకొమ్మ :
అన్యులలో దోషాలను ఎన్నైనా చూపవచ్చు
స్వీయ దోష పరిశీలన చేయడమే బహుకష్టం.

\- ధమ్మపదం

# బౌద్ధ ధర్మం - సర్వకాలీనం

- ముంగర జాషువ

తత్త్వ శాస్త్రం - తత్త్వ చింతన - తాత్త్వికా చరణ - అనేవి ప్రధానమైన మూడు దశలు వీటిలో: శాస్త్రం హేతు బద్ధతను కలిగి వుండాలి, చింతన సమ్యక్ దృక్పథాన్ని వెలువరించాలి, ఆచరణ, వ్యక్తికీ - సమాజానికీ మార్గదర్శి కావాలి !

ఇటువంటి లక్షణాలన్నీ బౌద్ధంలో ప్రత్యక్షరంలో ప్రత్యక్షమౌతాయి. అందుకు సందేహంలేదు. అయితే కాలక్రమేణా బుద్ధుని బోధనలు ''తాత్త్విక స్థాయి'' నుంచి ''మతస్థాయి''ని పొందటం; బుద్ధుని అనుచర వర్గం, తర్వాత కాలంలో వచ్చిన సిద్ధాంత కర్తల నిర్వాహకమే గాని మరేం కాదు.

అందువలనే, ఇటీవల (31-3-2004) ఆచార్య నాగార్జునుని గురించి డా॥ మలయశ్రీ, నాగార్జున సాగర్‌లో ప్రసంగిస్తూ: ''బౌద్ధాన్ని అనుసరించి హిందూమతం విశాలత్వాన్ని పొందితే హిందూ మత ప్రభావంతో బౌద్ధం క్షీణించింది'' అని అన్నారు. ఇది నిజం.

కొన్ని సత్యాలు భ్రమాత్మకాలు; కొన్ని సత్యాలు పాక్షికాలు ; కొన్ని సత్యాలు సర్వకాలీనాలు.

బౌద్ధ ధర్మాలు, సూత్రాలు ప్రధానంగా సర్వకాలీన సత్యాలు. ఇవి వర్తమానానికీ, భవిష్యత్తుకీ అనుసరణీయమైనవి. అందువలన 'నిత్యాగ్నిహోత్రత' కాదు కావలసింది. నిత్య అధ్యయన శీలతా వివేచనా, వివేకాల ద్వారా బౌద్ధం హృదయస్థంగా మారుతుంది.

ఆధునిక కాలం, సంక్షోభాల, సంఘర్షణల నిలయంగా మారినది గనుక. బౌద్ధం మరలా మానవ మానసం ముందు ప్రత్యక్షం కావలసిన ఆవశ్యకత ఏర్పడింది.

అష్టాంగ మార్గం - దశపారమితలు - అనుత్తర సమ్యక్ సంబోధి (సర్వోత్తమ జ్ఞానం) పొందటానికి మార్గదర్శకాలు. వైదిక గ్రంథాలు ఎక్కువ భాగం జిజ్ఞాసకు, అన్వేషణకు తావివ్వవు. ఒక ఉపనిషత్తులో శిష్యుడు ప్రశ్నిస్తుంటే, జవాబు చెప్పలేని పరిస్థితి వచ్చినప్పుడు గురువు ప్రశ్నించడం ఆపమని మండిపడిన సందర్భం వుంది. తర్కం - తత్త్వమూ పరస్పర ఆధారితాలు, అయితే తర్కాన్ని అణగ ద్రొక్కటం, అన్వేషణా మార్గాన్ని మూసివేయటమే !

ప్రశ్నించడం, హేతుబద్ధతను కలిగివుండటం, ఏనాడో బుద్ధడు ప్రబోధించినవే ! అందువల్లనే గోపీచంద్ తన ప్రఖ్యాత నవల 'అసమర్థుని జీవనయాత్రను' తన తండ్రిగారైన కవిరాజు రామస్వామి చౌదరికి అంకితమిస్తూ ''ఎందుకు? అనే ప్రశ్న నేర్పినందుకు'' అని అన్నారు. మహామనీషి డా. సంజీవదేవ్ ''ఎందుకు?'' అనే విషయంపై ప్రత్యేకించి గొప్ప వ్యాసాన్ని వ్రాశారు 'కాంతిమయి' అనే గ్రంథంలో! బుద్ధుడు జీవయాత్రను ముగిస్తూ ప్రియ శిష్యుడైన ఆనందునితో: ''తథాగతుడు మరణిస్తున్నాడని విచారించకు ఆనందా! పుట్టినది ప్రతిదీ గిట్టక తప్పదు కదా! వెళ్లు నీ ధర్మం ఆచరించు. ఇది వసంతకాలం. చుట్టూ అశేషంగా ఆకులు రాలుతున్నాయి. వీటిని లెక్క బెట్టడం సాధ్యమా? కాదు. అలాగే ఆనందా, నేను మీకు కొన్ని ధర్మాలు మాత్రమే తెలియజేశాను. ఇవిగాక వేలాది ధర్మాలు తెలుసుకోవలసి వున్నవి. అవన్నీ మీరే తెలుసుకోవాలి మీకు మీరే మార్గ దర్శకులు కావాలి'' అని అంటాడు. ఈ విధంగా బుద్ధుడు చివరి క్షణంలో కూడా జిజ్ఞాసను, అన్వేషణను ప్రోత్సహించాడు. కుల, మత, వర్గ దృక్పథం లేకుండా! అందువల్లనే బౌద్ధ ధర్మం సర్వకాలీనం, సర్వశ్రేష్టం కూడా !

ముంగర జాషువ, హిల్‌కాలని, నాగార్జునసాగర్

# పాళీ సాహిత్యం అశోకుని చరిత్ర

- జె. అమరజ్యోతి

అశోకుడు రోడ్డు కిరువైపులా చెట్లు నాటించి, బాటసారులు, పశువుల దప్పిక తీర్చటానికి బావులు తవ్వించాడనీ, కళింగ యుద్ధంలో మరణించిన లక్షలాది మంది మృతదేహాలపై పడి రోదిస్తున్న బంధువులు, బాధితులను చూచి చలించి బౌద్ధం పట్ల ఆకర్షితుడైనాడనీ తన కొడుకు మహేంద్ర, కూతురు సంఘమిత్రలకు బౌద్ధ దీక్ష నిప్పించి బౌద్ధ ధర్మ ప్రచారానికి శ్రీలంకకు పంపాడనీ, ఇంకా 84000ల స్థూపాలు నిర్మించాడనీ, అతని కొడుకు కుణాళుడు, భార్య తిష్యరక్షితల సంఘటనలకు కలత చెందాడనీ.... ఇలా కేవలం కొన్ని విషయాలే చాలా మందికి తెలుసు. అయితే పాళీ గ్రంథాలైన మహావంశం, దీపవంశం, సమంత పాసాదికా, దివ్యావ దానం, థేరగాథలలోని అశోకుని జీవితానికి సంబంధించిన అనేక వివరాలను పురావస్తు శాఖలో పనిచేస్తున్న జె. అమరజ్యోతి ఈ వ్యాసం ద్వారా అందిస్తున్నారు. – సంపాదకుడు

పాళీ గ్రంథాలు, బిందుసారుడు తన 16 మంది భార్యల ద్వారా 101 మంది కొడుకుల్ని కన్నాడని పేర్కొంటున్నాయి. దీపవంశ, మహావంశాలనే గ్రంథాలు బిందుసారునికి సుమన, అశోక, తిస్స అనే ముగ్గురు కొడుకు లని చెబుతున్నాయి. మహావంశ టీకలో మాత్రం బిందుసారుని అగ్ర పట్టమహిషి మోరియ వంశానికి చెందిన ధమ్మా అని ఉంది. ఆ జీవక రుషి అయిన జనసాన, ఈ కుటుంబీకుల ధమ్మగురువు.

అశోకుడు తన కుర్రతనంలోనే ఉజ్జయినీ రాజ్యానికి గవర్నరుగా నియమించబడినాడు. బిందుసారుని అవసాన దశలో తక్షశిలలో పెచ్చరిల్లిన అరాచకాన్ని అశోకుడే అణచగలిగాడు. బిందుసారుడు మరణించగానే అశోకుడు పాటలీపుత్రానికి తిరిగి వచ్చి, మగధ సింహాసనాన్ని అధిష్టించాడు. మహావంశంలో అశోకుడు తన సహోదరుడైన తిస్సను తప్ప అందరు సోదరులను చంపాడనీ. ఇంత ఘాతుకానికి పాల్పడటం వల్ల అశోకునికి చండశాసనుడని పేరు కలిగిందనీ పేర్కొనబడింది. అయితే ఈ విషయాన్ని అట్టే పట్టించుకోకుండా కొంతమంది పరిశోధకులు కొట్టిపారేశారు. ఎందుకంటే తన ఐదో శిలాశాసనంలో పాటలీపుత్రంలో తన సోదరులు, సోదరీమణులు, ఇతర బంధువులు ఎంతో మంది ఉన్నట్లు అశోకుడే పేర్కొన్నాడు. అశోకుడు తన తమ్ముడు తిస్సను మగధరాజ్యానికి ఉపరాజును కూడా చేశాడు.

అశోకుని భార్యల్లో విదిశాదేవి మొదటి ఆవిడ. విదిశ తండ్రి- శాక్యవంశానికి చెందిన ఒక వ్యాపారి. విదూదభునీ బాధలకు తట్టుకోలేక అతడు విదిశకు వలస వచ్చి స్థిర పడ్డాడు. ఉజ్జయినీ యువరాజుగా నియమితుడైన తరువాత అశోకుడు అవంతీకి వెళ్లేపుడు విదిశలోని ఈ వ్యాపారి ఇంట్లో బసచేయగా, అతనికి విదిశాదేవి నచ్చి, ఆమెను పెళ్లాడాడు. అసంధిమిత్ర అనే అశోకుని పట్టమహిషి పాటలీపుత్రంలో ఉన్నందున, విదిశాదేవి విదిశలోనే ఉండేది. విదిశకు అశోకునివల్ల మహేంద్ర, సంఘమిత్ర అనే కొడుకు, కూతురు పుట్టారు. విదిశాదేవి క్రీ.పూ. 256లో చనిపోయిన తరువాత తిష్యరక్షితను అగ్రమహిషిగా క్రీ.పూ.252లో అశోకుడు పట్టంకడతాడు. ఇలా అశోకుని కుటుంబం చాలా

---

జె. అమరజ్యోతి, రాష్ట్రపురావస్తుశాఖ, హైదరాబాదు.

పెద్దదౌతూ పోయింది. అశోకుని అలహాబాదు (కోశం), స్థంభ (రాణీ) శాసనంలో అతని రాణి కారువాకి, కొడుకు తీవరల ప్రస్తావన ఉంది. దివ్యావదానంలో అశోకుని మరో భార్య పద్మావతి అనీ, ఆమె కుణాలుడనే కొడుకును కన్నదని ఉంది. రాజతరంగిణి, అశుకునికి, జలౌకా అనే కొడుకు, చారుమతీ అనే కూతురు మరో రాణి ద్వారా పుట్టారని ప్రస్తావిస్తుంది. నేపాలులో బాగా ప్రచారంలో ఉన్న ఓ కథ ప్రకారం అశోకుని ఆజ్ఞ మేరకు, చారుమతి నేపాలులోని దేవపాలుడనే వ్యాపారిని పెండ్లాడి, స్థిరపడి అక్కడ ఒక భిక్షునీ విహారాన్ని నిర్మించి శేషజీవితమంతా ధమ్మ సేవచేసింది. పశుపతినాథ దేవాలయం సమీపంలో నిర్మించిన ఈ విహారం చారుమతీ విహారంగా ఇప్పటికీ అందర్నీ ఆకట్టుకొంటుంది.

తన తండ్రి నెలకొల్పిన భిక్షనొసంగే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న అశోకుడికి ఒకసారి, అప్పుడే దీక్షతీసుకొన్న నవ భిక్షువైన తన మేనల్లుడు న్యగ్రోధుడు కనబడతాడు. ఆహ్వానించిన అశోకునికి, న్యగ్రోధుడు అప్పమాదవగ్గను బోధించగా, నచ్చి, బౌద్ధ భిక్షు సంఘానికి దానాలను ఇవ్వటం హెచ్చించాడు. అశోకుడు 5 లక్షల నాణేలను భిక్షు సంఘం, బౌద్ధాలయాలకు, రోగులకు మందుల కోసం దానం చేసే వాడని మహా వంశంలో చెప్పబడింది.

బౌద్ధ ధమ్మంలో 84000 విభాగాలున్నాయని అశోకునికి మొగ్గలీపుత్త తిస్స తెలియజేయగా, ఆ సంఖ్యను స్ఫూర్తిగా తీసుకొని తన పాలనలో నున్న అనేక నగరాలు, పట్టణాలు, కూడళ్లు, ఉద్యాన వనాల్లో 84000 స్థూపాలు, విహారాలను నిర్మించాడనీ, పాటలీపుత్రంలో నిర్మించిన విహారాన్ని అశోకారామమని పిలిచేవారని ప్రపంచసూదనిలో చెప్పబడింది. మహాకాలుడనే నాగరాజు తోడ్పాటుతో, బుద్ధుని నిలువెత్తు ప్రతిమను ప్రతిష్ఠించాడని కూడ తెలుస్తుంది. బౌద్ధ ధమ్మం పట్ల ఆకర్షితుడైన అశోకుడు, తన కుమారుడు మహేంద్రుని, మొగ్గలీపుత్త తిస్స దగ్గర, కుమార్తె సంఘమిత్రకు ధమ్మపాలుని దగ్గర క్రి.పూ. 263లో దీక్ష నిప్పించాడని పైగ్రంథంలో చెప్పబడింది. అప్పుడు మహేంద్రునికి 20 ఏళ్లు. ఇలా ధమ్మ దీక్షనిప్పించిన అశోకుడు శాసన దాయకుడైనాడు.

కొందరు భిక్షుల విపరీత ప్రవర్తన పట్ల విసుగుచెందిన మొగ్గలీపుత్త తిస్స, సంఘాన్ని వారి నుంచి కాపాడటానికి అశోకుని ప్రోత్సాహంతో మూడో బౌద్ధసంగీతి నేర్పాటు చేస్తాడు. సంఘంలోని కొందరు చెడు నడత కల్గిన భిక్షువు వల్ల, మిగిలిన మంచి భిక్షువులు కూడా ఉపోసథను నడిపించలేకపోతున్నారు. సంఘంలోని తప్పుడు బౌద్ధ భిక్షువులను సరిదిద్దమని ఒక మహామాత్రుని అశోకుడు పంపగా, ఆజ్ఞలు సరిగా అర్థం చేసుకోలేని అతడు చాలా మంది భిక్షువులను చంపేశాడని, అప్పటికే అర్హంతుడైన అశోకుని తమ్ముడు తిస్స ఆ ఘోరకలిని ఆపించాడని ఓ కథ ఉంది. ఈ నేపథ్యంలో క్రీ.పూ. 252 లో జరిగిన మూడో బౌద్ధ సంగీతి, తన రాజ్యమంతటా బౌద్ధాచార్యులను ధమ్మ ప్రచారానికి పంపటానికి తీర్మానించటంతో ముగుస్తుంది.

అశోకుడు బుద్ధుని ధాతువులతో పాటు, తథాగతుని భిక్షాపాత్రను తన మనుమడైన సుమనునితో శ్రీలంకకు పంపగా, వాటిపై స్థూపాలను నిర్మించారు. అంతేకాదు శ్రీలంక రాజైన దేవానాంపియ తిస్స కోరికపై అశోకుడు తన కుమార్తె సంఘమిత్ర ద్వారా బోధ్‌గయ నుంచి బోధివృక్షశాఖను శ్రీలంకకు పంపాడు. అప్పటి నుంచి శ్రీలంక వాసులు అశోకుని ధమ్మాశోకుడని పిలిచారు.

ప్రజల్ని తన బిడ్డలుగా చూచుకొని, ఎన్నో సంక్షేమ పథకాలనమలు చేసి ధర్మరాజని కీర్తించబడిన అశోకునికి తన వ్యక్తిగత జీవితంలో చేదు అనుభవాలు కూడా ఎదురైనట్లు దివ్యావదానంలో ఉంది. ఆ గ్రంథంలోని కథనం ప్రకారం, ఏరోజు అశోకుడు 84000 స్థూపాలు నిర్మించాలని నిర్ణయించాడో ఆ రోజే రాజుకు పద్మావతి ద్వారా చక్కటి కళ్లతో ఒక కొడుకు పుట్టాడు. తన కుమారుని అందమైన మెరిసే కళ్లను చూచి, నీలిముక్కల్లా ఉండి, నిండు చంద్రునిలా వెలుగుతున్నాడని అశోకుడనుకొన్నాడు. ఆ కళ్లను చూచిన అశోకుని మంత్రులు, అవి హిమాలయ పర్వత పంక్తుల్లో తిరుగాడే కునాళ పక్షుల కళ్లను బోలి ఉన్నాయన్నారు. ఆశ్చర్యంతో తన కుమారుని అశోకుడు 'కునాళ' అని పిలుచుకొన్నాడు. కుణాళుడు యవ్వనంలోకి అడుగిడగానే ఎంతో అందంగా తయారవటంతో అశోకుని భార్య, అతని పినతల్లి, తిష్యరక్షిత అతని అందానికి ముగ్ధురాలై తన కోరిక తీర్చమని ప్రాధేయపడుతుంది. అప్పుడు కుణాళుడు 'మీరు నాకు అమ్మౌతారు. ఒక కొడుకుతో ఇలా ప్రవర్తించటం అధర్మం మీ కోరికను వెనక్కు తీసుకోం'డంటాడు. తన కోరికను మన్నించని కుణాళుని అందమైన కళ్లను ఎలాగైనా నాశనం చేయాలని పగతో ప్రణాళికను సిద్ధం చేస్తుంది తిష్యరక్షిత. అదే సమయంలో అశోకుడు ముసలితనంవల్ల వచ్చిన రోగాలతో తీవ్రమైన బాధల్లో ఉన్నాడు. ఇదే అదననుకొని తిష్యరక్షిత పాలనా పగ్గాలను తన చేతుల్లోకి తీసుకొంది. వెంటనే తక్షశిలలో ఏవో గొడవలు జరుగుతున్నాయని వాటిని సరిదిద్ది రమ్మని కుణాళుని ఆదేశించింది. మరోవైపు అక్కడికొచ్చే కుణాళుడు రాజద్రోహి అని, అతని కళ్లు పెరికేయమని తక్షశిల ముఖ్య అధికారిని రహస్యంగా ఆదేశిస్తుంది. అమాయకంగా తక్షశిల వెళ్లిన కుణాళుడు గుడ్డివాడై తన భార్య కాంచన మాలతో పాటలీపుత్రానికి తిరిగి వస్తాడు. అది తెలిసిన అశోకుడు ఎంతో బాధపడి, జరిగిన ఘోరానికి కారకురాలైన తిష్యరక్షితను గుడ్డిదాన్ని చేసే గానీ, శరీరమంతా మేకులను దించిగానీ శిక్షించాలనుకొంటాడు. చివరికి ఆమెను ఆమె పడకగదిలోనే దహనం చేసి, కుణాళుని గుడ్డివానిగా చేసిన తక్షశిల అధికారిని చంపిస్తాడు.

శాసనాల్లో పేర్కొన్న అశోకుని కళింగ యుద్ధం గురించి ఏ పాళీ గ్రంథం మాట్లాడక పోవటం గమనించ దగ్గ విషయం. బహుశ అశోకుని తరువాత కొన్ని శతాబ్దాలు గడిచిన తర్వాత కూర్చబడటం మూలాన కొన్ని విషయాలు మరుగున పడి ఉండొచ్చు.

పాళీ గ్రంథాల్లోని వివరాల ప్రకారం, అశోకుని కోరిక మేరకు అతని కూతురు సంఘమిత్ర సంఘానికి, ధమ్మానికి ఎంతో సేవచేసింది. తాను ఉజ్జయినీలో పుట్టింది. అక్కడే పెరిగింది. అగ్నిబ్రహ్మను పెండ్లాడి, కొన్నాళ్ళ కాపురం తరువాత, సుమనుడనే కొడుకును కంటుంది. ధర్మపాలుడు, ఆయుపాలుల వద్ద బౌద్ధ దీక్షను స్వీకరించి, ఉన్నత స్థాయి బౌద్ధ ధర్మాన్ని తెలుసుకొంటుంది. దీక్ష తీసుకొన్న తరువాత కూడా ఆమె పాటలీ పుత్రంలోనే ఉంటుంది. శ్రీలంక రాజు కోరికపై బోధి మొక్కను తీసుకొని అనూరాధపురం వెళ్లి ఉపాసికా విహారంలో నివాసముండి భిక్షునీలకోసం మరో 12 విహారాలను నిర్మిస్తుంది. 59వ ఏట పరి నిర్వాణం చెందిన సంఘమిత్రను, ఆమె తెచ్చి నాటిన అనూరాధపురంలోని బోధి వృక్షం వద్ద దహన సంస్కారాలు నిర్వహించి, అక్కడొక స్థూపాన్ని కూడా నిర్మించారు.

(రాజేంద్రరాం వ్యాసం ఆధారంగా)

# అశోకుని జీవితంలో ప్రధాన ఘట్టాలు

- కె. వెంకటరెడ్డి

మన దేశపు తొలి శాసనాలైన అశోకుని శాసనాలు అశోకుడు రాజ్య పట్టాభిషిక్తుడు కావటం, ఆయన కళింగ యుద్ధం తరువాత బౌద్ధుడు కావటం, ధర్మమహామాత్రలను నియమించటం, ధర్మయాత్రలు చేపట్టడం లాంటి ముఖ్యమైన ఘట్టాలను పేర్కొంటున్నాయి. అయితే అతడు పట్టాభిషిక్తుడైన తరువాత ఏ సం॥లో ఏ శాసనాన్ని విడుదల చేశాడో, ఇంకా అతని జీవితంలోని ప్రధాన ఘట్టాల తేదీలు జన సామాన్యానికి అందుబాటులో లేనిమాట నిజం. అశోకుని సంక్షేమ కార్యక్రమాలు తప్ప ఇతర ప్రధాన ఘట్టాల వివరాలు కూడా తెలుసుకొంటే అతని మూర్తి మత్వాన్ని రేఖామాత్రంగానైనా చూడటానికి వీలుచిక్కుతుంది. ఈ నేపథ్యంలో కూర్చిన ఈ వ్యాసం పరిశోధకులకేకాక సాధారణ పాఠకునికి కూడా ఆసక్తిని కలిగిస్తుంది. **- సంపాదకుడు.**

శాసనాలు పాళీగ్రంథాల మూలంగా అశోకుని పాలనా కాలం క్రీ.పూ. 270-69లో ప్రారంభమై, క్రీ.పూ. 233-32 వరకూ కొనసాగిందనీ, అశోకుని పట్టాభిషేకం, బుద్ధుని మహాపరి నిర్వాణం తరువాత 218 సం॥కు గానీ జరుగలేదనీ తెలుస్తుంది. పట్టాభిషేకం నుంచి, జీవితంలో అతను చేపట్టిన వివిధ కార్యక్రమాల వివరాలు, వాటి తేదీలు తెలుసుకోవటానికి ఆసక్తికరంగా ఉంటాయి.

- ★ పట్టాభిషేకం - క్రీ.పూ. 270-69
- ★ కళింగ యుద్ధం - క్రీ.పూ. 262
- ★ బౌద్ధంపట్ల ఆసక్తుడై, సంబోధికి తీర్థయాత్ర వెళ్లటం - క్రీ.పూ. 260
- ★ బీహార్ లోని బరాబర్ కొండల్లోని ఖలతికలోని 2 గుహలను ఆజీవిక సమణులకు దానం - క్రీ.పూ. 258
- ★ శిలాశాసనాలు I-IV ల ప్రకటన - క్రీ.పూ.258
- ★ ధర్మమహామాత్రలనియామకం - క్రీ.పూ. 257
- ★ శిలాశాసనాలు V-XIII ల ప్రకటన - క్రీ.పూ. 256
- ★ XIVవ శిలా శాసన ప్రకటన - క్రీ.పూ. 256
- ★ కోణాగమన స్థూపాన్ని విశాలం చేయటం - క్రీ.పూ . 256
- ★ ఖలతిక కొండలోని మరో 2 గుహలను ఆజీవకులకు దానం - క్రీ.పూ . 251
- ★ సిద్ధార్థుడు జన్మించిన లుంబినీ గ్రామాన్ని సందర్శించి అక్కడొక శాసన స్తంభాన్ని నిలబెట్టడం - క్రీ.పూ . 250
- ★ విశాలపరచిన కోణాగమన బుద్ధస్థూపాన్ని సందర్శించి అక్కడొక శాసన స్తంభాన్ని నిలబెట్టడం - క్రీ.పూ. 250

కె. వెంకటరెడ్డి, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర శిల్పకళాశాలలో సుధాశిల్పంలో అసోసియేట్ లెక్చరర్.

★ పాటలీపుత్ర, లోరియా అరరాజ్, లోరియా నందన్‌ఘర్, రాంపూర్వా, బెనారస్, కోశాంబి, సాంచి, తోసలి శిలా స్థంభాలను నిలబెట్టడం - క్రీ.పూ. 251-249
★ బౌద్ధ సంఘంలో విభజనను నివారించటానికి పాటలీ పుత్ర, సార్‌నాధ్, కౌశాంబి, సాంచీలలో శిలాస్థంభాలను నిలబెట్టడం - క్రీ.పూ. 251-249
★ కౌశాంబిలోని రాణీ శాసనం ప్రకటన క్రీ.పూ. 250-249
★ జైళ్ల నుంచి ఖైదీల విడుదల చేయించింది - క్రీ.పూ. 245-244
★ ఆరులఘు స్థంభ శాసనాల ప్రకటన - క్రీ.పూ. 245 - 244
★ ఏడో లఘు శిలా శాసన ప్రకటన - క్రీ.పూ. 244 -243
★ ధౌళి, జాగడ (కళింగ) ప్రత్యేక శిలాశాసనాల ప్రకటన - క్రీ.పూ. 235 - 234

**సమంతపాసాదికా మొదలైన పాళీ గ్రంథాలందిస్తున్న అశోకుని జీవిత ఘట్టాల వివరాలు ఇలా ఉన్నాయి:**

★ ఉజ్జయినినీ జయించటం - క్రీ.పూ. 285
★ అవంతి లో ఉజ్జయినీ గవర్నర్‌గా ఉన్నకాలం. - క్రీ.పూ. 285 - 274
★ విదిశాదేవితో వివాహం - క్రీ.పూ. 284
★ కుమారుడు మహేంద్రుని జననం - క్రీ.పూ. 283
★ కుమార్తె సంఘ మిత్ర జననం - క్రీ.పూ. 281
★ అశోకుని తండ్రి బిందుసారుని మరణం, అశోకుడు మగధ సామ్రాజ్యధిపతి కావడం - క్రీ.పూ. 273
★ మహేంద్రునికి 14 వ ఏట, అశోకుడు రాజ్య పట్టాభిషిక్తుడు కావడం క్రీ.పూ. 270-69.
★ బౌద్ధం పట్ల ఆకర్షితుడుకావడం - క్రీ.పూ . 266
★ జంబూ ద్వీపంలో 84000 ల స్థూపాలు పాటలీపుత్రంలో అశోకారామ నిర్మాణ ప్రారంభం - క్రీ.పూ. 266.
★ అశోకుడు రాజ్యాభిషిక్తుడైన నాలుగేళ్లకు తమ్ముడైన తిష్య, అల్లుడు అగ్ని బ్రహ్మ బౌద్ధ దీక్షతీసుకోవడం క్రీ.పూ. 266.
★ 96 కోట్ల ఖర్చుతో 84000ల ఆరామ, స్థూపాల నిర్మాణం పూర్తిచేసిన సం॥ క్రీ.పూ. 264
★ 20 ఏళ్ల వయసొచ్చిన కొడుకు మహేంద్రుడు, 18 ఏళ్ల కూతురు సంఘమిత్రలు భిక్కు, భిక్కునీలుగా బౌద్ధ దీక్ష తీసుకోవటం క్రీ.పూ. 264
★ అశోకునికి 'ప్రియదర్శి' అనే బిరుదు నిచ్చి పట్టంకట్టడం - క్రీ.పూ. 264
★ వ్యాధిగ్రస్తుడై, సమయానికి మందులు దొరక్క కొంతీపుత్ర తిష్య మరణం, పశ్చాత్తాపపడిన అశోకుడు పాటలీపుత్రంలో మందులను నిల్వచేసి రోగులకు ఉచితంగా పంపిణీ చేయాలనే నిర్ణయం - క్రీ.పూ. 264
★ పిటకాలు, వ్యాఖ్యానాల శిక్షణలో మహేంద్రుడు అందరి భిక్షువులకంటే అగ్రగామి కావటం - క్రీ.పూ. 263

★ పాటలీపుత్రంలోని అశోకారామ బౌద్ధ సంఘంలో అసమ్మతి శెగలు, ఏడేళ్లపాటు ఉపోసధ భగ్నం - క్రీ.పూ. 254

★ అసమ్మతి వాదులను వంతుల వారీగా పరీక్షించి సంఘాన్ని బలోపేతం చేయటానికి 60000 మంది భిక్షువుల వెలి - క్రీ.పూ. 253

★ అశోకుడేర్పాటు చేసిన బౌద్ధ సమాగమం తరువాత మొగ్గలీ పుత్త తిస్స కథావత్తు సంకలనం - క్రీ.పూ. 253

★ మొగ్గలీ పుత్త తిస్స ఆధ్వర్యంలో 10000 మంది భిక్షులచే పిటకాల పునశ్చరణ - క్రీ.పూ. 253

★ భారతదేశం, సువర్ణభూమిలకు బౌద్ధ సంఘాలను ప్రచారం కోసం పంపటం - క్రీ.పూ. 253

★ సింహళదేశంలో అశోకుని సమకాలికుడు దేవానాం పియతిస్స పట్టాభిషేకం - క్రీ.పూ. 253

★ మహేంద్రుని కోసం అతని తల్లి విదిశాదేవి, విదిశాగిరి మహా విహార నిర్మాణం - క్రీ.పూ. 253

★ మహేంద్ర భిక్కు నాయకత్వంలో బౌద్ధ ధమ్మ ప్రచారానికి శ్రీలంకకు భిక్కు సంఘం వెళ్ళటం - క్రీ.పూ. 252

★ అశోకుడు భిక్కు సంఘంతో బుద్ధగయను సందర్శించి, బోధివృక్షశాఖను పాటలీపుత్రంలో నాటడం - క్రీ.పూ. 252

★ అశోకుడు స్వయంగా తామ్రలిప్తి రేవు పట్టణం ద్వారా సంఘమిత్ర భిక్కునిని బోధివృక్షశాఖతో శ్రీలంకకు ధమ్మ ప్రచారానికి పంపటం, - క్రీ.పూ. 252

★ పట్టాభిషిక్తుడైన 26 ఏళ్లకు అశోకుని మొదటి భార్య అసంధిమిత్త మరణం, మరో భార్య త్రిష్యరక్షిత పట్టమహిషి కావటం - క్రీ.పూ. 242

★ తిష్యరక్షిత బోధి వృక్ష నిర్మూలనం - క్రీ.పూ. 239

★ అశోకుని మరణం క్రీ.పూ. 233-32

(కె.బి.ఎం. బారువా, ఆనంద డబ్ల్యు.పి. గురుగేల వ్యాసాల ఆధారంగా)

''కేవలం జన జాగృతి మీద ఎంతో కాలం నుంచి ఇలాగే వింటున్నామని భావించి, ఆధారపడి దేనినీ అంగీకరించకండి. కేవలం సంప్రదాయంగా వస్తున్నంత మాత్రాన ( తరతరాలుగా ఇలా వస్తున్నదని భావించి) దేనినీ అంగీకరించకండి. కేవలం పుకార్ల మీద (పరిశోధించకుండ ఇతరులు చెప్పిన దానిని నమ్మి) ఆధారపడి దేనినీ ఆమోదించవద్దు. మీ మత గ్రంథాలకనుగుణంగా ఉన్నంత మాత్రాన దేనినీ అంగీకరించవద్దు. దేనినీ ఊహ మీద ఆధారపడి అంగీకరించవద్దు. అనుమానం మీద, పైకి కనిపించే రూపాలను పరిగణనలోకి తీసుకొని దేనినీ అంగీకరించవద్దు. నీవు అంతకముందే ఏర్పరచుకొన్న అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నదని ఏ విషయాన్ని అంగీకరించవద్దు. మన గౌరవాన్ని చూరగొన్నవాడు కనుక ఆ సన్యాసి చెప్పింది వాస్తవమని అంగీకరించరాదు. నీకై నీకు తెలసినప్పుడు నీవు అంగీకరించు. నీవు అలా జీవించు.''

**- గౌతమబుద్ధుడు, అంగుత్తరనికాయ**

# బుద్ధుని మూల బోధనల భాండాగారమే-సుత్తనిపాతం

-దిట్టకవి కన్నబాబు

బౌద్ధ పాళీ వాఙ్మయంలో 'సుత్తనిపాతానికి' అత్యంత ఆదరణ - ఉంది. సంభాషణలు - చర్చల రూపములో గల సుత్తనిపాతం బౌద్ధ మతానికే కాక యావత్ పాళీ వాఙ్మయానికే వన్నె తెచ్చింది. సమ్యక్ సంబుద్ధుని మూలబోధనలన్నీ ఇరువురి మధ్య సాగే చర్చల రూపములో ఇందు పొందు పరచపడినవి. బౌద్ధ త్రిపిటకాలలో రెండవదైన 'సుత్తపిటకం' లోని ఐదవ అంతర్భాగమే 'సుత్తనిపాతం' అనేగద్య పద్య కావ్యము. గౌతమ బుద్ధుని కాలం నాటి సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు వాటినేపథ్యము దీనిలో స్పష్టంగా చూడవచ్చు. బౌద్ధమత ఆవిర్భావ ప్రారంభదశలను, నాటి జనపదుల ఆచార వ్యవహారాల్ని, బౌద్ధేతర సంప్రదాయముల ఉనికి - మనుగడలను విశదంగా వ్యక్తీకరించింది. నైతిక వర్తనా పునాది పైనే బౌద్ధ మత భవ్య మందిరము నిర్మింపబడినదన్న వాస్తవ సత్యాన్ని ప్రతి అధ్యాయంలోని సుత్తాల ద్వారా చాటింది. తథాగతుని మూలబోధనోపదేశములన్నింటి సారాంశములను 'మాట-మంతి' రూపంలో గ్రంథస్తం చేయబడి - చదివేవారికి, వినేవారికి సుత్త పాఠాలు సులభంగా అర్థమయ్యే రీతిలో కూర్చబడినవి. సుఖ జీవనమునకు నైతిక వర్తనావశ్యకత మూలకందమని విపులీకరించి జనపదులు హృదయములకు హత్తుకొనునట్లు చేయుటయే సుత్తనిపాతమునందలి సుత్తముల ముఖ్యోద్దేశము. బౌద్ధమత వ్యాప్తికి జనపదులే ఊపిరి. అట్లే బౌద్ధ పాళీ వాఙ్మయానికి జనపదులే ఆలంబన - ఆలాపన. సుత్తనిపాతంలోని ఉరగవగ్గము, చూలవగ్గము, మహావగ్గము, అత్థక వగ్గము, పారాయన వగ్గము అను ఐదు అధ్యాయాలున్నాయి.

మొదట నాలుగు వగ్గములలో యాభైనాలుగు, ఐదవదైనపారాయన వగ్గంలో పదహారు చిన్న చిన్న కావ్య ఖండములున్నాయి. ఉరగ, చూల, మహావగ్గాలలోగల ముప్పై ఎనిమిది శ్లోకములలో ఆరు పద్యాకృతులు ఇతర పాళీ వాఙ్మయ గ్రంథాల్లో కనబడుతున్నాయి. సుత్త నిపాత గ్రంథంలోకి గ్రుది గ్రుచ్చకమునుపే ఈ పద్యసుత్తముల ముత్యపు సరణులు సుగతుని సందేశపు కాంతులీనుచూ సంఘభిక్షుల, జనపదుల నోళ్ళలో సామెతలుగా జీవించాయి. నాలుగవది అయిన అత్థక వగ్గలోని నాలుగు శ్లోకాలు ఒక్కొక్కటి ఎనిమిది పాదాలు కలిగి ఉన్నాయి. అత్థక వగ్గలోని సుత్తములు సుత్తనిపాత గ్రంథంలోనికి అంతర్భాగంగా మార్చక మునుపే బౌద్ధుల ప్రథమ గ్రంథం వినయపిటకములో దర్శనమిచ్చినవి. ఐదవ అధ్యాయమగు పారాయన వగ్గ నికాయగ్రంథాలలో పెక్కు సార్లు పేర్కొనబడింది. సుత్తనిపాతంలోని సుత్త పద్యములన్నిగాథల రూపుదాల్చినవి. ఇవి చిన్న చిన్న సంఘటనలను వర్ణిస్తాయి. సందేశాలు పద్య రూపంలోను, కథాంశమంతా గద్య రూపంలోను ఉన్నాయి. గద్య భాగాల్లో చాల పాఠాంతరాలు, కూర్పులు, చేర్పులు ఉన్నాయి. పబ్బజ్జ, పథాన, నాలక, సుత్తములందలి పద్యములు ప్రాచీనవైదిక మత ప్రార్థనలను పోలి ఉన్నాయి. మహావగ్గ, అత్థక వగ్గలలోని పాళీ భాష ధమ్మ పదముపు పాళీ భాషకంటే ప్రాచీనమైంది. పద్య సుత్తములో వాడిన ఛందస్సుకు వేదమంత్రములలోని ఛందస్సుకు

---

దిట్టకవి కన్నబాబు, పురావస్తు సంగ్రహాలయము, అమరావతి, గుంటూరు జిల్లా.

చాలా సారూప్యత ఉంది. ఉదాహరణకు పై మూడు లక్షణాలు పొందిపుచ్చుకున్న నాలక సుత్తలోని ఈ క్రింది పద్య సుత్తములను గమనింప వచ్చు.

| | |
|---|---|
| ఉచ్చవహి పటిపాదా | యం సమునొ బహుంభాసతి |
| సమనేన పకాసితా | ఉపేతం అత్థ సంహితం |
| నపార దిగునం యన్తి | గానం సొ ధమ్మం దెసతి |
| న ఇదం ఏకగుణం ముతం | గానం సొ బహు భాసతి |
| తన్న దీహి విజానాథ | యొకగానం సమ్యతత్తొ |
| సొబ్బేసు పదరేసుచ | గానం నబహు భాసతి |
| సనన్తా యాన్ని చుస్సొచ్చా | స మునీ మోనం అరహతి |
| తుష్ణీ యాతి మహోదధి | స మునీ మోనం అజ్ఞగా |

సుత్త నిపాత గ్రంథ ప్రాముఖ్యతను గుర్తించి పెక్కు పండితులు ఆంగ్లములోనికి అనువదించి పేరు పొందారు. వారిలో పోస్ బోల్ అను పరిశోధకుడు బహు గ్రంథ కర్త. సుత్తనిపాతమును ఆంగ్లములోనికి తర్జుమా గావించి తన విపుల పీఠికలో ఇలా వ్యాఖ్యానించినాడు. ''సుత్త నిపాత విషయ చర్చనందు బౌద్ధుల సంఘారామ జీవనమును గురించి కాక బౌద్ధము తొలిదశయందలి మునుల జీవనమును చిత్రీకరించినది. అర్వాచీన కాలమునాటి వ్యవస్థీ కృత బౌద్ధ సంఘమును గురించి కాక ఒకమత సంప్రదాయమునందలి మణులనదగు మూల భావనలను ఎంతో స్వచ్ఛంగా మనముందు వుంచినది.''

సుత్తనిపాతంలోని సుత్తాలలో ఎన్నో కాంతులీనే ఆణిముత్యాలున్నాయి. వానిలో ఉరగవగ్గము నందలి- ధనియ, కుంద, వసల, మెత్త, ఆలవక, మునిసుత్తములు; చూల వగ్గములో గల- రతన, ఆమగంధ, హిరి, మహామంగల, ధమ్మిక సుత్తములు; మహావగ్గమునందలి - పబ్బజ్జ, పధాన, సభియ, సేల, సల్ల, వాసెత్థ సుత్తములు; అత్థకవగ్గము నందలి- కామ, సుద్ధాత్తక, సుత్త పరమాత్థక సుత్తములు; పరాయన వగ్గములోని - అజిత మానవ పుచ్ఛ, కలహవివాద, మెత్తగు మానవ పుచ్ఛ సుత్తములు మొదలైనవి విశిష్టమైనవి. వీటియందు మంచి-చెడునడతలు, స్నేహ ధర్మము, ముదుసలి తనము, శీల స్వచ్ఛత, సమదృష్టి- పవిత్రతలను, ఆదర్శవంతమగు జీవిత ఆవశ్యకతలను గూర్చి బుద్ధ భగవానుడు బోధించుట ఉంది. ఉరగ వగ్గములోని 'ధనియ సుత్తము' అన్ని కాలాల వారికి మార్గ దర్శకముగానిలచిన ప్రముఖ సుత్తము. ప్రపంచ భోగములు అనుభవించుచు సాంసారిక సుఖమత్తుడగు భోగికి, నిష్కాముడగు సర్వ సంఘ పరిత్యాగికి మధ్యగల వ్యత్యాసమును కనులకు కట్టినట్లు చూపించింది. భోగలాలసత్వము విడచి నైతిక విలువలతో మానవులందరు జీవిస్తూ నిర్వాణ పథాన్ని అనుసరించాలనే బుద్ధ భగవానుని బోధనా సారాంశము దీనిలో చక్కగా ఇమిడి ఉంది. నేటి ఆధునిక సమాజానికి 'ధనియ సుత్తము' సందేశాత్మకముగను, ఆదర్శవంతముగను ఉపకరించ దనుటలో ఎంతమాత్రం సందేహంలేదు. అవశ్య పఠనీయమైన 'ధనియసుత్తాని'కి అనుసృజనను క్రింద చూడవచ్చు.

ధనికుడు - పశుపాలకుడగు ధనియకు బుద్ధ భగవానునికి మధ్య జరిగిన సంభాషణా వృత్తాంతమే ధనియ సుత్తము. ధనియడు నిత్యము పాలనిచ్చు గొప్ప గోసంపదకలిగి, వినయవతి - శీలవతి యగు

గృహిణి తోను, పితృ భక్తి పరాయణులు - ఆరోగ్యవంతులగు పుత్ర సంతతితోను భోగలాలసా లంపటత్వమున మునిగి తేలుచున్న భోగి. బుద్ధుడు సర్వసంఘ పరిత్యాగి ఒకనాడు నిర్మల హృదయుడు యశశ్చరితడగు శాక్యముని బుద్ధునితో ఈ క్రింది రీతిగా ఆసక్తి కరమగు సంభాషణ మొనర్చెను.

1. ధనియడు : ఓ ఆకాశమా ! మహీనది ఒడ్డుకు సమీపమున నా సహచరులతో కూడి ఆనందముగా నివసించుచున్నాను. నా గృహము పై కప్పు కప్పబడినది. ఇంటి లోపల నిప్పు రగిలించబడినది. గోవుల పాలు పిండితిని. అన్నము వండితిని, నీకు నచ్చినచో వర్షింపుము.

2. భగవానుడు : ఓ ఆకాశమా! నేను క్రోధము, మూర్ఖత్వములను వదిలి వేసితిని. మహీ నదీతటమున ఒక్క రాత్రి గడిపితిని. నేను నివసించుగృహమునకు పై కప్పు లేదు. విషయ వాంఛాజ్వాల ఆరిపోయినది. కావున నీకు సమ్మతి అయినచో వర్షింపుము.

3. ధనియడు : ఓ ఆకాశమా ! ఇచట పశువులను బాధించు పురుగులు లేవు. గోవులు గ్రాసము మేయుచు పశుకోష్ఠమంతయు తిరుగాడు చున్నవి. వర్షమునందు తడియుదమన్న భయము లేదు. కురిసినచో వర్షపు భారము వహించుటకు సిద్ధముగా యున్నవి. నీకు నచ్చినచో వర్షింపుము.

4. భగవానుడు : ఓ ఆకాశమా! నేను బల్లకట్టు నొకదానిని నిర్మింపజేసితిని. నిర్వాణపథమున పయనించితిని. ప్రమాదమగు విషయవాంఛా ప్రవాహమునుదాటి క్షేమముగా ఆవలి ఒడ్డు చేరితిని. ఒక మీదట నాకీ తెప్పతో పనిలేదు. నీకు సమ్మతి అయినచో వర్షింపుము.

5. ధనియడు : ఓ గగనమా ! నా గృహిణి శీలవతి - వినయవతి, చాలా కాలమునుండి నాతో కలసి సహజీవనము చేయుచున్నది. ఆమెను గూర్చి చెడ్డగా ఏనాడు వినియుండ లేదు. చేపట్టిన పనులు విజయవంతముగా నెరవేర్చుచున్నది. కావున నీవు మెచ్చినచో వర్షింపుము.

6. భగవానుడు : ఓ ఆకాశమా ! నామనస్సంతయు వినయముతో నిండియున్నది. ప్రాపంచిక బంధముల నుండి బయట పడినది. చాలకాలము నుండి విశేషముగా మనస్సును నియంత్రించి (సమ్యక్ చింతనలతో) తేట పరచితిని. ఇప్పుడది నా అధీనములో వున్నది. ఇకపై నాయందెట్టి కాఠిన్యము లేదు. నీకు నచ్చినచో వర్షింపుము.

7. ధనియడు : ఓ ఆకాశమా ! నేను స్వార్జిత సంపాదనము పైననే ఆధారపడి యుంటిని. నా సంతాన మంతయు ఆరోగ్యవంతులు. నాతో కలసి జీవించుచున్నారు. వారి దుష్టత్వమును గూర్చి ఎన్నడును వినలేదు. కావున నీకు నచ్చినచో వర్షింపుము.

8. భగవానుడు : ఓ గగనమా! నేనెవ్వనికిని సేవకుడను కాను. నాకు లభియించిన దానితో తృప్తి పడి సర్వ ప్రపంచమునందును తిరుగాడుదును. అన్యులను సేవించవలసిన

ఆశ్యకత నాకులేదు. కావున నీకు నచ్చినచో వర్షింపుము.

9. ధనియడు : ఓ ఆకాశమా! నాకు పాడిగోవులు, పసి లేగలు, పడుచు లేగలు కలవు. ఆలమందకు రాజగు వృషభుడు కూడ నావద్ద వున్నాడు. నీకు సమ్మతి అయినచో వర్షింపుము.

10. భగవానుడు : ఓ గగనమా! నాకు పాడిగోవులు, పసిలేగలు, పడచు లేగలు ఏమియు లేవు. ఆలమందకు రాజగు వృషభుడు కూడా నా వద్ద లేడు. కనుక నీకు నచ్చినచో వర్షింపుము.

11. ధనియడు : ఓ ఆకాశమా ! నాకు భూమిలోనికి లోతుగా పాతిన స్తంభములు కలవు. అవి గాలికి చెదరవు. ముంజగడ్డితో కొత్తగా నేసిన మోకులు కలవు. వాటిని ఆవులు తెంపజాలవు. కావున నీకు నచ్చినచో వర్షింపుము.

12. భగవానుడు : ఓ గగనమా ! బంధములను తెంపుకుని వెడలి పోవు వృషభము వలెను, గలుఝ్చి తీవెలను తెంపుకుని బయటపడి సాగిపోవు గజరాజు వలెను ప్రాపంచిక బంధముల నుండి బయలు పడితిని, ఇకపై ఎవ్వరి గర్భమునందును ప్రవేశింపను. కావున నీకు సమ్మతి అయినచో వర్షింపుము.

కొంత సమయము సంభాషణము జరిగిన పిమ్మట భూ సంత్రములు నిండునట్లు కుండపోతగా వర్షము కురిసింది. ఆకాశము నుండి కురుస్తున్న వర్షపు మోతవిని ధనియడిలా అన్నాడు.

13. భగవానుని దర్శించితిమి ! లేశమంతయినను ప్రతి ఫలము మాకు వలదు. జ్ఞాన నేత్రములు గల ఓ మహామునీ ! నీ పాదముల చెంత శరణు జొచ్చు చున్నాము.

14. నేను, నా గృహిణి నీకు విధేయులము. మేము సుగతుని కన్నుల ముందు పవిత్ర జీవనము గడిపెదము. జనన, మరణములను జయింతుము. దుఃఖమును పారద్రోలుదుము.

15. పిమ్మట దుష్టుడగు మారుడు ఇట్లు పలికెను. ఎవడు పుత్రులను కలిగియుండునో వానికి పుత్రులయందే సంతసము కలిగియుండును. ఎవనికిగోవులు కలవో వానికిగోవులయందే అమిత సంతుష్టి కలదు. మానవుని సంతసము కొఱకే ఉపధి ( ఆశాబంధము) కలదు. ఎవనియందు ఉపధి లేదో వానికాహ్లాదము లేదు.

16. అనంతరము భగవానుడీవిధముగా అనెను ! ఎవనికి పుత్రులు కలరో వానికి పుత్రుల పట్ల శ్రద్ధ యుండును. అట్లే ఎవనికి గోసమూహము కలదో వానికి గోసంరక్షణ భాధ్యత యుండను. జనుల భద్రత కొఱకే ఉపధి ( కార హేతువు) కలదు. ఎవని యందు ఉపధి లేదో వానికి భద్రత లేదు.

ధనియసుత్తము ముగిసింది.

# బౌద్ధ శిల్పకళా నిక్షేపం - సాంచి

- డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

మన జాతీయ సంకేతమైన అశోక చక్రం లేదా ధర్మచక్రం, దానిపైనున్న నాలుగు సింహాలు - బౌద్ధం మనకు ప్రసాదించింది. వారణాసి సమీపంలోని సారనాథ్‌వలె, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు సమీపంలో వున్న సాంచి కూడ బౌద్ధమత సంకేతంగా ప్రసిద్ధిగాంచింది. సాంచి స్థూపం బయట వున్న నాలుగు శిలా స్థంభాలలో కూడా, నాలుగు సింహాలు, ధర్మచక్రం ( జాతీయ చిహ్నం) అందంగా మలచబడినాయి.

సాంచి స్థూపాలు, ప్రధాన స్థూప స్వాగత ద్వారమందలి శిల్పకళ పర్యాటకుల నెంతగానో ఆకర్షిస్తాయి. యునెస్కో సాంస్కృతిక సంస్థ గుర్తింపు పొందినవీ స్థూపాకృతులు.

స్థూపం అంటే సమాధి. ఋగ్వేదంలో కూడ స్థూప ప్రస్తావన వుంది. మహాత్ములు, సుప్రసిద్ధులు దేహ త్యాగం చేసిన తర్వాత, వారి భౌతిక కాయాన్ని పంచ భూతములకు సమర్పించిన స్థలంలో, స్మారక చిహ్నం నిర్మించి వారిని అమరులుగా విశ్వసించడం అనాదిగా జరుగుతున్నది. బుద్ధ భగవానుడు శరీర త్యాగం చేసినపుడు దానిని చితికి అర్పించారు. ఆ చితా భస్మాన్ని బంగారు పాత్రలో వుంచి కుశీ నగర ( ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ సమీపంలో వుంది) ప్రాంతమును పాలించు చుండిన మల్ల దొరలు ఏడు దినములు శోకమును పాటించారు. గౌతమ బుద్ధుని నిర్వాణ వార్త విన్నంతనే మగధరాజు అజాతశత్రు, వైశాలి రాజు లిచ్ఛవి, కపిలవస్తు పాలకులైన శాక్యులు, అల్లకప్పకు చెందిన బులిరాజులు, పావమల్ల దొరలు మున్నగువారు బుద్ధ చితా భస్మం కావాలన్నారు. లేకున్న పోరాటం తప్పదని హెచ్చరించారు. కుశీ నగరరాజు పోరుకు సిద్ధపడినాడు. అప్పుడు ద్రోణుడను బ్రాహ్మణ పండితుడు అందరినీ సమాదరించి, అట్టి పోరాటం వల్ల బౌద్ధ మతానికి తీవ్రమైన కళంకమే కాక, బౌద్ధ మతానుయాయుల నాశనం తప్పదు అని సముదాయించాడు. అతని ఉపదేశం ప్రకారం చితాభస్మాన్ని ఎనిమిది భాగములుగా చేసి, ఎనిమిది మంది రాజులకు పంచి పెట్టారు. రాజులు తమకు లభించిన చితాభస్మాన్ని స్మారక చిహ్నాలుగా తమ రాజ్యాలలో స్థూపాకారంలో నిర్మించారు. ద్రోణ పండితునికి స్వర్ణ పాత్రమును కానుకగా సమర్పించారు. ఈ స్థూపాలకు చేరువగా ధర్మ ప్రచారం కోసం ధార్మిక గృహాల సముదాయాన్ని నిర్మించారు. ఇటువంటి ఎనిమిది స్థూపాలు రాజగృహ, వైశాలి, కపిలవస్తు, అల్లకప్ప, రామ గ్రామ్, పావా, విఠదీపక మరియు కుశీనగరాలలో నెలకొల్పారు. మౌర్య రాజు, బుద్ధుని చితిపై ఒక కొయ్య ముక్కను పెట్టి స్థూపాన్ని నిర్మించి దానిని అంగనాలి స్థూపం అన్నాడు. ఇదంతా క్రీ.పూ. 400 సంవత్సరాల గాథ.

అశోక చక్రవర్తి కాలంలో బౌద్ధ మతం మహోన్నత స్థితిలో వుండినది. క్రీ.పూ. 274 - 237లో బౌద్ధ మతానికి, సాంచికి మహర్దశ ప్రాప్తించింది. అశోక చక్రవర్తి తన సమస్త సంపదను, శక్తి యుక్తులను బౌద్ధమత ప్రచారానికి వినియోగించాడు. ఈ కాలంలోనే సాంచి స్థూప నిర్మాణం జరిగింది. అశోకుడు

---

డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, సి.పి. బ్రౌన్ మెమోరియల్ ట్రస్ట్ లైబ్రరీ ప్రధాన కార్యదర్శి, కడప

బుద్ధుని చితా భస్మ, అవశేషాలను ప్రోగు చేసి, సాంచిలో అత్యంత భవ్యమైన స్థూపాన్ని నిర్మించాలని సంకల్పించాడు. ఏడు చోట్ల వున్న బుద్ధ భగవానుని అవశేషాలను సేకరించాడు కాని రామగ్రామ్‌లోని స్థూపాన్ని తాకలేకపోయాడు. ఆ స్థూపం నాగుల వశంలో వుండినది. వారు ఎవరిని దగ్గరికి రానివ్వలేదు. ఈ స్థూపం శ్రీలంకలోని రువన్వేలి వద్ద వున్నది. బౌద్ధ మత చరిత్రను బట్టి అశోక చక్రవర్తి 84 వేల స్థూపాలను నిర్మించాడని చెబుతారు. బౌద్ధమత ప్రచారం కోసం మందిరాలను నిర్మించాడు. వీటిలో సాంచిలోని మొదటి స్థూపం, మరియు మూడవ స్థూపం ప్రముఖమైనవి. మొదటి స్థూపంలో బుద్ధుని భౌతిక శరీర చితాభస్మం మూడవ స్థూపంలో బుద్ధుని ప్రియశిష్యులైన సారిపుత్ర, మొగ్గలాయనుల అవశేషాలు నిక్షేపించబడినవి.

బౌద్ధమత క్షేత్రాలలో సాంచి అతి విశిష్టమైనది. బెటదా నదీ తీరమున వున్న ఈ పట్టణం శిల్ప కళా నిక్షేపంగా ప్రశస్తిగాంచింది. ఒకప్పుడు విదిశాగిరి, చెటియాగిరి, లేదా కకనాయ అని పేరుగాంచిన ఈ గిరి ప్రదేశం 384 మీటర్ల పొడవు, 287 మీటర్ల వెడల్పు, 91 మీటర్ల ఎత్తులో వుంది. ఈ గిరి ప్రాంతం బౌద్ధ మతానుయాయుల కత్యంత పవిత్ర క్షేత్రం.

19వ శతాబ్దం వరకు అజ్ఞాతంగా వుండిన సాంచి ప్రాంతాన్ని 1818లో బ్రిటిష్ అధికారి జనరల్ టేలర్ 1818-19 ప్రాంతాల్లో త్రవ్వకాలు జరిపించి వస్తు సంగ్రహాలయాన్ని నిర్మించారు. అతి విశిష్టమైన ఈ నిర్మాణాల సంరక్షణకు సర్ జాన్ మార్షల్ పటిష్టమైన చర్యలు తీసుకొన్నాడు.


విశ్వవ్యాప్తమైన బౌద్ధ మతానుయాయులకు అత్యంత పవిత్ర యాత్రా స్థలమైన సాంచి స్థూపం భోపాల్ (మధ్యప్రదేశ్ రాజధాని) కి 50 కి. మీ. దూరంలో వుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంచి గత వైభవ సముద్ధరణకు సత్వర చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతగానో వుంది.

(2వ, 3వ అట్టలపై చిత్రాలు సాంచిలోనివి)

*('తరంగ' కన్నడ వారపత్రిక ఆధారంగా)*

''నా మనసు బుద్ధుడి కాలానికి పోయింది. నేను అనుకున్నాను ఆయన సందేశం మతపరమైన ప్రాముఖ్యతతో పాటు అది సహిష్ణుతా సందేశం కలిగి ఉంది. మూఢ నమ్మకాల, అర్థ రహితమైన కర్మకాండ, పిడివాదానికి అది వ్యతిరేకమైనది. బుద్ధుడి సందేశం శాస్త్రీయ దృష్టితో కూడినటువంటిది. ఆయన ఎవర్ని, ఏ విషయంలోనూ ప్రయోగపూర్వకంగా నిరూపితం కానిదే నమ్మమమని చెప్పలేదు. ఆయన ఎవరి మాటను గుడ్డిగా విశ్వసించమని చెప్పలేదు. అది తన మాటయినా గుడ్డిగా విశ్వసించవద్దన్నాడు. ఆయన కోరిందల్లా సత్యాన్ని అన్వేషించమనే. అదే ఆయన సందేశ సారాంశం. బుద్ధుడి సందేశంలోని సహిష్ణుత, కరుణలతో పాటు శాస్త్రీయ దృష్టి నేటి కాలానికి కూడా ప్రత్యేకమైన ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి.

**- జవహర్‌లాల్ నెహ్రూ**



సాంచి బౌద్ధ స్థూపం



సాంచిలోని బౌద్ధ ఆరామ ఉత్తర ద్వార తోరణం పై సూక్ష్మ కళా నైపుణ్యం

MISIMI/ మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD-191/2003-05



## 5 టన్నుల బంగారు బుద్ధ ప్రతిమ

ఈ బుద్ధ ప్రతిమ బాంగ్‌కాక్ నగరంలో విశాలమైన ఆలయ ప్రాంగణంలో తలుపులుకూడా లేని గుడిలో ఉంది. మంగోలియన్ దాడులకు భయపడి ఈ విగ్రహాన్ని సిమెంట్ పూతతో దాచారు. తరువాత పూత పూడిపోయి లోపలి 5 టన్నుల బంగారు బుద్ధుడు బయటకు తొంగి చూశాడు.

చిత్రసేకరణ : అశ్వినీ కుమార్, విజయవాడ